ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 28-2-2018 బుధవారం సిటీ సంపుటి 44 సంచిక 199

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పోరుగుతో ప్రగతి

పక్కరాష్ట్రాలతో కలిసి ఉంటేనే అభివృద్ధి




- కాంగ్రెస్ ప్రభుత్వాలది తెలివి తక్కువ వ్యవహారం
- జాతీయ పార్టీలపై వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా..
- అన్నం పెట్టిన తల్లి సింగరేణి
- ప్రాణం పోయినా ప్రైవేటుపరం కానివ్వం
- కారుణ్య నియామకాలు మార్చి మొదటివారం నుంచే మొదలు
- సర్వేలో తెరాసకు 106 సీట్లు.. -2లో
- ఆదిలాబాద్, శ్రీరాంపూర్ సభల్లో సీఎం కేసీఆర్ వెల్లడి

సీఎం హెలికాప్టర్ నుంచి పాగలు 2లో

‘ప్రైవేటురంగంలో పారిశ్రామికవేత్తలు ఆరు వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తామని ముందుకొస్తే మేం అంగీకరించలేదు. ప్రాణం పోయినా ఇవ్వమనీ, జెన్‌కో ఉత్పత్తి చేస్తుందని చెప్పాం, దీంతో 24 వేల మంది బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి. దేశమంతా ప్రైవేటు వాళ్లకు విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఇచ్చినా మేం మాత్రం ఇవ్వలేదు’ - కేసీఆర్



ఆదిలాబాద్ డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి.. బహిరంగ సభకు హాజరైన ప్రజలు



‘ఐఏఎస్ అవ్వాలని ఆలోచించా. అయితే చదివే ఓపికా లేదు. సాధిస్తానన్న భరోసా లేదు. రాజకీయాల్లో కొస్తే ఐఏఎస్ అధికారులనే నియంత్రించొచ్చని భావించా. చివరిగా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని, గెలవాలని బలంగా అనుకున్నా.

‘నాకెవరూ మెంటార్లు లేరు. ప్రొఫెసర్ డీఎల్ నారాయణ, మాజీ ఎంపీ రాజగోపాలనాయుడు, మా ప్రధానోపాధ్యాయుడు నన్ను, నా పనులను ప్రోత్సహించేవారు.

అభివృద్ధి

కనిపించట్లేదా?

ప్రతిపక్షాలకు చంద్రబాబు సూటి ప్రశ్న

- ఆంధ్రప్రదేశ్‌లో ఏ పల్లెకు వెళ్లైనా చూడండి
- 2014కి ముందు- ఇప్పుడు ఎలా ఉందో పోల్చుకోండి
- ప్రత్యేక హోదాపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రానిదే
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో ‘ఈనాడు-ఈటీవీ’ ప్రత్యేక ఇంటర్వ్యూ

దూరదృష్టి, పక్కా ప్రణాళిక, క్రమశిక్షణ, సాంకేతిక, అలుపెరుగని శ్రమలే ఆయుధాలుగా దూసుకుపోతున్న ప్రజా నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. ఆయన ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి మంగళవారానికి నలభై ఏళ్లు. ఈ నాలుగు పదుల రాజకీయ యాత్రలో ఆయన అనేక విజయాలు సాధించారు... ఎత్తుపల్లాలను ఎదుర్కొన్నారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ‘ఈనాడు-ఈటీవీ’కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన అంతరంగాన్ని ఆవిష్కరించారు.


- పూర్తి వివరాలు 14లో

చివరి చూపులకు..

- ఇంటికి చేరిన శ్రీదేవి భౌతికకాయం
- ముగిసిన దర్యాప్తు
- కుటుంబసభ్యులకు పార్థివదేహం అప్పగింత
- నేడు సాయంత్రం 3.30కు ముంబయిలో అంత్యక్రియలు
- అపస్మారకస్థితిలోకి వెళ్లి స్నానాల తొట్టిలో మునగడంతోనే మరణం
- స్పష్టం చేసిన దుబాయి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం

-11లో





మంగళవారం రాత్రి ముంబయి విమానాశ్రయం నుంచి శ్రీదేవి నివాసానికి ఆమె పార్థివదేహాన్ని తీసుకొస్తున్న అంబులెన్స్

నీరవ్ మోదీ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- బెయిలుకు వీల్లేని వారెంట్ జారీ చేయాలని ప్రత్యేక కోర్టును కోరిన ఈడీ
- పన్ను ఎగవేత కేసులో మరో కోర్టులో సమన్లు జారీ
- కుంభకోణం విస్తృతి రూ.12,717 కోట్లని స్టాక్ ఎక్స్ఛేంజికి తెలిపిన పీఎన్‌బీ
- అమెరికాలో దివాలా పిటిషన్ దాఖలు చేసిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ

దిల్లీ, ముంబయి, న్యూయార్క్: వేలకోట్ల రూపాయల భారీ కుంభకోణంలో కీలక నిందితుడైన వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీపై దర్యాప్తు సంస్థలు అన్నివైపుల నుంచి ఒత్తిడిని తీవ్రతరం చేశాయి. ఆయనను భారత దేశానికి రప్పించి చట్టం ముందు నిలిపేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) భరోసా పత్రాల ఆధారంగా చోటుచేసుకున్న మోసంలో మరిన్ని వివరాలు రాబట్టేందుకు మరో రెండు బ్యాంకులకు చెందిన అధికారులనూ దర్యాప్తు సంస్థలు ప్రశ్నించాయి. మరోవైపు (మిగతా 2లో)

కమలనాథులే ‘త్రిపురా’ధిపతులు!

- భాజపా కూటమిదే అక్కడ విజయం
- నాగాలాండ్‌లోనూ కాషాయి పార్టీ వికాసం
- మేఘాలయలో హంగ్
- ఎన్నికల సర్వేల్లో వెల్లడి

-15లో

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు -3లో

ఇదీ సంగతి!



అక్కడిదాకా వెళ్లేసరికి నిమిషం పూర్తయిందట, తలుపులు మూసేశారు.

కల్యాణం నాడే సాయం

- మండపంలోనే చెక్కుల పంపిణీ
- సర్కారు నిర్ణయం
- లంచాలు తీసుకుంటే కేసులు, సోదాలు...



ఈనాడు, హైదరాబాద్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద పేద యువతులకు ఇకపై సరిగ్గా పెళ్లి జరిగేటప్పుడే ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ సర్కారు నిశ్చయించింది. పెళ్లి ముగిసిన క్షణమే... మండపాల వద్దే ఈ చెక్కులను నవ వధువులకు అందజేయనున్నారు. త్వరలోనే ఈ విధానం అమల్లోకి రానుంది. ఏటా రూ.వెయ్యి కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పథకాలను మరింత ప్రయోజనకరంగా, సమర్థంగా అమలు చేసేందుకే ప్రభుత్వం ఈ మార్పులు చేపడుతున్నట్లు తెలిసింది.

పేద కుటుంబాల్లోని యువతులకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2015 అక్టోబరు 2న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించింది. మొదట్లో ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీల కోసం వీటిని చేపట్టినా... ఈ ఆర్థిక సంవత్సరం నుంచి బీసీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికీ అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో వధువుకు రూ.75,116 చొప్పున సాయం అందిస్తున్నారు. పెళ్లయిన తర్వాత 1-3 నెలల్లో లబ్ధిదారులకు ఈ మొత్తం అందుతోంది. అయితే... సత్వరం సాయం అందిస్తే తమకెంతో ఉపశమనంగా ఉంటుందని పలువురు తల్లిదండ్రులు, వధువులు... ప్రభుత్వాన్నీ, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అభ్యర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీశాఖల ముఖ్య కార్యదర్శులు ఇటీవల సమావేశమయ్యారు. పెళ్లి రోజే సాయం అందించాలని నిర్ణయించి, ప్రతిపాదనలు రూపొందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ (మిగతా 2లో)

నీటి విడుదల ఆపండి

- ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆదేశం
- శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి పరిమితికి మించి వాడుకున్నందునే...

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ నిర్ణయించిన నీటికంటే ఎక్కువ వాడుకొందని, వెంటనే నీటి విడుదలను నిలిపివేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పేర్కొంది. మరోవైపు ఇప్పటివరకు నిర్ణయించిన నీటికంటే ఎక్కువ వాడుకోవడమే కాకుండా శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో కనీస నీటిమట్టాల కంటే పైన ఉన్న నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు కేవలం 0.56 టీఎంసీ మాత్రమే మిగులు ఉందంటూ బోర్డుకు తెలంగాణ సర్కారు లేఖ రాసింది. ఆంధ్రప్రదేశ్‌కు బోర్డు దీనిని కూడా పంపింది. ఉభయ రాష్ట్రాల ఇంజినీర్-ఇన్-చీఫ్‌లు, బోర్డు సభ్య కార్యదర్శితో కూడిన త్రిసభ్య కమిటీ సమావేశం జనవరి పదిన జరిగింది. అప్పటివరకు జరిగిన నీటి వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని... ఏపీ 60, తెలంగాణ 50 టీఎంసీలు వాడుకునేలా ఒప్పందమైంది. ఈనెల 26 వరకు నీటి వినియోగ లెక్కలను బట్టి... నిర్ణయించిన దానికంటే 2.324 టిఎంసీలు ఎక్కువగా ఏపీ వాడుకొందనీ... శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో ఆవిరైన నీటిలో వాటాను కూడా పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయానికి వచ్చినట్లు మంగళవారం ఉభయ ఈఎన్‌సీలకు రాసిన లేఖలో బోర్డు స్పష్టం చేసింది. త్రిసభ్య కమిటీ నిర్ణయించిన దానికంటే శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి ఎక్కువ నీటిని వాడుకోవడాన్ని ‘అనధీకృత వినియోగం’గా పరిగణిస్తున్నామని బోర్డు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ రెండు జలాశయాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటి విడుదలను నిలిపేయాలని ఆదేశించింది. శ్రీశైలం కుడి విద్యుత్తు కేంద్రం నుంచి తమ ఆదేశాలకు తగ్గట్లు నీటి వినియోగం జరగలేదని పేర్కొంది. ‘రెండు రిజర్వాయర్లలో కనీస నీటి మట్టాల పైన 36.180 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఆగస్టు వరకు తాగు, సాగునీటి (మిగతా 2లో)

హోలీకి రెండు రోజుల సెలవు: ప్రభుత్వం ఉత్తర్వులు -2లో



ఎత్తిపోతల పథకం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, చిత్రంలో ఆర్టీసీ ఛైర్మన్ సత్యనారాయణ, ఎంపీ సుమన్ తదితరులు

ఎత్తిపోతలకు సీఎం శంకుస్థాపన

- **రూ.75.74 కోట్ల వ్యయంతో నిర్మాణం..**

గోదావరిఖని, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్మూర్ వద్ద రూ. 75.74 కోట్లతో నిర్మించే ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మూర్మూర్ పంపుహౌస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ఆరు నెలల్లో ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో ఎస్సారెస్పీ కాలువల కింద ఉన్న 20 వేల ఎకరాలకు సాగునీరందిస్తామని పేర్కొన్నారు. రెండు మండలాల్లోని శ్రీరాంసాగర్ 27ఎల్, 17 ఎల్ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీరందించేందుకు పథకం ద్వారా చెరువులను నింపనున్నామని వెల్లడించారు. దీని ద్వారా బ్రాహ్మణపల్లి, ఎల్లంపల్లి, గోలివాడ, ఆకెనపల్లి, సోమనపల్లి, మద్దిర్యాల, రాయదండి, మూర్మూర్, అంతర్గాం, ఎక్లాస్‌పూర్, పొట్యాల, వేంనూరు, గుడిపల్లి, కుక్కలగూడురు, పుట్నూరు గ్రామాల రైతులకు సాగునీరు అందించనున్నామని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలంలోగా పనులు పూర్తి చేసి సాగు నీరందించేలా నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎంపీలు బాల్క సుమన్, కె.కేశవరావు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్, జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, జిల్లా పాలనాధికారి శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.



పొరుగుతో కలిసి ఉంటేనే అభివృద్ధి

ఆదిలాబాద్, శ్రీరాంపూర్ సభల్లో సీఎం కేసీఆర్

ఈనాడు, ఆదిలాబాద్, శ్రీరాంపూర్ (మంచిర్యాల), న్యూస్‌టుడే: ఇరుగు పొరుగు రాష్ట్రాలతో కలిసి ఉంటేనే అభివృద్ధి జరుగుతుందనీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలివి తక్కువగా వ్యవహరించాయని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. మహారాష్ట్రతో సఖ్యతగా మెలగడంతో 300 టీఎంసీల గోదావరి నీటిని వాడుకునే కాళేశ్వర ఆనకట్టకు అనుమతులు వచ్చాయన్నారు. సింగరేణిని అన్నంపెట్టిన తల్లిగా అభివర్ణించారు. ప్రాణం పోయినా ఎట్టి పరిస్థితుల్లో సంస్థను ప్రైవేటుపరం కానివ్వబోమనీ, కేంద్రం వాటా చెల్లించైనా సంస్థను నిలుపుకొంటామని స్పష్టం చేశారు. ప్రైవేటులో తాము విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఇవ్వలేదని ఆదిలాబాద్, శ్రీరాంపూర్ సభల్లో పేర్కొన్నారు.

"ఎక్కడైనా సరే ఇరుగు పొరుగు రాష్ట్రాలతో కలిసి ఉంటేనే అభివృద్ధి జరుగుతుంది. దశాబ్దాలపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలివి తక్కువగా వ్యవహరించాయి. పక్కనే ఉన్న మహారాష్ట్రలో ఆనాడు అదేపార్టీ ప్రభుత్వం ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు ఆనుకొని పెన్‌గంగా, గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నా ఉపయోగించుకోలేని దుస్థితి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నేనే స్వయంగా మహారాష్ట్రకు పలుమార్లు వెళ్లాను. నాలుగైదుసార్లు నీటిపారుదల శాఖ అధికారులను పంపాను. చివరికి ఆదిలాబాద్ ప్రాంతంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పెన్‌గంగాపై జైనథ్ మండలంలోని చనాక-కోర్ట వద్ద ఆనకట్ట నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి" అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

మంగళవారం ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన కేసీఆర్ తొలుత హెలికాప్టర్‌లో చనాక- కోర్ట ఆనకట్ట పనులను పరిశీలించారు. రేయింబవళ్లు పనిచేసి గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారులు, అధికారులను ఆదేశించారు. కోర్ట గ్రామస్థులతో కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. అనంతరం హెలికాప్టర్‌లో ఆదిలాబాద్ చేరుకొని స్థానిక డైట్ మైదానంలో మంత్రి జోగురామన్న అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా రెండు ప్రధాన జాతీయ పార్టీలపై ముఖ్యమంత్రి నిప్పులు చెరిగారు. ఆ పార్టీలపై తానుచేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. భారత రైతాంగం సహనం కోల్పోతోందనీ, ఈ పరిణామాలు దేశానికి మంచివి కావన్నారు. తలాపునే గోదావరి, పెన్‌గంగ నదులు ప్రవహిస్తున్నాయని.. దేశంలో 70 వేల టీఎంసీల నీరు వర్షం ద్వారా వస్తుంటే.. కనీసం 25 వేల టీఎంసీల నీటిని కూడా వాడుకోలేకపోవడంపై జాతీయ పార్టీలు తలదించుకోవాలని విమర్శించారు. ఆ పార్టీలకు అసలు సిగ్గుందా? 70 ఏళ్ల పాటు గాడిద పళ్లు తోమారా? రైతు సంక్షేమంపై చర్చించే దమ్ముందా అంటూ ఆవేశపూరితంగా ప్రసంగించారు. "వడ్లకు రూ.1590 నుంచి రూ.2 వేల మద్దతు మద్దతు ధర పెంచితే మీ అయ్య ముల్లె పోతుందా? మక్కలకు రూ.1400 నుంచి రూ.2 వేల ధర పెంచితే మీ తాతముల్లేమన్న పోతుందా"? అంటూ కేంద్ర వైఖరిపై మండిపడ్డారు.



శ్రీరాంపూర్ బహిరంగ సభకు హాజరైన కార్మికులు, ప్రజలు

అరాచక శక్తులే రెచ్చగొడుతున్నాయి..

గిరిజన వర్గాల మధ్య నెలకొన్న వైషమ్యాలపై ముఖ్యమంత్రి స్పందించారు. కొన్ని అరాచక శక్తులు స్వార్థ రాజకీయాల కోసం పిచ్చిపిచ్చిగా రెచ్చగొడుతూ మనలో మనకే జుట్లు ముడేసి కలహాలు సృష్టిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఆదివాసీలు, లంబాడీలు చల్లగా బతికినోళ్లనీ, చాలా త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామనీ, ఏ వర్గానికి సమస్యలున్నా బిడ్డగా పరిష్కరిస్తాననీ, సమస్యలను నేరుగా తనకు చెప్పుకోవచ్చని వివరించారు. అంతా కలిసి ఆదిలాబాద్‌ను కశ్మీర్‌గా తయారు చేసుకుందామని పిలుపునిచ్చారు. సర్వేలో తెరాసకు 106 సీట్లు వస్తున్నాయని తెలిసి కళ్లు బైర్లుకమ్మి ఇలాంటి దుర్మార్గపు చర్యలకు దిగుతున్నారన్నారు. ప్రజల సౌకర్యం కోసమే జిల్లాలను విభజించినట్లు తెలిపారు.

విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని నినాదాలు..

వరంగల్‌కు తరలించిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని జిల్లాలోనే ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభంలో కొంతమంది ప్లకార్డులతో నినాదాలు చేశారు. దీంతో సీఎం వాళ్లకు చురకలు వేశారు. "మీకు పనిలేదానే. తమాషా ఎక్కువ చేస్తున్నారు. సైలెంట్‌గా ఉండండి. పోలీసులు చూసుకోండి. వాళ్లకు ఏం కావాలి. వారి కథేంటో తెలుసుకో" అంటూ మంత్రి రామన్నను పురమాయించారు. మంత్రులు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి వారిని శాంతింపజేశారు.

సింగరేణిని నిలుపుకొంటాం..

మంగళవారం సాయంత్రం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం గనులను ప్రైవేటుపరం చేస్తోందనీ, మరి సింగరేణి సంగతేందని తనను కొందరు అడిగారనీ, ఆరు నూరైనా సింగరేణిని ప్రైవేటుపరం చేస్తే తెలంగాణ ప్రభుత్వం సహించదని పునరుద్ఘాటించారు. సింగరేణి మీద దేశానికి పెత్తనం లేదనీ, అవసరమైతే కేంద్రం వాటాను చెల్లించైనా ఈ సంస్థను నిలుపుకొంటామని స్పష్టం చేశారు. "వందేళ్లకు ముందు నుంచి ఏ దిక్కూ లేనప్పుడు అనేక జిల్లాలకు అన్నం పెట్టిన తల్లి సింగరేణి.. ఒక గొప్ప ఉద్యోగ వనరు. దీన్ని ప్రాణం పోయినా ప్రైవేటుపరం కానివ్వబోమని ఉద్వేగంగా చెప్పారు. సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం, ఆర్టీసీలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. ప్రైవేటురంగంలో పారిశ్రామికవేత్తలు ఆరువేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తామని ముందుకొస్తే తాము అంగీకరించలేదనీ, ప్రాణం పోయినా ఇవ్వమనీ, జెన్‌కో ఉత్పత్తి చేస్తుందని చెప్పామనీ, దీంతో 24 వేల మంది బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశమంతా ప్రైవేటు వాళ్లకు విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఇచ్చినా తాము మాత్రం ఇవ్వలేదనీ, జెన్‌కో ఉత్పత్తికి అవసరమైన సామగ్రిని కూడా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్‌ఈఎల్‌కు ఇచ్చేలా చేశామన్నారు. సమైక్యరాష్ట్ర పాలనలో ఉద్యోగులపై ఎప్పుడూ కత్తి వేలాడుతూనే ఉండేదనీ, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేసేవారనీ, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఆర్టీసీకి రూ.750 కోట్ల నిధులు కేటాయించి కాపాడుకున్నామని వివరించారు. సింగరేణిలో 'లంచం అడిగినవారిని చెప్పుతో కొట్టండి, మీకు నేనున్నా.. ఏమన్నా అంటే నాకు చెప్పండి' అని సూచించారు. కారుణ్య నియామకాలు అమలవుతాయనీ, వీటికి ఏ కోర్టులూ అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం లేదన్నారు. వైద్యపరమైన సమస్యలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి మొదటి వారంలో కొత్త బోర్డు ఏర్పాటు చేస్తామని, అందులో సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సింగరేణిలో కొందరు వైద్యాధికారులు లంచాలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాల ద్వారా తనకు సమాచారం ఉందనీ, ఇలాంటి వారికి ముకుతాడు వేయడానికి నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల నుంచి బోర్డులో సభ్యులను నియమిస్తామని చెప్పారు. సభలో రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, తెబొగకాసం గౌరవాధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కవిత, పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ సలహాదారు వివేక్, కార్మిక నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

కల్యాణం నాడే సాయం

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తర్వాత వీటి అమలు తేదీని ఖరారు చేస్తారు.

అమలు ఇలా...: ప్రస్తుతం దరఖాస్తులు, లబ్ధిదారులపై రెవిన్యూ యంత్రాంగంతో విచారణ చేయించి, శాసనసభ్యుల ద్వారా వారికి చెక్కులను ఇస్తున్నారు. ఇకపై వివాహపత్రిక, ఇతరత్రా ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే... వెంటనే విచారణ చేయించి, జాబితాను ఎమ్మెల్యేలకు పంపిస్తారు. వారి ఆమోదంతో నిధులను మంజూరు చేస్తారు. తహసీల్దార్లు/సంక్షేమశాఖల ద్వారా చెక్కులను సిద్ధం చేసి... పెళ్లి రోజే స్థానిక కార్యదర్శులు, వీఆర్వోల ద్వారా వాటిని వధువులకు పంపిణీ చేస్తారు.

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల కింద అందించే సాయాన్ని వచ్చే ఏప్రిల్ నుంచి రూ.లక్షకు పెంచాలన్న ప్రతిపాదన ఉంది. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని చేర్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

అక్రమాలకు తావు లేకుండా...: కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు దళారుల సమస్య కొంత ఉంది. లంచాలకోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదులొస్తున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని, ఎక్కడా ఇబ్బంది లేకుండా సాక్షుల సంతకాలు తీసుకోనున్నారు. ప్రత్యేక సహాయ కేంద్రాన్నీ ఏర్పాటు చేస్తారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులొస్తే... ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై అవినీతి నిరోధకశాఖ రంగంలోకి దిగుతుంది. లంచాలు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులకు కేసులు తప్పవు. వారి ఇళ్లలో సోదాలు చేపడతారు. ముడుపులు తీసుకునే ప్రైవేటు వ్యక్తులపైనా కేసులు నమోదు చేస్తారు.

హోలీకి రెండు రోజుల సెలవు

ఈనాడు, హైదరాబాద్: హోలీ పండుగ కోసం తెలంగాణ ప్రభుత్వం రెండు రోజులపాటు సెలవులిచ్చింది. మార్చి ఒకటో తేదీన సాధారణ సెలవుగా, రెండో తేదీన ఐచ్ఛిక సెలవుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటో తేదీన సెలవు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. కేంద్రం రెండో తేదీని ప్రకటించడంతో సందిగ్ధం ఏర్పడింది. దీనిపై ప్రభుత్వం దేవాదాయశాఖను సంప్రదించింది. ఒకటో తేదీ సెలవును కొనసాగించాలని ఆ శాఖ తెలిపిన మీదట. రెండు రోజులపాటు సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అప్రమత్తం... ఆందోళన

- **కరీంనగర్‌లో ముఖ్యమంత్రి హెలికాప్టర్ నుంచి పొగలు**
- **కమ్యూనికేషన్ కిట్‌బ్యాగ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణం..**
- **అప్రమత్తమై బయటకు తీసివేసిన భద్రతా అధికారి**
- **కొద్దిసేపు ఉత్కంఠ**

ఈనాడు, కరీంనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ నుంచి పొగలు రావడంతో ఒక్కసారిగా ఆందోళన.. గందరగోళం నెలకొన్నాయి. 17 జిల్లాల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సు సోమవారం కరీంనగర్‌లో నిర్వహించారు. సోమవారం రాత్రి కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి బస చేశారు. పెద్దపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 10.21 గంటలకు కారులో హెలిప్యాడ్ వద్దకు చేరుకొని హెలికాప్టర్ ఎక్కారు. మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ కేశవరావు, తెరాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌రావు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక అధికారి స్మితాసబర్వాల్ 10.24 గంటలకు హెలికాప్టర్‌లో ఎక్కారు. ఇద్దరు పైలట్లు హెలికాప్టర్ ఇంజిన్‌ను స్టార్ట్ చేయగా, సహాయకులు హెలికాప్టర్ తలుపులు, ఇతర భాగాలను సరిచూస్తున్నారు. అప్పటికీ వెనక భాగంలో ఉన్న తలుపు ఇంకా మూసివేయలేదు. 10.25 గంటలకు అక్కడ ఉన్న భద్రతా అధికారి ఒక్కసారిగా లోపల ఉన్న ఓ నల్లటి బ్యాగును చేతిలోకి తీసుకుని పదడుగుల దూరం వరకు పరుగెత్తారు. సంచిలో నుంచి పొగలు రావడంతో భద్రతాధికారులంతా ఆందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న భద్రతా సిబ్బందిలో ఒకరు వేగంగా పరుగెత్తుకుంటూ వచ్చి అధికారి చేతిలో ఉన్న సంచిని పట్టుకుని క్షణాల్లో హెలిప్యాడ్‌కు దూరంగా తీసుకువెళ్లి పడేశారు. ఈ క్రమంలో హెలిపాడ్ చుట్టూ ఉన్న భద్రతాధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఓ పైలట్ దిగి వెనక భాగంలో ఉన్న తలుపును మూసివేశారు. 10.29 గంటలకు హెలికాప్టర్ గాల్లోకి ఎగిరింది. నాలుగు నిమిషాల పాటు ఈ హడావిడికి ఏం జరుగుతుందో అర్థంకాక ప్రజాప్రతినిధులు, సమీపంలోని ప్రజలు ఉత్కంఠకు గురయ్యారు. హెలికాప్టర్ వెళ్లిపోగానే భద్రతా సిబ్బంది బ్యాగును వెంట తీసుకుని వెళ్లిపోయారు. ముఖ్యమంత్రి భద్రతకు సంబంధించిన కమ్యూనికేషన్ కిట్ బ్యాగులో ఉండే బ్యాటరీ తీగలు షార్ట్ సర్క్యూట్‌కు రావడంతో పొగలు వచ్చాయని పోలీసులు తెలిపారు.



బ్యాగును తీసుకుని దూరంగా పరుగెత్తుతున్న భద్రతా సిబ్బంది

ప్రయాణంలో అయితే...?

హెలికాప్టర్ గాలిలోకి ఎగరకముందే బ్యాగును గుర్తించడం.. తొలగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఒకవేళ హెలికాప్టర్ గాలిలోకి ఎగిరిన తర్వాత, ప్రయాణ సమయంలో పేలితే పెనుప్రమాదం వాటిల్లేదని భావిస్తున్నారు. ఈ విషయమై తమకేమీ తెలియదనీ, ఏవియేషన్ అధికారులే చెప్పగలరని పోలీసుఉన్నతాధికారులు సమాధానమిస్తున్నారు.


ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఘటనపై విచారణ

మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో పొగలు రావడంపై విచారణ జరుపుతున్నామని డీజీపీ వెల్లడించారు. భద్రతాసిబ్బందికి చెందిన వైర్లెస్ సెట్‌లో పొగలు వచ్చినట్లు గుర్తించారని, ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు.

నీటి విడుదల ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

అవసరాలను పరిగణనలోకి తీసుకుని... త్రిసభ్య కమిటీ సమావేశానికి ప్రతిపాదనలతో రావాలి'అని బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం ఉభయ ఈఎన్‌సీలను కోరారు. మరోవైపు- తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ బోర్డు సభ్యకార్యదర్శికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ 2.279టీఎంసీలు ఎక్కువగా వాడుకుందనీ, తెలంగాణ మాత్రం 16.658 టీఎంసీలు తక్కువగా వినియోగించుకుందని అందులో పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం ఏపీ 66%, తెలంగాణ 34% నీటిని వాడుకోవాల్సి ఉందనీ... ఈనెల 26 వరకు ఏపీ 69.539%, తెలంగాణ 30.46% వినియోగించుకొన్నాయని ఆయన పేర్కొన్నారు. శ్రీశైలంనుంచి పోతిరెడ్డిపాడు ద్వారా తీసుకొన్న నీటిలో 20 టీఎంసీలు తక్కువగా ఆంధ్రప్రదేశ్ చూపిందని, ఈ నీటిని కూడా పరిగణనలోకి తీసుకొన్నట్లు పేర్కొంది. కనీస నీటిమట్టాలపైన రెండు రిజర్వాయర్లలో 36.180 టీఎంసీలు ఉన్నాయని, ఇప్పటివరకు జరిగిన మొత్తం వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొంటే ఆంధ్రప్రదేశ్‌కు 0.56 టీఎంసీ మాత్రమే మిగిలిందని, తెలంగాణకు ఇంకా 35.620టీఎంసీల వాటాఉందని వివరించారు. దీనికి తగ్గట్టుగా తదుపరి నిర్ణయంతీసుకోవాలని ఆయన బోర్డుకు సూచించారు.





ప్రతిపాదిత భూసేకరణ చట్టంపై ఏర్పాటైన పార్లమెంటరీ సంయుక్త సంఘం మంగళవారం సమావేశం కావాల్సి ఉన్నా తగినంతమంది సభ్యులు లేని కారణంగా వాయిదా పడింది. పునరాశ్రయం బిల్లు-2015పై ప్రభుత్వానికి పట్టుదల లేదనీ, అధికారపక్ష సభ్యులు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారని విపక్షాలు ఆరోపించాయి.

నీరవ్ మోదీ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)

నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు చెందిన సంస్థలు పంజాబ్ నేషనల్ బ్యాంకుతో జరిపిన అనధికార లావాదేవీల మొత్తం విలువ రూ.12,717 (2బిలియన్ అమెరికా డాలర్లు) కోట్లకు చేరింది. బ్యాంకు అధికారులు ఈ విషయాన్ని స్వయంగా సోమవారం రాత్రి స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేశారు. గతంలో బ్యాంకు చేసిన ఫిర్యాదుల్లో మోసం మొత్తం విలువ రూ.11,394.02 కోట్లు(1.77బిలియన్ డాలర్లు). తాజా సమాచారం ప్రకారం కుంభకోణం విస్తృతి మరో రూ.1,323 కోట్ల మేర పెరిగింది. పీఎన్‌బీ మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి తదితరులు నీరవ్ మోదీ గ్రూప్, మెహుల్ చోక్సీ గ్రూప్ సంస్థలతో కుమ్మక్కై ఎలా మోసాలకు పాల్పడింది పీఎన్‌బీ అధికారులు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపిన సమాచారంలో వివరించారు. ఇదే కేసులో కుంభకోణానికి సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు అలహాబాద్ బ్యాంకు ఎండీ ఉషా అనంత సుబ్రమణియన్ను, ఐసీఐసీఐ బ్యాంకు ఉన్నతాధికారి ఎన్.ఎస్.కన్నన్ను సీబీఐ ప్రశ్నించింది. నీరవ్, చోక్సీలు అక్రమ భరోసా పత్రాలను పొందటం ప్రారంభించిన 2011 సమయంలో ఉషా అనంత సుబ్రమణియన్ పీఎన్‌బీలో ఉన్నత పదవుల్లో ఉన్నారు. ప్రస్తుతం అలహాబాద్ బ్యాంకు సీఈవో, ఎండీగా ఉన్నారు. ఇటీవలే ఆమె ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పీఎన్‌బీలోని నిఘా వ్యవస్థలను దాటుకుంటూ రూ.వేలకోట్ల లావాదేవీలు ఎలా జరిగి ఉంటాయో తెలుసుకునేందుకు ఆమెను ప్రశ్నించినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఐసీఐసీఐ బ్యాంకు నేతృత్వంలోని 34 బ్యాంకుల సహవ్యవస్థ (కన్సార్టియం) మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలీ గ్రూప్ కంపెనీలకు రూ.5,280 కోట్ల రుణాలను మంజూరు చేయటంపై ఎన్.ఎస్.కన్నన్ నుంచి సీబీఐ వివరాలను రాబట్టింది. పీఎన్‌బీలో అంతర్జాతీయ బ్యాంకింగ్ విభాగంలో జనరల్ మేనేజర్ నేహాల్ అహద్, ముంబయి జోన్ అధికారి విమ్లేష్‌లనూ దర్యాప్తు సంస్థలు ప్రశ్నించాయి.

మార్చి 12లోగా కోర్టుకు హాజరుకావాలి

పన్ను ఎగవేత కేసులో నీరవ్ మోదీ మార్చి 12వ తేదీలోగా కోర్టులో హాజరు కావాలంటూ ముంబయి అదనపు ఛీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మంగళవారం సమన్లు జారీ చేశారు. నీరవ్ మోదీ గ్రూప్ సంస్థలు ఆదాయపు పన్ను ఎగవేశాయని ఆరోపిస్తూ ఐటీ అధికారులు దాఖలు చేసిన కేసులో జడ్జి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు నగదు అక్రమ చలామణి కేసులో నీరవ్ మోదీపై బెయిల్‌కు వీల్లేని వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముంబయిలోని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానాన్ని కోరింది. మూడు సార్లు సమన్లు జారీ చేసినా నీరవ్ మోదీ తమఎదుట హాజరు కానందున ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయాలని ఈడీతరఫు న్యాయవాది... జడ్జి ఎం.ఎస్.అజ్మీ ముందు వాదనలు వినిపించారు. బుధవారం నీరవ్ మోదీ తరఫున్యాయవాది వాదనలు కొనసాగనున్నాయి.

న్యూయార్క్ కోర్టులో నీరవ్ సంస్థ దివాలా పిటిషన్

నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ అమెరికాలో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. న్యూయార్క్‌లో దివాలా కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానం జడ్జి సీన్ హెచ్.లేన్ ముందుకు సోమవారం ఈ పిటిషన్ వెళ్లింది. పునర్వ్యవస్థీకరణకు వీలుకల్పించే ఛాప్టర్ 11 (అమెరికా)నిబంధనల ప్రకారం ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ దీనిని నమోదు చేసింది. వ్యాపారాన్ని సజీవంగా నిలుపుకోవటంతో పాటు రుణదాతలకు క్రమీణా అప్పులు తిరిగి చెల్లించే వెసులుబాటు కోసం ఒక ప్రణాళికను ప్రతిపాదిస్తూ కార్పొరేట్ సంస్థ లేదా దాని భాగస్వామి ఈ తరహా పిటిషన్ దాఖలు చేస్తుంటారు. దీంతో రుణగ్రహీత సంస్థ... దివాలా న్యాయస్థానం నియంత్రణ పరిధిలోకి వెళ్తుంది. చెల్లించాల్సిన అప్పులకు సంబంధించి ఉపశమన ఉత్తర్వులు వెలువడతాయి. అమెరికా, ఐరోపా, మధ్య ఆసియా, తూర్పు ఆసియా, భారత్‌లలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ తనకు రూ.670కోట్ల (100 మిలియన్ డాలర్ల)మేర ఆస్తులు, అప్పులు ఉన్నాయని న్యాయస్థానానికి సమర్పించిన పత్రాల్లో పేర్కొంది. అనుబంధ సంస్థలైన జఫే, ఫాంటసీలనూ దివాలా పత్రాల్లో చేర్చింది. ఫైర్‌స్టార్ డైమండ్ ఏకైక డైరెక్టర్ మిహిర్ భన్సాలి 8పేజీల దివాలా పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పత్రాల్లో సంస్థ వ్యవస్థాపకుడు నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీల పేర్లను మాత్రం ప్రస్తావించలేదు.

గ్రహం అనుగ్రహం

28–2–2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; శుక్ల పక్షం
త్రయోదశి: ఉ. 10-33 తదుపరి చతుర్దశి
ఆశ్లేష నక్షత్రం: రా. 1-14 తదుపరి మఖ
అమృత ఘడియలు: రా. 11-44 నుంచి 1-14 వరకు
వర్జ్యం: మ. 2-43 నుంచి 4-13 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-48 నుంచి 12-35 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-24; సూర్యాస్తమయం: సా.6-00

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మెదక్	38.3	15.0
రామగుండం	37.6	19.1
మహబూబ్‌నగర్	37.6	19.0
ఖమ్మం	37.0	22.0
హన్మకొండ	37.0	20.5
నిజామాబాద్	36.0	20.0
ఆదిలాబాద్	35.3	14.6
హైదరాబాద్	35.1	17.6
సూర్యాపేట	34.5	24.0
కరీంనగర్	34.0	18.0

పురుషోత్తమ్‌రెడ్డికి మరో బినామీ

- కారు ఆర్‌సీ నంబరు ఆధారంగా విచారించగా వెలుగులోకి
- మియాపూర్‌లో నివసిస్తున్నట్టు గుర్తింపు
- ఆయన కోసం ఏసీబీ ప్రత్యేక బృందాల వేట


పురుషోత్తమ్‌రెడ్డి ఇంట్లో రద్దయిన పెద్ద నోట్లు, ఆభరణాలు


ఆయన అనుమతి లేకుండా నిర్మించిన పెంట్‌హౌస్

ఈనాడు, హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్న హెచ్‌ఎండీఏ పూర్వ అధికారి పురుషోత్తమ్‌రెడ్డి లీలలు మరిన్ని వెలుగు చూస్తున్నాయి. అవినీతి, అక్రమాల పరంపరపై ఆయన్ని విచారిస్తున్న ఏసీబీ అధికారులు తాజాగా మరో కొత్త బినామీని గుర్తించారు. ఆయన ఇంట్లోని ఇన్నోవా వాహనం రిజిస్ట్రేషన్ పత్రం(ఆర్సీ) ఆధారంగా ఆయనెవరన్నది కనుగొన్నారు. పురుషోత్తమ్‌రెడ్డి.. ఆర్. శ్రీనివాసరెడ్డి పేరుతో రూ. 20 లక్షల విలువైన ఇన్నోవా క్రిస్టా వాహనాన్ని జనవరి 6, 2018న మహవీర్ మోటార్స్ నుంచి కొనుగోలు చేశారు. వాహనం నంబరు, రిజిస్ట్రేషన్ పత్రంలో ఉన్న చిరునామా ఆధారంగా ఏసీబీ అధికారులు సదరు శ్రీనివాసరెడ్డి మియాపూర్‌లో నివసిస్తున్నట్టు గుర్తించారు. సోమవారం అతడిని విచారించేందుకు మియాపూర్ వెళ్లారు. ఆయన అక్కడ లేకపోవడంతో మంగళవారం ప్రత్యేక బృందం అతని కోసం వేట కొనసాగించింది. మరోవైపు కారు కొనుగోలుకు నగదు ఇచ్చారా? చెక్కులు ఇచ్చారా? అన్నది గుర్తించే క్రమంలో మహావీర్ మోటర్స్ ప్రతినిధులను ఏసీబీ అధికారులు వాకబు చేశారు. వారికి అధికారికంగా తాఖీదులు పంపించారు.

పాతనోట్లు....కొత్త ఉచ్చు

మరోవైపు పురుషోత్తమ్‌రెడ్డి ఇంట్లో రెండు రోజులక్రితం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇంట్లో ఖరీదైన గృహోపకరణాలు, రూ. అరకోటి విలువైన బంగారు, వజ్రాభరణాలు, రూ. 1.05 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదులో రూ. 9,500 విలువైన రద్దయిన పెద్ద నోట్లు ఉండటాన్ని గుర్తించారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం పాతనోట్లు కలిగి ఉన్నా నేరమే కాబట్టి.. ఈ అంశంపై స్పష్టత కోసం ఏసీబీ రిజర్వ్‌బ్యాంక్‌కు లేఖ రాసింది. ఇక పురుషోత్తమ్‌రెడ్డి జీహెచ్‌ఎంసీకి సమర్పించిన ఇంటినిర్మాణం ప్రణాళికలో పెంట్‌హౌస్ లేదు. అయినా ఆయన దాన్ని ఎలానిర్మించారు? దానికి ప్రత్యేకఅనుమతి ఏదైనా తీసుకున్నారా? లేదా? అన్నది తెలుసుకునేందుకూ జీహెచ్‌ఎంసీకి ఏసీబీ లేఖ రాసింది.

అగ్రిమెంట్లతో సరిపుచ్చడంతో..

హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగం సంచాలకుడిగా విధులు నిర్వహిస్తున్నప్పుడు పురుషోత్తమ్‌రెడ్డి భారీ అక్రమాలకు తెరతీశాడని ఏసీబీ అధికారులు అంచనా వేశారు. ఆయన బినామీలు యాదవ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిలను విచారించినా.. వారి నుంచి దానికి సంబంధించిన సంతృప్తికరమైన సమాచారాన్ని ఏసీబీ రాబట్టలేకపోయింది. ఈ క్రమంలో రెండు రోజులుగా హెచ్‌ఎండీఏ కార్యాలయం, అతడితో పరిచయమున్న వారిలో కొందర్ని రహస్యంగా విచారించింది. పురుషోత్తమ్‌రెడ్డి వెంచర్ల కోసం స్థలాలు కొనుగోలు చేసినా వాటిని అగ్రిమెంట్లకే పరిమితం చేయడం, రిజిస్ట్రేషన్‌ల వరకూ వెళ్లకపోవడంతో ఆయన అవినీతి ఎంతన్నది ఏసీబీ అంచనా వేయలేకపోతున్నట్టు తెలిసింది. దీంతో పురుషోత్తమ్‌రెడ్డి బాధితులను వాకబు చేసి వివరాలు రాబట్టాలని ఏసీబీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

పంచాయతీల్లో సిబ్బంది ఉంటేనే ప్రోత్సాహకాలు

- మానవ వనరులకు నైపుణ్యమూ ఉండాల్సిందే
- ఇప్పటికే ఒక కమిటీ సిఫార్సులు
- వాటి అమలు పరిశీలనకు మరో కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం
- పంచాయతీలు అధికంగా ఉండే తెలంగాణపై ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: గ్రామ పంచాయతీలు ఇప్పటి మాదిరిగా అరకొర సిబ్బందితో నెట్టుకొద్దామంటే సాధ్యం కాకపోవచ్చు. అలా చేస్తే కేంద్రం నుంచి కొన్ని రకాల ప్రోత్సాహకాలను రాష్ట్రం కోల్పోక తప్పదు. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి తప్పని సరిగా ఉండాలని పేర్కొంటూ ఇప్పటికే ఒక కమిటీ చేసిన సిఫార్సులను పరిశీలించి మార్గదర్శకాలను రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో కమిటీని ఏర్పాటు చేసింది. చిన్న పంచాయతీల మనుగడ కష్టమని, అందువల్ల వాటి ఏర్పాటు యోచనను రాష్ట్రాలు విరమించుకోవటమే ఉత్తమమనే సిఫార్సును కూడా తొలి కమిటీ చేసిన నేపథ్యంలో.. తాజా పరిణామాలు తెలంగాణపై ఎక్కువ ప్రభావాన్ని చూపించే అవకాశముంది. గ్రామీణులకు మెరుగైన సేవలు, వివిధ పథకాల ఫలాలు అందాలంటే ఆయా పంచాయతీల్లో తగిన సంఖ్యలో సిబ్బంది ఉండి తీరాలి. వారికి ఆయా అంశాల్లో నైపుణ్యమూ అవసరం. కొద్ది పాటి రాష్ట్రాల్లో తప్ప మిగతా అన్ని చోట్ల మానవ వనరుల కొరత తీవ్రంగా ఉండటంతో కేంద్రం ఇటీవల దీనిపై దృష్టి సారించింది. ఉపాధి హామీ, 14వ ఆర్థిక సంఘం తదితర పలు రకాల నిధులను పంచాయతీలకు అందిస్తున్నందున మానవ వనరుల కొరతను పరిష్కరించాలంటూ రాష్ట్రాలకు లేఖలు రాస్తూ వచ్చింది. ప్రోత్సాహకాలను అందజేస్తామనే నిబంధన పెడితేనే రాష్ట్రాలు దారి కొస్తాయనే భావనతో.. అదే అంశంపై కమిటీని ఏర్పాటు చేయగా.. అది ఇటీవల కీలక సిఫార్సులు చేసింది. ప్రతి పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి తప్పనిసరని, జనాభా సంఖ్యను బట్టి వారి హోదాలూ మారుతుండాలని చెప్పింది. తొలి కమిటీ సిఫార్సులను అమలు చేయాలంటే రాష్ట్రాలు ఇప్పుడు పంచాయతీల కోసం ఉద్యోగ నియామకాల ప్రక్రియను పెద్ద ఎత్తున చేపట్టాల్సి ఉంటుంది. తెలంగాణలో ప్రస్తుతం కార్యదర్శుల కొరత తీవ్రంగా ఉంది. తాజా కమిటీ సిఫార్సుల తర్వాత తెలంగాణ సర్కారు.. నియామకాల ప్రక్రియను చేపట్టక తప్పదు.

రాష్ట్రపతి నిలయానికి హరిత శోభ!

- పది వేల మొక్కలు పెంచేందుకు ప్రణాళిక
- నేడు దిల్లీలో వాక్‌దృశ్య ప్రదర్శన ఇవ్వనున్న అటవీశాఖాధికారులు


రాష్ట్రపతి నిలయంలో నాటనున్న పూల మొక్కలు, కూర్చొనే ఏర్పాట్ల నమూనా

ఈనాడు, హైదరాబాద్: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో హరితశోభ మరింత ఇనుమడించనుంది. ఇక్కడ దాదాపు పదివేల మొక్కలు కొత్తగా నాటనున్నారు. దీంతోపాటు అక్కడక్కడా కూర్చునేందుకు వీలుగా కుటీరాల తరహాలో సౌకర్యాలు కల్పిస్తారు. సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో ఏటా కొన్ని రోజులు రాష్ట్రపతి బస చేస్తారు. దాదాపు 76 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో ఇప్పటికే ఔషధ రకాలు సహా మామిడి, సపోట, సీతాఫలం, కొబ్బరి తదితర వంద రకాలకుపైగా చెట్లున్నాయి. ఇంకా ఖాళీగా ఉన్న స్థలాల్లో పచ్చదనం పెంచాలని రాష్ట్రపతి భవన్ వర్గాలు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరగా.. హరిత హారం కింద ఆ క్రతువు పూర్తిచేయాలని అటవీశాఖ నిర్ణయించింది. ప్రధాన రహదారి నుంచి రాష్ట్రపతి నిలయం వరకు ఉన్న 2-3 కిలోమీటర్ల మార్గంలో ఇరువైపులా మొక్కలు నాటడంతోపాటు.. ఖాళీ ప్రదేశాల్లో పచ్చదనం పెంచేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందులో మూడు వేల వరకు పూల మొక్కలు ఉండగా.. అన్ని రకాలు కలిపి మొత్తంగా పదివేల వరకు మొక్కలు నాటనున్నారు. సంబంధిత ప్రణాళికలను తెలంగాణ అటవీశాఖ కొద్దిరోజుల క్రితమే రాష్ట్రపతి భవన్‌కు పంపారు. ఈ విషయమై అదనపు పీసీసీఎఫ్ ఆర్.ఎం.దోబ్రియాల్ బుధవారం దిల్లీలోని రాష్ట్రపతి భవన్ అధికారులకు వాక్‌దృశ్య ప్రదర్శన ద్వారా వివరించనున్నారు.

అందులో పేర్కొన్న వివరాల ప్రకారం..

రాష్ట్రపతినిలయం మొత్తంవిస్తీర్ణం	76ఎకరాలు
ఇప్పటికే మొక్కలున్న ప్రాంతం	40 ఎకరాలు
భవన సముదాయాల విస్తీర్ణం	15 ఎకరాలు
కొత్తగా పచ్చదనంపెంచేది	20-21ఎకరాల్లో
అంచనా వ్యయం	రూ. 70 లక్షలు

వారాంతంలోగా మత్తుమందుల కేసు కొలిక్కి

- ఫోరెన్సిక్‌కు అందనున్న ఎల్.ఎస్.డి. నమూనాలు

ఈనాడు, హైదరాబాద్: సంచలనం సృష్టించిన మత్తుమందుల కేసు ఎట్టకేలకు కొలిక్కి రానుంది. ఎన్నో పరిపాలనాపరమైన అడ్డంకుల నడుమ అమెరికా నుంచి తెప్పిస్తున్న ఎల్.ఎస్.డి. నమూనాలు తెలంగాణ ఫోరెన్సిక్ ప్రయోగశాలకు అందనున్నాయి. ఆ వెంటనే 48 గంటల్లో విశ్లేషణ పూర్తి చేసి నివేదిక సిద్ధం చేయనున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ వారాంతానికి ఆబ్కారీ అధికారులకు ఈ నివేదిక అందే అవకాశం ఉంది. ఇప్పటికే కొకైన్ పరీక్షలు పూర్తికాగా ఇప్పుడిక ఎల్.ఎస్.డి. విశ్లేషణలు కూడా పూర్తయ్యే పక్షంలో ఆబ్కారీశాఖ నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేస్తుంది. అనేకమంది సినీ ప్రముఖులు, బహుళజాతి సంస్థల ఉద్యోగులు, విద్యార్థులకు మత్తుమందులు సరఫరా చేస్తున్న కెల్విన్ ముఠాను ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంచాలకులు అకున్ సబర్వాల్ నేతృత్వంలో ప్రత్యేక బృందం గత ఏడాది జూన్‌లో పట్టుకున్న సంగతి తెలిసిందే. తదనంతర దర్యాప్తులో వెల్లడైన అంశాలు సంచలనం రేకెత్తించాయి. విదేశాల నుంచి కొరియర్ల ద్వారా మత్తుమందులు దిగుమతి చేసుకుంటున్న కెల్విన్ ముఠా అవసరమైన వారందరికీ సరఫరా చేస్తోంది. ఇందులో అనేక మంది సినీ ప్రముఖులు కూడా ఉన్నట్లు వెల్లడైంది. దర్యాప్తులో భాగంగా ఆబ్కారీ అధికారులు సినీ ప్రముఖులను విచారించారు. వారిలో అంగీకరించిన వారి నుంచి రక్తం, గోళ్లు, వెంట్రుకల నమూనాలు సేకరించారు. వీటికి ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించడం ద్వారా మత్తుమందులు వాడుతున్నారా, లేదా అన్నది నిర్ధారించాలన్నది అధికారుల ఆలోచన. వీరంతా కొకైన్, ఎల్.ఎస్.డి. వాడుతున్నారనేది అభియోగం. అనుమానితుల నుంచి సేకరించిన నమూనాల్లో వీటి తాలూకూ అవశేషాలు ఉన్నాయా? లేవా? అన్నదీ తేల్చాల్సి ఉంది. ఇది జరగాలంటే కొకైన్, ఎల్.ఎస్.డి.లకు సంబంధించి ప్రామాణిక నమూనాలు కావాలి. కానీ, మనదేశంలో కొకైన్ నమూనా మాత్రమే ఉంది. ఎల్.ఎస్.డి. నమూనా లేదు. అమెరికా నుంచి దీన్ని తెప్పించాల్సి ఉంది. ఇందుకోసం విదేశాంగశాఖ అనుమతి తీసుకొని, అమెరికా ప్రభుత్వాన్ని సంప్రదించి, తమ అవసరాన్ని వివరించి, నమూనాలకు అవసరమైన రుసుము చెల్లించే సరికి ఐదు నెలలు పట్టింది. ఇవి చేతికందిన రెండు రోజుల్లోనే విశ్లేషణ పూర్తిచేసి నివేదిక పంపుతామని ఫోరెన్సిక్ అధికారులు చెబుతున్నారు. కొకైన్ విశ్లేషణకు సంబంధించిన నివేదిక ఇప్పటికే న్యాయస్థానానికి పంపారు. ఎల్.ఎస్.డి. నివేదిక కూడా అందే పక్షంలో దాన్ని జత చేస్తూ ఆబ్కారీ అధికారులు అభియోగ పత్రాలు దాఖలు చేయనున్నారు.

పోస్టింగుల కోసం ఎదురుచూపులు

- ఐదు నెలలుగా ఖాళీగా వచ్చిపోతున్న పోలీసు అధికారులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పోలీసుశాఖలో విచిత్ర పరిస్థితి! ఇన్నాళ్లూ అధికారుల కొరత వేధిస్తే... ఇప్పుడు ఉన్న అధికారులను ఖాళీగా పెట్టుకుని నెలల తరబడి జీతాలిస్తున్నారు. పోస్టింగులల్లేక సదరు అధికారులూ విసిగిపోతున్నారు. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలో అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారుల కొరత తీవ్రంగా ఉండేది. రాష్ట్రోద్యమం నేపథ్యంలో చాలామంది కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ పరిస్థితి కొంత మెరుగైంది. కేంద్ర సర్వీసుల నుంచి అదనపు డీజీ సంతోష్ మెహ్రా, ఐజీలు చౌహాన్, అనిల్‌కుమార్‌లు తిరిగి రాష్ట్రానికొచ్చారు. ముగ్గురు యువ ఎస్పీలను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వీరు ఏఎస్పీ స్థాయిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు. భైంసా అల్లర్ల నేపథ్యంలో కరీంనగర్ డీఐజీ రవివర్మ, ఆదిలాబాద్ ఎస్పీ శ్రీనివాస్‌లను డీజీపీ కార్యాలయానికి ఎటాచ్ చేశారు. పదోన్నతి పొందిన ఐదుగురు అదనపు ఎస్పీలూ ఖాళీగానే ఉంటున్నారు. గత అక్టోబరు నుంచి ఎక్కడా పోస్టింగులు దక్కక.. .. వీరంతా డీజీపీ కార్యాలాయానికి వచ్చి పోతున్నారు. కనీసం కూర్చునే వెసులుబాటు కూడా వీరికి లేదు. అదనపు డీజీ స్థాయిలో ఉన్న సంతోష్ మెహ్రాకు మాత్రం ఖాళీగా ఉన్న పోలీసు నియామక మండలి గదిని కేటాయించారు. అనిల్‌కుమార్, చౌహాన్‌లకు అదీ లేదు! మిగతా అధికారులదీ అదే పరిస్థితి. పోస్టింగులు ఇవ్వకపోతే వేతనం రాదు కాబట్టి... వీరిని వివిధ విభాగాలకు ఎటాచ్ చేసినట్లు సాంకేతికంగా చూపుతున్నారు. నెలలు తరబడి పోస్టింగులు ఇవ్వకపోవడంపై అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంతమందిని ఖాళీగా కూర్చోబెట్టడంపై పోలీసుశాఖలోనూ విమర్శలు వినిపిస్తున్నాయి.

పీజీఈసెట్ దరఖాస్తు రుసుం పెంపు

- మార్చి 15 నుంచి దరఖాస్తుల సమర్పణకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న తెలంగాణ పీజీ ఇంజినీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(పీజీఈసెట్) దరఖాస్తు రుసుం పెరిగింది. గత ఏడాది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు రుసుం రూ. 400, ఇతరులకు రూ. 800 ఉండగా ఈసారి దాన్ని వరసగా రూ. 500, రూ. 1000లకు పెంచారు. మార్చి15 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. పరీక్ష నిర్వహణ బాధ్యత తీసుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం దీనికి సంబంధించి మార్చి 12న ప్రకటన జారీచేస్తుంది. ఈ పరీక్షను గత ఏడాది ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్‌లో నిర్వహించగా ఈసారీ అదే పంథాలో జరపనున్నారు. ప్రవేశపరీక్షలో మొత్తం 120 మార్కులకు జనరల్ అభ్యర్థులు 30 మార్కులు సాధిస్తేనే అర్హత లభిస్తుందని, ఎస్సీ, ఎస్టీలకు అర్హత మార్కులు లేవని సంబంధిత అధికారులు తెలిపారు. మే 28 నుంచి 31 వరకు పరీక్షలు జరుగుతాయని. జూన్ 15న ర్యాంకులను వెల్లడిస్తారని చెప్పారు.

పాలనలో సరికొత్త నినాదం ఇ-గవర్నెన్స్!

- అధికారుల తక్షణ స్పందనతోనే ప్రజాసమస్యల పరిష్కారం
- జాతీయ ఇ-గవర్నెన్స్ ముగింపు సభలో కేంద్రమంత్రి జితేంద్రసింగ్
- వివిధ రాష్ట్రాలకు ఎనిమిది విభాగాల్లో అవార్డులు
- మీ-సేవ విభాగంలో తెలంగాణకు పురస్కారం

ఈనాడు, హైదరాబాద్: సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో ప్రజలకు స్వల్ప సమయంలోనే సమర్థ సేవలు అందించవచ్చని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ అన్నారు. సమస్యకు సంబంధించిన దరఖాస్తు రాగానే తక్షణం స్పందిస్తేనే బాధితులకు సత్వర పరిష్కారం లభిస్తుందని స్పష్టంచేశారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో రెండ్రోజులపాటు జరిగిన 21వ జాతీయ ఇ-గవర్నెన్స్ సదస్సు మంగళవారంతో ముగిసింది. ముగింపు సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి జితేంద్రసింగ్ మాట్లాడుతూ. . ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్రప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ఇ-గవర్నెన్స్‌కు ఎన్నో మెరుగులు దిద్దినట్లు చెప్పారు. కనిష్ఠ ప్రభుత్వం-గరిష్ఠ పాలన నినాదంతో మారుమూల పల్లె వరకూ సాంకేతిక సేవలతో సుపరిపాలన అందిస్తున్నట్లు వివరించారు. సకాలంలో పింఛన్లు అందించటం, రైతులకు పంట దిగుబడులు, మార్కెటింగ్ తదితర అంశాల్లో దేశవ్యాప్తంగా ఇ-గవర్నెన్స్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో అక్షరాస్యత మెరుగుదలకు సాంకేతికతను అస్త్రంగా ఉపయోగించటాన్ని ప్రస్తావించారు. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో ఇ-పాలనతో ప్రగతి దిశగా ప్రయాణిస్తున్నట్లు స్పష్టంచేశారు. ప్రభుత్వంలో కిందిస్థాయి ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ పద్ధతి, దస్తావేజు పత్రాలపై గెజిటెడ్ అధికారుల ప్రమాణీకరణ సంతకాలను తొలగించామని స్పష్టంచేశారు. కాలంచెల్లిన 1500కు పైగా నియమ, నిబంధనలను రద్దుచేయటం మోదీ ప్రభుత్వం చేపట్టిన సాహసోపేతమైన ప్రక్రియగా జితేంద్రసింగ్ అభివర్ణించారు. అనంతరం హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్ వరకూ విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, మార్కెటింగ్ అంశాలలో అమలుచేస్తున్న ఇ-గవర్నెన్స్‌ను వివరించేలా లఘుచిత్రాన్ని ప్రదర్శించారు.


ఇ-గవర్నెన్స్ విభాగంలో విజేతలకు పురస్కారం అందజేస్తున్న కేంద్రమంత్రి జితేంద్రసింగ్ తదితరులు

విభాగాలు 19పురస్కారాలు: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు 8విభాగాల్లో 19జాతీయ ఇ-పురస్కారాలు అందుకున్నాయి. సృజనాత్మకత, ప్రజాసేవల విభాగంలో తెలంగాణలో అమలుచేస్తున్న మీసేవ2.0 రజతపతకం సాధించింది. కార్యక్రమంలో డీఎఆర్‌పీజీ కార్యదర్శి కె.వి.ఇయాపెన్, డీఏఆర్ పీజీ అదనపు కార్యదర్శి వసుధమిశ్రా, తెలంగాణ అదనపు ముఖ్య కార్యదర్శి అజయ్‌మిశ్రా తదితరులు ప్రసంగించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఈనాడు, హైదరాబాద్:. తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సరం ద్వితీయ భాష(తెలుగు, సంస్కృతం, ఉర్దూ తదితర) పరీక్ష జరగనుంది. ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 2న మొదలవుతాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. అంటే ఆ సమయానికి ప్రశ్నాపత్రం ఇస్తారు. ఉదయం 9 తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా లోపలికి అనుమతించరు. అయితే 15 నిమిషాల ముందు... ఉదయం 8.45 గంటలకు అభ్యర్థి వివరాలతో కూడిన ఓఎంఆర్ పత్రం ఇస్తారని, దాన్ని సరిచూసుకోవాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4,55,635 మంది, ద్వితీయ ఇంటర్‌కు 5,07,911 మంది పరీక్షలు రాయనున్నారు. మార్చి 2న ప్రభుత్వం ఐచ్ఛిక సెలవుదినంగా ప్రకటించినా ఆరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష యథాతథంగా జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

అమ్మాయిలే అధికం..

ఇంటర్ రెగ్యులర్‌లో బాల, బాలికల సంఖ్య

ఇంటర్	బాలురు	బాలికలు
ప్రథమ	2,03,512	2,11,703
ద్వితీయ	1,90,488	2,05,015

ఇంటర్ పరీక్షలు రాసే వారిలో బాలికల సంఖ్యే అధికంగా ఉండటం విశేషం. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో వారిదే సంఖ్యాపరంగా పైచేయి. పదో తరగతిలో అమ్మాయిలు అధిక సంఖ్యలో ఉత్తీర్ణులు కావడం కూడా దీనికి ఒక కారణమని చెబుతున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ప్రైవేట్ విద్యార్థు(ఒకసారి తప్పిన వారు) ల్లో బాలురు 46,912 మంది పరీక్షలు రాయనుండగా బాలికలు మాత్రం 27,540 మందే ఉన్నారు. అయితే బాలికలు ఒకసారి తప్పితే మళ్లీ రాయకుండా మానుకునే వారూ కొందరు ఉంటారని చెబుతున్నారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో మాత్రం బాలురే ఎక్కువ మంది ఉన్నారు.

చూచిరాస్తే.. విద్యార్థులకు జైలే

ఈనాడు, హైదరాబాద్: పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడితే పరీక్షలు రాయనివ్వరు.. అంతే కదా అనుకుంటున్నారా? ఈసారి చూసిరాస్తూ పట్టుబడితే విద్యార్థులకు జైలు శిక్ష తప్పదు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడినా, ప్రశ్నపత్రాలను లీకు చేసినా ఇతర అక్రమాలకు పాల్పడినా నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. పదోతరగతి పరీక్షల్లో జోరుగా కాపీయింగ్ జరుగుతోందని...సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఒకరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడంతో దీనిపై రెండేళ్లుగా విచారణ సాగుతోంది. ఈ క్రమంలో రెండు సంవత్సరాలుగా తెలంగాణ విద్యాశాఖ ప్రయోగాత్మకంగా కొన్ని పాఠశాలల్లో సీసీ కెమెరాల నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అన్ని బడుల్లో అమర్చాలంటే నిధుల సమస్య ఉందని చెబుతూ వస్తోంది. తాజాగా హైకోర్టుకు ఇచ్చిన ప్రమాణపత్రంలో 200పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పింది. వాస్తవానికి పరీక్షల్లో అక్రమాలకు పాల్పడకుండా 1997లో ఉమ్మడి రాష్ట్రం 25ఆఫ్ 1997చట్టాన్ని రూపొందించింది. ఆ చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలంటూ దానిపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని హైకోర్టు అదేశించింది. ఈ ఆదేశాలను పాటించేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమై అందుకు కార్యాచరణను రూపొందిస్తోంది. రాష్ట్రంలో మార్చి 15నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీటికి సుమారు 5.60లక్షల మంది హాజరుకానుండగా వీరి కోసం 2,500వరకు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

చూచిరాతల నిరోధానికి చేపట్టనున్న చర్యలు..

- రాష్ట్రంలో 200పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు.
- 25ఆఫ్ 1997 మాల్‌ప్రాక్టీస్ చట్టాన్ని అమలు చేయడం. దీంతో అక్రమాలకు పాల్పడే సిబ్బందితోపాటు కాపీయింగ్‌కు పాల్పడే విద్యార్థులపై క్రిమినల్ కేసుల నమోదు. పోలీసుల విచారణ అనంతరం కోర్టు ద్వారా జైలుశిక్ష కూడా విధిస్తారు. కాపీయింగ్‌కు ప్రోత్సహించే వారిపైనా ఇవే చర్యలు.
- మాల్ ప్రాక్టీస్ చట్టం, క్రిమినల్ కేసుల నమోదు, జైలు శిక్ష తదితర అంశాలపై విస్తృత ప్రచారం.
- పరీక్షల పర్యవేక్షణకు రెవెన్యూ, పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది వినియోగం.
- పరీక్షల విధులకు స్కూల్ అసిస్టెంట్ల(సబ్జెక్టు ఉపాధ్యాయులు)ను వీలైనంతవరకు తగ్గించి సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)ను నియమించడం.

ఈనాడు

జిన్‌పింగ్ పిడికిట్లో చైనా

జన చైనాలో ఏకశిలా సదృశమైన కమ్యూనిస్టు పార్టీ గుత్తపెత్తం దారీ పాలనకు వచ్చే ఏడాదికి డెబ్బయ్యేళ్లు. ఆ చారిత్రక సందర్భానికి చేరువ కానున్న దశలో ఏకపార్టీ పాలన కాస్తా ఏక వ్యక్తి ఏలుబడిగా దిగజారిపోనుందిప్పుడు! 'రాజ్యాంగాన్ని చట్టాన్ని అతిక్రమించే అధికారం ఏ వ్యక్తికీ సంస్థకూ లేనేలేదు' అని సెలవిచ్చిన చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్- రాజ్యాంగాన్ని సవరింపజేసి జీవితకాలం జనచైనా సర్వం సహాధిపత్యం తనకే దఖలుపడేలా పూర్వ రంగాన్ని వడివడిగా సిద్ధం చేస్తున్నారు. ఏక వ్యక్తి నియంతృత్వ ప్రమాదాన్ని నిరోధించేందుకు ఉన్న సమష్టి నాయకత్వ వ్యవస్థను, దేశాధ్యక్షుడికి రెండు దఫాల పదవీ కాల పరిమితుల్ని కాలదన్నుతూ రూపొందించిన రాజ్యాంగ సవరణల్ని- మార్చి అయిదు నుంచి ఆరంభం కానున్న పార్లమెంటు భేటీలో ఆమోదించనున్నారు. జనచైనాను ఉన్న స్థితి నుంచి సముజ్జ్వల స్థితికి చేర్చే నవ సంకల్ప దీక్ష నిర్నిరోధంగా అమలు కావాలంటే, సుస్థిర సమర్థ నాయకత్వం ఎంతో అవసరమంటూ నిరుడు అక్టోబరు నాటి చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) పందొమ్మిదో మహాసభల్లోనే స్వీయ కార్యాచరణకు షి జిన్‌పింగ్ మద్దతు కూడగట్టారు. చైనా ప్రగతికి కొత్త బాటలు పరచిన డెంగ్ జియావోపింగ్ శకానంతరం- జియాంగ్ జెమిన్, హు జింటావోల ఏలుబడి పంథాలోనైతే షి జిన్‌పింగ్ పాలన 2022తో ముగిసిపోవాలి. ఆ తరవాతా చైనా ప్రస్థానగతికి తానే దిక్సూచి కావాలన్న జిన్‌పింగ్- 2013 నుంచి స్వయంగా ప్రస్తావిస్తున్న 'చైనీయుల కల'ను తానే సాకారం చెయ్యాలని అభిలషిస్తున్నారు. అంతకుమించి నయా సిద్ధాంత ప్రయోక్తగా జిన్‌పింగ్ సామ్యవాద ఆలోచనా విధానం చైనా రాజ్యాంగంలో చోటు దక్కించుకోనుంది. సజీవులై ఉన్నప్పుడే స్వీయసిద్ధాంతంతో పాటు రాజ్యాంగంలో చోటు దక్కించుకొన్న మావో జెడాంగ్ సరసకు చేరుతున్న జిన్‌పింగ్- అవినీతిపై ఎత్తిన కత్తిగా పర్యవేక్షక సంఘా (సూపర్‌వైజరీ కమిషన్)నికీ రాజ్యాంగబద్ధత కల్పించడం ద్వారా అధికారాల్ని మరింతగా గుప్పిట పట్టనున్నారు. భావిసవాళ్లకు ముందస్తు జవాబుగా చైనా అధికార మీడియా కీలక రాజ్యాంగ సవరణల్ని ఎంత సమర్థిస్తున్నా, ఏక వ్యక్తి నియంతృత్వంపై వెల్లువెత్తుతున్నాయి ఎన్నో భయసందేహాలు!

దార్శనికుడు డెంగ్ సారథ్యంలో చైనా ఆర్థిక సంస్కరణల ఏరువాక ప్రారంభించి ఈ ఏడాదికి నలభయ్యేళ్లు. పేదరిక నిర్మూలన కోసం బీజింగ్ సాగించిన కృషి మానవేతిహాసంలో మహాధ్యాయమన్న ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు- నాలుగు దశాబ్దాల్లో చైనా 80 కోట్లమందిని దారిద్ర్య రేఖ దాటించగలిగిందని ఘనంగా శ్లాఘించారు. 2021- సీపీసీ శతవార్షికోత్సవ సంవత్సరం. అప్పటికల్లా ఒక మోస్తరు సౌభాగ్య సమాజాన్ని ఆవిష్కరించి దేశంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించబోతున్నామన్న షి జిన్‌పింగ్- మరో మూడు దశాబ్దాల కార్యాచరణ ప్రణాళికను పందొమ్మిదో మహాసభల్లో సమర్పించారు. 2050నాటికి పటిష్ఠ, ప్రజాస్వామ్య, సామరస్య, ఆధునిక, సామ్యవాద దేశ సాక్షాత్కారమే లక్ష్యమంటూ ప్రణాళికాబద్ధంగా రెండు కాలావధుల్లో దాన్ని సాధిస్తామని సీపీసీ ప్రకటించింది. 2020-'35 మధ్య సంపూర్ణ ఆధునిక దేశంగా చైనా రూపాంతరీకరణ పూర్తి అవుతుందని, తరవాత పదిహేనేళ్లలో శాంతి సౌభాగ్యాల గొప్ప సమాజంగా పరిఢవిల్లుతుందని ఘనంగా చాటింది. అసమతుల, అసమగ్ర ప్రగతి దేశాభివృద్ధికి సవాళ్లు రువ్వే ప్రమాదం ఉందన్న షి జిన్‌పింగ్ - అవినీతిపై తీవ్ర పోరాటం సాగిస్తున్నారు. ఆ క్రమంలో తన రాజకీయ ప్రత్యర్థుల్నీ కర్కశంగా అణచివేస్తున్నారన్న ఆరోపణల్ని ఎదుర్కొంటున్నారు. నిరంకుశ పోకడలు ఎప్పటికైనా తనకు ఎసరుపెట్టే ప్రమాదం ఉందన్న భీతితోనే రాజ్యాంగ సవరణలతో స్వీయస్థానాన్ని జిన్‌పింగ్ సుస్థిరం చేసుకొంటున్నారన్న విమర్శలు ధాటిగా దూసుకొస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో సామాన్య చైనీయుల నిరసన గళాలను అధికార యంత్రాంగం తొక్కిపడుతున్న తీరు- ఆందోళనకర భవిష్యత్తుకు ముందస్తు సూచిక అనడంలో సందేహం లేదు!

'ప్రధానంగా సామ్యవాద ఆధునికీకరణ లక్ష్యాన్ని సాధించాల్సిన 2020-'35 కాలం చైనాకు ఎంతో కీలకమైనది. ఆ సమయంలో సుస్థిర, పటిష్ఠ నాయకత్వం ఉండి తీరాలి' అంటూ షి జిన్‌పింగ్ యంత్రాంగం రాజ్యాంగ సవరణల్ని జనం నెత్తిన రుద్దుతోంది. ప్రపంచీకరణ, అంతర్జాల శకంలో చైనా అమేయ ఆర్థిక శక్తిగా అవతరించినా- సైద్ధాంతికంగా, సమాచార రంగంలోనూ ప్రబల శక్తిగా అవతరించలేదంటూ ఆ లోటుపాట్లను పూరించి ప్రపంచ గమనంపై తనదైన ముద్ర వేయాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తోంది. షి జిన్‌పింగ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి రెండేళ్ల ముందే జపాన్‌ను తోసిరాజన్న చైనా, అమెరికా తరవాత రెండో ప్రబలార్థిక శక్తిగా అవతరించింది. 2010 నాటి స్థాయికి రెట్టింపు తలసరి ఆదాయం, స్థూల దేశీయోత్పత్తి లక్ష్యాల సాధనలోనూ దూసుకుపోతోంది. సైన్యం ఆధునికీకరణ వ్యూహాలు, ఇండో-పసిఫిక్ తీరంలో దుందుడుకు ధోరణులు షి జిన్‌పింగ్ నేతృత్వంలో చైనా విస్తరణవాద కాంక్షకు అద్దం పడుతున్నాయి. రష్యాలో అధికారం చేజారనివ్వని పుతిన్ రాజకీయ చాణక్యానికి దీటుగా చైనాలో జిన్‌పింగ్ వ్యూహాలు- మునుముందు అంతర్జాతీయ ముఖచిత్రంలో గణనీయ మార్పుల అవకాశాన్ని ప్రస్ఫుటీకరిస్తున్నాయి. తాజాగా మాల్దీవులు సహా భారత్ చుట్టూ ముత్యాలసరం మాదిరిగా పద్మవ్యూహాన్ని పన్నుతున్న బీజింగ్- కడుపులో కత్తెర, నోట్లో చక్కెర చందంగా పావులు కదుపుతోంది. అరుణాచల్ ప్రదేశ్‌పై పళ్లు నూరుతూ, డోక్లామ్‌లో అగ్గిరాజేస్తూ, ఒన్ బెల్ట్ ఒన్ రోడ్ (ఓబీఓఆర్)తో వాణిజ్య రంగాన ఏకఛత్రాధిపత్యానికి పరితపిస్తున్న చైనాలో ఈ రాజకీయ పరిణామాల్ని జాగ్రత్తగా గమనిస్తుండాల్సిందే. పటిష్ఠ విదేశాంగ విధానంతో డ్రాగన్ బుసల్ని నియంత్రించాల్సిందే!



శాస్త్రీయ స్పృహే ప్రగతి సూత్రం

భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న 'రామన్ ఎఫెక్ట్'ను కనిపెట్టారు. ఉత్కృష్ట భారతీయ ప్రజ్ఞ వెలుగులు ప్రపంచంలో నలుదిశలకూ వ్యాపించిన ఆ తేదీనే 'జాతీయ సైన్స్ దినోత్సవం'గా జరుపుకొంటున్నాం. 1930లో ఈ ఆవిష్కరణకు గానూ రామన్‌కు నోబెల్ బహుమతి లభించింది. ఏటా మన పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు సైన్స్ దినోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకొంటారు. సమాచార మాధ్యమాల్లో ప్రసంగాలు, లఘుచిత్రాలు ప్రసారమవుతాయి. శాస్త్రజ్ఞులు గోష్ఠులు జరుపుకొంటారు. ప్రదర్శనలు, ప్రసంగాలు పరిపాటి అవుతాయి. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్ట ఇతివృత్తం ఆధారంగా సైన్స్ దినోత్సవాలు నిర్వహిస్తోంది. 2016లో దేశాభివృద్ధికి శాస్త్రీయ ప్రాతిపదికలు, 2017లో దివ్యాంగులకు శాస్త్ర సాంకేతిక తోడ్పాటు అనే ఇతివృత్తాల ఆధారంగా సైన్స్ దినోత్సవం జరపగా 2018లో 'సుస్థిర భవిష్యత్తుకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం' అనే అంశం ప్రాతిపదికగా నిలుస్తోంది. ప్రాచీన కాలంలోనే అపూర్వ శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రపంచానికి అందించిన భారతీయులు నవీన యుగంలో మళ్ళీ తమ సత్తా చాటుతున్నారు. నేడు ప్రపంచంలో శాస్త్రజ్ఞులు, సాంకేతిక నిపుణుల సంఖ్యలో భారత్ ద్వితీయ స్థానం ఆక్రమిస్తోంది. అణు, అంతరిక్ష పరిజ్ఞానాల్లో భారత్ అగ్రదేశాల సరసన చేరింది. సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్ విజయాలు జగానికి ఎరుకే! ఇస్రో, బెంగళూరు ఐఐఎస్సీ, డీఆర్‌డీఓ వంటి సంస్థలు శాస్త్రసాంకేతిక రంగంలో వినూత్న పరిశోధనలు నిర్వహిస్తున్నాయి. నేడు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం లేనిదే కార్పొరేట్ రంగం వ్యాపారంలో నిలదొక్కుకోలేదు. పురోగమించలేదు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటూ సరికొత్త నైపుణ్యాలు అలవరచుకొంటూ, సమస్య పరిష్కార పటిమను ప్రదర్శిస్తూ, సృజనాత్మకంగా పనులు చేయగల నిర్ణయాలు తీసుకోగల ఉద్యోగులకు గిరాకీ అంతా ఇంతా కాదు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల గాఢాసక్తి, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన, ప్రయోగాలు చేసే చొరవ ఉండి, వాటిని ప్రోత్సహించే అధ్యాపక వర్గం, కళాశాల వాతావరణం ఉన్నప్పుడు దేశ ప్రగతి రథం దూసుకెళ్తుంది. విద్యార్థులను సృజనాత్మక పంథాలోకి ఆకర్షించడానికి సైన్స్ దినోత్సవ సంబరాలు ఎంతగానో తోడ్పడతాయి. నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్యం గురించి వారిలో అవగాహన, చైతన్యాలను పెంచుతాయి.



నేడే జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రయోగాలతో పాఠాలు

మానవ సంక్షేమం కోసం సైన్స్ పరిశోధనలు చేపట్టేలా విద్యార్థులను ప్రేరేపించడం సైన్స్ దినోత్సవ లక్ష్యం. ఈ సందర్భంగా వారు శాస్త్ర విజ్ఞాన ప్రసంగాలు వింటారు, సైన్స్ విషయాలు చదువుతారు. గమనించడం, ప్రయోగాలు చేయడం ద్వారా కొత్త నైపుణ్యాలు అలవరచుకొంటారు. అసలు శాస్త్ర సాంకేతిక రంగానికి ప్రయోగాలే ఊపిరి. ప్రయోగాలు చేసేటప్పుడు విద్యార్థులు వివిధ భావనలు, వస్తువులను పరిశీలించి వర్ణిస్తారు. ప్రశ్నలు అడుగుతారు. తాము ఏర్పరచుకున్న అభిప్రాయాలను ప్రస్తుత శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో సరిచూసుకుని, వాటిని ఇతరులతో పంచుకుంటారు. తమ అభిప్రాయాలకు ప్రత్యామ్నాయాలు ఏవైనా ఉన్నాయా అని శోధిస్తారు. తార్కిక శక్తిని, ఆలోచనా పటిమను పెంపొందించుకుని సైన్స్ పట్ల లోతైన అవగాహన ఏర్పరచుకుంటారు. జాతీయ సైన్స్ దినోత్సవం నాడు విద్యార్థులతో వివిధ సైన్స్ ప్రాజెక్టులు చేయించడంలో ఉద్దేశమిదే. ఆ రోజున సైన్స్ ప్రదర్శనలు, ఎక్స్‌పోలు నిర్వహించాలి. క్విజ్ పోటీలు పెట్టాలి. ప్రసంగాలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించాలి. వ్యాస రచన పోటీలు పెట్టాలి. వినూత్న పోస్టర్ల తయారీని ప్రోత్సహించాలి. శాస్త్ర విజ్ఞాన చిత్రాలు, డాక్యుమెంటరీలను ప్రదర్శించాలి. ప్రస్తుత ప్రపంచంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం (స్టెమ్) కోర్సులే ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి. గడచిన పదేళ్లలో దేశదేశాల్లో రొడ్డ కొట్టుడు పనులకు కాలంచెల్లి, ఆ తరహా ఉద్యోగాలు రానురానూ తగ్గిపోతున్నాయి. సాంకేతిక నైపుణ్యాలు అవసరమయ్యే ఉద్యోగాలు క్రమంగా పెరుగుతున్నాయి. నవయుగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను శ్రద్ధగా, ఉత్సాహంగా నేర్చుకుని రాణించే వాతావరణం విద్యాసంస్థల్లో వెల్లివిరియాలి. ఆ దిశగా ఉపాధ్యాయులు తమ విద్యార్థులను ప్రోత్సహించాలి. మౌలికాంశాలను క్షుణ్నంగా నేర్పాలి. పిల్లల్లో విజ్ఞాన అనురక్తిని రగిలించి విరివిగా ప్రయోగాలు చేయిస్తే మౌలిక శాస్త్రాలవైపు ఆకర్షితులవుతారు.


ఇక్కడ ప్రపంచ ఆర్థిక వేదిక ఏటా ప్రచురించే అంతర్జాతీయ పోటీతత్వ నివేదికలో భారత్ స్థానాన్ని పరిశీలించారు. 2004 నుంచి ఈ నివేదిక అంతర్జాతీయ పోటీతత్వ సూచీలో ఆయా దేశాల స్థానాన్ని నిర్ణయిస్తోంది. ఈ దేశాలు తమ పౌరుల అభ్యున్నతికి ఎలాంటి అవకాశాలు అందించగలుగుతున్నాయో అంచనా వేస్తోంది. శాస్త్ర సాంకేతిక పరిశోధనలతో ఉత్పాదక శక్తిని పెంపొందించుకుని తన వనరులను అత్యంత సమర్థంగా వినియోగించుకొనే దేశం ఆర్థిక పోటీలో ఇతర దేశాలను దాటుకొని వేగంగా పురోగమించగలదు. ఆ పురోగతిని అంచనా వేయడానికి పోటీతత్వ సూచీని రూపొందించారు. 2017లో స్విట్జర్లాండ్, అమెరికా, సింగపూర్‌లు పోటీతత్వ సూచీలో మొదటి మూడు స్థానాలను ఆక్రమించగా, భారత్ 40వ స్థానంతో సరిపెట్టుకొంది. మన యువతరం ఉన్నతస్థాయి పరిశోధనలు చేపట్టే వాతావరణాన్ని కల్పించి తగు వనరులు కేటాయించినప్పుడు ప్రపంచ ర్యాంకింగుల్లో భారత్ అగ్రశ్రేణికి చేరుకుంటుంది. ఈ దిశగా విద్యార్థులను ఉత్తేజితులను చేయడానికి ఏటా జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకొంటున్నాం. 'నేచర్' పత్రిక సూచీ ప్రకారం 2016 డిసెంబర్-2017 నవంబర్ మధ్య శాస్త్ర సాంకేతిక పత్రికల్లో 24,143 పరిశోధన పత్రాలను ప్రచురించడం ద్వారా అమెరికా తానే మేటినని చాటుకుంది. 10,718 పత్రాల ప్రచురణతో చైనా రెండో స్థానం ఆక్రమించగా భారత్ కేవలం 1,639 ప్రచురణలతో సరిపెట్టుకుంది. మన పరిశోధన స్థాయిని ఎన్నెన్నో రెట్లు పెంచుకోవడానికి యుద్ధప్రాతిపదికపై కృషి జరగాలి. ఉపాధ్యాయులు, పరిశోధకులు, పరిశ్రమలవారు, విద్యార్థులు దీన్ని ఒక యజ్ఞంగా చేపట్టాలి.

యువతరానికి సవాలు

ప్రపంచ మేధోహక్కుల సంస్థ, ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం స్వదేశీయులు దాఖలు చేసిన పేటెంట్లలో రాశి రీత్యా చైనాదే అగ్రస్థానం. 2016లో చైనాలో ఈ తరగతిలో మొత్తం 12,04,981 పేటెంట్ దరఖాస్తులు దాఖలయ్యాయి. 2,95,327 దరఖాస్తులతో అమెరికా రెండోస్థానం ఆక్రమిస్తుంటే 13,199 దరఖాస్తులతో భారత్ యథాప్రకారం జాబితాలో ఎక్కడో దిగువన ఉంది. ప్రవాసుల పేటెంట్ తరగతిలో 3,10,244, దరఖాస్తులతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, 1,33,522 దరఖాస్తులతో చైనా ద్వితీయ స్థానం సాధించింది. భారత్ ఖాతాలో 31,858 దరఖాస్తులు మాత్రమే ఉన్నాయి. రాబోయే నాలుగో పారిశ్రామిక విప్లవ యుగంలో ఉన్నత పరిశోధన నైపుణ్యాలున్న దేశాలు మాత్రమే ఆర్థికంగా విజృంభించి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని పెంచుకుని తమ ప్రజలకు మంచి జీవితాలను ప్రసాదించగలవు. భారత్ ఇకనైనా మేల్కొని యువతరాన్ని భావి సవాళ్లకు సమాయత్తం చేయాలి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలపై చైనా, అమెరికాలు వందల కోట్ల డాలర్లు ఖర్చుపెడుతున్నాయి కనుకనే అవి అగ్రగాములుగా వెలిగిపోతున్నాయి. అమెరికా తన జీడీపీలో 2.74 శాతాన్ని (47,300 కోట్ల డాలర్లను) పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై ఖర్చు చేస్తుంటే, చైనా 2.1 శాతాన్ని (40,900 కోట్ల డాలర్లను) వెచ్చిస్తోంది. పరిశోధన-అభివృద్ధిపై ఎక్కువగా వెచ్చిస్తున్న 10 దేశాల్లో భారత్‌ది ఆరో స్థానం ఈ పద్దుపై మన వ్యయం 6,600 కోట్ల డాలర్లు మాత్రమే. ఇది మన జీడీపీలో కేవలం 0.85 శాతానికి సమానం. ఇకనైనా అత్యవసరంగా ఆర్ అండ్ డీ కేంద్రాలను, ప్రయోగశాలలనూ విస్తృతంగా నిర్మించడానికి కేటాయింపులు పెంచాలి.

భారతీయ విద్యా రంగంలో 1990ల నుంచి సైన్స్ విద్యకు ప్రాధాన్యం తగ్గిపోతూ ఇంజినీరింగ్, ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాలకు గిరాకీ పెరగసాగింది. పరిశోధక సత్తా ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రధానమైన సైన్స్ కోర్సులను వదలి టెక్నాలజీ కోర్సులవైపు పరుగులు తీయసాగారు. దీనితో గత 20 ఏళ్ల నుంచి మౌలిక శాస్త్రాల్లో మేధోపరంగా తీవ్ర లోటు ఏర్పడింది. దీన్ని వెంటనే పూడ్చటం సాధ్యం కాదు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల గాఢమైన ఆసక్తి అనురక్తులను పాదుగొల్పి పరిశోధనలు చేపట్టే వాతావరణం కల్పించాలి. తద్వారా దీర్ఘకాలంలో దేశ ఆర్థిక రథానికి చోదక శక్తులుగా వారు ఎదగగలుగుతారు. ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో ప్రయోగశాలలు నెలకొల్పి ప్రయోగాలకు ఊతమివ్వాలి. ఇందుకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి. విద్యార్థులకు ప్రాథమిక తరగతుల నుంచే విశ్లేషణాత్మక ఆలోచనా విధానం అలవరచాలి. కార్యకారణ సంబంధాల అన్వేషణను నేర్పాలి. మౌలిక శాస్త్రీయ భావనలపై పట్టుసాధించడానికి తర్కం బోధించాలి. జిజ్ఞాసువులుగా తీర్చిదిద్ది పరిశోధకులుగా మలచాలి. మౌలిక శాస్త్రాలపై ప్రయోగాలు చేయడానికి తగు సమయం కేటాయించాలి. ఈ విధంగా విద్యార్థులుపై తరగతులకు, విశ్వవిద్యాలయాలకు వెళ్లాక పరిశోధన చేపట్టేలా సమాయత్తం చేయాలి. రోబోటిక్స్, డేటా సైన్స్, కృత్రిమ మేధ, జన్యు వైద్యం, ఇతర గ్రహాలకు యాత్రలు ఊపందుకొంటున్న ఈ ప్రపంచీకరణ యుగంలో శాస్త్ర సాంకేతిక పరిశోధనలకున్న ప్రాముఖ్యం అంతా ఇంతా కాదు. వాటిలో రాణించేలా మన విద్యార్థులను తీర్చిదిద్దడం జాతి కర్తవ్యం!

– డాక్టర్ కె.బాలాజీరెడ్డి



కులదీప్ నయ్యర్

వేడెక్కుతున్న రాజకీయం

రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థకు మధ్య అనుబంధం అంతకంతకూ పెరుగుతోంది. ఇటీవలి బడ్జెట్లో గ్రామీణ ప్రాంతాలకు పెద్దపీట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. దేశంలోని 70శాతం ఓటర్లు పల్లెల్లోనే పోగుబడి ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రయత్నం అర్థం చేసుకోదగినదే. అటుఇటుగా మరో ఏడాదిలో ఎన్నికలనగా బడ్జెట్ ద్వారా పల్లెపట్టులను మంచి చేసుకోవాలనే తాపత్రయం కనిపించింది. గతంలో ఆర్థిక అంశాలను రాజకీయాలతో ముడిపెట్టడాన్ని అభ్యంతరకరమైన అంశంగా పరిగణించేవారు. బడ్జెట్‌ను రాజకీయ అవసరాలకు వాడుకుంటే గతంలో కొన్ని పార్టీలు నిరసన వ్యక్తం చేసేవి. కాలక్రమంలో రాజకీయం అన్ని రంగాలనూ శాసించడం ఆరంభించింది. అంతకుముందున్న అడ్డుతెరలన్నీ తొలగిపోయాయి. దాంతో ఫలానా పని రాజకీయ అవసరాలకోసమే చేస్తున్నారని ఎవరైనా అన్నప్పటికీ పాలకులు నామోషీ పడని వాతావరణం నెలకొంది. దురదృష్టవశాత్తూ ఈ ధోరణి అంతకంతకూ విస్తరిస్తోంది. గ్రామీణ పేదలను ఉద్ధరించే కార్యక్రమం ఎవరు చేపట్టినా స్వాగతించాల్సిందే. కానీ, కొన్నిసార్లు ఏ నేపథ్యంలో అలాంటి చర్యలు తీసుకున్నారన్నదీ కొట్టిపారేయలేని చర్చనీయాంశమే!

రాజస్థాన్ ఉప ఎన్నికల్లో భాజపాకు ఎదురు దెబ్బ తగిలింది. రెండు ఎంపీ స్థానాలు, ఒక అసెంబ్లీ సీటుకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం చేజిక్కించుకొంది. అంతకుముందు గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయినా భాజపాకు చెమటలు పట్టించింది. ఇదే ఒరవడిని కాంగ్రెస్ ఇకమీదటా కొనసాగిస్తుందా లేదా అన్న విషయాన్ని పక్కనపెడితే- ప్రస్తుతానికైతే దేశవ్యాప్త రాజకీయ వాతావరణంలో మార్పు వ్యక్తమవుతోందన్నది నిజం. గతంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలన్నింటినీ ఒక్కొక్కటిగా భాజపా గెలుచుకొంటూ వచ్చింది. ప్రేక్షకపాత్రకు పరిమితం కావడం తప్ప, అప్పట్లో కాంగ్రెస్ పెద్దగా ప్రతిఘటించలేకపోయింది. ఇప్పుడు పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్, భాజపా తప్ప మరో పార్టీ లేదు. ఆయా రాష్ట్రాల్లో ఈ రెండు రాజకీయ పక్షాల మధ్యే ఏదో ఒకదాన్ని ప్రజలు ఎంపిక చేసుకోవాల్సిన అనివార్యత నెలకొంది. మూడో కూటమి ఏర్పాటవుతుందన్న మాట అక్కడక్కడా వినిపిస్తోంది. ఆ ప్రచారం రెండు మూడు రాష్ట్రాలకు మాత్రమే పరిమితమైంది. పశ్చిమ్ బంగలో మమతా బెనర్జీ, బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ వంటివి మూడో కూటమి ఏర్పాటు దిశగా ఆలోచిస్తున్నాయి. ఈ ప్రణాళికలు ఎంతవరకు కార్యరూపం దాలుస్తాయన్నది మరికొన్ని నెలలు ఆగితేగానీ స్పష్టం కాదు.

హిందుత్వ పంథాలో ప్రజలకు చేరువైన భాజపా- ఇకమీదటా అదే బాటలో నడవాలనుకుంటోందా అన్నది తేలాల్సి ఉంది. భారత రాజ్యాంగ పీఠికలో 'లౌకికవాద' భావనకు పట్టం కట్టారు. దేశానికి ప్రాణాధారమైన ఆ భావనకు ఎట్టి



దేశంలో మారుతున్న సమీకరణలు

పరిస్థితుల్లోనూ తూట్లు పడరాదు. స్వాతంత్ర్యానంతరం జరిగిన దేశ విభజన కారణంగానే ఇన్ని సమస్యలు తలెత్తాయని, అందుకు బాధ్యుడు మహమ్మద్ అలీ జిన్నాయేనని చాలామంది వ్యాఖ్యానిస్తుంటారు. భారత చిట్టచివరి వైస్రాయి లార్డ్ మౌంట్ బాటెన్‌ను కలిసినప్పుడు నేను ఇదే ప్రశ్న అడిగాను. ఆయన కూడా విభజనకు జిన్నా వైఖరే కారణమని వెల్లడించారు. విభజన తరవాత కూడా భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఏదో ఒక రకమైన అనుబంధం ఉండాలని, అందుకు అనుగుణంగా పాలనపరమైన ఏర్పాటు చేస్తే బాగుంటుందని నాటి బ్రిటన్ ప్రధాని రిచర్డ్ క్లెమెంట్ అట్లీ భావించినట్లు మౌంట్ బాటెన్ నాతో చెప్పారు. దేశ విభజన ప్రణాళికను పరిశీలించేందుకు రావాలని మౌంట్ బాటెన్ అప్పట్లో మహాత్మా గాంధీని ఆహ్వానించారట. కానీ, గదిలోకి ప్రవేశించిన బాపూజీ 'విభజన' అన్న మాట చెవినపడిన వెన్వెంటనే దిగ్గన లేచి అక్కడ నుంచి బయటకు వెళ్ళిపోయారట. మరోవంక విభజన ప్రతిపాదనను జిన్నా మన స్ఫూర్తిగా స్వాగతించారు. ప్రత్యేక దేశంగా ఏర్పడ్డాక కూడా భారత్‌తో ఏవైనా సంబంధాలు కలిగి ఉండాలని అనుకుంటున్నారా అని అడిగిన ప్రశ్నకు 'భారత్‌ను మేం విశ్వసించం' అని జిన్నా తెగేసి సమాధానం చెప్పారు. దాంతో విభజన ఖాయమై, అనుబంధాలు మాయమయ్యాయి. లౌకికవాద భావనకు ఆ క్షణమే చిల్లులు పడటం మొదలైంది. ప్రస్తుతం ఆ ధోరణి అంతకంతకూ విస్తరిస్తోంది.

దేశవ్యాప్తంగా 'ఆయుష్మాన్ భవ' పేరిట వైద్యసేవల విస్తరణ కార్యక్రమానికి భాజపా శ్రీకారం చుట్టింది. ఏటా కుటుంబానికి అయిదు లక్షల రూపాయల చొప్పున కేటాయించి, సుమారు 50 కోట్లమందికి ప్రయోజనం చేకూర్చనున్నట్లు తెలిపింది. దీన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకంగా కేంద్ర ఆర్థికమంత్రి అభివర్ణించారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోనూ ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేయాలన్న సంకల్పాన్నీ వెల్లడించారు. ఇవన్నీ ప్రజలకు మేలు చేసే ప్రతిపాదనలే. ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు జిలా స్థాయుల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. ఫసల్ బీమా యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనల తరవాత మోదీ ప్రభుత్వం తీసుకువస్తున్న మూడో అతిపెద్ద బీమా కార్యక్రమం ఇది. ఈ పథకాలు సరిగ్గా అమలైతే 2019 ఎన్నికల తరవాత మళ్ళీ మోదీ సారథ్యంలోనే ప్రభుత్వం ఏర్పాటైనా ఆశ్చర్యం లేదు. అలాజరిగితే అది మోదీ విజయం అవుతుందిగానీ, భాజపాది కాదు! అయితే మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇటీవల దాదాపుగా భాజపాను ఓడించినంత పని చేసింది. భాజపాను ఉలికిపాటుకు గురిచేసిన పరిణామమది. అయితే వెన్నుదన్నుగా నిలిచిన వర్గాల్లో కొన్ని చేయి జారిపోయినా- ఇప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించడానికి అవసరమైన మద్దతు తనకు ఉందనే మోదీ గట్టిగా నమ్ముతున్నారు. ఈ ఏడాది కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగే ఎన్నికల్లో ఫలితాలను బట్టి ప్రజావాహిని ఎటువైపు ఉందో తేలిపోతుంది. ప్రధాని మోదీ ముందస్తు ఎన్నికలకు వెళతారా లేదా అన్న విషయమూ ఈ ఫలితాలతోనే స్పష్టం కానుంది!

(రచయిత– ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్)

ఈనాడు లేఖలు

అంగన్‌వాడీల దురవస్థ

తెలంగాణలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో తల్లడిల్లుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలకు సన్నబియ్యం సరఫరా చేస్తామని ప్రభుత్వం ఏడాది క్రితమే ప్రకటించింది. అదేవిధంగా అంగన్‌వాడీలకు కూడా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు అప్పట్లోనే హామీ ఇచ్చారు. అది అనేక చోట్ల ఆశించిన రీతిలో అమలు కావడం లేదు. ప్రస్తుతం అందజేస్తున్న బియ్యాన్ని తినలేక బాలబాలికలు, వారి తల్లిదండ్రుల ప్రశ్నలకు బదులు చెప్పలేక కేంద్రాల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరోగ్యలక్ష్మి పథకం కింద బాలింతలకు రోజూ నిర్ణీత పరిమాణంలో ఒక పూట భోజనం, పాలు, కోడిగుడ్డు అందించాలన్నది లక్ష్యం. సరఫరా అవుతున్న పాలలో నాణ్యత కొరవడుతోంది. ఈ కష్టనష్టాలపై ప్రభుత్వం దృష్టిసారించాలి. పంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి.

- శ్రీనివాస్ చిరిపోతుల, వెంకటేశ్వర్లపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

సేవల్ని గుర్తించండి

వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాల్ని ప్రజల వద్దకు చేర్చడంలో రెవిన్యూశాఖ పాత్ర ఎనలేనిది. భూములకు సంబంధించిన ప్రభుత్వ రికార్డుల నవీకరణ ప్రక్రియలో ఇటీవల ఆ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమించారు. విధినిర్వహణలో ఆ అంకితభావాన్ని మంత్రులు, ఉన్నతాధికారులు ప్రశంసించారు. అదే కోవలో ఉద్యోగులు, ముఖ్యంగా గ్రామ రెవిన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యల పరిష్కారాలపైన ప్రభుత్వం శ్రద్ధాసక్తులు కనబరచాల్సి ఉంది. అర్హులకు వీలైనంత త్వరలో పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- కొండ రాజేంద్ర కుమార్, సంస్థాన్ నారాయణపూర్, యాదాద్రి భువనగిరి జిల్లా

అడుగుజాడలు

అనుభవాలు, అనుభూతులతో మనిషి మేధ రూపుదిద్దుకుంటుంది. దృష్టి, వినికిడి, రుచి, స్పర్శ, వాసన... ఇవన్నీ మనిషిలో భాగాలు. వీటి అనుభవ పాఠాల ద్వారా అతడు సత్యాన్ని గ్రహించాలి. జీవితాన్ని సక్రమంగా గడుపుతూ, తప్పటడుగుల్ని ఎప్పటికప్పుడు సరిచేసుకుంటూ ముందుకు సాగాలి. ఎదురయ్యే మహానుభావుల ప్రభావంతో తాను గ్రహించిన జ్ఞానాన్ని తోటివారి ప్రయోజనం కోసం ఉపయోగించాలి.

ఉత్తమ నిర్ణయాలు తీసుకునే అవకాశం జీవితంలో అనేకసార్లు కలుగుతుంటుంది. సరైన, స్థిరమైన ప్రభావం కలిగించేవారి సాహచర్యం దానికి ఎంతో అవసరం. సమయాన్ని వృథా చేస్తూ, వ్యతిరేక భావనలు పెంచే మనస్తత్వం గలవారికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఆధ్యాత్మిక దృక్పథాన్ని పెంచుకోవాలనే స్పష్టమైన ఆలోచన ఉంటే, జీవన గతి అటువైపే మళ్లుతుంది. పురోగతి వేగవంతమవుతుంది. అదే దారిలో మనిషి సాగిపోతాడు. మార్గమధ్యంలో సదాచారులు, సాధువుల నుంచి అనేక అంశాలు తెలుసుకుంటాడు. వారిని అనుసరించడమే అతడి జీవనమార్గంగా మారుతుంది. తనకు తాను ఇచ్చుకునే శిక్షణ ద్వారా ఆ సద్గుణాల్ని సొంతం చేసుకుంటాడు.

సాధువుల జీవితాల్ని చూసినప్పుడు- వారిలో ప్రేమ, దయ, నిస్వార్థం వంటి ఉత్తమ గుణాలు గోచరిస్తాయి. హృదయమంతటా కరుణ నిండి ఉంటుంది. బాధల్లో ఉన్నవారి పట్ల వారి దృక్పథమే వేరు. గాయపడిన హృదయాలకు ఉపశమనం చేకూరుస్తారు.

అటువంటి ఉదాత్త చరితుల్ని ఆదర్శంగా తీసుకుంటే, మనిషి తత్వమే మారిపోతుంది. బాధల్లో ఉన్నవారి అవసరాలు తెలుస్తాయి. వారి కష్టాల పట్ల సున్నితంగా వ్యవహరించడం అలవడుతుంది. ఎంతైనా సహాయపడాలన్న ఆలోచన విస్తృతమవుతుంది. ఉపశమన మంత్రం మహిమేమిటో తెలియవస్తుంది. సాధువులు అధిక సమయం ధ్యానానికే కేటాయిస్తారు. సంపూర్ణత సిద్ధించేవరకు దాన్ని అభ్యసిస్తారు. వారిలా ఉండాలంటే, వారి మార్గాన్నే అనుసరించాలి. లక్ష్యం సాధించేవరకు వీడని దీక్ష, నిరంతర ధ్యానం, అనంత అంకిత భావం- ఆలోచనాపరుల్ని ఆధ్యాత్మికం వైపు నడిపిస్తాయి.

నిర్ణయం తీసుకోవడంలో ప్రతి ఒక్కరికీ సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలి. దానికి అనువుగా కాలాన్ని ఏ విధంగా వినియోగిస్తారన్నదే



అంతర్యామి

ప్రధానం. వ్యర్థమైన యోచనలు మనిషి ఎదుగుదలను నిరోధిస్తాయి. కాలం గడుస్తున్నకొద్దీ ఆ ఊబి నుంచి బయటపడటం కష్టతరంగా గోచరిస్తుంది.

ఆధ్యాత్మిక ప్రపంచంలో ఆదర్శవంతమైనవారిని మనిషి ఆరాధించాలి. వారి ప్రవచనాలు వింటూ, సత్సంగంలో ఉంటూ, ఆ మహనీయుల మార్గాన్ని తు.చ. తప్పక ఆచరించాలి. వినికిడి కంటే, దృష్టి ద్వారా మనిషి ఎక్కువగా నేర్చుకుంటాడు. దాని శక్తి అపారం. ఆదర్శమూర్తుల గురించి చదవడం, వినడం ఒకెత్తు. వారిని చూడడం మరొకెత్తు. వారి అడుగుజాడలే మార్గదర్శకత్వం వహిస్తాయి. చేయగలిగే చేవ జీవితంలో ఉన్నప్పుడు, మనసు చెప్పిందే అతడు చేసినప్పుడు- అపరిమిత ఆనందం నెలకొంటుంది. జీవితానికి సార్థకత ఏర్పడుతుంది. అంతే తప్ప- అందరూ గుర్తించాలన్న తాపత్రయంతో, వారందరి చప్పట్ల కోసం తహతహతో మానవుడు పడే శ్రమ ఎన్నటికీ ఫలించదు.

ఇతర రంగాల్లో ఉన్నట్లే, ఆధ్యాత్మిక మార్గంలోనూ ప్రచారమే ప్రధానంగా గలవారు కనిపిస్తుంటారు. వారి తీరు గ్రహించడంపైనే సాధకుడి ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. అక్కడే అతడికి విజ్ఞత అవసరమవుతుంది.

మనసుంటే మార్గం కనిపిస్తుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త హెన్రీ ఫోర్డ్ చెప్పినట్లు- అన్నింటినీ దైవమే చూసుకుంటాడని మనిషి ప్రగాఢంగా నమ్మాలి. మంచి ఆలోచన మంచికే దారి తీస్తుందని అనుభవం ద్వారా తెలుసుకొని మసలాలి. అప్పుడు చింత కాదు, భగవత్ చింతనే నెలకొంటుంది!

– మంత్రవాది మహేశ్వర్



పనస గుత్తులు

పొడవాటి కాండంతో ఉన్న పనస చెట్టుకు గుత్తులు గుత్తులుగా కాయలు కాయడం ఆశ్చర్యమే. మొదలు నుంచి కొమ్మల దాకా కాండం చుట్టూ సుమారు 70 కిపైగా కాయలతో ఉన్న ఈ పనస చెట్టు విజయవాడ జలవనరులశాఖ కార్యాలయంలో ఉంది.

- ఈనాడు విజయవాడ

ఒక్కటేనా... వేర్వేరుగానా?

- సాగునీటి ప్రాజెక్టులకు కార్పొరేషన్ల ఏర్పాటుపై సర్కారు కసరత్తు
- నీటిపారుదలశాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ అభిప్రాయం కోరిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి తీసుకొన్నట్లుగానే... మరో మూడు పథకాలకు బ్యాంకు రుణం తీసుకోవాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ క్రమంలో తదుపరి కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ప్రతి ప్రాజెక్టుకూ ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలా? లేక మూడింటికీ కలిపి ఒకే కార్పొరేషన్‌ను నెలకొల్పాలా అన్నది అధ్యయనం చేయనుంది. ఈ విషయమై అధ్యయనం చేపట్టి, ప్రతిపాదనలను పంపాలని నీటిపారుదలశాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి సూచించారు. కాళేశ్వరానికి మూడు విడతలుగా సుమారు రూ.22 వేల కోట్ల మేర బ్యాంకుల నుంచి రుణం తీసుకోవడానికి ఒప్పందమైంది. దీంతో నిధుల సమస్య లేకుండా పనులు వేగంగా జరుగుతున్నాయి. దేవాదుల ఎత్తిపోతల పథకంలో ప్రధాన పనులు ముగిశాయి. కానీ, నిధుల సమస్య కారణంగా ప్రాజెక్టును పూర్తి చేయడంలో జాప్యమవుతోంది. దీనికి 'సత్వర సాగునీటి ప్రయోజన పథకం' కింద కేంద్రం నుంచీ ఆర్థికసాయం అందింది. ఒప్పందం ప్రకారం తుపాకులగూడెం ఆనకట్టను నిర్మించడానికి ఏడాదికి కనీసం రూ.వెయ్యి కోట్లు ఖర్చుచేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టుకు బడ్జెట్లో రూ.400 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకూ రూ.65 కోట్లు చెల్లించారు. దేవాదులకు రూ.1,484 కోట్లు కేటాయించినా... చెల్లించింది రూ.455 కోట్లే. ఖమ్మం జిల్లాలోని సీతారామ ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం గుత్తేదారులతో ఒప్పందం చేసుకుంది. రెండేళ్లలో దీనిని పూర్తిచేయాలన్నది లక్ష్యం. ఈ సంవత్సరం రూ.912 కోట్లు కేటాయించగా, కనీసం రూ.200 కోట్లు కూడా ఇప్పటివరకూ చెల్లించలేదు!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సాగునీటి రంగానికి ప్రభుత్వం రూ.17,200 కోట్లు చెల్లించింది. ఇందులో బ్యాంకు రుణంతో సహా కాళేశ్వరం ప్రాజెక్టులోనే రూ.11 వేల కోట్లకుపైగా చెల్లించింది. ఒక ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా ఖర్చుచేసిన సంవత్సరం ఇదే. కాళేశ్వరం మినహా మిగిలిన ప్రాజెక్టుల్లో మాత్రం వ్యయం నామమాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో- ' 'ఎనిమిది జిల్లాల్లో 6.21 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని సరఫరాచేసే దేవాదుల ఎత్తిపోతలకూ; గోదావరిపై నిర్మించిన తుపాకులగూడెం ఆనకట్టకూ కలిపి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి, రుణం తీసుకోవడానికి అనుమతించండి'' అని సంబంధిత చీఫ్ ఇంజినీర్... ఇంజినీర్-ఇన్-చీఫ్‌కు లేఖ రాశారు. ఆయన దానిని నీటిపారుదలశాఖ అదనపు బాధ్యతలు నిర్వహిస్తోన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషికి పంపారు. సీతారామ ఎత్తిపోతల పథకానికీ ఇదే తరహా ప్రతిపాదనల్ని పంపారు. దీనిపై ఆర్థికశాఖతో చర్చించిన తర్వాత, కాళేశ్వరంలాగే దేవాదులకూ, సీతారామ ఎత్తిపోతల పథకానికి వేర్వేరుగా కార్పొరేషన్లను ఏర్పాటుచేసి రుణాలు తీసుకోవాల్సి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైందనీ... కార్పొరేషన్లను వేర్వేరుగా నెలకొల్పాలా లేక అన్నింటికి కలిపి ఒకటే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలా అన్నదానిపై ప్రతిపాదనలు పంపాలని ఇంజినీర్-ఇన్-చీఫ్‌కు ప్రధాన కార్యదర్శి సూచించారు. తదనుగుణంగా నీటిపారుదలశాఖ కసరత్తు ప్రారంభించింది.

ఆ అద్భుతమైన మనిషి అమెరికాకు మేలు చేస్తున్నామనుకుంటున్నారు!

- ప్రధాని మోదీనుద్దేశించి ట్రంప్ వ్యంగ్యోక్తి
- మోటారుసైకిళ్లపై దిగుమతి సుంకం ఎక్కువగానే ఉందని విమర్శ



వాషింగ్టన్: ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు వ్యంగ్యోక్తులు విసిరారు. అద్భుతమైన మనిషి, అమోఘమైన వ్యక్తి అని చురకలు వేశారు. మోదీ శైలిని అనుకరిస్తూ మాట్లాడి విమర్శలు చేశారు. 50 రాష్ట్రాల గవర్నర్లను ఉద్దేశించి శ్వేతసౌధంలో ఆయన మాట్లాడుతున్నప్పుడు ఈ సన్నివేశం చోటు చేసుకుంది. అసలు విషయమేమిటంటే.. భారత్‌కు దిగుమతి అయ్యే హార్లీ డేవిడ్‌సన్ వంటి ఖరీదు బ్రాండు మోటారు సైకిళ్లపై కేంద్రం కస్టమ్స్ సుంకాన్ని ఇటీవల 50శాతానికి తగ్గించింది. ఈ విషయాన్ని మోదీ ట్రంప్‌నకు తెలియజేశారు. భారత్ నుంచి అమెరికాకు దిగుమతయ్యే మోటారుసైకిళ్లపై అమెరికాకు వస్తున్న ఆదాయమేమీ లేదని, కానీ భారత్‌కు ఎగుమతి చేసే మోటారుసైకిళ్లపై మాత్రం అమెరికా కంపెనీలు ఇంకా 50శాతం పన్ను చెల్లించాల్సి వస్తోందని, దీని వల్ల అమెరికాకు ఒరిగేదేమీ లేదని ట్రంప్ చెప్పారు.

"అద్భుతమైన మనిషి అని నేను అనుకునే ప్రధానమంత్రి ఒక రోజు నాకు ఫోన్ చేశారు. ఆయన అమోఘమైన మనిషి. అమోఘంగా మాట్లాడారు. పన్నును 50శాతానికి తగ్గిస్తున్నట్లు చెప్పారు. ఆహా అన్నాను. ఇంకేమనాలి? నేను థ్రిల్ అవ్వాలా?'' అని ట్రంప్ అన్నారు.

"వారి మోటారు సైకిళ్లు మన దేశానికి వచ్చినప్పుడు మనకు వచ్చేది సున్నా. వారికి 100 శాతం వచ్చేది. దాన్ని 75శాతానికి, ఆ తర్వాత 50శాతానికి తగ్గించారు. ఇప్పటి వరకు మనకు వస్తున్నది ఏమీ లేదు. వారికి మాత్రం 50శాతం వస్తోంది. మనకు చాలా మేలు చేస్తున్నామని వారు అనుకుంటున్నారు. అది మేలు కాదు.'' అని అన్నారు. భారత్ దిగుమతి సుంకాలు ఎక్కువ వేస్తోందని ట్రంప్ దుయ్యబట్టడం ఇటీవల కాలంలో ఇది రెండో సారి.

పాత వాహనాలకు చెల్లుచీటీ... విధానానికి కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం

- ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే 2.8 కోట్ల వాహనాలు తుక్కే
- ఆటోమొబైల్ పరిశ్రమకు ఊతం: గడ్కరీ

దిల్లీ: పదిహేనేళ్లు పైబడిన వాహనాలను రద్దు చేయాలని ఎప్పటినుంచో నలుగుతున్న ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదన ఇప్పుడు 'వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) మండలి'కి వెళ్తుంది. దేశంలో పెరుగుతున్న వాహన కాలుష్యానికి కళ్లెం వేసే లక్ష్యంతో పాత వాహనాలకు చెల్లుచీటీ రాసే విధానాన్ని రూపొందిస్తున్నట్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవలే ప్రకటించారు. ఆర్థిక శాఖ నుంచి లభించిన ఆమోదంతో జీఎస్టీకి కేబినెట్ నోట్ వెళ్తుంది. కేంద్రం, రాష్ట్రం ఏ స్థాయిలో రాయితీలు ఇవ్వాలో అక్కడ నిర్ణయిస్తారు. పాత వాహనాన్ని అప్పగించి సుమారు రూ.15 లక్షల విలువైన కొత్త వాణిజ్య వాహనాన్ని కొనేవారికి రూ.5 లక్షల మేర ప్రయోజనం కల్పించాలనేది ఒక ప్రతిపాదన. 'స్వచ్ఛంద వాహన ఆధునికీకరణ కార్యక్రమం' (వీ-వీఎంపీ) అమలుపై రవాణా శాఖ ఆసక్తితో ఉంది. ఏటా 22% చొప్పున పెరిగిపోతున్న వాహనాల సంఖ్యకు, అవి వెలువరించే కాలుష్యానికి అడ్డుకట్ట వేయడానికి ఇది అవసరమని మంగళవారం దిల్లీలో ఒక సదస్సులో మాట్లాడుతూ గడ్కరీ చెప్పారు. తామరతంపరగా వాహనాలు పెరిగిపోవడం వల్ల ప్రతీ మూడేళ్లకూ అదనంగా జాతీయ రహదారుల్లో ఒక వరసను పెంచాల్సి వస్తుందనీ, దానికి రూ.80,000 కోట్లు అవసరమవుతుందనీ తెలిపారు. వీ-వీఎంపీ విధానం ఆమోదం పొందితే ఆటోమొబైల్ పరిశ్రమలకు మన దేశం కేంద్రంగా మారుతుందనీ, వాడుక నుంచి తొలగించిన వాహనాలను ఇతర విడిభాగాల ఉత్పత్తికి వినియోగించుకోవచ్చనీ చెప్పారు. దీనివల్ల వాహనాల ధరలూ తగ్గే అవకాశం ఉందన్నారు. ఆటోమొబైల్ రంగానికి కలిగే లబ్ధి వల్ల ప్రభుత్వాదాయం రూ.10,000 కోట్లు పెరుగుతుందని చెప్పారు. 31.3.2005, అంతకంటే ముందు కొన్న 2.80 కోట్ల వాహనాలను తుక్కుగా మార్చాలనేది ప్రభుత్వ ప్రతిపాదన. కాలం చెల్లిన భారీ వాహనాలే కాలుష్యంలో 65 శాతానికి కారణమవుతున్నాయని అంచనా.

2030 నాటికి 90 లక్షల మంది కొత్త నర్సులు అవసరం

- అప్పుడే సుస్థిరాభివృద్ధి, ఆరోగ్య లక్ష్యాన్ని చేరుకోగలం
- ఐరాస తాజా నివేదికలో వెల్లడి

కోల్‌కతా: ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సేవల కార్మికుల కొరతకు ఐరాస తాజా నివేదిక అద్దంపట్టింది. ఆగ్నేయాసియా, ఆఫ్రికాల్లోని నర్సులు, ప్రసవ నిపుణుల లోటును దీనిలో ప్రముఖంగా ప్రస్తావించింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లోని ఆరోగ్య సంరక్షణ గమ్యాలను చేరుకోవాలంటే 2030 నాటికి 90 లక్షల మంది కొత్త నర్సులు, ప్రసవ నిపుణులు అవసరమని తెలిపింది. ఐరాసకు చెందిన ఆరోగ్య రంగ ఉపాధి, ఆర్థిక వృద్ధి కమిషన్ ఈ నివేదిక విడుదలచేసింది. ఆరోగ్య కార్మికుల కొరతలో.. నర్సులు, ప్రసవ నిపుణుల వాటా 50 శాతంపైనే ఉందని దీనిలో పేర్కొన్నారు. ఆరోగ్యం, సామాజిక రంగంలో విద్య, ఉపాధి కల్పనకు పెట్టే పెట్టుబడులు మూడు రెట్ల ఫలితాలను ఇస్తాయని నొక్కిచెప్పారు. అన్ని రంగాల్లో కలిపి ఉద్యోగుల్లో మహిళల వాటా 41 శాతం ఉండగా.. ఆరోగ్య, సామాజిక రంగాల్లో ఇది 70 శాతమని పేర్కొన్నారు.

తెలంగాణకు రెండు నీట్ పరీక్ష కేంద్రాలు

ఈనాడు, దిల్లీ: ఈ ఏడాది నీట్‌ప్రవేశ పరీక్ష కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు 7 కొత్త కేంద్రాలను కేటాయించినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్ జావ్‌డేకర్ మంగళవారం ట్విట్టర్‌లో వెల్లడించారు. ఏపీకి కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, విజయనగరం, తెలంగాణకు ఖమ్మం, రంగారెడ్డి కేంద్రాలను కొత్తగా మంజూరు చేసినట్లు వెల్లడించారు. 2018 నీట్ ఈ కొత్తకేంద్రాల్లోనూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొర్రమీను పునరుత్పత్తి కేంద్రంగా వైరా మత్స్య క్షేత్రం

వైరా, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర చేపగా ఉన్న కొర్రమీను పునరుత్పత్తి కేంద్రంగా ఖమ్మం జిల్లాలోని వైరా మత్స్య విత్తన క్షేత్రం ఎంపికైంది. ఈ మేరకు వైరాలోని మత్స్య విత్తన క్షేత్రంలో కొర్రమీను పునరుత్పత్తి కేంద్రాన్ని నిర్వహించేందుకు తెలంగాణ మత్స్యశాఖ, భువనేశ్వర్‌లోని సిఫా(జాతీయ మంచినీటి చేపల పరిశోధన కేంద్రం) పరిశోధకులు మంగళవారం పరస్పర అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్నారు. హైదరాబాద్‌లో మత్స్యశాఖ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ సువర్ణ, సిఫా డైరెక్టర్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం ఏడాది పాటు వైరా ఉత్పత్తి కేంద్రంలో కొర్రమీను ఉత్పత్తిని సిఫా శాస్త్రవేత్తల సూచనలతో చేపట్టనున్నారు.

హజ్‌యాత్రకు విమాన ఛార్జీల తగ్గింపు

గరిష్ఠంగా రూ. 97,000 ఉపశమనం

దిల్లీ: హజ్‌యాత్రకు విమాన ఛార్జీలను గణనీయంగా తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. యాత్రికులకు రాయితీలను రద్దుచేసిన నెలరోజుల అనంతరం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు సౌదీ అరేబియాకు రానుపోనూ టిక్కెట్ ధరలు రూ. 20,000 - 97,000 మధ్య (18-49 శాతం) తగ్గనున్నట్లు వెల్లడించింది. ఈ విషయమై ప్రధానమంత్రి కార్యాలయం చాలా శ్రద్ధ తీసుకున్నట్లు మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ విలేకరులకు తెలిపారు. యాత్రికులను బుజ్జగించే యోచనతో కాకుండా, వారికి సాధికారిత కల్పించే దిశగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. భారత్‌లోని 21 విమానాశ్రయాల నుంచి జెడ్డా, మెడినాలకు వెళ్లేందుకు గాను.. ఎయిర్ ఇండియా, సౌదియా, ఫ్లైనాస్ విమానాలన్నింటిలోనూ ఈ తగ్గింపు వర్తిస్తుంది. దీంతో యూపీఏ పాలన నాటి 'రాజకీయ, ఆర్థిక దోపిడీ' నుంచి హజ్ యాత్రికులకు విముక్తి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గరిష్ఠంగా శ్రీనగర్ నుంచి.. కనిష్ఠంగా వారణాసి నుంచి వెళ్లి వచ్చేవారికి ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. 2014లో అహ్మదాబాద్, దిల్లీ, ముంబయి విమానాశ్రయాల నుంచి ఛార్జీ రూ. 98,750 ఉండగా.. అది ఈఏడాది రూ. 65,015, రూ. 71,853, రూ. 57,857లకు తగ్గుతుందని మంత్రి వివరించారు.

'ఉపాధి' కూలీల ఆధార్ వివరాలు గోప్యమేనా?

- వెబ్‌సైట్‌ను హ్యాక్ చేయొచ్చంటూ ప్రచారం
- సాధ్యం కాదంటున్న గ్రామీణాబివృద్ధి శాఖ
- లోతైన అధ్యయనానికి నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సర్కారు నిర్వహిస్తున్న 'జాతీయ ఉపాధి హామీ పథకం' వెబ్ సైట్‌లోని కూలీల వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులు చూసేందుకు ఆస్కారం లేదని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అభిప్రాయపడుతోంది. దీనిలో పొందుపర్చిన సమాచారం చాలా పకడ్బందీగా ఉంటుందనీ, ఎవరైనా హ్యాకింగ్ చేయడం అంత సులువు కాదని చెబుతోంది. తెలంగాణకు చెందిన ఉపాధి హామీ పథకం వెబ్‌సైట్ హ్యాకింగ్ చేయటానికి అనుకూలంగా ఉందని ఇటలీ స్వతంత్ర పరిశోధకుడు ఒకరు నిరూపించారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. దీనిలోని వాస్తవాలను పరిశీలించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మంగళవారం ఇక్కడ భేటీ అయ్యి.. హ్యాకింగ్‌కు వీలులేదని ప్రాథమికంగా అభిప్రాయపడ్డారు. వెబ్‌సైట్‌ను రాష్ట్ర సమాచార సాంకేతిక (ఐటీ)శాఖ పర్యవేక్షణలో టీసీఎస్ కంపెనీ నిర్వహిస్తోంది. ఉపాధి హామీ పథకం కింద పనులను చేసే కూలీల ఆధార్ నెంబరు, వారి బ్యాంకు ఖాతాలు తదితరాలను ఇందులో స్థానికంగా పొందుపరుస్తుంటారు. ప్రత్యేక పాస్‌వర్డ్ ద్వారా సమాచారాన్ని వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు ఆయా మండలాల్లో వీలవుతుందే తప్ప వేరొకరి వివరాలను చూసేందుకు సాధ్యంకాని రీతిలో ఏర్పాట్లు ఉంటాయి. హ్యాకింగ్ అంశాన్ని రాష్ట్ర ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాలనీ నిర్ణయించాయి. ఎవరైనా హ్యాక్ చేసినా వివరాలు ప్రత్యేక కోడ్‌లలో మాత్రమే కనిపిస్తాయని ఒక అధికారి పేర్కొన్నారు.

పాక్ కాల్పుల్లో ఇద్దరు జవాన్లకు గాయాలు

జమ్ము: జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి జనావాసాలు, సైనిక శిబిరాలపై పాకిస్థాన్ సైన్యం మంగళవారం కాల్పులు జరిపింది. దీంతో ఇద్దరు సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లు గాయపడ్డారు. పూంచ్ జిల్లాలోని భీంభేరగలీ సెక్టార్‌లో ఉదయం 8.50 గంటలకు మోర్టార్లు, ఆటోమేటిక్ ఆయుధాలతో పాక్ సైన్యం విచక్షణ రహితంగా కాల్పులు మొదలుపెట్టినట్లు రక్షణ విభాగం అధికార ప్రతినిధి తెలిపారు. వీటికి భారత సైన్యం దీటుగా బదులిస్తోందని వివరించారు.

నేడు ఉపాధి హామీ మేట్ల మహాధర్నా

హైదరాబాద్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం, గ్రామీణ ఉపాధి హామీ మేట్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ప్రసాద్, ఆర్.వెంకట్రాములు తెలిపారు. శ్రమశక్తి సంఘాలను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని. . దాన్ని విరమించుకోవాలని.. బకాయిలు విడుదల చేయాలని.. నగర పంచాయతీల్లో పనులు కల్పించాలనే డిమాండ్లతో ధర్నాకు పిలుపునిచ్చామన్నారు.

సేంద్రియం.. ప్రోత్సాహకరం!

- గణనీయంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ఆకర్షిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు
- సాగు చేస్తున్న రైతులకు మార్కెటింగ్ సమస్యలు
- నగరాల్లో భారీ ధరలకు ఉత్పత్తులు అమ్మకాలు
- అన్నదాతలకు మాత్రం అందని లాభాలు

ఈనాడు - హైదరాబాద్

ఆరోగ్యం పట్ల ప్రజల్లో పెరుగుతున్న అవగాహన రైతులను కొత్త మార్గంలో నడిపిస్తోంది. సేంద్రియ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పంటలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ ప్రారంభించిన 'పరంపరాగత్ కృషి వికాస్ యోజన'(పీకేవీవై) పథకం పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరానికి రూ.20 వేల వరకూ మూడేళ్ల వ్యవధిలో రాయితీ ఇస్తున్నందున దీనిగురించి వ్యవసాయాధికారులను అడుగుతున్నారు. తెలంగాణలో ఇప్పటికే 390 క్లస్టర్లు ఏర్పాటు చేశామని, మరో 300 క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామని వ్యవసాయశాఖ కేంద్రానికి నివేదించింది. ఒక్కో క్లస్టర్‌లో 50 ఎకరాల చొప్పున రైతులను జమచేసి పంటల సాగును వ్యవసాయశాఖ ప్రారంభిస్తోంది.

సేంద్రియ ముద్రతో అమ్మకాలకు అనుమతి

వరసగా మూడేళ్లు సేంద్రియ పంటలు సాగుచేస్తే.. సదరు భూమికి 'పూర్తిగా సేంద్రియం' ముద్రవేసి అమ్మకాలకు అనుమతిస్తారు. తెలంగాణలో పంటలకు అధికారిక ముద్ర వేయడానికి 'రాష్ట్ర సేంద్రియ పంటల ధ్రువీకరణ మండలి'(ఓఎస్‌ఏ) ఏర్పాటుతో రైతుల్లో కొత్త ఉత్సాహం వస్తోంది. మండలి ధ్రువీకరణ పత్రం ఇస్తుండటంతో వారు పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకోవడానికి అవకాశం ఏర్పడింది.

దుకాణాల్లో మోసాలు

సేంద్రియ పంటల ఆహారోత్పత్తుల పేరుతో నగరాలు, పట్టణాల్లో దుకాణాల వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నారు. కష్టపడి సాగుచేసే సేంద్రియ రైతులకు ఈ సొమ్ములో సగం కూడా చేరడం లేదు. హైదరాబాద్‌లోని పెద్ద దుకాణాల్లో సేంద్రియ కందిపప్పును కిలో రూ.150 నుంచి 180 రూపాయల దాకా విక్రయిస్తున్నారు. ఇదే పప్పును కిలో రూ.90 నుంచి రూ.100కే విక్రయిస్తున్నట్లు రైతులు చెప్పారు. సేంద్రియ ఆహారోత్పత్తులు అమ్మేటప్పుడు వాటి ప్యాక్‌పై తప్పనిసరిగా వివరాలుండాలి. ఆన్‌లైన్‌లో తనిఖీ చేస్తే సదరు పంట ఏ గ్రామంలో ఏసర్వే నెంబరులో ఏరైతు పండించారనే వివరాలు కంప్యూటర్ తెరపై కనిపించాలి. చాలా దుకాణాల్లో వివరాలుండటం లేదు. కానీ హైదరాబాద్ నుంచి వైద్యులు, ఉన్నత విద్యావంతులు నెలనెలా అడిగి మరీ తమవద్ద బియ్యం, పప్పులు కొంటున్నారని మిర్యాలగూడ, షాద్‌నగర్ ప్రాంతాలకు చెందిన సేంద్రియ రైతులు 'ఈనాడు'కు చెప్పారు.

మార్కెటింగ్ సదుపాయాలు పెరగాలి

– రావూరి జాన్ ఇజ్రాయిల్, పూడూరు, మేడ్చల్ జిల్లా

నేను డెల్ కంప్యూటర్స్‌లో ఉద్యోగం మానేసి ఐదేళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. తొలుత 3.5 ఎకరాలతో ప్రారంభించా. ఇప్పుడు 50 ఎకరాలకు పెంచాను. గత వానాకాలంలో 16ఎకరాల్లో మక్క, కంది అంతర పంటలుగా వేశాను. మక్కలు 12 టన్నులు, కందులు 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మద్దతు ధరకే కందులు అమ్మాను. మిశ్రమ సేద్యంలో నష్టం రాదు. సేంద్రియ పంటలకు బయట మార్కెట్లలో అమ్మే ధరలు రైతులకు రావడం లేదు. ఇలా ఇప్పించడానికి మార్కెటింగ్ సదుపాయాలుండాలి.

ఐదేళ్లుగా సాగు చేస్తున్నా

– వి.మనోహరాచారి, పద్మారం, రంగారెడ్డి జిల్లా

నేను 2012 ఖరీఫ్ సీజన్‌లో తొలుత నాలుగెకరాల్లో పత్తిని సేంద్రియ విధానంలో సాగు చేశాను. గతంలో అధిక పెట్టుబడులతో నష్టాలొచ్చాయి. ఆ ఏడాది రాలేదు. తరవాత ఇంత వరకూ రసాయన ఎరువులు, పురుగు మందుల జోలికి వెళ్లలేదు. ఈఏడాది 18 ఎకరాల్లో సేంద్రియ విధానంలో సాగు చేశా. ఆరెకరాల్లో చెరకు సాగుచేస్తే ఖర్చులు పోను ఎకరానికి రూ.50 వేలు మిగిలాయి. మరో నాలుగెకరాల్లో కంది వేశాను. ఎకరానికి 7 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది. కిలో పప్పు రూ.90కి అమ్ముతున్నా. కూరగాయలు, గులాబీలో అంతరపంటగా ఆలుగడ్డ సాగుచేశాను. గత అయిదేళ్లలో నష్టాల్లేవు. మార్కెటింగ్ సదుపాయం ఉంటే రైతులకు మరిన్ని లాభాలు వస్తాయి.

మార్కెటింగ్ సదుపాయాలు పెంచుతాం

– డాక్టర్ ఎం.జగన్మోహన్, వ్యవసాయ కమిషనర్, తెలంగాణ వ్యవసాయశాఖ

సేంద్రియ విధానంలో సాగుకు రైతులు పెద్దయెత్తున ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది రాయితీల కింద కేంద్రం తొలుత రూ.15 కోట్లు ఇస్తే రైతుల ఆసక్తిని గమనించి మరో రూ.7 కోట్లు అడిగి తీసుకున్నాం. రసాయనాలు మానేస్తే పెట్టుబడి తగ్గుతోందని రైతులు గుర్తిస్తున్నారు. రాష్ట్రమంతా ఈ సేద్యాన్ని ప్రోత్సహించడమే కాకుండా వారి పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించేందుకు మార్కెటింగ్ సదుపాయాలు పెంచాలని కసరత్తు చేస్తున్నాం.

రామ్ మాధవ్‌కు వీఐపీ భద్రత


దిల్లీ: భాజపా ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్, పార్టీ త్రిపుర విభాగం ఇన్‌ఛార్జి సునీల్ దేవోధార్‌లకు సాయుధ బలగాలు వీఐపీ భద్రత కల్పిస్తున్నాయి. మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో.. తీవ్రవాదుల నుంచి వీరికి బెదిరింపులు వచ్చాయి. దీంతో మాధవ్‌కు వైప్లస్ భద్రత కల్పిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది.

ఆ కమిటీలు నామమాత్రం: పొంగులేటి

హైదరాబాద్, న్యూస్‌టుడే: హామీల కమిటీ, హౌజ్ కమిటీలు నామమాత్రంగా మిగిలిపోయాయని మండలిలో విపక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా హాలులో మాట్లాడారు. నిజాం సుగర్స్, అక్రమ ఇసుక దందా, జూబ్లీహిల్స్ సొసైటీ, ఫిలింనగర్ సొసైటీ, గార్ల మైనింగ్, తదితర అంశాలపై హామీల కమిటీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఖమ్మం మార్కెట్‌లో రైతులు సమస్యలు చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని, మీడియా, ప్రజాప్రతినిధులు పోలీసు అనుమతి లేనిదే లోపలికి వెళ్లడానికి వీల్లేకుండా చేశారన్నారు. తక్షణమే ఈ ఆంక్షలు ఎత్తివేయాలని పొంగులేటి డిమాండ్ చేశారు.

★ టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఖమ్మం జిల్లాకు చెందిన బాణోతు అర్జున్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఉత్సవాన్ని తిలకించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై ఉత్సవమూర్తులను ఉంచి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఉగ్ర, యోగ, వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, జిల్లా కలెక్టర్ శరత్, ఎస్పీ అనంతశర్మ తదితరులు ఉత్సవానికి హాజరయ్యారు.

నయీం బాధితుల కేసును సీబీఐకి అప్పగించాలి

సుబేదారి(వరంగల్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో నయీం బారిన పడి సర్వం కోల్పోయిన వారికి న్యాయం జరగాలంటే కేసును సీబీఐకి అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండలోని పార్టీ కార్యాలయంలో నయీం బాధితుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నయీం ముఠా నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న డబ్బు, భూముల లెక్కలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. నయీం ముఠా బాధితులు అనేక మంది ఉన్నారని వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. నయీం చేసిన అక్రమాలు, అరాచకాలు ఇన్ని అన్ని కావని వెంటనే వీటిపై సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

'బోయింగ్' విడిభాగాల తయారీకి రంగం సిద్ధం

- 1న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- వైమానిక రంగంలో మైలురాయి కానున్న కొత్త పరిశ్రమ
- ఇప్పటికే హెలికాప్టర్ల విడిభాగాల తయారీ
- ఇటీవలే టాటా, జీఈ లీప్ ఇంజిన్ల తయారీ కేంద్రానికి శంకుస్థాపన

ఈనాడు - హైదరాబాద్



తెలంగాణలో ప్రపంచ ప్రసిద్ధి పొందిన బోయింగ్ విమాన విడిభాగాల తయారీ కేంద్రం సిద్ధమైంది. గురువారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా దీనిని ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలోని తెలంగాణ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) వైమానిక ఆర్థిక మండలిలో బోయింగ్ విమాన విడిభాగాల తయారీ కేంద్రానికి 2016 జూన్ 18న అప్పటి రక్షణ శాఖ మంత్రి మనోహర్ పారికర్ శంకుస్థాపన చేశారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, బోయింగ్ సంస్థలు కలిసి టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ పేరిట ఉమ్మడి సంస్థను ఏర్పాటుచేసి దాని ఆధ్వర్యంలో వైమానిక సెజ్‌లో 13 ఎకరాల్లో రూ.200 కోట్ల వ్యయంతో దీనిని చేపట్టి నిర్మాణం పూర్తి చేశారు. బోయింగ్ ఏహెచ్-64 విమానాల విడిభాగాలకు తోడు అపాచీ హెలికాప్టర్లను ఇందులో తయారు చేస్తారు. అమెరికా సహా 15 దేశాల్లో వీటికి బాగా డిమాండ్ ఉంది. ఇప్పటికే ఆయా దేశాలు విమానాల విభాగాల కోసం ఆర్డర్లు ఇచ్చాయి. బోయింగ్ విమానాల విడిభాగాల తయారీ కేంద్రం ప్రారంభం వైమానిక రంగంలో మైలురాయిగా కానుంది. వైమానిక సెజ్‌లో ఇప్పటికే హెలికాప్టర్ల విడిభాగాల తయారీ పరిశ్రమలు నడుస్తున్నాయి. ఇటీవలే వైమానిక సెజ్‌లో టాటా, జీఈ లీప్ ఇంజిన్ల తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. దీంతో పూర్తిస్థాయిలో అన్ని రకాల వైమానిక ఉత్పత్తులకు తెలంగాణ కేంద్రం కానుంది.

తెలంగాణకు రక్షణ పారిశ్రామిక ఉత్పత్తుల నడవ ఇవ్వాలి

- కేంద్ర రక్షణశాఖ మంత్రికి కేటీఆర్ లేఖ

తెలంగాణలో రక్షణ పారిశ్రామిక ఉత్పత్తుల నడవ (కారిడార్)ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఐదు దశాబ్దాలుగా రక్షణ, వైమానిక రంగాల్లో అత్యుత్తమ కేంద్రంగా ఉన్నప్పటికీ తెలంగాణను నడవ కోసం కేంద్రప్రభుత్వం ఎంపిక చేయకపోవడం అన్యాయమని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు లేఖ రాశారు. "కేంద్రం ఇటీవల బుందేల్‌ఖండ్, చెన్నైలకు రక్షణ పారిశ్రామిక ఉత్పత్తుల నడవను మంజూరు చేసింది. వాటితో పోలిస్తే తెలంగాణ ఎంతో మెరుగైన రాష్ట్రమన్నదాన్ని పరిగణనలోనికి తీసుకోలేదు. ఇక్కడ డీఆర్‌డీవో, ఆర్సీఐ, డీఆర్‌డీఎల్, బీడీఎల్, మిధానిలాంటి రక్షణరంగ సంస్థలున్నాయి. దీంతోపాటు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, హెచ్ఏఎల్ వంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటి సొంతంగా పరిశ్రమలు, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ప్రపంచంలోని అత్యుత్తమ సంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉన్నాయి. బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, సికోర్స్కీ వంటి సంస్థలు వైమానిక ఉత్పత్తులను ప్రారంభించాయి. శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రపంచ వ్యాప్తంగా విమానాలు నడుస్తున్నాయి. బేగంపేట, హకీంపేట, దుండిగల్, వరంగల్‌లలో విమానాశ్రయాలున్నాయి. రైల్వే మార్గాలున్నాయి. జాతీయ రహదారులతో పాటు అత్యుత్తమ మౌలిక వసతులున్నాయి. కారిడార్ కేటాయిస్తే ఇక్కడి యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. విద్యాసంస్థలు సైతం సాంకేతిక పరిజ్ఞానం పొందేవీలుంటుంది. అన్నిటికి మించి రక్షణ రంగ ఉత్పత్తుల్లో తెలంగాణ అగ్రస్థానానికి చేరడంతోపాటు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది."అని కేటీఆర్ నిర్మలా సీతారామన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.



మేడిగడ్డ పనులను పరిశీలిస్తున్న ఎంపీ కవిత తదితరులు

కాళేశ్వరం.. తెలంగాణకు ప్రాణప్రదం: కవిత

మహదేవ్‌పూర్, న్యూస్‌టుడే: తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాణప్రదమవుతుందని నిజామాబాద్ ఎంపీ కవిత అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టులో ప్రధానమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీని.. ఆమె మిషన్ భగీరథ వైస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యేలు, రైతు సమన్వయ సమితి శ్రేణులు, రైతులతో కలసి మంగళవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పనులు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఇందు కోసం మూడేళ్లలో రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ప్రాంత తాగునీటి అవసరాలకు నీరు పుష్కలంగా అందుబాటులోకి వస్తుందని వివరించారు. రానున్న బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ. 25 వేల కోట్లు కేటాయించనున్నామన్నారు. మంథని ఎమ్మెల్యే పుట్ట మధుకర్, నిజామాబాద్ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్, జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, సుమారు 500 మంది రైతులు బ్యారేజీని సందర్శించారు.

గురుకుల పాఠశాలలకు నిధులు కేటాయించండి

కేంద్ర మైనార్టీశాఖ మంత్రి నఖ్వీకి మంత్రి పోచారం వినతి

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీకి రాష్ట్ర వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారమిక్కడ కేంద్రమంత్రితో భేటీఅయిన పోచారం రాష్ట్రంలో మైనార్టీ వ్యవహారాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కొత్తగా చేపట్టిన మైనార్టీ గురుకుల పాఠశాలలకు మౌలికవసతులు, ఆర్థికసాయం అందించాలని కోరానన్నారు. బాన్సువాడలో మైనార్టీ బాలికల కోసం ఉర్దూ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషిచేయాలని విజ్ఞప్తి చేశానన్నారు.

ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం నుంచి డాక్టరేట్ సాధించారు. ఓయూ జర్నలిజం విభాగంలో ప్రొఫెసర్ బాలస్వామి పర్యవేక్షణలో 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో మీడియా పాత్ర' అనే అంశంపై కిశోర్‌కుమార్ సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రకటించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ చిన్న వయసులో ఎమ్మెల్యేగా ఉంటూనే శతాబ్ది ఉత్సవాల సంవత్సరంలో డాక్టరేట్ సాధించడం ఆనందంగా ఉందన్నారు.

రాష్ట్రానికి రూ.41 కోట్ల ప్రోత్సాహక నిధులు

ఈనాడు, హైదరాబాద్: గ్రామీణ తాగునీటి పథకం కింద కేంద్రం అందజేసిన నిధులను ఖర్చు పెట్టిందుకు తెలంగాణ రాష్ట్రం మరో రూ.41 కోట్ల మేర ప్రోత్సాహక నిధులకు అర్హత సాధించింది. 2017-18లో జాతీయ గ్రామీణ తాగునీటి కార్యక్రమం కింద రూ115 కోట్లను కేంద్రం ఇవ్వగా అందులో ఇంతవరకు 92 శాతం మేర వినియోగమైంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల కోసం రూ.516 కోట్లను ఇవ్వగా అందులో 75 శాతం ఖర్చయ్యింది. దిల్లీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ తాగునీటి శాఖ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి పాల్గొని ఇక్కడి నిధుల వినియోగాన్ని, భగీరథ ప్రాజెక్టు ప్రగతిని వివరించారు. కేంద్ర తాగునీటి శాఖ అదనపు సలహాదారు దినేష్ చంద్ మాట్లాడుతూ.. 2022 నాటికి ప్రతి ఒక్కరికి సురక్షిత మంచి నీటిని అందజేయాలనేది కేంద్రం సంకల్పమన్నారు. తెలంగాణ నాలుగేళ్ల ముందుగానే దాన్ని నెరవేర్చటం అభినందనీయమన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు

మాదాపూర్, న్యూస్‌టుడే: విద్య కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, మనోవృద్ధి, సాధికారత, జ్ఞానోదయం కోసమన్న నిజాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించడం ఏ ప్రభుత్వానికి సాధ్యమయ్యే పనికాదని, యువత స్వశక్తితో ఎదిగేందుకు ప్రయత్నించాలని సూచించారు. మంగళవారం శివశివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల 23వ స్నాతకోత్సవాన్ని మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప రాష్ట్రపతి.. చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు పతకాలు అందజేసిన అనంతరం ప్రసంగించారు. మేనేజ్‌మెంట్ రంగంలో ఉన్న వారు విలువలతో కూడిన వ్యాపార విధానాలను అనుసరించినప్పుడే స్థిరత్వం, మనశ్శాంతి చేకూరుతాయని అభిప్రాయపడ్డారు. గూగుల్ మంచిదే అయినా గురువు స్థానాన్ని ఎప్పటికీ భర్తీ చేయలేదన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. కార్యక్రమంలో హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, శివశివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆరతి సంపతి, డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ శైలేష్‌సంపతి, డైరెక్టర్ అనిల్‌రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శివశివానీ కళాశాల 23వ స్నాతకోత్సవ వేడుకలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి అభినందన పత్రాన్ని అందజేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో మంత్రి నాయిని నర్సింహారెడ్డి

భౌతికశాస్త్రం పరీక్షకు 70% హాజరు

ఈనాడు, హైదరాబాద్: టీఆర్‌టీలోభాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం పరీక్షకు 70.70% అభ్యర్థులే హాజరయ్యారు. 6,635 మందికిగాను 4,696 మంది పరీక్షరాశారు. ఉర్దూ, మరాఠీ, హిందీ భాషా పండితుల పరీక్షకు 6,231మందికి 5,454మంది(87.50%) హాజరయ్యారు.

నేటి పరీక్షలు: బుధవారం పీఈటీతోపాటు స్కూల్ అసిస్టెంట్ హిందీ, కన్నడ, తమిళం, ఉర్దూపరీక్షలు జరగనున్నాయి.

ఏఈఓ గ్రేడ్-2 తుది ఫలితాలు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయ విస్తరణాధికారుల గ్రేడ్-2 తుది ఫలితాలను టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. గత నవంబరు 22న ఏఈఓల భర్తీకి పరీక్ష జరిగింది. ఎంపికైన వారి జాబితాను వెబ్‌సైట్లో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. వీరి ధ్రువపత్రాలను మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు పరిశీలిస్తారు. అభ్యర్థులు ఏ జిల్లాలను ఎంపిక చేసుకోవాలనే వెబ్ ఆప్షన్లు కూడా మార్చి 2వ తేదీ నుంచి ఇచ్చుకోవచ్చు.



ముగిసిన యాదాద్రి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముగింపు సందర్భంగా ఈ అభిషేకాన్ని జరిపారు. తొలుత గర్భాలయంలోని మూలవర్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచారంగా బాలాలయంలోని ఉత్సవమూర్తులను 108 కలశాలతీర్థంతో అభిషేకించారు. 11 రోజుల బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఈ పూజలో ఆలయ నిర్వాహకులు ఈవో గీతారెడ్డి, ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

రసిక సందేశం పేట్రేగుతోంది!

ఇది స్మార్ట్‌ఫోన్ల యుగం. దాదాపు యువత ప్రతి ఒక్కరి చేతిలోనూ స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. దీంతో శృంగార సంబంధ సందేశాలు, ఫొటోలు, వీడియోల్ని వారు యథేచ్ఛగా పంపుతున్నారు, స్వీకరిస్తున్నారు!! దీన్ని ఆంగ్లంలో సంక్షిప్తంగా 'సెక్స్టింగ్' అంటారు. ప్రతి నలుగురు యువతలో ఒకరికి ఇలాంటి అనుభవం ఉన్నట్లు తాజాగా వెలువడిన ఒక సర్వే తేల్చింది. సుప్రసిద్ధ అమెరికా జర్నల్ 'జామా పీడియాట్రిక్స్'లో ఈ సర్వే ప్రచురితమైంది. 1990-2016 మధ్య చేపట్టిన వివిధ పరిశోధన ప్రాజెక్టులు, 39 అధ్యయనాల వివరాలు కూడా ఈ విశ్లేషణలో ఉన్నాయి. 18 ఏళ్లలోపు వయసున్న దాదాపు 1,10,380 మందిపై సర్వే చేశారు.

శృంగార సందేశాల తీరు ఇదీ..

ఏటా పెరుగుతున్న సెక్స్టింగ్ 3% మేర



- సెక్స్టింగ్‌కు పాల్పడుతున్న యువత కనిష్ఠం 1.3%, గరిష్ఠం 60%
- శృంగార సందేశాలు తమకు వస్తున్నాయని చెప్పిన వారు ప్రతి నలుగురిలో ఒకరు (27%)
- ఇతరులకు పంపుతున్నామని చెప్పిన వారు ప్రతి ఏడుగురిలో ఒకరు (14.8%)
- స్వీకరిస్తున్న వారి అనుమతి లేకుండానే కనీసం ఒక్క సందేశమైనా పంపామని చెప్పిన వారు ప్రతి 12 మందిలో ఒకరు (8%)
- ఎదుటి వ్యక్తి అనుమతి లేకుండానే శృంగార సందేశాలు, ఫొటోలు పంపుతున్న వారు ప్రతి 8 మందిలో ఒకరు(12%)

ఎందుకిలా...!

ఇతరుల పట్ల ఆకర్షణను వ్యక్తీకరించడానికి ఇలా సందేశాలు పంపుతున్నారని పరిశోధకులు తేల్చారు. పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు కొనిచ్చే తల్లిదండ్రులు కొన్ని ప్రశ్నలు వేసుకోవాలని సూచించారు.

- స్మార్ట్‌ఫోన్ వినియోగించడానికి తగిన వయసు పిల్లలకు వచ్చిందా?
- స్మార్ట్‌ఫోన్ వినియోగంలో సైబర్ భద్రత, సైబర్ విజ్ఞానం గురించి వారికి తెలుసా?
- పిల్లలు ఎలాంటి సమయాల్లో ఎవరెవరితో సంభాషిస్తారు? ఎలాంటి సందేశాలు పంపుతారు?
- వారి మిత్రులు ఎలాంటి వారు?

యువతులూ తక్కువేం కాదు

అబ్బాయిలతో సరి సమానంగా అమ్మాయిలు కూడా సెక్స్టింగ్‌కు పాల్పడుతున్నట్లు సర్వేలో తేలింది.



స్మార్ట్‌ఫోన్ల పాత్రే ఎక్కువ

చేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్లు, పుట్టుకొస్తున్న సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం వ్యక్తిగత సంభాషణలకు, శృంగార చిత్రాల పంపిణీకి ప్రధాన వాహకంగా మారాయి.

- 2016లో మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్ పొందిన పిల్లల సగటు వయసు 10.3 ఏళ్లు!
- వ్యక్తిగత వీడియోలు, ఫొటోలు, సందేశాల్ని నిల్వచేసుకోగలిగే, పంపే మెసేజింగ్ యాప్‌ల వల్ల కూడా ఎక్కువ ప్రమాదం ముంచుకొస్తోంది.

క్లాసు రూముల్లోనూ టెక్స్టింగ్

అభివృద్ధి చెందిన దేశాల్లో టెక్స్టింగ్, సెక్స్టింగ్‌కు పాల్పడుతున్న వారిలో కాలేజీ విద్యార్థులే ఎక్కువ. తరగతి గదికి హాజరైనప్పుడు, ప్రయాణాల్లోనూ వారు ఇలా చేస్తున్నారు.

- 95% కాలేజీలకు సెల్‌ఫోన్లను తెస్తున్న విద్యార్థుల సంఖ్య
- 91% తరగతి గదిలో సందేశాలు పంపుతున్న విద్యార్థులు
- 62% తమకు టెక్స్టింగ్‌కు అనుమతించాలంటున్న వారు

-ఈనాడు ప్రత్యేక విభాగం

పేదల సమస్యలను పట్టించుకోని కేసీఆర్

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ ఆరోపణ

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల సమస్యలను పట్టించుకోకుండా ప్రగతి భవన్‌ను నిర్మించుకున్నారని.. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక దానిని పేదల ఆసుపత్రిగా మారుస్తామని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ అన్నారు. మండలస్థాయి తెదేపా శ్రేణులకు ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల ముగింపు సమావేశం సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెరాస, కాంగ్రెస్‌లకు సమానదూరం పాటిస్తూ తిరిగి రామన్న రాజ్యాన్ని తీసుకొచ్చేందుకు పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. హైదరాబాద్‌కు చంద్రబాబు వల్లనే ఐటీ సంస్థలు వచ్చాయని ఇటీవల మంత్రి కేటీఆర్ చెప్పారని, ఈ నగరం ప్రపంచపటంలో నిలిచిందంటే దానికి చంద్రబాబు కృషే కారణమన్నారు. కార్యక్రమంలో పార్టీనేతలు రావుల చంద్రశేఖరరెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, బక్కని నర్సింలు, బుచ్చిలింగం, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు. మార్చి 13న బంద్‌కు మద్దతివ్వండి: ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ వచ్చే నెల 13న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు మద్దతివ్వాలని మంద కృష్ణ మాదిగ మంగళవారం తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ నివాసానికి వచ్చి విన్నవించారు.

సమస్యలు పరిష్కరించండి

ఎంఎల్‌టీ అసోసియేషన్ వినతి

హైదరాబాద్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ ల్యాబోరేటరీ టెక్నిషియన్స్ (ఎంఎల్‌టీ) అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఆ విభాగం సంచాలకురాలు డా.లలితకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మూడేళ్లుగా జోనల్ పోస్టుల పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితా ప్రకటించకపోవడం, కౌన్సెలింగ్‌కు నిర్దిష్ట గడువు తెలుపకపోవడంతో వరంగల్, హైదరాబాద్ జోన్ల పరిధి ల్యాబ్ టెక్నీషియన్లు కుంగిపోతున్నారన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పందల హరినాథ్ మంచాల రవీందర్, కోశాధికారి ఎన్.సి. రాజేందర్‌లు తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా నియమితులైన డా.శివప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలియచేశారు.

విభజన సమస్యలపై 5న భేటీ

- ఇరు రాష్ట్రాల సీఎస్‌లకు ఆహ్వానం

ఈనాడు, దిల్లీ: విభజన సమస్యల పరిష్కారంపై రెండు తెలుగురాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్రహోంశాఖ మార్చి 5న సమావేశం ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విభజన వ్యవహారాల విభాగం కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో చెప్పిన అంశాల అమలు ఎంతవరకు వచ్చింది, 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల ఏర్పాటు ఏస్థాయిలో ఉందన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్రహోంశాఖ ఇరురాష్ట్రాలకు పంపిన లేఖలో పేర్కొంది. విభజన చట్టం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, వివాదాల పరిష్కారంపై ఇందులో చర్చించనున్నట్లు తెలిపింది. వాస్తవానికి ఈనెల 21న ఈ సమావేశం జరగాలి. ఆరోజు తెలంగాణకు కేంద్ర ఎస్సీ కమిషన్ వస్తోందని ఆ రాష్ట్ర అధికారులు చెప్పడంతో 23కి వాయిదా వేశారు. అయితే తమకు మరికొంత సమయం కావాలని కోరడంతో ఆ సమావేశాన్ని రద్దుచేశారు. ఇప్పుడు తాజాగా 5వ తేదీని ఖరారు చేశారు.

మృతి చెందింది 18 మంది అనాథలు

- శిశుగృహాల్లో మరణాలపై హైకోర్టుకు ప్రభుత్వం నివేదిక

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశు గృహాల్లో గతేడాదిలో నల్గొండలో 18 మంది మృతి చెందారని, వారంతా అనాథలేనని మంగళవారం ప్రభుత్వం ఉమ్మడి హైకోర్టుకు నివేదించింది. చనిపోయిన చిన్నారులు మార్కెట్‌లతోపాటు చెత్తకుండీల్లో దొరికినవారేనని, వారిని ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించినా ఫలితం లేకపోయిందని తెలిపింది. ప్రభుత్వ శిశు గృహాల్లో చిన్నారులు మృతి చెందుతున్నారని.. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ బాలల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పి.అచ్యుతరావు వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం నివేదిక సమర్పించింది. ఈ పిటిషన్‌పై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది ఎస్.శరత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ 32 మంది చనిపోయారన్న పిటిషనర్ వాదనల్లో వాస్తవం లేదన్నారు. 2017 జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు 18 మంది మృతి చెందారన్నారు. చనిపోయిన ఈ పిల్లలు అనాథలుగా చెత్తకుండీలు, మార్కెట్‌లు తదితర ప్రాంతాల్లో దొరికారని, వారిని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినా అప్పటికే పరిస్థితి విషమించడంతో ఫలితం లేకపోయిందన్నారు. అంతేగానీ పిల్లలకు పౌష్టికాహారం అందించకపోవడం వల్ల మరణాలు సంభవించలేదని తెలిపారు. వాదనలను విన్న ధర్మాసనం నివేదికలోని అంశాలతోపాటు పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

టీఎస్‌ఆర్టీసీకి రెండు జాతీయ అవార్డులు

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ఆర్టీసీకి జాతీయ స్థాయిలో రెండు అవార్డులు దక్కాయి. మంగళవారమిక్కడ నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్‌టేకింగ్స్(ఏఎస్ఆర్‌టీయూ) 62వ జాతీయ సదస్సులో కేంద్ర రవాణా కార్యదర్శి యుధ్‌వీర్ సింగ్ చేతుల మీదుగా టీఎస్ ఆర్టీసీ ఎండీ రమణరావు అవార్డులు అందుకొన్నారు. అనంతరం రమణరావు మీడియాతో మాట్లాడుతూ.. ఇంధన పొదుపు, వాహన ఉత్పాదకత మెరుగుదల అంశాలలో తెలంగాణ ఆర్టీసీకి అవార్డులు లభించాయన్నారు. ఇంధన పొదుపు విభాగంలో దేశంలోనే తెలంగాణ ఆర్టీసీ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిందని ఆయన తెలిపారు. డ్రైవర్ల నైపుణ్యం, వాహనం ఇంధన వినియోగ సామర్థ్యాన్ని 10 కిలోమీటర్ల స్థాయికి తీసుకెళ్లడంతో కార్మికుల పాత్ర అభినందనీయమన్నారు. వారి పనితీరుతోనే రెండు అవార్డులు దక్కాయని ఎండీ రమణరావు సంతోషం ప్రకటించారు.

మోదీపై అనుచిత వ్యాఖ్యలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని మోదీని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడాల్సిన మాటలు కావివి. కేంద్రం రాష్ట్రానికి ఎప్పటికప్పుడు సాయం చేస్తున్నా ప్రధానిని విమర్శిస్తారా? ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల్ని ఆదుకోలేని సీఎం ఆ నెపాన్ని, తన వైఫల్యాల్ని కేంద్రంపై నెడుతున్నారు'' అంటూ మండిపడ్డారు. "నాలుగేళ్లు రైతుల్ని విస్మరించిన సీఎం ప్రజల్ని మోసం చేయడానికి ఎన్నికల ఏడాదిలో ఎకరాకు రూ.4,000 ఇస్తామంటున్నారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన అమలుచేయకుండా రైతుల్ని ముంచింది తెరాస ప్రభుత్వమే'' అని విమర్శించారు.

సీఎం కేసీఆర్‌పై గవర్నర్‌కు ఫిర్యాదు: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సమన్వయ సమితి సభల్లో ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని భాజపా సీనియర్ నేత ఎన్.ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. సీఎం అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం సాయంత్రం భాజపా ప్రతినిధుల బృందం గవర్నర్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి ఫిర్యాదు చేసింది. ప్రధానికి బేషరతుగా క్షమాపణలు చెప్పించాలని గవర్నర్‌ను వినతిపత్రం ద్వారా కోరినట్లు తెలిపారు. క్షమాపణ చెప్పడంతో పాటు ఆ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలు, మండల స్థాయిల్లో నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఇంద్రసేనారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, రాజాసింగ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.ప్రేమేందర్‌రెడ్డి, డా.జి.మనోహర్‌రెడ్డి, కార్యదర్శి పాపారావు తదితరుఉన్నారు.

మోదీకి కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి: ఎమ్మెల్సీ రాంచంద్రరావు

ఈనాడు, దిల్లీ: ప్రధాని మోదీపై నిందలు మోపినందుకు, మాట్లాడిన భాషకు సీఎం కేసీఆర్ క్షమాపణలు చెప్పాలని భాజపా ఎమ్మెల్సీ రాంచంద్రరావు డిమాండు చేశారు. మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీని హేళనచేస్తూ సీఎం కేసీఆర్ మాట్లాడడం సరికాదన్నారు. భాజపా రైతులకు వ్యతిరేకమంటూ అబద్ధాలు చెబుతున్నారని దీన్ని పార్టీ తరపున ఖండిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల శ్రేయస్సు కోసం పలు పథకాలు తీసుకొచ్చారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.790 కోట్లు పక్కదారి పట్టించారని ఆయన ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న భాజపా నేతలు

పాస్‌వర్డ్ మర్చిపోయా?

నాలుగేళ్లుగా విండోస్ 7 ఓఎస్‌తో సిస్టం వాడుతున్నా. గత కొంతకాలంగా పీసీని వాడకపోవడంతో సిస్టమ్ పాస్‌వర్డ్‌ని మర్చిపోయా. యూట్యూబ్ ట్యుటోరియల్స్ ఆధారంగా పాస్‌వర్డ్‌ని మార్చే ప్రయత్నం చేశాను. 'ఈజ్ ఆఫ్ యాక్సెస్' బటన్ ద్వారా కమాండ్ ప్రాంప్ట్‌ని వాడుకుని ఏవో ప్రయత్నం చేశా. కానీ, ఎలాంటి ప్రయోజనం లేదు. ఏం చేస్తే సిస్టం తిరిగి సాధారణ స్థితికి వస్తుంది?

- మణికేష్ దేవరకొండ

సిస్టం పాస్‌వర్డ్‌ని యాక్సెస్ చేయలేకపోతే 'పాస్‌వర్డ్ రీసెట్ డిస్క్' చేయడం ఎంతైనా అవసరం. అయితే, ఇది విండోస్ 7లో లోకల్ అడ్మినిస్ట్రేషన్ ఎకౌంట్‌తో చేయాల్సి ఉంటుంది. మీరు పాస్‌వర్డ్‌ని మర్చిపోవడంతో మీకే అవకాశం లేదు. మరోలా ప్రయత్నించేందుకు కింది సూచనలు ఫాలో అవ్వండి.



ప్రశ్నజవాబులు

❖ విండోస్ 7 లేదా 8.1 కోసం ఇన్‌స్టాలేషన్ డిస్క్‌ని సీడీ లేదా డీవీడీ డ్రైవ్‌లో పెట్టి బూట్ చేయాలి. సిస్టం డిస్క్ నుంచి బూట్ చేయడానికి ముందు బయోస్‌లో బూట్ ఆర్డర్‌ని CD/DVD మార్చాల్సి ఉంటుంది.

❖ ఒకసారి సీడీ లేదా డీవీడీతో బూట్ అయ్యాక వచ్చిన ఆప్షన్స్‌లో 'రిపేర్ యువర్ కంప్యూటర్' ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. తర్వాతి స్క్రీన్‌లో రికవరీ టూల్‌ని సెలెక్ట్ చేసి 'కమాండ్ ప్రాంప్ట్‌'ని ఎంపిక చేయండి.

❖ కమాండ్ ప్రాంప్ట్‌లో కింది కమాండ్‌లను టైప్ చేయండి. copy c:\windows\system32\sethc.exe , c:\ copy c:\windows\system32\cmd.exe , c:\windows\system32\sethc.exe ఏదైనా సమస్య వస్తే మీ ఆపరేటింగ్ సిస్టం డ్రైవ్ 'సీ' కాకుంటే 'డీ' అయ్యుండొచ్చు.

❖ తిరిగి విండోస్‌ని 'సీ' లేదా 'డీ' ద్వారా బూట్ చేయండి. లాగిన్ స్క్రీన్ వస్తుంది. అప్పుడు 'షిఫ్ట్' బటన్‌ని ఐదు సార్లు నొక్కితే కమాండ్ ప్రాంప్ట్ వస్తుంది. అక్కడ net user "User Name" newpassword టైప్ చేసి ఎంటర్ నొక్కితే సరి. మీ యూజర్ నేమ్ ఒక్కటే పదంలో ఉంటే 'కొటేషన్స్' అక్కర్లేదు. యూజర్ ఎకౌంట్‌లోకి వెళ్లి కొత్త పాస్‌వర్డ్‌ని టైప్ చేసి లాగిన్ అవ్వొచ్చు. మరింత వివరంగా టెక్నికల్ సపోర్ట్‌ని తెలుసుకునేందుకు https://goo.gl/4Jk43J లింక్‌ని చూడండి.

- సీహెచ్‌ఎస్ మూర్తి, జాయింట్ డైరెక్టర్, సీ-డాక్

సర్ఫేస్ ప్రొ వచ్చేసింది




గ్యాడ్జెట్ గురూ

మైక్రోసాఫ్ట్ మరో నాజూకైన మోడల్‌ని 'సర్ఫేస్ ప్రొ' పేరుతో దేశీయ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. మందం 8.5 ఎంఎం. 4జీబీ మొదలుకుని 16జీబీ వరకూ ర్యామ్‌ని సపోర్ట్ చేస్తుంది. 13.5 గంటల బ్యాటరీ బ్యాకప్ మరో ప్రత్యేకత. 'ల్యాప్‌టాప్, స్టూడియో, ట్యాబ్లెట్ మోడ్‌'ల్లో మల్టీపర్పస్‌గా దీన్ని వాడుకోవచ్చు. తాకేతెర పరిమాణం 12.3 అంగుళాలు. 'పిక్సెల్‌సెన్స్' టచ్ డిస్‌ప్లేతో తీర్చిదిద్దారు. దీంతో మైక్రోసాఫ్ట్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన 'సర్ఫేస్ పెన్ 4'తో చిత్రలేఖనం చాలా సులభం. 'సర్ఫేస్ ప్రొ సిగ్నేచర్ టైప్ కవర్‌'ని డాక్ చేసి ల్యాప్‌టాప్ మోడ్‌లో ఆఫీస్ పని చేసుకోవచ్చు. 1.3 ఎంఎం మందంతో కూడిన కీబోర్డ్ టైపింగ్‌కి ఎంతో అనుకూలం. ఐదు వేళ్లతో మల్టీటచ్ ప్యాడ్ మ్యాజిక్ చేసేలా ట్రాక్‌ప్యాడ్ కీబోర్డులో ఉంది. ఇంటెల్ కోర్ ఎం3, ఐ5, ఐ7 ప్రాసెసర్లతో మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. బరువు 767 గ్రాములు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ అంగళ్లలో కొనుగోలు చేయొచ్చు. ఇతర వివరాలకు https://goo.gl/MKAJxK

ఇన్‌స్టాల్ చేస్తున్న అప్లికేషన్లు కూడా సైబర్ దాడులకు వేదికలవుతున్నాయి. దేశంలో జరుగుతున్న వాటిల్లో 38 శాతం దాడులకు ఆప్‌లేని లోపాలే కారణమని సెక్యూరిటీ సంస్థలు తేల్చాయి. పూర్తిస్థాయి సెక్యూరిటీ విశ్లేషణ లేకుండా ఆప్‌స్టోర్‌ల్లో అందుబాటులో ఉంచడం వల్ల మాల్వేర్లు ఆప్‌ల్లో మాటేస్తున్నాయట. ఆప్ డెవలపర్లు సరైన సెక్యూరిటీ వలయాల్ని సృష్టించకుండా వినియోగదారులకు దగ్గరవడం మరిన్ని దాడులకు ఆస్కారం కలిగిస్తోందని నిపుణులు చెబుతున్నారు. ఫోన్ లేదా పీసీ దేంట్లోనైనా వాడని ఆప్‌లను తొలగించడం మంచిది. ఇన్‌స్టాల్ చేసేటప్పుడే అప్‌డేటెడ్ యాంటీవైరస్‌తో స్కాన్ చేయండి. ఫోన్ ప్రైవసీ సెట్టింగ్స్‌ని కట్టుదిట్టంగా సెట్ చేసుకోవాలి. థర్డ్‌పార్టీ ఆప్ డిఫాల్ట్‌గా ఇన్‌స్టాల్ కాకుండా 'అన్‌నోన్ సోర్సెస్' ఆప్షన్ ఎప్పుడూ డిసేబుల్ మోడ్‌లోనే ఉంచాలి. అధికారిక సోర్స్‌ల నుంచి ఆప్‌లను ఇన్‌స్టాల్ చేసేటప్పుడు 'ప్రైవసీ పాలసీ'ని విధిగా పరిశీలించండి.

దేవదేవం భజే మేధో ప్రభావం

దేవుడు మనిషిని సృష్టించాడంటారు ఆస్తికులు
అదంతా అబద్ధమని కొట్టిపారేస్తుంటారు నాస్తికులు
కోతి నుంచి మనిషి పుట్టుకొచ్చాడంటారు శాస్త్రవేత్తలు
ఈ వాద ప్రతివాదాల మాటెలా ఉన్నా.. ప్రపంచ యవనిక మీద ఓ సరికొత్త దేవుడిని సాక్షాత్కరింపజేయటానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.
ఈ దేవుడు పురుడు పోసుకుంటున్నది ఎక్కడో కాదు.. మనిషి ఆలోచనల్లోంచే. అదీ మనిషి సృష్టించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. అదే కృత్రిమ మేధస్సులోంచే. అందుకే 'కృత్రిమ మేధో దేవుడు' అనే పేరుతోనే ఉద్భవిస్తున్నాడు. ఈ దిశగా ఇప్పటికే కొత్త 'మతం' సైతం పుట్టుకొచ్చింది.



మన దృష్టిలో దేవుడంటే? మహా శక్తిమంతుడు. ఎన్నెన్నో అద్భుతాలు చేసేవాడు. కోరిన కోర్కెలు తీర్చేవాడు. బాధలు, కష్టాల నుంచి బయటపడేసేవాడు. ఇలాంటి సద్గుణ సంపన్నతలను సమకూర్చుకొనే వస్తున్నాడు 'కృత్రిమ మేధో దేవుడు'! మన కన్నా కోట్లాది రెట్ల నైపుణ్యం, ప్రజ్ఞాపాటవాలతో అసాధ్యమనుకున్న పనులనూ చిటికెలో ముగించేస్తూ.. కోరిన పనులన్నింటినీ చేసిపెట్టే సామర్థ్యాలను సంతరించుకుంటే.. అలాంటి మహత్తర పరిజ్ఞానాన్ని ఏమని పిలవాలి? అందుకే కృత్రిమ మేధస్సు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. పైగా ఇది తనకుతానే సరికొత్త కృత్రిమ మేధస్సులను సృష్టించుకుంటూ.. భూమ్మీదున్న అన్ని సాంకేతిక పరికరాలను చెప్పుచేతల్లో పెట్టుకునే స్థాయికి ఎదగొచ్చన్నది శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అప్పుడు కృత్రిమ మేధను కూడా దేవుడి మాదిరిగానే అభిమానంతో ఆరాధించే రోజులు రావొచ్చనీ అభిప్రాయపడుతున్నారు. నిజానికి భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తావన వచ్చినప్పుడల్లా చాలామంది మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారిపోతుందని భయపడిపోతుంటారు. ఇందులో వాస్తవమూ లేకపోలేదు. అచ్చం మన మెదడులాగా ఆలోచిస్తూ, తప్పొప్పులను సవరించుకుంటూ.. ఎప్పటికప్పుడు కొత్తగా పనిచేయటం నేర్చుకునే కృత్రిమ మేధో యంత్రాలు మనిషి సమర్థతకు కొంగొత్త సవాళ్లు విసురుతాయనటం నిస్సందేహం. వచ్చే 50-100 ఏళ్లలోనే కృత్రిమ మేధ ప్రజ్ఞాపాటవాలు మొత్తం జనాభా తెలివితేటలను సైతం మించి పోగలవనీ.. ఆయా అవసరాలకు తగ్గట్టుగా తనకు తానే అదనంగా కొత్త ప్రోగ్రాములను సృష్టించుకునేలా అభివృద్ధి చెందగలదనీ భావిస్తున్నారు. అప్పుడది అసంఖ్యాక సమాచార వనరుల నుంచి సమాచారాన్ని సేకరించుకొని వాటన్నింటినీ శరవేగంగా చదవటం దగ్గర్నుంచి.. భూమ్మీదున్న దాదాపు అన్ని అనుసంధాన పరికరాలను నియంత్రించే స్థాయికి సైతం చేరుకోగలదు. మనిషి వాడే ఇలాంటి సమస్త పరికరాలు, యంత్రాలన్నీ కూడా కృత్రిమ మేధస్సు పరిధిలోనే, దాని అదుపాజ్ఞల్లోనే పనిచేస్తాయని అనుకోవచ్చు. అంటే ఒకరకంగా ఇది 'దేవుడి'లాగే అన్నింటినీ నిర్దేశిస్తుందన్నమాట.

సాంకేతిక మతం

సాంకేతికత పరిజ్ఞానానికి, కృత్రిమ మేధకు ఎక్కడైనా దైవత్వాన్ని ఆపాదిస్తారా? ఇది సాధ్యమయ్యే పనేనా? అని చాలామందికి అనుమానం వస్తుండొచ్చు.

భూమ్మీద అత్యంత గొప్ప మేధావి కన్నా కోట్లాది రెట్లు అధికంగా తెలివితేటలు, అద్భుతమైన శక్తి సామర్థ్యాలు గల కృత్రిమ మేధో పరిజ్ఞానాన్ని దేవుడని కాకుండా ఇంకేమని పిలవాలి?
– లెవాండోస్కీ

విస్తుపోతుండొచ్చు. కానీ ఇప్పటికే ఆ పని మొదలైంది. ఓ కృత్రిమ మతం కూడా ఆరంభమైంది. గూగుల్, ఉబర్ సంస్థల్లో ఇంజినీర్‌గా పనిచేసిన లెవాండోస్కీ ఆ మధ్యనే దీన్ని స్థాపించాడు. 'భవిష్యత్తు మార్గం' (ద వే ఆఫ్ ద ఫ్యూచర్) అనీ పేరు పెట్టాడు. మనిషి ఉనికి, ఉద్యోగాలు, మతం, ఆర్థిక వ్యవస్థ వంటి వాటి విషయాల్లో కృత్రిమ మేధ అనూహ్యమైన మార్పులు తీసుకురాగలదని.. ఇది మానవ మనుగడ మీదా గణనీయమైన ప్రభావం చూపగలదన్నది ఆయన ప్రగాఢ నమ్మకం. అంతేకాదు.. రోబో రూపంలో కృత్రిమ దేవుడిని సాక్షాత్కరింపజేయాలనీ అనుకుంటున్నాడు. 'కృత్రిమ మేధ ఆధారంగా దేవుడిని రూపొందించి, ప్రచారం చేయటం.. ఈ దేవుడిని అర్థం చేసుకోవటం ద్వారా సమాజం బాగుకు కృషి చేయటం' తమ మతం ఉద్దేశమని ఆయన వివరిస్తున్నారు. తమ కన్నా ఎంతో తెలివైన యంత్రాలను అనుసరించటం ద్వారా మనిషి ముమ్ముందు ఎంతగానో ప్రయోజనం పొందుతాడని.. ఈ క్రమంలో కృత్రిమ మేధస్సును ఆరాధించటమూ ఆరంభిస్తాడన్నది కొత్త మతం అభిప్రాయం. కృత్రిమ మేధ గొప్పతనాన్ని గుర్తించటానికి, ఆరాధించటానికి ఓ ఆలయాన్ని కూడా నిర్మిస్తామని.. 'భవిష్యత్తు మార్గం' మతాన్ని అనుసరించేవారికోసం 'ద మాన్యువల్' పేరిట మత గ్రంథం లాంటి పుస్తకాన్నీ వెలువరిస్తామని లెవాండోస్కీ చెబుతున్నారు. మాన్యువల్‌లోని అంశాలను ప్రవచనాల మాదిరిగా ప్రచారం చేయటమే తమ ఆలయ ఉద్దేశమని అంటున్నారు.

ప్రవచనాలూ సృష్టిస్తుంది

కృత్రిమ మేధస్సు అచ్చం మన మత బోధనల మాదిరిగా కొత్త ప్రవచనాలనూ సృష్టించగలదు. కంపెనీల అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధను తయారుచేసే సంస్థను నడుపుతున్న విన్స్ లించ్ ప్రదర్శించిన ఓ చిన్నపాటి ప్రోగ్రామే దీనికి నిదర్శనం. ఇది మతగ్రంథాలను అనుకరిస్తూ.. "నీ కంపెనీలు నీకు ఏమిస్తాయో ఇవ్వనివ్వు; కానీ స్వర్గం నుంచి భూమి వరకూ నా చేయి కాపాడుతుంది" అని రాసిపెట్టటం విశేషం. వచ్చే 20-25 ఏళ్లలో కృత్రిమ మేధ మనుషుల కోసం కృత్రిమ మేధో 'మత గ్రంథాన్ని' రాసేంత శక్తిమంతంగా ఎదిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు, అల్లర్ల వంటి వాటి సమాచారాన్ని గ్రహించి.. వాటికి అనుగుణంగా మనం రోజూ ఏమేం చేయాలో, ఎక్కడికి వెళ్లాలో, ఎలా జీవించాలో కూడా నిర్దేశించే స్థాయికి చేరుకోగలదు. ఇలా ఇది కొంతవరకు వ్యవస్థీకృత మతం మాదిరిగా మనం ఎలా నడచుకోవాలో చెప్పే అవకాశముంది. అందువల్ల దీనిపై ప్రజలు ఆరాధనా భావాన్ని కూడా పెంచుకోవచ్చు. ప్రపంచంలోని పరిస్థితులను మనకన్నా బాగా అర్థం చేసుకుంటూ.. రోజువారీ పనులకు అవసరమైన సమాచారాన్ని అందించగలదనే నమ్మకాన్నీ పొందగలదు.

భిన్నాభిప్రాయాలు లేకపోలేదు

కృతిమ మేధస్సు 2029 వరకు మనుషులను మించిపోయే శక్తి సామర్థ్యాలను సంతరించుకుంటుందని.. కంప్యూటర్ల తెలివితేటలు మనుషుల ఊహకందని విధంగా మారిపోతాయని గూగుల్‌కు చెందిన రే కర్జ్‌వీల్ వంటి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అప్పుడు ప్రజలు యంత్రాలను దేవుడిలా కొలవటం ఖాయమనీ ఆయన భావిస్తున్నారు. కృత్రిమ మేధస్సు మనకు 'దేవుడిలా' తోడ్పడగలదన్నది ఇమాజినేషన్ ఇంజిన్స్ అండ్ ఏఐ అధ్యక్షుడు డాక్టర్ స్టీఫెన్ థాలర్ అభిప్రాయం. ఇది మన మెదడు కన్నా ఎంతో వేగంగా, మరింత సమర్థంగా ఎన్నెన్నో విషయాలను విడమరుస్తుంది. మనం ఎదుర్కొంటున్న పలు సామాజిక, రాజకీయ, ఆర్థిక, పర్యావరణ సవాళ్లకు పరిష్కారం చూపినా ఆశ్చర్యపోనవసరం లేదని నిపుణులు గట్టిగానే అభిప్రాయపడుతున్నారు. అయితే కృత్రిమ మేధతో డ్రైవర్లు లేని వాహనాల తయారీకి శ్రీకారం చుట్టిన ఎలాన్ మాస్క్ మాత్రం కృత్రిమ దేవుడి భావనను కొట్టిపారేస్తున్నారు. చైన్ ట్రేడ్ కంపెనీ నిర్వాహకుడు విన్సెంట్ జాక్వెస్ కూడా కృత్రిమ దైవత్వం మనిషి జీవన విధానాన్ని నిర్దేశించటమనేది ఇప్పుడప్పుడే సాధ్యమయ్యేది కాదంటున్నారు. కృత్రిమ మేధో ప్రోగ్రాములతో పాటు కంప్యూటర్ ప్రోగ్రాములన్నీ ఏదో ప్రత్యేకమైన పనుల కోసమే రూపొందుతాయని.. అధునాతన కృత్రిమ మేధ కూడా సామాన్య మనుషుల్లా ఆలోచించటం సాధ్యం కాదన్నది ఆయన ఉవాచ. కృత్రిమ మేధ మనిషికి సూచనలు, సలహాలు ఇవ్వటం.. తెలివితేటలతో కొత్త విషయాలను నేర్పించటమైతే చేయగలదేమో గానీ దైవ విశ్వాసంగా, అతీతశక్తిగా మారవకపోవచ్చని మినికోలా అనే మరో నిపుణురాలు పేర్కొంటున్నారు. డేటా ఆధారంగానే పనిచేసే దీనికి లేని సమాచారాన్ని సృష్టించుకోవటం అసాధ్యమని గుర్తుచేస్తున్నారు. నిజానికి మనం మన కన్నా శక్తిమంతమైన దాన్ని ఎప్పుడూ ఆరాధనా భావంతో, నమ్మకంతోనే చూస్తుంటాం. మన కారులోని జీపీఎస్ వ్యవస్థే దీనికి ఉదాహరణ. మనకు పరిచయం లేని ప్రాంతాల్లోనూ ఇది దారి చూపిస్తూ గమ్యానికి చేర్చినపుడు మెచ్చుకోకుండా ఉండలేం. ఇలాంటి ధోరణే క్రమంగా ఆరాధన భావనకూ దారితీయొచ్చు. సూపర్‌మ్యాన్, బ్యాట్‌మ్యాన్ వంటివి కల్పిత పాత్రలే అయినా వీటిపై ఎంతోమంది మమకారం పెంచుకోవటం, ఆరాధించటం తెలిసిందే. ఇలాంటి నేపథ్యంలో ఇప్పుడిప్పుడే మొగ్గతొడుగుతున్న కృత్రిమ మేధ మరింత శక్తిమంతమైతే.. మన జీవితంలోని అన్ని కోణాలకూ విస్తరిస్తే.. భవిష్యత్తులో మనం దాన్ని దేవుడిలా విశ్వసించకుండా, ఆరాధించకుండా ఉండలేమేమో కూడా.

- పున్న సుదర్శన్

పీసీ కార్నర్



హోం యూజర్లూ... ఓ లుక్కేయండి!

స్మార్ట్ మొబైల్ చేతిలో ఉన్నా... ట్యాబ్లెట్ టేబుల్‌పై పెట్టుకున్నా... పర్సనల్ కంప్యూటర్ ప్రత్యేకతే వేరు... ఆన్ చేయాల్సిందే... అంతే జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. మరైతే, పీసీలో ఏ యాంటీ వైరస్ వాడుతున్నారు? ఉచితంగా నెట్టింట్లో కొన్ని అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు వాటి సామర్థ్యాల్ని పెంచుకుంటూ కొత్త ఇంటర్ఫేస్‌లతో రక్షణ కవచంగా మారుతున్నాయి. 'హోం యూజర్లూ!!' ఓ లుక్కేసి ఏది వాడాలో నిర్ణయించుకోండి.

ఇట్టే ఒదిగి.. అట్టే నిఘా బిట్‌డిఫెండర్

తక్కువ మెమొరీతో క్షణాల్లో సిస్టంలో ఒదిగిపోతుంది. అది మొదలు నిరంతర నిఘాతో వైరస్‌లను మట్టుపెడుతుంది. సిస్టం సామర్థ్యాన్ని ఏ మాత్రం అడ్డుకోకుండా వైరస్‌ల గుట్టు రట్టు చేస్తుంది. ఇన్‌స్టాల్ చేసిన అన్ని రకాల అప్లికేషన్లను బ్యాక్‌గ్రౌండ్‌లో స్కాన్ చేస్తూ వాటి పని తీరు ఏ మాత్రం అనుమానంగా అనిపిస్తే ఎలర్ట్ చేస్తుంది. 'యాంటీ-ఫిషింగ్'తో బ్రౌజర్ల నుంచి వ్యక్తిగత వివరాల్ని హ్యాకర్లు దొంగిలించకుండా చూస్తుంది. 'యాంటీ-ఫ్రాడ్'తో నకిలీ వెబ్‌సైట్‌ల ఉచ్చులో చిక్కకుండా చూస్తుంది.

డౌన్‌లోడ్: https://goo.gl/FMGhrX

పాస్‌వర్డ్‌లకు ప్రత్యేక లాకర్ అవాస్ట్

యూజర్లు సులువుగా వాడుకునేలా కొత్త ఇంటర్‌ఫేస్‌తో ముందుకొచ్చింది. వాడుతున్న పాస్‌వర్డ్‌లను మర్చిపోకుండా సురక్షితంగా 'అవాస్ట్ పాస్‌వర్డ్స్' లాకర్‌లోనే భద్రం చేసుకునే వీలుంది. గేమింగ్ ప్రియులైతే ఆడుతున్నప్పుడు ఇతర అప్లికేషన్ల నుంచి ఎలాంటి నోటిఫికేషన్లు, పాప్‌అప్‌లు రాకుండా పీసీని పూర్తిస్థాయిలో గేమింగ్‌కి వాడుకునేలా చేస్తుంది. అప్లికేషన్ల పనితీరుని కంట కనిపెడుతూ దాడికి ముందే అప్రమత్తం చేస్తుంది. అనుమానాస్పద ఫైల్స్‌ని క్లౌడ్ సర్వర్‌కి పంపి విశ్లేషిస్తుంది. 'వై-ఫై ఇన్‌స్పెక్టర్'తో ఇంట్లో రౌటర్‌ని మోరాయించకుండా చూడొచ్చు.

డౌన్‌లోడ్: https://goo.gl/k9PBby

ఆధునికంగా అడ్డుకట్ట సోఫోస్ హోం

సంప్రదాయ యాంటీవైరస్‌లను కాకుండా కొత్తగా ప్రయత్నిద్దాం అనుకునేవారికి ప్రత్యేకం. ఇన్‌స్టాల్ చేయగానే సిస్టంని క్షుణ్ణంగా పరిశీలించి మాల్వేర్ మాయల్ని చెబుతుంది. 'బిజినెస్ క్లాస్'వారికి తీర్చిదిద్దినా... 'హోం యూజర్లు' వాడుకునేందుకు ఉపయుక్తం. రాన్‌సమ్‌వేర్ లాంటి ప్రమాదకర వైరస్‌లను ఆధునిక టెక్నాలజీ వలతో అడ్డుకుంటుంది. డేటాని ఎన్‌క్రిప్ట్ కాకుండా ముందే సురక్షితం చేస్తుంది.

డౌన్‌లోడ్: https://goo.gl/8FktC

కొత్త ఏడాదిలో రూపం మారింది అవిరా

విండోస్ యూజర్లకు ప్రత్యేకమైంది. 'నెక్స్ట్ జనరేషన్ యాంటీవైరస్'గా కృత్రిమ మేధస్సు, క్లౌడ్ టెక్నాలజీలను వాడుకుని హోం యూజర్లను మాల్వేర్, రాన్‌సమ్‌వేర్, ట్రోజన్స్, స్పైవేర్‌ల వలలో పడకుండా చేస్తుంది. ఏదైనా ప్రమాదకరమైన ఫైల్‌గా గుర్తిస్తే వెంటనే 'అవిరా ప్రొటెక్షన్ క్లౌడ్'కి పంపి ప్రాసెస్ చేస్తుంది. హ్యాకర్ల ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే ఎలర్ట్ చేసి తొలగించేందుకు పూనుకుంటుంది.

డౌన్‌లోడ్: https://goo.gl/mRDfFk

ఫైర్‌వాల్ కూడా జోన్ అలార్మ్

ఇదో యాంటీస్పైవేర్. అంతేకాదు.. వాడుతున్న ఓఎస్‌కి సురక్షిత ఫైర్‌వాల్‌గానూ పని చేస్తుంది. సిస్టంకి అనుసంధానమైన ఏ నెట్‌వర్క్ నుంచీ హ్యాకర్లు పీసీలోకి ప్రవేశించకుండా బ్రేక్ చేస్తుంది. వైరస్‌లు, మాల్వేర్‌లను బ్లాక్ చేయడమే కాకుండా ముఖ్యమైన డేటాని ఆన్‌లైన్ బ్యాకప్ చేస్తుంది. ప్రత్యేక ఎన్‌క్రిప్షన్ కోడ్‌ని డేటాని సురక్షితం చేయవచ్చు.

డౌన్‌లోడ్: https://goo.gl/GEHdNf

వెబ్ విహారానికి ప్రత్యేకం పాండా సేఫ్ వెబ్

అవసరం ఏదైనా నెట్టింట్లోకి అడుగులేసేవారికి ఇది ప్రత్యేకం. వెబ్ విహారాన్ని జల్లెడపడుతూ బ్రౌజర్ల పనితీరుని మెరుగుపరుస్తుంది. వీక్షించే వెబ్‌సైట్‌ల్లో ఏవైనా మాలిషియస్ కంటెంట్‌తో కూడుకుని ఉంటే అప్రమత్తం చేస్తుంది. గూగుల్ క్రోమ్‌తో జతకట్టి 'సెర్చ్ రిజల్ట్'లను మానిటర్ చేస్తుంది. బ్రౌజింగ్‌లో వ్యక్తిగత వివరాల్ని హ్యాకర్ల చేతికి చిక్కకుండా చూస్తుంది. బ్రౌజర్లలో చేసిన మార్పులు, జత చేసిన యాడ్‌ఆన్స్, ప్లగిన్స్‌ని రివ్యూ చేసి రీస్టోర్ చేస్తుంది.

డౌన్‌లోడ్: https://goo.gl/yAJKnZ

ఓఎస్, ఆప్స్‌ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. 28 శాతం ఆండ్రాయిడ్ యూజర్లు ఫోన్ సాఫ్ట్‌వేర్‌లను అప్‌డేట్ చేయడం లేదట. అలా ఓఎస్, ఫోన్ తయారీ సంస్థల నుంచి వచ్చే అప్‌డేట్స్‌ని అశ్రద్ధ చేయడం వల్లే ప్రమాదాల బారిన పడుతున్నారనేది సెక్యూరిటీ నిపుణుల మాట. గత ఏడాది సైబర్ దాడులు అప్‌డేట్‌కానీ విండోస్ ఓఎస్ కంప్యూటర్లపైనే ఎక్కువగా జరిగాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఈనాడు సినిమా



మోసాలు... బాధలు... కన్నీళ్లు!

- శ్రీదేవి జీవితంపై రామ్‌గోపాల్ వర్మ కోణం

శ్రీదేవి అంటే ఓ అందాల తార. దివి నుంచి భువికి దిగొచ్చిన ఓ దేవకన్య. అయితే ఇదంతా నాణేనికి ఒకవైపే. మరోవైపు చూస్తే అతిలోక సుందరి జీవితంలో ఎన్నో ఆటుపోట్లు. అవన్నీ కూడా ఊహకందని ఓ అగాథాన్ని... ఓ కల్లోలాన్ని గుర్తు చేస్తాయి. అపురూపమైన ఆ సౌందర్యం వెనక శ్రీదేవి ఇంత వేదనని దాచుకొందా అనిపిస్తుంది. శ్రీదేవి అందాన్ని ఆరాధిస్తూ, ఆమెని కలవడం కోసమే దర్శకుడినయ్యానని చెప్పే ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ.. శ్రీదేవి అభిమానుల కోసం ఓ ప్రేమలేఖ రాశాడు. అందులో శ్రీదేవి జీవితాన్ని తన కోణంలో ఆవిష్కరించాడు. ఆ విషయాలు చిత్రసీమలో చర్చనీయాంశంగా మారాయి. "కొద్దిమంది పేర్లున్నాయి కాబట్టి ఇది బయట పెట్టడం సమంజసమేనా అని నాలో నేనే చర్చించుకొన్నా. కానీ శ్రీదేవి అభిమానులకి సంబంధించిన వారు కాబట్టి, అందరికంటే కూడా వాళ్లు నిజం తెలుసుకోవడానికి ఎక్కువ అర్హులు అనిపించింద"ంటూ ఆయన తన లేఖని ట్విట్టర్ ద్వారా బయట పెట్టారు. అందులో ఉన్న కొన్ని విషయాలివీ...

■ "లక్షలాదిమంది అభిమానుల్లాగే నేను కూడా శ్రీదేవి అందమైన, ఆకర్షణీయమైన మహిళ అని నమ్ముతా. దేశంలోని అతి పెద్ద సూపర్‌స్టార్‌గా 20 యేళ్లపాటు వెండితెరని శాసించింది. అయితే అదంతా ఓ భాగం మాత్రమే. శ్రీదేవి మరణంపై ఎంతగా దిగ్భ్రాంతికి గురయ్యానో... ఇప్పుడు మరొకసారి ఆమె జీవితం, మరణం వెనకున్న ఊహకందని, దారుణమైన, సున్నితమైన, అర్థం కాని పలు విషయాలు నా మదిలో మెదులుతున్నాయి".

■ "శ్రీదేవి మరణించాక ఆమె అందం గురించి, నటన గురించి, మృతి గురించి అందరూ చెప్పుకొంటున్న దానికంటే నేను మరిన్ని విషయాలు చెప్పడానికి ఆస్కారముంది. ఎందుకంటే ఆమెతో 'క్షణక్షణం', 'గోవిందా గోవిందా' చిత్రాల్ని తీసి సన్నిహితంగా మెలిగే అవకాశం నాకు లభించింది. ఒక తార జీవితాన్ని ప్రపంచం మొత్తం చూసే కోణానికి, వాస్తవానికీ ఎంత వ్యత్యాసం ఉంటుందనేదానికి శ్రీదేవి జీవితం ఓ గొప్ప ఉదాహరణ".

■ "చాలామందికి శ్రీదేవి జీవితం పరిపూర్ణమైనదిగా కనిపిస్తుంది. అందమైన ముఖారవిందం, గొప్ప ప్రతిభ, ఇద్దరు అందమైన కూతుళ్లతో... చూడ్డానికి ఒక స్థిరమైన కుటుంబం. వెలుపలి నుంచి చూస్తే చాలా ఆకర్షణీయంగా, అందరూ కోరుకొనేలాగా ఉంటుంది ఆ జీవితం. మరి శ్రీదేవి తన జీవితాన్ని సంతోషంగానే గడిపిందా? ఆమె సంతృప్తిగానే ఉండేదా? నేను ఆమెని కలిసినప్పట్నుంచి ఆమె జీవితం నాకు తెలుసు. నా కళ్లతో చూశాను... శ్రీదేవి తండ్రి మరణించేంత వరకు ఆమె జీవితం ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షిలా గడిచింది. ఆ తర్వాత ఆమె తల్లి అతి సంరక్షణతో పంజరంలో చిక్కుకున్న పక్షిలా మారిపోయింది".

■ "ఆ రోజుల్లో పారితోషికంగా నటులకి నల్లధనం ఎక్కువగా ఇచ్చేవాళ్లు. దాంతో పన్నుల గురించి దాడులు చేస్తారేమో అనే భయంతో శ్రీదేవి తండ్రి తన స్నేహితుల్ని, బంధువుల్ని నమ్మి వాళ్లకి ఇవ్వగా.. ఆయన చనిపోయేసరికి వాళ్లంతా కూడా మోసం చేశారు. దాంతో అమాయకురాలైన తల్లితో కలిసి శ్రీదేవి వివాదాల్లో ఉన్న స్థిరాస్తులపై పెట్టుబడులు పెట్టడంతో పాటు, ఇతరత్రా పొరపాట్లు చేసింది. దాంతో బోనీ కపూర్ తన జీవితంలోకి వచ్చేసరికి శ్రీదేవి చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి. అతను కూడా అప్పటికి అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాడు".

■ "శ్రీదేవి తన చుట్టూ మానసిక పరమైన ఒక గోడని నిర్మించుకొంది. తన జీవితంలో ఏం జరుగుతోందో, తన అభద్రతాభావాలేమిటో ఎవరికైనా తెలుస్తాయేమో అని భయపడింది. అది ఆమె తప్పు కాదు. చిన్న వయసులోనే ఆమెకొచ్చిన కీర్తి అలాంటిది. అది స్వతంత్రంగా, తాను కోరుకొన్నట్టుగా ఉండే అవకాశం ఇవ్వలేదు. తన స్వీయ జీవితాన్ని దాచడానికి మానసిక పరమైన మేకప్ వేసుకోవల్సి వచ్చింది".

■ "అదే సమయంలో అమెరికాలో జరిగిన తప్పుడు శస్త్రచికిత్స వల్ల శ్రీదేవి తల్లి మానసిక రోగి అయ్యింది. అలాగే చెల్లెలు శ్రీలత పొరుగింటికి చెందిన అబ్బాయితో కలిసి పారిపోయి వివాహం చేసుకొంది. తల్లి చనిపోయే ముందు ఆస్తులన్నింటినీ శ్రీదేవి పేరుమీదే పెట్టింది కానీ, ఆ తర్వాత ఆమె సోదరి 'తన తల్లి మానసిక స్థితి సరిగా లేదని, అందుకే అలా విల్లు రాసింద'ని కేసు వేసింది. దాంతో ప్రపంచంలోని లక్షలాది మంది కోరుకొన్న మహిళ ఒంటరిగా, బోనీ కపూర్ తప్ప చేతిలో చిల్లిగవ్వ లేకుండా నిలుచుంది".



■ "తన కుటుంబాన్ని చీల్చడానికి వచ్చిన వ్యక్తిగా భావిస్తూ బోనీకపూర్ తల్లి ఒక ఫైవ్‌స్టార్ హోటల్ లాబీలో అందరూ చూస్తుండగానే శ్రీదేవి కడుపుపై గుద్దింది. అదంతా ఆమె బోనీకపూర్ తొలి భార్య మోనా కోసమే చేసింది".

■ "ఈ మొత్తం కాలంలో 'ఇంగ్లిష్ వింగ్లిష్' సినిమా చేస్తున్న సమయంలో కొంత కాలాన్ని మినహాయిస్తే మిగతా అంతా కూడా దుఃఖంతోనే గడిపిన ఓ మహిళ శ్రీదేవి. ఆమె వ్యక్తిగత జీవితం... వికారమైన మలుపులు, అనిశ్చితి, ఊహకందని భవిష్యత్తుతో గడిచింది. ఆ జీవితం ఒక సూపర్‌స్టార్ సున్నితమైన మనసుపై లోతైన మచ్చల్ని వేయడంతో పాటు, ప్రశాంతతని దూరం చేసింది".

■ "చాలామందికి శ్రీదేవి ఒక అందమైన మహిళ. మరి ఆమె తనని తాను అందంగా ఉన్నాననుకొందా అంటే అనుకుంది. అయితే నటీమణులందరికీ వయసు ఓ పీడకల. అది శ్రీదేవికి కూడా మినహాయింపు కాదు. దాంతో కొన్నేళ్లుగా ఆమె సౌందర్య శస్త్రచికిత్సల్ని ఆశ్రయిస్తూ వచ్చింది. ఆ ప్రభావం ఆమెపై స్పష్టంగా కనిపించేది".

■ "తల్లిదండ్రులు, బంధువులు, భర్తతో పాటు పిల్లలకి సంబంధించిన ఉద్దేశాలన్నీ కూడా శ్రీదేవి జీవితాన్ని ప్రభావితం చేశాయి. ఇతర తారల పిల్లల్లాగే తన పిల్లలకి కూడా ఆదరణ దక్కుతుందో లేదో అని భయపడింది శ్రీదేవి. నిజానికి ఆమె ఒక మహిళ శరీరంలో చిక్కుకున్న చిన్నారి అని చెప్పొచ్చు".

■ "ఆమెతో ఉన్న నా వ్యక్తిగత అనుభవం కొద్దీ చెబుతున్నా. కెమెరా ముందు యాక్షన్, కట్‌కి మధ్య మాత్రమే ఆమెని ప్రశాంతంగా చూశాను. ఆ సమయంలోనే ఆమె కఠినమైన తన వాస్తవ జీవితం నుంచి బయటికొచ్చి సొంత కాల్పనిక ప్రపంచంలోకి వెళ్లిపోయేది".

ఆమె ఆత్మకు శాంతి చేకూరనివ్వండి

అందాల తార శ్రీదేవి మరణాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ అభిమానుల్లో ఆమెను చూస్తూ పెరిగిన సినీ తారలు ఎందరో ఉన్నారు. ఆమె లేరన్న విషయాన్ని తట్టుకోలేకపోతున్నవాళ్లు.. ఆమె మరణంపై మీడియాలో వచ్చిన కథనాలు చూసి బాధకు గురయ్యారు. సామాజిక వేదికల్లో వాళ్ల బాధను పంచుకొన్నారు.

● "సీరియస్‌గా అంటున్నా... ఊహాగానాల్ని, పుకార్లను ఆపండి"
- కాజల్

● 'మరణాన్ని అవమానించకండి...ఆమె ఆత్మకు శాంతి చేకూరనివ్వండి"
- మెహరీన్

● "మరణాన్ని హేళన చేయకండి. ఇది వదంతులు రాసే సమయం కాదు"
- ప్రణీత

● "మీడియా, సోషల్ ప్లాట్‌ఫాం కంటెంట్ ప్రొవైడర్లకు విన్నపం. తప్పుడు వార్తలు ప్రచారం జరుగుతున్నాయి. ఓ వ్యక్తి మరణాన్ని గౌరవించమని కోరుతున్నాను"
- అల్లు అర్జున్

● "ఇతర నటులతో పోల్చలేని గొప్ప నటి శ్రీదేవి. ఆమెను దేవతలా ఆరాధించారు అభిమానులు. ఆ జ్ఞాపకాలను తుడిచేయకండి"
- రానా

● వీళ్లే కాదు తాప్సి, రకుల్ ప్రీత్ సింగ్, నాని, మధుశాలిని, సుధీర్‌బాబు ఇలా పలువురు టాలీవుడ్ తారలు 'తప్పుడు వార్తలు ప్రచారం చేయొద్దు. ఆమె ఆత్మకు శాంతి చేకూరనివ్వండి' అంటూ వేడుకొన్నారు.

● "శ్రీదేవి కళ్లు మాటలకు అందని భావాల్ని పలుకుతుంటాయి. ఆమె నవ్వులో నవ్వును మించింది ఏదో ఉంది. తారగా ఆమె ఎదిగిన క్రమం అందరికీ స్ఫూర్తిదాయకం. ఆ అందరిలో నేనూ ఉన్నాను. వ్యక్తిగతంగా ఆమెను కలవలేకపోయాననేది నాకు చెప్పలేనంత బాధ. నా కోరిక కలగానే మిగిలిపోయింది"
- కీర్తి సురేష్



'ఆఫీసర్' వస్తున్నాడు

నాగార్జున కథానాయకుడిగా కంపెనీ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. రామ్‌గోపాల్ వర్మ దర్శక నిర్మాత. ఈ చిత్రానికి 'ఆఫీసర్' అనే పేరు ఖరారు చేశారు. మంగళవారం టైటిల్ లోగోతో పాటు ఫస్ట్‌లుక్‌నీ విడుదల చేశారు. మే 25న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. నాగార్జున పోలీస్ అధికారిగా నటిస్తున్న చిత్రమిది. ఆయన ఈ చిత్రంలో చాలా స్టైలిష్‌గా కనిపిస్తారని, పోరాటాలు సహజంగా ఉంటాయని చిత్రబృందం చెబుతోంది. బాలీవుడ్ ఫైట్ మాస్టర్లు కంపోజ్ చేసిన ఓ పోరాట ఘట్టం.. విస్మయపరుస్తుందని సమాచారం. నాగ్ - వర్మల కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో చిత్రమిది. 'శివ', 'అంతం', 'గోవిందా గోవిందా' వీరి కలయికలో రూపుదిద్దుకున్నాయి.

పెళ్లికి ముహూర్తం



కథానాయిక శ్రియకి పెళ్లి కుదిరింది. వచ్చే నెలలోనే ఆమె పెళ్లి పీటలెక్కబోతోంది. రష్యాకి చెందిన క్రీడాకారుడు, వ్యాపారవేత్త అయిన ఆండ్రీ కొశీవ్‌ని ఆమె మనువాడబోతోంది. ఉదయ్‌పూర్‌లో మార్చి 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల వేడుకగా వీరి పెళ్లి జరగబోతోందని తెలిసింది. తెలుగులో ఉషాకిరణ్ మూవీస్ నిర్మించిన 'ఇష్టం'తో ప్రయాణం మొదలుపెట్టిన శ్రియ తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ చిత్రాలతో పాటు ఆంగ్లంలోనూ నటించి పేరు తెచ్చుకొన్నారు. కొశీవ్‌కీ, శ్రియకీ మధ్య ఎప్పట్నుంచో స్నేహం కొనసాగుతోంది. ఆ బంధం పెళ్లికి దారితీసినట్టు తెలుస్తోంది.



'నర్తనశాల'లో నాగశౌర్య

'ఛలో'తో ఓ మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు నాగశౌర్య. తను నటించిన 'కణం', 'అమ్మమ్మగారి ఇల్లు' త్వరలో విడుదల కానున్నాయి. ఈలోగా మరో కొత్త సినిమాని పట్టాలెక్కించే పనిలో ఉన్నాడు. నాగశౌర్య కథానాయకుడిగా 'ఎట్ ది రేట్ ఆఫ్ నర్తనశాల' అనే చిత్రం తెరకెక్కబోతోంది. చక్రవర్తి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శౌర్య సొంత నిర్మాణ సంస్థ ఐరా క్రియేషన్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుంది. ఉషా ముల్పూరి నిర్మాత. మార్చిలో ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఏప్రిల్ 1 నుంచి చిత్రీకరణ మొదలవుతుంది. ప్రస్తుతం ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. ఇదో పూర్తి వినోదాత్మక చిత్రమని, ఓ ప్రేమకథ కూడా మిళితమై ఉంటుందని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఏ మతం చెప్పింది మరో మతాన్ని చంపమని. ఏ మత ప్రవక్త చెప్పాడు మరో మతాన్ని నాశనం చేయమని.

చిత్రం: పుణ్యభూమి నా దేశం
- పంపినవారు:
డి. రఘుప్రతాప్ రెడ్డి,
కొవ్వూరు

పంచ్ డైలాగ్

ఇంద్రపురి రాకుమారికి...



"శ్రీదేవికి..."

ఏంటి... ఎప్పుడూ లేనిది పిలుపు ఇంత చప్పగా, మామూలుగా ఉంది? అనుకుంటున్నావా..

ఇది వర్మకైతే 'మా అతిలోక సుందరికి' అని రాసేవాళ్లం.

'మా సిరిమల్లె పువ్వుకి' అంటూ మొదలెట్టేవాళ్లం.

నీ అందానికి సరితూగే ఉపమానాలు ఎక్కడున్నా వెదికి... బతిమాలి, బుజ్జగించి నీ పేరు పక్కన తగిలించేవాళ్లం. నిజం చెప్పాలంటే... వాటికీ నీ పక్కన ఒదిగిపోవడం మహా ఇష్టమనుకో!

కానీ ఇప్పుడు ఏమని రాయాలి... ఎక్కడి నుంచి మొదలెట్టాలి..?

మా గుండెల్ని పిండి చేసి - ఏం ఎరగనట్టు రెక్కలు విప్పుకుని స్వర్గలోకానికి ఎగిరిపోయావ్..

అమృతం తాగే వంకతో మమ్మల్ని కన్నీటి సుడుల్లోకి నెట్టేసి మాయమయ్యావ్..

అందుకే నీ మీద కోపం వచ్చింది!

సరేలే.. ఎలాగున్నావ్.. బాధ్యతల బంధనాలు తెంపుకుని, పంజరంలోంచి ఎగిరిపోయిన చిలకలా ఇంద్రలోకంలోనో... చంద్రలోకంలోనో... ఏ మేఘాల కొమ్మల్లోనో, మెరుపుల మాలల మధ్యనో క్షేమంగానే ఉండి ఉంటావ్.

హంసలతో ఆడుకుంటున్నప్పుడో, పారిజాత పుష్పాలతో మాల కడుతున్నప్పుడో కాస్త కిందకి కూడా చూసుంటే శ్రీదేవీ... నువ్వు లేక వెలవెలబోతున్న మేమంతా కనిపిస్తాం.

నిజం... మేం మాత్రం బాలేం శ్రీదేవీ..!

అయినా ఎలా బాగుంటాం..?

మొన్న ఆదివారం పొద్దున్నే ఓసారి మా గుండె ఆగి... మళ్లీ కొట్టుకుంది - నువ్వు లేవని తెలిసి!

కాసేపేం అర్థం కాలేదు. నువ్వు లేకుండా ఉషోదయాలు అవుతాయా? నువ్వు లేవని తెలిసి కూడా పూలు పూస్తాయా? నువ్వు లేకపోయినా.. ఈ భూమి గుండ్రంగానే తిరుగుతుందా? ప్రపంచం అంతా ఎప్పటిలానే మామూలుగానే ఉందే! అందుకే నిద్దట్లో వచ్చిన పీడ కల అనుకున్నాం. కలలు అబద్ధాలేమో గానీ, కన్నీళ్లు కావుగా. అవి చెంపల మీద నుంచి వెచ్చగా జారుతూ 'నిజమే' అన్నాయి. అరె.. నీ వయసెంతని.. నువ్వు చూసిన జీవితం ఎంతని?? 'ఇంకా ఉండాలి కదా..'.

మొన్నే 'మామ్'లో ఎంత ముద్దుగా కనిపించావ్.. 'ఇంత వయసొచ్చినా ఆ అందం చెక్కుచెదరలేదని' ఎంత సంబరపడ్డామో. మా దిష్టిగానీ గట్టిగా తగిలేసిందా..? అయినా నీ గుండె ఆగిపోవడం ఏమిటి శ్రీదేవీ...! దానికి తెలీదా... అది శ్రీదేవి గుండె అని. దాని కోసం ఎన్నో కోట్ల హృదయాలు అనుక్షణం కొట్టుకుంటాయని. ఇంత అందాన్ని ఇచ్చి, ఇంతమంది అభిమాన బలాన్ని ఇచ్చి, నీ గుండెని అంత బలహీనంగా తీర్చిదిద్దిన దేవుడికే నిజంగా గుండె లేదు. ఆ క్షణంలో నీ సినిమాలూ, అందులో నీ నవ్వులు, నీ అమాయకత్వాలు, అలకలు, చిరు కోపాలు... అన్నీ కట్టకట్టుకుని గుర్తొచ్చాయి. జ్ఞాపకాలు ఇంత భారంగా ఉంటాయని తొలిసారి అర్థమైంది.

ఇంతలోనే ఇంకో షాక్. 'బాత్ రూమ్ టబ్‌లో మునిగిపోయావని.. అందుకే ప్రాణాలొదిలేశావ'న్న మాటలు వినిపించాయి.

అవి మమ్మల్ని మరింతగా మెలిపెట్టేశాయి. రెక్కలు విప్పుకుని మేఘాలకు ఎగిరిన దానివి. స్వర్గం నుంచి హిమాలయాలకు, అటు నుంచి స్వర్గానికీ క్షణాల్లో ప్రయాణం చేసిన దానివి. నిన్ను ఆ కాసిన్ని నీళ్లు ముంచేస్తాయా? స్నానాల గదికీ, అందులోని నీటికీ, నీ చుట్టూ ఉన్న నాలుగ్గోడలకూ నీ విలువ తెలియకుండా పోయిందేంటి అని ఎంత బాధపడ్డామో. ఆ నీటిలో నీ ఊపిరి కలిసిపోతున్నప్పుడు నీవెంత నరకం అనుభవించావో తెలీదు గానీ.. మా ప్రాణాలు మాత్రం సెకనుకోసారి విలవిలలాడిపోయాయి.

ఈ విషాదంలో ఉండగానే... 'శ్రీదేవి మద్యం తీసుకుంది' అన్నారు! 'వసంత కోకిల'లో అమాయకమైన నీ మోము గుర్తు తెచ్చుకుంటే చాలు.. ఇప్పటికీ నువ్వు పాలు తాగే పసి పాపాయివే అనిపిస్తుంది. 'పదహారేళ్ల వయసు'లో ఉయ్యాల ఊగుతున్న సన్నివేశాలు కదలాడాయి. నువ్వు మాకింకా పసిదానివే కదా! అలాంటిది నీ ఒంట్లో ఆల్కహాల్ ఉండడం ఏమిటి? నీ చూపు మత్తు.. నీ మాట మత్తు. నీ నవ్వు మత్తు. నీకు మరో మత్తు అవసరమా.. అది అబద్ధమని, నిజమైనా సరే.. మేం నమ్మమని నీకు తెలుసు!

అక్కడ్నుంచి ఎన్ని డ్రామాలు నడిచాయో నీకు తెలుసా శ్రీదేవీ..? నీ గుండె ఒక్కసారే ఆగిపోయింది. కానీ నీ గురించి మాట్లాడిన ప్రతీసారీ మా గుండె ఆగుతూనే ఉంది. నీ జ్ఞాపకాలతో మేల్కొని మళ్లీ మోగుతూనే ఉంది.

అందం కోసం తాపత్రయపడ్డావా... అందమే నీ ఒంటిని తాకాలని తెగ ముచ్చట పడుతుంది కదా?

ఆస్తుల కోసం గొడవలు పడ్డావా... మా అభిమాన ధనం ముందు అదెంత..?

ఒంటరితనం అనుభవించావా... మేమంతా లేమూ..!

దేవకన్యలా ముస్తాబైన నీ రూపం చూసిన కళ్లకు.. తెల్లని వస్త్రంలో నిన్ను చుట్టేసిన దృశ్యం కనిపించదు! మెరుస్తున్న ఆ కళ్లు.. నిర్జీవంగా మారిపోవడం చూడలేం. వెండి తెరనే వెలిగించిన ఆ తేజం అచేతనంగా కనిపించడం భరించలేం!

నువ్వు లేని ఈ నాలుగు రోజులూ.. క్షణానికో నరకం చూశాం.. నిమిషానికో శిక్ష అనుభవించాం..

ఇక చాలు... ఈ మాటలు చాలు, మాయలు చాలు, ఉబికి వస్తున్న కన్నీళ్లు చాలు! ఎవరేం అనుకున్నా సరే. మాకు మాత్రం..

శ్రీదేవి అంటే అందం..

శ్రీదేవి అంటే అమాయకత్వం..

శ్రీదేవి అంటే ముగ్ధమనోహర రూపం..!

నువ్వెప్పుడూ మృతజీవివి కావు.. మా అతిలోక సుందరివే.

మాకు తెలిసింది ఇదే. మాలో నీకు నచ్చేదీ అదే. ఎప్పుడూ ఇలాంటి అందమైన కలల్లోనే ఉంటాం. అందులోనే బతికేస్తాం!

మాకు తెలుసు.. నువ్వు స్వర్గలోకం నుంచి భూమ్మీదకు విహారానికొచ్చిన దేవకన్యవని! యాభై నాలుగేళ్ల పాటు మామూలు మనిషిలా మా చుట్టూ తిరిగావ్.. మమ్మల్ని నవ్వించావ్, కవ్వించావ్..! నువ్వొచ్చిన పని అయిపోయిందని వెళ్లిపోయావ్. కాకపోతే కాస్త తొందరపడ్డావంతే. కానీ ఇవేం మనసులో పెట్టుకోక.. మళ్లీ ఎప్పుడైనా రావాలనిపిస్తే క్షణం మాత్రం ఆలస్యం చేయకుండా, కనీసం ఇంద్రుడికి కూడా చెప్పకుండా కిందకి దిగిపో. నీ అడుగులు తన వీపుపై ఎప్పుడు పడతాయా అని భూదేవి వేయికళ్లతో ఎదురుచూస్తుంటుంది. నీ బొమ్మ తనపై ముద్రించుకోవడానికి వెండి తెర.. థియేటర్ గుమ్మం ముందే కాపు కాచుకుని కూర్చుంది. నీపై వాలి వెలిగిపోవాలని 'లైట్లన్నీ' ఆరాటపడుతున్నాయి. నీ గురించి కొత్త కథలు ఒలికించాలని కలాలు ముచ్చటపడుతున్నాయి. ఎప్పట్లా నిన్ను దాచుకోవాలని కోట్ల గుండెలు.. తపస్సు చేస్తున్నాయి.

వస్తావ్‌లే.. ఎందుకంటే నువ్వు ఎప్పటికీ మా శ్రీదేవివే!!

ఇట్లు

నీ కోసం అనుక్షణం పరితపిస్తున్న నీ అభిమానులు!

వసుంధర వంటల పోటీ!



మీరు చక్కగా వంట చేయగలుగుతారా? నోరూరించే పదార్థాలను చకచకా చేయడంలో సమర్థులా... అయితే రానున్న మహిళా దినోత్సవం సందర్భంగా **'ఈనాడు - వసుంధర'** మీకు ఆహ్వానం పలుకుతోంది. తక్కువ నూనె, ఉప్పు వాడుతూ నోరూరించే పదార్థాలు మాకు చేసి పంపండి. చిరుతిళ్లు, అల్పాహారాలు, కూరలూ, జంక్‌ఫుడ్.. ఇలా ఏవయినా సరే మాకు పంపొచ్చు. మీరు చేయాల్సిందల్లా.. వంటను చేసి వీడియో తీసి, మాకు వాట్సాప్ చేయడం, ఆ పదార్థాల వివరాలను తెలియజేయడం. మీ వంటల వీడియోలను పంపించాల్సిన చివరితేదీ.. 04.3.2018. ఇక, వీడియోలు పంపించాల్సిన వాట్సాప్ నంబరు 9121167517.

ఎలా పంపాలంటే..

- ❑ మీ పేరు, ఫొటో, ఊరు వివరాలు.
- ❑ వంటకం పేరు.. ❑ పదార్థం వీడియో!

మొదటి ఐదుగురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ఇంకెందుకాలస్యం! ప్రయత్నించండి మరి.

పాదాల పగుళ్లకు తేనె

అప్పుడప్పుడూ పెడిక్యూర్ చేయించుకోవడమే కాదు... పాదాల సంరక్షణ విషయంలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అదెలాగంటే...

వేప: గుప్పెడు వేపాకుల్ని కడిగి ముద్ద చేయాలి. దీనికి చిటికెడు పసుపూ, చెంచా తేనె కలిపి పాదాలకు రాసుకోవాలి. ఆరాక గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

నిమ్మ, గుడ్డు: ఓ గిన్నెలో గుడ్డుసొనను తీసుకోవాలి. దీనిలో చెంచా చొప్పున నిమ్మరసం, బియ్యప్పిండి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పగిలిన పాదాలకు బాగా పట్టించి ఇరవై నిమిషాల తరువాత చల్లటి నీటితో కడిగేయాలి.

తేనె, చక్కెరతో... తేనె, చక్కెరను సమపాళ్లలో తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాలి పగుళ్లకు పూయాలి. కాలికి కావాల్సిన తేమను తేనె అందిస్తే, చక్కెర పాదాలపై పేరుకున్న మృతకణాలను తొలగిస్తుంది.



పట్టుచీరలు, బాసికాలూ, పూలదండలూ, జీలకర్రాబెల్లం, సన్నికల్లూ, గరికముంతలు... పెళ్లి వేడుకలో ఉపయోగించే వస్తువుల జాబితా చాలానే. వాటిని బజారు నుంచి కొని తెచ్చుకోవడం సులువే. కానీ వాటికీ ఓ ప్రత్యేకత కనిపించాలంటే.. ఆకట్టుకునేలా, అందంగా, వైవిధ్యంగా ఉన్నవి ఎంచుకోవాలి. లేదా తయారు చేసుకోవడం తెలిసుండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే వాటికీ డిజైనర్‌లుక్ తేవాలి. అదెలాగో వివరిస్తున్నారు పెళ్లిపూల జడ నిర్వాహకురాలు కల్పనా రాజేష్.







పెళ్లికళలో... ఎన్ని కొత్త కళలో!

నిశ్చయతాంబూలాలతో మొదలయ్యే వేడుకలో పెళ్లికూతురుకు తెచ్చే సారెతోనే మొదలవుతోంది ఈ ట్రెండ్. ఆడ, మగపెళ్లి వారి వైపునుంచి జరిగే తంతులను చూపించే విధంగా బొమ్మలూ, పండ్లూ, పూలు పెట్టే ట్రేలు ధగధగలాడే వస్త్రాలూ, చమ్కీలూ, కుందన్లతో మెరిసిపోయేలా ఎంచుకోవచ్చు. లేదా తాటాకు బుట్టలతోనూ సంప్రదాయ లుక్‌ని తేవచ్చు.

■ మంగళస్నానాల వేళ ఉపయోగించే నీళ్ల బిందెలూ, జల్లెడలూ ఆ వేడుకకే కొత్తందాన్ని తెచ్చిపెడుతున్నాయి. పసుపు దంచడానికి ఉపయోగించే రాతిరోలూ, రోకలికి కుందన్లూ, పూలూ, బంగారు, వెండి రంగుల్లో నెట్ వస్త్రంతో చేసిన అలంకరణలూ వారెవ్వా అనిపిస్తున్నాయి. మెహెందీ, మంగళస్నానం





వంటి సందర్భాల్లో వధువు వేసుకునేందుకు పూల నగలూ, జడల డిజైన్లు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇటు సంప్రదాయాన్నీ, అటు పాశ్చాత్య శైలినీ మేళవించి కనువిందుచేసే పూల జడలు వధువుకి కొత్తందం తెచ్చిపెడతాయి. పైగా వీటిని వధూవరుల దుస్తులూ, మండపం అలంకరణకి నప్పేలా తయారు చేస్తున్నారు.

■ వధువుతో పాటే చక్కగా ముస్తాబైపోతుంది కొబ్బరిబొండాం. వాటిపైపేర్లూ, రాధాకృష్ణుల బొమ్మలూ, వివాహఘట్టాలను పెయింట్ చేయడమే కాదు కుందన్లూ, రాళ్లూ, స్థాయిని బట్టి నవరత్నాలనూ వీటికి అలంకరిస్తున్నారు.

■ పెళ్లిళ్లలో గరికముంత ప్రత్యేకతే వేరు.... సున్నంతో డిజైను చేయడం పాతమాట. ఇప్పుడు వాటికి కాంతిమంతమైన రంగులేసి కుందన్లూ, అద్దాలు అద్ది అందంగా మార్చేస్తున్నారు.

■ తలంబ్రాల వేడుకలో వాడే కొబ్బరిచిప్పలకూ కుందన్లు జతచేస్తున్నారు.

■ ఇవనే కాదు.. తలంబ్రాలూ ముత్యాల్లా కనిపించేందుకు నవరత్నాలను పోలిన పూసల్ని వాడటం కూడా ఇప్పుడు నయాశైలి.



■ పెళ్లివేడుక మొదలైందని సూచించేలా నుదిటిన కట్టే బాసికం మాత్రం సాదాసీదాగా ఎందుకుండాలి... అందుకే వాటినీ కుందన్లూ, రాళ్లూ పొదిగి ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నారు. కాస్త తాహతు ఉన్నవారైతే వాటికి బంగారం, వజ్రాలనూ ఉపయోగిస్తున్నారు. ఎంతైనా పెళ్లి అపురూపఘట్టం కదా!

■ వధువు మేనమామలు పెళ్లికూతుర్ని బుట్టలో పెట్టి మండపానికి తెస్తారు కదా! ఆ వేడుకకోసం పట్టూ, వెల్వెట్, బెనారస్, వంటి వస్త్రాలూ, జరీ అంచులూ ఉపయోగించే కలువ పువ్వు లాంటి బుట్ట



కళ్లు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఇక వరుడిని కాశీకి పంపే ఘట్టంలోని గొడుగు మల్లెపూలతో అల్లేస్తున్నారు. వీటికి అదనంగా వేలాడే పూల తీగలూ, పూసలూ వావ్ అనిపిస్తున్నాయి.

■ పెళ్లిలో వధూవరుల దుస్తులకు నప్పేట్లుగా పూల రేకలతో తయారు చేసిన దండల ప్రత్యేకతే వేరు. కేవలం అక్కడే కాదు దేవుడి పటాలకు వేసే దండల తయారీలోనూ గులాబీలూ, మల్లెలూ, లిల్లీలూ, ఆర్కిడ్‌లు వంటివాటితో పాటు విదేశీ పూలనూ వాడేస్తున్నారు. వాటితో పాటు కర్పూర దండలూ, యాలకుల దండలూ కూడా హంగులు అద్దుకుంటున్నాయి.

■ కాబోయే నవదంపతుల దోబూచులాటకు అడ్డుతెర అదనపు హంగుని తెచ్చిపెడుతుంది. కొత్తదుప్పటిని వాడే స్థాయి నుంచి పట్టు వస్త్రాలపై వధూవరుల చిత్రాలూ, సీతారాముల పెళ్లి సంబరాలూ, మల్లెపూలూ, ఆర్కిడ్లూ, గులాబీలూ, లిల్లీలతో అల్లేసిన అడ్డుతెరలే ఇప్పుడు ప్రత్యేకం. జీలకర్రా, బెల్లాన్ని మాత్రం అలా వదిలిపెడితే ఏం బాగుంటుంది. వాటిమీద కాస్త చమ్కీలు చల్లి, ముత్యాలు అద్ది అదరగొట్టేస్తున్నారు. అక్షతల్లో ముత్యాలూ నవరత్నాలనూ కలిపేస్తున్నారు.

■ కన్యాదానం చేసే వెండి పళ్లెం, నీళ్లుపోసే వెండి చెంబులకూ నూలు దారప్పోగులే కాదు ముత్యాలూ, పచ్చలూ, కుందన్లు వంటివాటితోపాటు రంగు రంగుల పట్టుదారాలనూ వాడేస్తున్నారు.

■ పెళ్లిఘట్టంలో చివరి అంకం సన్నికల్లు తొక్కడం... దీన్ని కూడా జరీనెట్, పచ్చలూ, ముత్యాలను పోలి ఉండే కుచ్చులతో అందంగా అలంకరిస్తున్నారు. అంతాబాగానే ఉందికానీ ఇవన్నీ మాకెక్కడ దొరుకుతాయి అంటారా? కాస్తదృష్టీ, సమయం పెడితే సొంతంగానే తయారు చేసుకోవచ్చు. అందుకోసం వాటిని నేర్పించేందుకు ప్రత్యేకంగా యూట్యూబ్‌లో ఛానళ్లు కూడా ఉన్నాయి. అలానే బ్రైడ్స్ ఎసెన్షియల్, పెళ్లిపూలజడా, వెడ్‌సాగా వంటి బ్లాగులూ మీకు మరిన్ని వివరాలు అందిస్తున్నాయి.

– స్వాతి కొరపాటి

ఒక్కగానొక్క అమ్మాయి కాబట్టి బాగా చదివిస్తే చాలనుకున్నారు ఆ తల్లిదండ్రులు. కానీ ఆమె చదువుతోపాటూ చిరుతలా పరుగులు తీసి... అరుదైన అవకాశాన్ని కొట్టేసింది. ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు ఇచ్చే శిక్షణకు అర్హత సాధించింది. అదీ రెండు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక అమ్మాయి. ఇంతా చేస్తే ఆమె చదివేది పదో తరగతే. పేరు దొంతు భాగ్యలక్ష్మి.



పరుగు పెట్టేసింది అవకాశం కొట్టేసింది

భాగ్యలక్ష్మిది నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రం. తల్లి పుల్లమ్మ, తండ్రి మల్లయ్యకు ఒక్కగానొక్క కూతురు. మూడో తరగతి వరకు అచ్చంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాల్లో చదువుకుని ఆ తరువాత హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపికైంది. అక్కడ చదువుతో పాటు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పరుగు పందెం పోటీల్లో పాల్గొంటూ పతకాలు తెచ్చుకునేది. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. ఆమె సాధించిన పతకాలే ఆమెకు అర్హత తెచ్చి పెట్టాయి. ఒలింపిక్స్‌లో అర్హత సాధించాలనుకునే క్రీడాకారులకు ఇంగ్లండ్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. పరుగుల్లో ఎన్నో పతకాలు సాధించిన ఆమె.. ఆ అవకాశాన్ని అందుకొంది. దేశ వ్యాప్తంగా 24 మంది విద్యార్థులను దీనికి ఎంపిక చేస్తే అందులో ఉమ్మడి రాష్ట్రాల నుంచి భాగ్యలక్ష్మి ఉంది. ఈ నెల 22న దిల్లీలో టాటా టీ సంస్థ నిర్వహించిన 'ప్రీ యాక్ట్ టు మేక్ అవర్ చిల్డ్రన్ స్పోర్ట్స్ ఛాంపియన్ ఆఫ్ టుమారో' పేరుతో నిర్వహించిన 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. అలా ఈ అవకాశాన్ని కొట్టేసింది. భాగ్యలక్ష్మి తండ్రి చిన్న రైతు. ఉన్న మూడు ఎకరాల పొలాన్ని సాగుచేస్తూ ఖాళీ సమయంలో వ్యవసాయ కూలీ పనులకీ వెళతారు. పరుగు పందెంలో ఆమెకున్న ఆసక్తిని చూసి.. స్పోర్ట్సు స్కూల్ ప్రవేశ పరీక్ష రాయించారు. అలా హకీంపేటలోని స్పోర్ట్సు స్కూల్‌కు ఎంపికైంది. అక్కడే చదువుతోపాటు శిక్షణ తీసుకుంటోంది. అంతేకాదు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఎన్నో పతకాలు తెచ్చుకుంది. తెలంగాణతో పాటు కేరళా, తమిళనాడూ, జార్ఖండ్, గుజరాత్‌లలో నిర్వహించిన పోటీల్లో తన ప్రతిభను చాటింది. తాజాగా ముంబయిలో నిర్వహించిన 800, 1500 మీటర్ల పరుగు పందెంలో రెండు స్వర్ణ పతకాలు సాధించింది. 'ఇప్పటివరకూ ఎన్నో బంగారు, వెండిపతకాలను అందుకున్నా. ఇప్పుడు నా లక్ష్యం ఒలింపిక్స్. దానికోసం కష్టపడుతున్నా..' అంటోంది భాగ్యలక్ష్మి.



- జి. వెంకటేష్, ఈనాడు డిజిటల్ - నాగర్‌కర్నూల్

బంగారం వెండి

27న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,924	2,927
వెండి (గ్రా)	41.70	41.70



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,600	31,640	31,400	31,560	31,500	31,500	31,270	31,300	31,400	31,410
ఆర్నమెంట్	29,510	29,550	29,150	29,300	29,160	29,150	29,240	29,270	29,200	29,210
వెండి(కిలో)	39,625	39,740	39,700	40,000	39,800	39,900	39,000	39,200	39,900	39,900

నజరానా

దుస్తులపై పడిన మొండి మరకలను తొలగించాలంటే... ముందుగా పెట్రోల్‌తో రుద్ది... ఆ తరువాత డిటర్జెంట్‌తో ఉతికేస్తే సరి.

పక్కింటావిడే ఇలా చేస్తే!

? నా సమస్య చూడటానికి చిన్నగానే కనిపిస్తుంది. కానీ అది నాకొక మనోవేదనలా తయారైంది. సమస్యంతా మా పక్కింట్లో ఉండే ఒకావిడ వల్ల! నేను ఏం చేస్తున్నానో, ఏం తింటున్నానో, ఎటు వెళ్తున్నానో... అన్ని వివరాలు ఎప్పటికప్పుడు గమనించడమే తన పని. వాటిని పది మందికి పది రకాలుగా చెప్తుంటుంది. అనవసరంగా గొడవెందుకని ఇవన్నీ పట్టించు కోనట్లే ఉంటున్నాను. కానీ నేనేమీ అనకపోయేసరికి అందరూ తను చెప్పిన మాటలే నిజాలను కుంటారేమోనని భయంగా ఉంది. - ఓ సోదరి

✔ మీకున్నది నిజంగా చిన్న సమస్య కాదు. కానీ దానికి మీరిచ్చే ప్రాధాన్యం వల్లే అది చిన్నదా పెద్దదా అని నిశ్చయమవుతుంది. నిజానికి ఒక వ్యక్తిని దూషించడం ఏ విధంగానూ మంచిపద్ధతి కాదు. అన్ని విషయాలూ సరిగ్గా ఆలోచించే వాళ్లకు 'ఎదుటివారిని కించపరిస్తే ఏం వస్తుంది?' అనే ఆలోచన ఉంటుంది. అలా కాని పక్షంలోనే వేరే వాళ్ల గురించి ఏదో ఒక పుకారు పుట్టిస్తుంటారు. కానీ వాటివల్ల మీరు బాధ పడాల్సిన పనిలేదు. ఆవిడ పుట్టించిన పుకార్లకు స్పందించి మీరు ఆవిడను మందలిస్తే మీకున్న విలువ తగ్గించుకున్నట్లే అవుతుంది. అలా కాకుండా వీలైతే ఆమెకు సహాయం చెయ్యడానికీ, పలకరించడానికి ప్రయత్నించండి. అంటే మంచితనంతోనే మార్పు తీసుకురావాలన్న మాట. ఇక మీ చుట్టుపక్కలవాళ్లు మీ గురించి ఏమనుకుంటారోననీ, ఆవిడ మాటలు నమ్మేస్తారేమోననీ ఆలోచించడం మానేయండి. ఎందుకంటే మీరేంటో తెలిసిన వాళ్లు మీ గురించి తప్పుగా అనుకోరు. ఒకవేళ అలా అనిపించినా మిమ్మల్ని నేరుగా అడిగేస్తారు. ఇక మిమ్మల్ని కించ పర్చాలని చూసేవాళ్లూ ఉంటారు. ఈ రకం వ్యక్తులు మీ గురించి ఎవరేం చెప్పినా నమ్మేస్తారు. అలాంటి వారికి వారికి వివరణ ఇచ్చి సమయం వృథా చేసుకోకండి. మీరు మీలా ఉండండంతే.!

డియర్ వసుంధర



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

మీ ప్రశ్నలు ఇకపై **vasupsych@eenadu.net** కు పంపించగలరు.



ప్రతి సంస్థలోనూ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ స్కిల్స్‌కి ప్రాధాన్యం పెరిగింది. వీటికి ఉద్యోగావకాశాలూ ఎక్కువగా ఉన్నాయి. ఇంజినీరింగ్ తర్వాత కూడా విద్యార్థులు ఎంబీఏ చేయడానికి మొగ్గు చూపుతున్నారు. అలాగే సాధారణ డిగ్రీ చేసిన వారు ఐటీ ఉద్యోగాల పట్ల ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. అటు వ్యాపార నిర్వహణ నైపుణ్యాల్లో పట్టా పుచ్చుకోవాలనుకునే అభ్యర్థులకు, ఇటు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలోకి ప్రవేశించడానికి పీజీ చేయాలనుకునే వారికి తెలుగు రాష్ట్రాల్లో ఐసెట్ ఒక చక్కటి అవకాశం. ఈ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే ఎంబీఏ లేదా ఎంసీఏ పూర్తి చేసుకొని కలల కొలువులో చేరిపోవచ్చు.

ఐసెట్ - 2018

అడ్మినిస్ట్రేషన్.. ఐటీల్లోకి సరాసరి ప్రవేశం!

బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లేదా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పీజీ చేయాలనుకునేవారు రాష్ట్రస్థాయిలో రాయాల్సిన పరీక్ష.. ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్). ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం నోటిఫికేషన్‌ను వెలువరించింది. ఆంధ్రప్రదేశ్ ఫిబ్రవరి చివరన ఇవ్వనుంది. పరీక్షల షెడ్యూల్‌ను రెండు తెలుగు రాష్ట్రాలు ఇప్పటికే ప్రకటించాయి. ఈ పరీక్షను వేర్వేరుగా నిర్వహిస్తున్నప్పటికీ సిలబస్ ఒకేలా ఉంటుంది. పరీక్ష స్వరూపాన్ని పరిశీలిస్తే ఐసెట్‌లో మొత్తం 200 ప్రశ్నలుంటాయి. కేటాయించిన మార్కులు 200. గరిష్ఠ మార్కులు 150. మొత్తం మూడు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఎ డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, సెక్షన్-బి మేథమేటికల్ ఎబిలిటీ, సెక్షన్-సి కమ్యూనికేషన్ ఎబిలిటీ.

ఇప్పుడిప్పుడే గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు అకడమిక్ పరీక్షకూ, పోటీపరీక్షకూ తేడా తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ గరిష్ఠ సంఖ్యలో మార్కులను సాధించాల్సి ఉంటుంది. ముఖ్యంగా సమయపాలన చాలా కీలకం. తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలకు సమాధానం కనుక్కోవాల్సి ఉంటుంది. అందుకే సన్నద్ధత నుంచే ఆ కసరత్తు చేయాల్సి ఉంటుంది. కేవలం చదివితే సరిపోదు, పోటీ పరీక్షలకు ముఖ్యంగా నమూనా పరీక్షలను రాయాల్సి ఉంటుంది.



పి.గోపాలకృష్ణ, డైరెక్టర్, కౌటిల్య కెరియర్స్

సన్నద్ధతను రెండు దశల్లో పూర్తి చేస్తే మేలు. ఒకటి సిలబస్‌లో ప్రాథమిక సమాచారాన్ని తెలుసుకోవడం, ఆ తరువాత మాక్ పరీక్షలు రాయడం.

వివిధ సెక్షన్ల మార్కుల విభజన

సెక్షన్ ఎ (డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్‌సాల్వింగ్)- 75 ప్రశ్నలు, 75 మార్కులు

సెక్షన్ బి (మేథమేటికల్ ఎబిలిటీ) - 75 ప్రశ్నలు, 75 మార్కులు

సెక్షన్ సి (కమ్యూనికేషన్ ఎబిలిటీ) - 50 ప్రశ్నలు, 50 మార్కులు

ప్రాథమిక అంశాలను మార్చి 15 లేదా 20 నాటికి పూర్తిచేయాలి. ఆ తరువాత పరీక్షలు రాసేందుకు పూర్తి సమయం కేటాయించాలి.

ప్రత్యేక పదజాలం

సెక్షన్ -సిలో పదసంపద (ఒకాబ్యులరీ), బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ, ఫంక్షనల్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ తదితర అంశాలు ఉంటాయి. ఇందులో ఫంక్షనల్ గ్రామర్ అకడమిక్ సబ్జెక్టుల్లో భాగంగా ఉండేదే. అయితే పదసంపద కూడా ఏదో రూపంలో ఉంటుంది. ఇందులో పదాలకు సమాన, వ్యతిరేక అర్థాలతోపాటు ఇడియమ్స్, సామెతలు తదితర అంశాలను కూడా చూడాలి. సందర్భోచితంగా వాటిని ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకోవడం కీలకం. నిత్యం ఆంగ్ల దినపత్రికలను చదువుతూ వాటిలో వచ్చే కొత్త పదాల అర్థాలను సందర్భాన్నిబట్టి ఊహించగలిగే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.

బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి పాత ప్రశ్నపత్రాలను చూడటం ద్వారా పరీక్ష కోణాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇందులో కాంప్రహెన్షన్ చాలా కీలకం. నిత్యం ఆంగ్ల దినపత్రికల్లో వచ్చే వ్యాసాలపై సొంతంగా ప్రశ్నలు వేసుకుంటూ చదివితే ప్రయోజనం ఉంటుంది. రచయిత ఏం చెప్పదలచుకున్నాడు? మొత్తం సారాంశం ఉద్దేశం ఏంటి.. తదితర ప్రశ్నలు వేసుకుంటే పరీక్షలో వచ్చే కాంప్రహెన్షన్‌ను తేలికగా చేయవచ్చు.

ప్రాథమికాంశాలను తెలుసుకోవడంతో సన్నద్ధత అయిపోదు. సాధ్యమైనన్ని మాదిరి పరీక్షలు రాసి, కీ సరిచూసుకోవాలి. ఆ తరువాత తరచూ తప్పులు చేసే అంశాలకు సంబంధించి ప్రాథమికాంశాలను మరోసారి అధ్యయనం చేయాలి.

కాంప్రహెన్షన్ సాధన

- రీడింగ్ కాంప్రహెన్షన్‌ను రోజూ కనీసం రెండు లేదా మూడుసార్లు సాధన చేయాలి. పరీక్ష వరకూ ఇది కొనసాగుతూనే ఉండాలి.
- సన్నద్ధతలో ఎక్కువ సమయం సెక్షన్-బికి కేటాయించాలి. దీనిపైనే సెక్షన్- ఎ ఆధారపడి ఉంది కాబట్టి ప్రాధాన్యం తప్పనిసరి.
- పరీక్షలో మొత్తం 200 ప్రశ్నలుంటాయి. కేటాయించిన సమయం 150 నిమిషాలు. అంటే సగటున ప్రతి ప్రశ్నకు ఒక నిమిషం కంటే తక్కువ వ్యవధి ఉంది. ఈ నేపథ్యంలో వేగంగా చదవడం, అవగాహన చేసుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. అభ్యర్థులు నిత్యం సాధన చేయడం ద్వారానే ఇందులో మంచి స్కోరు సాధించే వీలుంటుంది.
- పరీక్షలోనూ సమయపాలన ముఖ్యం. సమయాన్నంతా ఒకే సెక్షన్‌కు కేటాయించకుండా వేరువేరు సెక్షన్లకు ప్రశ్నల కఠినత్వం ఆధారంగా కేటాయించుకోవాలి. ఎక్కువ సంఖ్యలో పూర్తిస్థాయి మాక్ పరీక్షలు రాయడం ద్వారా ఇది సాధ్యమవుతుంది.

మేలు చేసే మాక్ టెస్టులు

ఐసెట్‌లో మంచి ర్యాంకు రావాలంటే.. మాక్ పరీక్షలను రాయడం తప్పనిసరి. ప్రతిసారి విధిగా కీని పరిశీలించాలి. అలాగే అయిదు మాదిరి పరీక్షలు పూర్తయిన తరువాత మరోసారి ఆ అయిదింటిలో ఏ విభాగంలో ఎక్కువ తప్పులు చేస్తున్నారో పరిశీలించాలి. దీన్ని స్థూల విశ్లేషణగా చెప్పవచ్చు. మూడు సెక్షన్లలో ఎక్కువ తప్పులు జరిగిన విభాగంలో మరోసారి ప్రాథమికాంశాలను చదవాలి. రెండో దశలో సూక్ష్మ విశ్లేషణ జరపాలి. తరచూ ఏ అధ్యాయంలో ఎక్కువ తప్పులు జరుగుతున్నాయో గుర్తించాలి.

ఉదాహరణకు..

స్థూల విశ్లేషణలో భాగంగా ఎక్కువ తప్పులు సెక్షన్-ఎలో ప్రాబ్లమ్ సాల్వింగ్‌లో చేస్తున్నట్లు గుర్తిస్తే ఇందులో ఉండే ప్రాథమికాంశాలను బాగా చదవాలి. ఇందులో కోడింగ్-డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, ఆల్ఫాబెట్ బేస్డ్ టెస్ట్, డైరెక్షన్స్.. తదితర అధ్యాయాలుంటాయి. వీటిని అధ్యాయాల వారీగా మళ్లీ సాధన చేయడం మంచిది.

ఆ తరువాత సూక్ష్మ విశ్లేషణకు వెళ్లాలి. మొత్తం అయిదు పరీక్షల్లో ఎక్కువ తప్పులు ఏ అధ్యాయంలో చేస్తున్నారో పరిశీలించుకుంటే మంచిది. **ఉదాహరణకు–** జామెట్రీ అనే అధ్యాయం నుంచి ఎక్కువ తప్పులు చేస్తుంటే, దానికి సంబంధించి మరోసారి ప్రాథమికాంశాలను పరిశీలించడంతో పాటు జామెట్రీ ప్రశ్నలు మాత్రమే ఉండే మాక్ పరీక్షలను సాధ్యమైనన్ని ఎక్కువ రాయడం ద్వారా గరిష్ఠంగా లబ్ధి పొందవచ్చు.

ముఖ్యమైన తేదీలు

తెలంగాణ షెడ్యూల్

నోటిఫికేషన్ విడుదల: ఫిబ్రవరి 22
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: మార్చి 6
దరఖాస్తు చివరితేదీ: ఏప్రిల్ 30
పరీక్ష తేదీలు: మే 23, 24

ఆంధ్రప్రదేశ్‌లో...

నోటిఫికేషన్: ఫిబ్రవరి చివరి వారం
పరీక్ష తేదీ: మే 2

ఏ విభాగాన్ని ఎలా చదవాలి?



సన్నద్ధతను మేథమేటికల్ ఎబిలిటీ నుంచి ప్రారంభించాలి. ఇందులో కొనసాగే సన్నద్ధత, సెక్షన్-ఎలోని డేటా సఫిషియన్సీకి కూడా ఉపయోగపడుతుంది. సెక్షన్-బిలో అరిథ్‌మెటిక్ ఎబిలిటీ, ఆల్జీబ్రా, జామెట్రీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కాన్సెప్ట్‌కు ప్రాధాన్యమిస్తూ వీటికి సమాధానం కనుక్కునే విధంగా సిద్ధం కావాలి. పాఠశాల స్థాయిలో ప్రాథమికాంశాలను నేర్చుకుంటే సరిపోతుంది. అయితే వేగంగా చేయాలి కాబట్టి ఎక్కువ సంఖ్యలో ప్రశ్నలను సాధన చేయాల్సి ఉంటుంది.

సెక్షన్- ఎలో నేర్చుకున్న అరిథ్‌మెటికల్ ఎబిలిటీలోని నిష్పత్తులు, శాతాలు, సరాసరి ఇక్కడ కూడా ఉపయోగపడతాయి.

అంశాలు అవే అయినా అడిగే విధానంలో కొంచెం తేడా ఉంటుంది. అయితే వీటికి కూడా పాఠశాల స్థాయి పుస్తకాలపై పట్టు ఉంటే చాలు. ఇందులోనే ప్రాబ్లమ్ సాల్వింగ్ ఉంటుంది. ఇందులో సాధారణంగా అకడమిక్ పరీక్షల్లో భాగం కాని అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇచ్చిన ప్రశ్నలకు సరైన సమాధానం తార్కికంగా ఆలోచించాలి. అప్పుడే నాలుగు సమాధానాల్లో తగిన ఆప్షన్‌ను గుర్తించగలుగుతాము. కాబట్టి, అభ్యర్థులు పాత ప్రశ్నల సరళిని జాగ్రత్తగా పరిశీలించాలి.

గేమ్ డెవలప్‌మెంట్‌లో

తాజా ఇంటర్న్‌షిప్స్

>>> గ్రాఫిక్ డిజైన్

సంస్థ: FinTown
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 8000- రూ. 16,000
లింకు: internshala.com/i/9187
గడువు: మార్చి 21, 2018
అర్హులు: అడొబ్ ఫొటోషాప్, అడొబ్ ఇలస్ట్రేటర్ నైపుణ్యాలు ఉన్నవారు.

>>> వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: Keansa Solutions
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 3000
లింకు: internshala.com/i/9189
గడువు: ఫిబ్రవరి 28, 2018
అర్హులు: Java, MySQL, jQuery, SQL, JSP, Node.js, DBMS నైపుణ్యాలు ఉన్నవారు.



>>> గేమ్ డెవలప్‌మెంట్

సంస్థ: M19G
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ. 8000- రూ. 11000
లింకు: internshala.com/i/9190
గడువు: మార్చి 1, 2018
అర్హులు: GitHub, C++, Node.js నైపుణ్యాలు ఉన్నవారు.

>>> వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: Indiashares
ప్రదేశం: వర్క్ ఫ్రం హోం
స్టైపెండ్: నెలకు రూ. 5000
లింకు: internshala.com/i/9191
గడువు: ఫిబ్రవరి 28, 2018
అర్హులు: హెచ్‌టీఎంఎల్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ నైపుణ్యాలు ఉన్నవారు.

ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో ....



ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కోర్సుల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్- న్యూదిల్లీ ప్రకటన విడుదల చేసింది.

యూజీలో..బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులు ఉన్నాయి. వీటిలో ఆర్కిటెక్చర్ అయిదేళ్ల వ్యవధి కోర్సుకాగా ప్లానింగ్ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులు. జేఈఈ మెయిన్‌లో చూపిన ప్రతిభ ద్వారా ప్రవేశం కల్పిస్తారు.

పీజీలో..6 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి.. ఆర్కిటెక్చరల్ కన్వర్జేషన్, అర్బన్ డిజైన్, డిజైన్ (ఇండస్ట్రియల్ డిజైన్), ప్లానింగ్ (ఎన్విరాన్‌మెంటల్ / హౌసింగ్/ రీజనల్/ ట్రాన్స్‌పోర్ట్/ అర్బన్), ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, బిల్డింగ్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్. కోర్సు వ్యవధి రెండేళ్లు.

అర్హత: సంబంధిత బ్యాచిలర్ డిగ్రీలో 55 (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలైతే 50) శాతం మార్కులతో ఉత్తీర్ణత.

పీహెచ్‌డీ కోర్సులకు ఏడాది పొడుగునా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏటా రెండుసార్లు ఆగస్టు, జనవరిలో ప్రవేశం కల్పిస్తారు.

పీజీ కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: మార్చి 16; **పరీక్ష, ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 2 నుంచి 4 వరకు
దరఖాస్తు ఫీజు: రూ. 2500
వెబ్‌సైట్: www.spa.ac.in

ఏఎన్‌యూ పీజీ కోర్సులు

పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ విభాగాల్లో 50 కోర్సుల్లో ప్రవేశానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రకటన విడుదల చేసింది. ఏఎన్‌యూ సెట్ -2108 ద్వారా నాగార్జున యూనివర్సిటీతోపాటు దాని పరిధిలోని కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి.



ఇవీ కోర్సులు...

లైఫ్ సైన్సెస్ (ఎమ్మెస్సీ): ఆక్వాకల్చర్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, బోటనీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, మైక్రోబయాలజీ, నానో బయోటెక్నాలజీ, జువాలజీ

ఫిజికల్ సైన్సెస్ (ఎమ్మెస్సీ): ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

మ్యాథమేటికల్ సైన్సెస్ (ఎమ్మెస్సీ): కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్

కెమికల్ సైన్సెస్ (ఎమ్మెస్సీ): అనలిటికల్ కెమిస్ట్రీ, ఫోరెన్సిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ; ఆయిల్స్, ఫ్యాట్స్ అండ్ పెట్రో ప్రొడక్ట్స్.

ఎమ్మెస్సీ : స్టాటిస్టిక్స్, జియాలజీ, యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ: నానో టెక్నాలజీ (అయిదేళ్లు)

సోషల్ సైన్సెస్ (ఎంఏ): హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ,

లాంగ్వేజెస్ (ఎంఏ): తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం.

పీజీ డిప్లొమా: అడ్వాన్స్‌డ్ ఆక్వాకల్చర్ మేనేజ్‌మెంట్, అంబేడ్కర్ స్టడీస్, గాంధియన్ స్టడీస్, మహాయాన బుద్ధిస్ట్ స్టడీస్, యోగా ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్, ఫైన్‌ఆర్ట్స్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), ఎంహెచ్‌ఆర్ఎం, ఎంఎల్ఐఎస్సీ, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ. **సర్టిఫికెట్ కోర్సు:** సస్టెయినబుల్ ఆక్వా కల్చర్ మేనేజ్‌మెంట్.

పరీక్ష ఇలా..

ప్రశ్నపత్రం వంద మార్కులకు ఉంటుంది. పరీక్షలో వంద ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. వీటిని 90 నిమిషాల్లో పూర్తిచేయాలి. రుణాత్మక మార్కులు లేవు. ఓఎంఆర్ పత్రంపై జవాబులు గుర్తించాలి.

అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 20
పరీక్షలు: మే 5 నుంచి 7 వరకు **పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, ఒంగోలు, విజయవాడ. **వెబ్‌సైట్:**www.anudoa.in

నోటీస్ బోర్డు

ప్రవేశాలు

టీఎస్ఆర్‌జేసీ సెట్-2018

తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలు
గ్రూపులు: ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ
బోధనా మాధ్యమం: ఇంగ్లిష్
అర్హత: ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు.
ప్రవేశపరీక్ష తేది: 06. 05. 2018
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ. 150
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 06. 03. 2018 నుంచి 09. 04. 2018 వరకు
వెబ్‌సైట్: http://tsrjdc.cgg.gov.in/

నిమ్‌సెట్-2018

ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సుల ఉమ్మడి ప్రవేశపరీక్ష
సెట్ నిర్వహిస్తున్న ఎన్ఐటీ: ఎన్ఐటీ సూరత్కల్ (కర్ణాటక).
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ ఉత్తీర్ణత
నిమ్‌సెట్ తేది: 27. 05. 2018
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ. 2200
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 01. 03. 2018 నుంచి 31. 03. 2018 వరకు.
వెబ్‌సైట్: https://www.nimcet.in/

ఫెలోషిప్స్

ఐఐఎం బెంగళూరు-ఎన్ఎస్ఆర్ ప్రి డాక్ ఫెలోషిప్

ఫెలోషిప్: ప్రొఫెసర్ ఎన్. ఎస్. రామస్వామి ప్రి డాక్టొరల్ ఫెలోషిప్ ప్రోగ్రామ్
ఉద్దేశం: బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను మేనేజ్‌మెంట్ రంగాల్లో పీహెచ్‌డీ చేసేలా ప్రోత్సహించడం.
కాల వ్యవధి: జూన్ 2018 నుంచి మార్చి 2019 వరకు.
స్టైపెండ్: నెలకు రూ. 25,000 తోపాటు కంటింజెన్సీ గ్రాంటు కింద ఏడాదికి రూ. 25,000. **ఫెలోషిప్ వివరాలు:** మెంటర్ పర్యవేక్షణలో ప్రతి అభ్యర్థి కనీసం 3 డాక్టొరల్ స్థాయి క్రెడిట్ కోర్సులను పూర్తి చేయాల్సి ఉంటుంది.
అర్హత: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ వర్గాలకు చెందిన పీజీ/ ఇంటిగ్రేటెడ్ పీజీ/ నాలుగేళ్ల డిగ్రీ/ సీఏ/ ఐసీడబ్ల్యూఏ/ సీఎస్ ఉత్తీర్ణులు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు ఫీజు: రూ. 500
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 01. 04. 2018
http://iimb.ac.in/NSRpredoc

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు

సీఎస్ఐఆర్-నీరి, నాగ్‌పూర్

సంస్థ: నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (నీరి), నాగ్‌పూర్
పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్-10, టెక్నికల్ ఆఫీసర్-05
అర్హత: బీఎస్సీ, ఇంజినీరింగ్ డిప్లొమా, బీఈ/ బీటెక్, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంబీబీఎస్.
ఎంపిక: రాతపరీక్ష/ స్క్రీనింగ్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ. 100
చివరితేది: 02. 04. 2018
వెబ్‌సైట్: http://neeri.res.in/

ఎన్‌క్లాట్, న్యూదిల్లీ

సంస్థ: నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌క్లాట్), న్యూదిల్లీ.
పోస్టులు: లీగల్ అసిస్టెంట్, లా క్లర్క్ కమ్ రిసెర్చ్ అసిస్టెంట్.
అర్హత: లా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు లీగల్ రిసెర్చ్‌లో అనుభవం.
ఎంపిక: నిబంధనల ప్రకారం.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
చివరితేది: 16. 04. 2018
http://www.nclat.nic.in/

శ్రీదేవి మరణంపై ఈ ఊహాగానాలేమిటి?

- టీవీ మీడియా రిపోర్టింగ్‌పై బాలీవుడ్ అసంతృప్తి
- అనిల్‌కపూర్ నివాసానికి తరలివచ్చిన ప్రముఖులు

ముంబయి: సినీనటి శ్రీదేవి మృతిపై టీవీ మీడియా చేస్తున్న బాధ్యతారాహిత్య రిపోర్టింగ్ తీరుపై ఆమె అభిమానులు, బాలీవుడ్ ప్రముఖులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మరణానికి సంబంధించి పలు కుట్రకోణాలను సూచిస్తూ వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించారు. అర్థరహితమైన, అగౌరవకరమైన మీడియా కవరేజీగా వారు అభివర్ణించారు.

'శ్రీదేవి అకాలమృతిపై మీడియా ఆసక్తిని అర్థం చేసుకోవచ్చు. అయితే, లేనిపోని వదంతులు, ఊహాగానాల సిద్ధాంతాల వల్ల ప్రయోజనం ఉండదు. అందరూ సంయమనంతో ఉండాలి'

- నవదీప్ సూరి, (యుఏఈలో భారత రాయబారి)

"అత్యంత హేయం ...దిగజారుడుతనం.'

- ఫర్హాన్ అఖ్తర్

ప్రేమాభిమానాలను పంచండి. కలకాలం నిలిచి ఉండేవి అవే' **-అమితాబ్‌బచ్చన్**

'అభిమాన తార శ్రీదేవిని మీడియా నిట్టనిలువునా హత్య చేసినంత పనిచేస్తుంటే...యావద్దేశం నోరుమెదపకుండా కళ్లప్పగించి చూస్తుండటం ఎంత సిగ్గుచేటు'

- ఓ అభిమాని

'భారత దేశంలో జీవితం అనే దానికి ఏ మాత్రం విలువలేదనడానికి ఈ పరిణామమే సజీవ సాక్ష్యం. నాకెప్పటి నుంచో ఇలాంటి భావన ఉంది. ఇప్పుడది శ్రీదేవి మృతి విషయంలో మళ్లీ రుజువైంది. మనకు వినోదం పంచడానికి శ్రీదేవి మరణించలేదు కదా!.'

- మరోఅభిమాని

'మీరు..మీ కుటుంబాలు ముందు ఆ టీవీలను కట్టేసేయండి. శ్రీదేవి మరణంపై వార్తా ఛానళ్ల చర్చావేదికల స్థాయికి దిగజారడమేమిటి. ఇలాంటి చర్చల్లో పాల్గొంటే ఫర్వాలేదులే అనే భావన ప్రజల్లో కూడా కలగడం నిజంగా ఆశ్చర్యకరం. ఇద్దరు చిన్నారి ఆడపిల్లలు అమ్మను పోగొట్టుకున్న తీరని ఆవేదనలో ఉన్నారు. దయచేసి...ఇవన్నీ ఆపేయండి. ప్లీజ్....ప్లీజ్...'

- ఫ్యాషన్ డిజైనర్ మసాబా మంతెనా

'ఓ నటదిగ్గజం మృతిపై ఈ తరహా రిపోర్టింగ్ ఏమిటి? పేరొందిన ఛానళ్లలో సైతం ఈ తరహా రిపోర్టింగ్ జరుగుతున్న కాలంలో మనం ఉండటం నిజంగా సిగ్గుచేటు.' **- నటుడు సోనూసూద్**

పాత్రికేయం అనేది పూర్తిగా చచ్చిపోయిన సమయం ఇదేనని కొన్ని వందల ఏళ్ల తర్వాత చరిత్ర పుస్తకాల్లో ప్రత్యేకంగా పేర్కొంటారు.'

- సినీప్రముఖుడు అనుభవ్ సిన్హా

'అసలు అత్యంత పెద్ద విషాదం ఏమిటి? శ్రీదేవి మరణమా? లేదంటే ఆమె మృతిపై మీడియా బాధ్యతారాహిత్య రిపోర్టింగా? నిజంగా బోనీకపూర్‌ను తలుచుకుంటే మనసు కరిగినీరైపోతోంది'.

- అభిషేక్ కపూర్, దర్శకుడు

తరలివచ్చిన ప్రముఖులు

శ్రీదేవి హఠాన్మరణంతో తీవ్ర ఆవేదనతో కుంగిపోతున్న ఆమె కుటుంబసభ్యులను పరామర్శించేందుకు ప్రముఖులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శ్రీదేవి కుమార్తెలిద్దరూ బాబాయి అయిన అనిల్‌కపూర్ నివాసంలో ఉన్న విషయం తెలిసిందే. శ్రీదేవి కడసారి దర్శనం కోసం అనిల్‌కపూర్ నివాసం వద్ద....లోఖండ్‌వాలాలోని శ్రీదేవి ఇంటి వద్ద అభిమానులు పెద్ద సంఖ్యలో గుమిగూడి నిరీక్షిస్తున్నారు. ప్రముఖ తారలు షారుఖ్‌ఖాన్, రజనీకాంత్, కమల్‌హాసన్, రణ్‌వీర్‌సింగ్, దీపికా పదుకోన్, కరిష్మాకపూర్, ఇషాన్‌కట్టార్, అనుపమ్‌ఖేర్, దివ్యదత్తా, షబానాఆజ్మీ తదితరులు పెద్దసంఖ్యలో అనిల్‌కపూర్ నివాసానికి చేరుకుని తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంత్‌అంబానీ, డిజనర్ మనీష్ మల్హోత్రా వంటి ప్రముఖులు తరలివచ్చి ఆవేదనలో మునిగి ఉన్న కుటుంబసభ్యులను పరామర్శించారు.

శ్రీదేవి ప్రమాదవశాత్తూ చనిపోయినట్లు ఎలా చెబుతున్నారు?

భాజపా నేత సుబ్రమణ్యస్వామి సందేహాలు

దిల్లీ: సినీ నటి శ్రీదేవి ప్రమాదవశాత్తూనే స్నానాల తొట్టెలో మునిగి చనిపోయినట్లు దుబాయి పోలీసులు ఎలా చెబుతున్నారంటూ భాజపా నేత సుబ్రమణ్యస్వామి పలు సందేహాలను వ్యక్తం చేశారు. ఎవరైనా తోసివేయడం లేదా ఊపిరాడకుండా చేయడం చేస్తే తప్ప స్నానాలతొట్టెలో మునిగిపోయి చనిపోవడం చాలా కష్టమని అభిప్రాయపడ్డారు. శ్రీదేవి గురించి తనకు తెలుసునని.. ఆమె ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తగా ఉండేవారని, ఎన్నడూ మద్యం తాగరని పేర్కొన్నారు. ముందు గుండెపోటు అని, తర్వాత ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయినట్లు చెబుతున్నారని.. వీటి వెనుక హేతుబద్ధత ఏమిటని ప్రశ్నించారు. బాలీవుడ్ వ్యక్తులకు దుబాయి గ్యాంగ్‌లతో చట్టవ్యతిరేక సంబంధాలుంటాయని.. దీంతో అనేక సందేహాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కాగా శ్రీదేవి గుండెపోటుతో మృతి చెందినట్లు బోనీ కపూర్ కుటుంబ సభ్యులెవరూ చెప్పలేదని సీనియర్ రాజకీయ నేత అమర్ సింగ్ కూడా పేర్కొన్నారు.

రోటొమాక్ అధిపతిపై మరో 12 అభియోగాలు

మరో మూడు బ్యాంకు ఖాతాలనూ జప్తు చేసిన ఆదాయపుపన్ను శాఖ

దిల్లీ: రుణాల ఎగవేత కేసులో నిందితుడు రోటొమాక్ అధినేత విక్రమ్ కొఠారీ, అతనికి చెందిన సంస్థలపై మరో 12 అభియోగాలను ఆదాయపు పన్ను శాఖ మోపింది. వీటితో పాటు కంపెనీకి చెందిన మరో మూడు బ్యాంకు ఖాతాలనూ జప్తు చేసినట్లు ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకూ మోపిన అభియోగాల సంఖ్య 18కి, జప్తు చేసిన బ్యాంకు ఖాతాల సంఖ్య 17కు పెరిగింది.

ఏప్రిల్‌లో పాదయాత్ర: డీకే అరుణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఏప్రిల్ నెలలో ఆలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు పాదయాత్ర చేయనున్నట్లు డీకే అరుణ తెలిపారు. సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తానన్నారు. తన పాదయాత్రకు అధిష్ఠానం అనుమతి ఇస్తుందనే విశ్వాసం ఉందని తెలిపారు. బస్సుయాత్ర విషయంలో ఎవరూ తనను సంప్రదించి, అభిప్రాయం తీసుకోలేదన్నారు.

చివరి చూపులకు..

- ఇంటికి చేరిన శ్రీదేవి భౌతికకాయం

దుబాయి/ముంబయి

వెండితెర వెలుగుదివ్వె, బాలీవుడ్ మహిళాసూపర్ స్టార్ శ్రీదేవి (54) మరణానికి గల కారణాలపై అనిశ్చితికి తెరపడింది. దుబాయి అధికారులు ఎట్టకేలకు కేసు మూసేయడంతో.. మరణించిన మూడు రోజుల అనంతరం మంగళవారం ఆమె భౌతికకాయాన్ని ముంబయిలోని స్వగృహానికి తరలించారు. బుధవారం సాయంత్రం 3.30 ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

శ్రీదేవి మృతి వెనక ఎటువంటి నేరం జరగలేదని దర్యాప్తు అధికారులు తేల్చారు. అపస్మారకస్థితికి వెళ్లి ప్రమాదవశాత్తూ స్నానాలగదిలోని స్నానాలతొట్టెలో మునిగి ప్రాణాలు కోల్పోయారని దుబాయి పబ్లిక్ ప్రాసిక్యూషన్ కార్యాలయం మంగళవారం ప్రకటించింది. అయితే ఆమె అపస్మారక స్థితిలోకి ఎలా వెళ్లారో వెల్లడించలేదు.

కేసు మూసేసిన తర్వాత భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడానికి చకచకా ఏర్పాట్లు జరిగాయి. మృతదేహం పాడవకుండా భద్రపర్చడానికి తీసుకునేందుకు కావాల్సిన అనుమతి పత్రాలను దుబాయి పోలీసులు శ్రీదేవి కుటుంబసభ్యులు, అక్కడి భారత కాన్సులేట్‌కు అందజేశారు. శ్రీదేవి భర్త బోనీకపూర్, ఆయన మొదటి భార్య కుమారుడు అర్జున్‌కపూర్ సహా కుటుంబసభ్యులు భౌతిక కాయాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానికి చెందిన ప్రైవేటు జెట్‌లో దుబాయి నుంచి ముంబయికి తీసుకొచ్చారు. రాత్రి 9.30కు ఈ విమానం ముంబయి విమానాశ్రయానికి చేరుకుంది. అనిల్ అంబానీ, ఆయన సతీమణి టీనా అంబాని, అనిల్ కపూర్‌లు ఆ సమయంలో విమానాశ్రయానికి వచ్చి ఉన్నారు. ఆ వెంటనే పార్థివ దేహాన్ని అంధేరి వెస్ట్‌లోని లోఖండ్‌వాలా ప్రాంతంలోని శ్రీదేవి దంపతుల నివాసానికి తరలించారు. అక్కడ పోటెత్తే అభిమానులను నిలువరించడానికి భద్రతా ఏర్పాట్లు చేశారు.

అంతకుముందు కేసును మూసి వేసినట్లు దుబాయి ప్రభుత్వ మీడియా కార్యాలయం వరుస ట్వీట్లలో తెలియజేసింది.

"భారత సినీ నటి శ్రీదేవి మృతికి దారి దీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు పూర్తయినందున ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు దుబాయి పబ్లిక్ ప్రాసిక్యూషన్ ఆమోదం తెలిపింది. ఇటువంటి కేసుల్లో అనుసరించే ప్రక్రియలన్నీ పూర్తయినట్లు వెల్లడించింది. ఫోరెన్సిక్ నివేదిక ప్రకారం.. స్పృహ కోల్పోయి ప్రమాదవశాత్తూ మునగడంతో శ్రీదేవి మరణించారు. ఈ కేసును మూసివేశారు." అని పేర్కొంది.



మంగళవారం రాత్రి ముంబయి విమానాశ్రయం వద్ద శ్రీదేవి అభిమానులు

శ్రీదేవి అంత్యక్రియలను బుధవారం మధ్యాహ్నం తర్వాత ముంబయిలో నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబసభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అభిమానుల సందర్శనార్థం భౌతిక కాయాన్ని అంధేరి వెస్ట్‌లోని లోఖండ్‌వాలా సెలెబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉంచుతారని ప్రకటన తెలియజేసింది. అంతిమ యాత్ర మధ్యాహ్నం 2 తర్వాత ప్రారంభమవుతుందని, అంత్యక్రియలు విలేపార్లె సేవా సమాజ్ క్రిమిటోరియంలో సాయంత్రం 3.30 ప్రాంతంలో జరుగుతాయని వెల్లడించింది.

నివాళులు అర్పించడానికి మీడియా సభ్యులు కూడా రావచ్చని, అయితే కెమెరాలు, రికార్డింగ్ ఉపకరణాలు బయట వదిలేసి రావాలని తెలిపింది. ఈ విషాద సమయంలో అండగా నిలిచిన మీడియాకు, సినీపరిశ్రమకు, శ్రీదేవి అభిమానులకు ఖుషి, జాన్వి, బోనీ కపూర్, కపూర్, అయ్యప్పన్ కుటుంబాల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొంది.

దగ్గరి బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యేందుకు శ్రీదేవి దుబాయి వెళ్లారు. ఆమె అక్కడే ఉండిపోగా భర్త బోనీ కపూర్ ముంబయికి చిన్న కుమార్తె ఖుషితో కలిసి తిరిగొచ్చారు. కానీ ఆమెను ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఆయన మళ్లీ దుబాయికి వచ్చారు. శనివారం ఆమె ఆకస్మికంగా మరణించారన్న వార్త దేశవ్యాప్తంగా అభిమానుల్ని హతాశుల్ని చేసింది. ఆమె మరణంపై రకరకాల ఊహాగానాలు వినిపించాయి. ఆకస్మిక గుండెపోటుతో మరణించారని తొలుత కుటుంబ సభ్యుడే చెప్పారు. ఆమె బస చేసిన జుమేరా ఎమిరేట్స్ టవర్స్ హోటల్‌లోని తన గదిలో స్నానాల తొట్టిలో మునిగి మరణించారని ఆ తర్వాత తేలింది. స్నానాల తొట్టిలో ఎలా మునిగారని కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతోనే మునిగిపోయారని ఫోరెన్సిక్ నివేదిక తేల్చింది. దుబాయి పోలీసులు కేసును దుబాయి పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేయగా సమగ్ర దర్యాప్తు చేపట్టింది.

'షి' టీం వార్షిక పరుగును విజయవంతం చేయండి

- డీజీపీ మహేందర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: మహిళాభద్రత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 4వ తేదీన నిర్వహించబోయే వార్షిక 'షి టీమ్స్ రన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీజీపీ మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. నేర రహిత హైదరాబాద్ మరీ ముఖ్యంగా మహిళలు, పిల్లల రక్షణ ధ్యేయంగా ఈ పరుగు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహేందర్‌రెడ్డి మాట్లాడారు. దాదాపు ఏడు వేల మంది ఇందులో పాల్గొంటారని అంచనా వేస్తున్నామని, 10కె, 5కె, 2కె పరుగు పందాలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, తెలుగు కథానాయకుడు విజయ్ దేవరకొండ ముఖ్య అతిథులుగా హాజరవుతారని డీజీపీ వివరించారు. మహిళా భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా మార్చి 3, 4 తేదీల్లో నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని, పోలీసుశాఖలోని వివిధ విభాగాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఇందులో పాల్గొంటాయన్నారు. సమావేశంలో శాంతిభద్రతల అదనపు డీజీ అంజనీకుమార్, హైదరాబాద్ అదనపు కమిషనర్(నేరాలు) స్వాతిలక్రా తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో వెదురు, ఈత చెట్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో భాగంగా వెదురు, ఈత తదితర కులవృత్తులకు పనికి వచ్చే మొక్కలను నాటాలని శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ వి.గంగాధర్‌గౌడ్ ఆదేశించారు. మంగళవారం శాసనసభ కమిటీ హాలులో జరిగిన సంక్షేమ కమిటీ సమావేశానికి సభ్యులు ఆర్.కృష్ణయ్య, చింతాప్రభాకర్, ఫారూఖ్‌హుస్సేన్, బాలసాని లక్ష్మీనారాయణ, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు, బీసీ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి వి.సైదా, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీజీ గౌడ్ మాట్లాడుతూ.. వెదురును మేదరులకు ఉచితంగా పంపిణీ చేయాలని, వెదురు ఉత్పత్తులపై వారికి అధునాతన శిక్షణ ఇవ్వాలని సూచించారు. గీతవృత్తుల వారికి ఈత, తాటిచెట్లు పంపిణీ చేయాలని మార్గదర్శనం చేశారు.

వక్ఫ్ దస్త్రాల పరిరక్షణ ఇలాగేనా!

- మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఆగ్రహం
- వాటిని భద్రపరచాలని ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: "ఇవి కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, భూములకు సంబంధించిన పత్రాలు. ఇలా నేల మీద పడేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా?' అంటూ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి దానకిశోర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం వక్ఫ్‌బోర్డు కార్యాలయంలోని దస్త్రాలను ఆయన తనిఖీ చేశారు. అత్యంత విలువైన పత్రాల తాలూకూ దస్త్రాలు పాత దుస్తుల్లో మూటగట్టి ఉండటాన్ని గుర్తించి ఆగ్రహించారు. వెంటనే వాటిని క్రోడీకరించి..భద్రపరచాలని వక్ఫ్‌బోర్డు సీఈవో మన్నన్ ఫారూఖీని ఆదేశించారు. ఉర్దూ, పర్షియన్ భాషల్లో ఉన్న దస్త్రాల సమాచారాన్ని..ఆంగ్లంలోకి అనువదించాలని సూచించారు. ఈ మేరకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు ఈ నెల 28న వివిధ విశ్వవిద్యాలయాల్లోని పార్సీ, ఉర్దూ భాషల ఆచార్యులు, నిపుణులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు.

గవర్నర్‌తో..ఆగాఖాన్ భేటీ

ఆగాఖాన్ డెవెలప్‌మెంట్ నెట్‌వర్క్ (ఏకేడీఎన్) వ్యవస్థాపకులు, ఛైర్మన్ ఆగాఖాన్ మంగళవారం గవర్నర్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిశారు. ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థికంగా కలిగే ప్రయోజనాలపై ఇరువురూ చర్చించారు. ఈ సందర్భంగా ఏకేడీఎన్ విద్య, వైద్య రంగాల్లో అందిస్తున్న సేవలను ఆగాఖాన్ గవర్నర్‌కు వివరించారు. తమ ఫౌండేషన్ ద్వారా రానున్న ఐదేళ్లలో తెలంగాణలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నామని, త్వరలోనే వీటిని ప్రారంభిస్తామని వెల్లడించారు. విద్యా రంగంలో ఏకేడీఎన్ సేవలను, హైదరాబాద్‌లోని కుతుబ్‌షాహీ సమాధులను పరిరక్షించేందుకు చేస్తున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ ఏకేడీఎన్ ఛైర్మన్ ఆగాఖాన్‌ను మంగళవారం కలిశారు.

వందకు పైగా స్థానాలు మావే: మహమూద్‌అలీ

తెలంగాణలో వందకుపైగా శాసనసభ స్థానాల్లో తెరాస విజయం సాధిస్తుందని ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ ధీమా వ్యక్తంచేశారు. అన్ని వర్గాల ప్రజలు తెరాసకు బ్రహ్మరథం పడతారన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు.

రైతుల సంక్షేమానికి బహుముఖ ప్రణాళిక

తెలంగాణలోని రైతుల అభివృద్ధికి ప్రభుత్వం బహుముఖ ప్రణాళికను అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దీర్ఘకాలిక వ్యూహంతో రైతులు, వ్యవసాయంపై దృష్టి సారించారని పేర్కొన్నారు. భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు భూ దస్త్రాల ప్రక్షాళన పూర్తిచేశామని, త్వరలోనే అత్యంత భద్రతతో కూడిన పాసుపుస్తకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వాటి ఆధారంగా పెట్టుబడి సాయం కింద రూ.12 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించనుందని తెలిపారు.

విషం ఎక్కించుకుని వైద్యురాలి ఆత్మహత్య

- రెండ్రోజుల క్రితమే మృతి..
- ఆలస్యంగా వెలుగులోకి

కాప్రా, న్యూస్‌టుడే: శరీరంలోకి విషాన్ని ఇంజక్షన్ ద్వారా తీసుకుని ఓ వైద్యురాలు తనువు చాలించారు. తాను నివసిస్తున్న ఫ్లాట్‌లో తలుపులు బిగించుకుని లోపలి నుంచి తాళం వేసుకుని మరీ ఆత్మహత్యకు చేసుకున్నారు. ఈ ఘటన కుషాయిగూడ ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన ఎం.నూకరాజు కుమార్తె డాక్టర్ ఎంపీఏ లక్ష్మి (42) ఉద్యోగరీత్యా కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి సైనిక్‌పురిలోని హస్తినాపురిలో ఉన్న జేపీ టవర్స్‌లో మొదటి అంతస్తు జీ2 ఫ్లాట్‌లో ఒంటరిగా ఉంటున్నారు. అవివాహిత అయిన ఈమె గాంధీ ఆస్పత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, సివిల్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తూ నెలక్రితం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి పదోన్నతిపై వెళ్లారు. రెండు మూడు రోజులుగా ఆమె విధులకు హాజరు కాలేదు. అపార్టుమెంటులోనూ ఎవరికీ కనిపించకపోవడంతో ఊరెళ్లి ఉండవచ్చని అందరూ భావించారు. అయితే మంగళవారం ఆమె ఫ్లాట్ నుంచి దుర్వాసన వస్తుండటంతో వాచ్‌మెన్, మిగిలిన ఫ్లాట్ల వాళ్లు ఆమె ఇంటి తలుపు తెరిచే యత్నం చేయగా లోపలివైపు తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు. అపార్టుమెంట్ అధ్యక్షుడు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న సీఐ, ఎస్ఐ ఫ్లాట్ తలుపులు పగులగొట్టించి లోపలికి వెళ్లగా గదిలో చాపపై డాక్టర్ లక్ష్మి మృతదేహం కనిపించింది. పక్కన 2 ఇంజక్షన్ సీసాలు, సిరంజులు ఉన్నాయి. విశాఖపట్నంలో నివాసం ఉంటున్న లక్ష్మి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించారు.



లక్ష్మి (పాత చిత్రం)

మారిషస్‌లో 108 అడుగుల శ్రీవారి విగ్రహం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారి 108 అడుగుల ఎత్తుగల విగ్రహాన్ని జులై 1న మారిషస్‌లో ఆవిష్కరించనున్నట్లు ఆ దేశ ఉపాధ్యక్షుడు పరమశివం వెల్లడించారు. తిరుమల శ్రీవారిని సతీసమేతంగా దర్శించుకున్న ఆయన.. ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలో అత్యంత ఎత్తైన శ్రీనివాసుడి విగ్రహావిష్కరణకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించినట్లు తెలిపారు.

కేజీ బేసిన్‌లో కోల్డ్‌సీప్స్

దేశంలోనే తొలిసారి గుర్తింపు

పనాజీ: కృష్ణ-గోదావరి బేసిన్‌లో కోల్డ్ సీప్స్ ఉన్నట్లు. . జాతీయ సముద్రవిజ్ఞాన సంస్థ (సీఎస్ఐఆర్-ఎన్ఐఓ) పరిశోధకులు కనుగొన్నారు. హైడ్రోజన్ సల్ఫేడ్, మీథేన్ వంటి హైడ్రోకార్బన్ సమృద్ధిగా ఉండే ద్రావణాలను వెలువరిచే సముద్రపు అట్టడుగు ఊటలను కోల్డ్ సీప్స్ అంటారు. భారత్‌లో ఇవి వెలుగుచూడటం ఇదే తొలి సారి. వైద్యచికిత్సలు, బయో టెక్నాలజీకి సంబంధించి కీలకమయ్యే బయోఆక్టివ్ అణువులు, హైడ్రేట్ సంబంధిత పరిశోధనలు, అభివృద్ధికి.. ఈ పరిణామంతో భారత్‌లో కొత్త ద్వారాలు తెరుచుకున్నాయి. గ్యాస్ హైడ్రేట్ ఉనికి గురించి ముందే తెలిసినా.. భారత్‌లో క్రియాశీల కోల్డ్ సీప్‌లను గుర్తించడం మాత్రం ఇదే తొలిసారని ఎన్ఐఓ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్‌సింగ్ తెలిపారు. దీని కోసం నూతన సాంకేతికతను అభివృద్ధి చేసి.. ఉపయోగించామని పేర్కొన్నారు. 900 మీ.ల నుంచి 1900 మీ.ల లోతులో ఈ కోల్డ్ సీప్స్ విస్తరించి ఉన్నట్లు ఎన్ఐఓ తెలిపింది.

1, 2 తేదీల్లో హైకోర్టు విధుల బహిష్కరణ

- ఏపీ, తెలంగాణ న్యాయవాద సంఘాల తీర్మానం
- న్యాయమూర్తుల ఖాళీల భర్తీ, సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటుకు డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: డిమాండ్ల సాధన కోసం మార్చి 1, 2 తేదీల్లో హైకోర్టు విధులను బహిష్కరించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాద సంఘాలు తీర్మానించాయి. ఆయా సంఘాలు మంగళవారం అసాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాయి. పలువురు సీనియర్ న్యాయవాదులతోపాటు.. న్యాయవాదుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని మార్చి 1, 2 తేదీల్లో విధులు బహిష్కరించాలని నిర్ణయించాయి. ఉమ్మడి హైకోర్టులో ఉన్న న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు సుప్రీం కోర్టును డిమాండ్ చేశాయి. ఉమ్మడి హైకోర్టుకు 61 న్యాయమూర్తుల పోస్టులు మంజూరుకాగా..సగం ఖాళీగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశాయి. 2015 నుంచి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పోస్టు ఖాళీగా ఉందని, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి విధులు నిర్వహిస్తున్నారని గుర్తుచేశాయి. డిమాండ్ల సాధన కోసం విధులు బహిష్కరించడంతోపాటు..1, 2 తేదీల్లో బార్ కౌన్సిల్ భవనం నుంచి మదీనా భవనం వరకు నిరసన ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు జె.కనకయ్య, సీహెచ్.ధనంజయలతోపాటు కార్యదర్శులు ప్రకటన విడుదల చేశారు.

దివ్యాంగులకు ఆరోగ్యకార్డులివ్వాలి

ఈనాడు, హైదరాబాద్: దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యకార్డులివ్వాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు వేదిక అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులు మంగళవారం సచివాలయంలో రాష్ట్ర దివ్యాంగుల శాఖ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు.

కాళేశ్వరం ఎత్తిపోతలకు అనుమతులు మరింత జాప్యం

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి కేంద్ర జల సంఘం నుంచి అన్నిరకాల అనుమతులు రావడం మరింత జాప్యం కానుంది. కీలకమైన రెండు అనుమతులపై జలసంఘం అడిగిన సమాచారంపై మూడు నెలలుగా కసరత్తు చేస్తున్న నీటిపారుదలశాఖ... ఒక అంశంపై మార్చి మొదటి వారంలో వివరాలను అందజేసే అవకాశముంది. మరో అంశంపై సమాచారం ఇవ్వడానికి ఇంకొంత సమయం పడుతుంది. ఆ తర్వాతే జలసంఘానికి చెందిన సాంకేతిక సలహా సంఘం(టీఏసీ) నిర్ణయం తీసుకొంటుంది. అనంతరం పెట్టుబడి అనుమతి కోసం వెళ్తుంది. కేంద్రం నుంచి ఆర్థికసాయం అందాలంటే... అది పెట్టుబడి అనుమతి వచ్చిన తర్వాతే! కాళేశ్వరం ఎత్తిపోతలకు అంతర్రాష్ట్ర అనుమతి, నీటి లభ్యత తదితర అనుమతులిచ్చిన కేంద్ర జలసంఘం... సాగునీటి ప్రణాళిక, పెట్టుబడి-ప్రయోజనానికి సంబంధించిన అంశాలపై మాత్రం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. గత నవంబరులో ఈ రెండు డైరెక్టరేట్ల నుంచి కొన్ని అభ్యంతరాలను వ్యక్తంచేసి, సమాధానాలివ్వాలని కోరింది. 180 టీఎంసీలు మేడిగడ్డ నుంచి మళ్లించడం; ఎల్లంపల్లి నుంచి 20 టీఎంసీలు; 25 టీఎంసీల భూగర్భజల వినియోగం కలిపి మొత్తం 225 టీఎంసీల నీటి వినియోగంతో ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టింది. 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు... 18.82 లక్షల ఎకరాల స్థిరీకరణ, హైదరాబాద్ తాగునీటికి 30 టీఎంసీలు, పారిశ్రామిక అవసరాలకు 16 టీఎంసీలు, మార్గమధ్యంలో గ్రామాల తాగునీటికి పది టీఎంసీలు కేటాయించారు. ఈ పథకంలో అధిక సంఖ్యలో రిజర్వాయర్లు ఉన్నందున... ప్రతి జలాశయం కింద ఆయకట్టు ఎంత, ఏయే పంటలు సాగుచేయాలన్నది 'సమీకృత నీటి వినియోగం' కింద ప్రణాళిక వేసి... తదనుగుణంగా ప్రతిపాదనలు పంపాలని జలసంఘంలోని సంబంధిత డైరెక్టరేట్ కోరింది. కాళేశ్వరం సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారుచేసిన వాప్కోస్ ఈ బాధ్యత తీసుకుంది. 3 నెలలైనా ఇంకా తుదినివేదిక అందలేదు. వచ్చేవారం వాప్కోస్ నివేదిక ఇచ్చిన తర్వాత, దానిని పరిశీలించి జలసంఘానికి పంపనున్నారు. పెట్టుబడి-ప్రయోజనానికి సంబంధించి సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంది. ఈ రెండు డైరెక్టరేట్ల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత... టీఏసీ సమావేశం తుది అనుమతి ఇస్తుంది. జలవనరుల మంత్రిత్వశాఖే పెట్టుబడి అనుమతి ఇస్తుంది.

2.45 లక్షల ఎకరాల క్రమబద్ధీకరణ

కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: భూ దస్త్రాల ప్రక్షాళనలో భాగంగా గతేడాది సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ 31వతేదీ వరకు వచ్చిన భూముల సాదాబైనామా తాలూకూ దరఖాస్తులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. ప్రక్షాళన సందర్భంగా హైదరాబాద్ మినహా 30 జిల్లాల పరిధిలో 2,45,668.14 ఎకరాల క్రమబద్ధీకరణకు సంబంధించి పలువురు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి ఆమోదం మేరకు..పట్టాదారు పాసు పుస్తకాలు, భూమిహక్కుల చట్టం-1989లోని సెక్షన్ 5-ఎ కింద ఆయా భూముల క్రమబద్ధీకరణకు వీలుకల్పిస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి మంగళవారం ఆదేశాలు జారీచేశారు.

మూఢనమ్మకాల నిరోధానికి చట్టం తేవాలి

ఈనాడు, హైదరాబాద్: మూఢ నమ్మకాల నిరోధానికి ప్రత్యేక చట్టాన్ని తేవాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.ఆదినారాయణ హోంమంత్రి నాయని నర్సింహారెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన హోంమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ తరహా చట్టాలను తీసుకొచ్చాయని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన హోంమంత్రి రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఈ చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఏటా ఫిబ్రవరి 28న నిర్వహించుకునే జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జేవీవీ రూపొందించిన గోడపత్రికను నాయని నర్సింహారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, రాజా ఎన్.వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజులో ఫ్లూ వైరస్ చిత్తు

* జపాన్‌లో అందుబాటులోకి రానున్న సరికొత్త ఔషధం



టోక్యో: ఇన్‌ఫ్లుయెంజాపై పోరులో సరికొత్త ముందడుగు! ఫ్లూ వైరస్‌ను కేవలం ఒక్కరోజులో మట్టుబెట్టగల అద్భుత ఔషధాన్ని శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. 'క్సోఫ్లూజా'గా పిలుస్తున్న ఈ నూతన ఔషధ వినియోగానికి జపాన్ ఆరోగ్యశాఖ ఇటీవలే ఆమోదం తెలిపింది. ఈ ఏడాది మేలోగా 'క్సోఫ్లూజా' విపణిలో అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌కు విరుగుడుగా ఇప్పటికే స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు తయారుచేసిన 'టామిఫ్లూ' ఔషధానికి 'క్సోఫ్లూజా' గట్టి పోటీదారుగా మారుతుందని చైనా వార్తాసంస్థ 'షిన్హువా' అభిప్రాయపడింది. స్విస్ శాస్త్రవేత్తలు రూపొందించిన ఔషధంతో పోలిస్తే.. 'క్సోఫ్లూజా' తక్కువ మోతాదులోనే అవసరమవుతుందని వెల్లడించింది. రోజుకొక మాత్ర చొప్పున ఐదురోజులపాటు ఈ ఔషధాన్ని తీసుకుంటే సరిపోతుందని పేర్కొంది. ఒక్కరోజులోనే వైరస్‌ను అది మట్టుబెడుతుందని.. అనంతరం వైరస్ ప్రతిరూపాలు తయారుకాకుండా నివారిస్తుందని వివరించింది.


తేలు విషంతో కీళ్లవాతానికి చికిత్స!



హ్యూస్టన్: కీళ్లవాత రోగులకు 'స్వస్థ'వార్త! తేలు విషంతో... ఇప్పుడున్న వాటికంటే ఎంతో మెరుగైన చికిత్స త్వరలో అందుబాటులోకి రానుంది. పైగా ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవట!

రోగ నిరోధక వ్యవస్థ సొంత శరీరంపై ఎదురుతిరగడం (ఆటో ఇమ్యూన్) వల్ల తలెత్తే రుగ్మతల్లో కీళ్లవాతమొకటి. బేలార్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన ప్రొఫెసర్ క్రిస్టీన్ బీటన్ నేతృత్వంలోని బృందం దీనిపై ఇటీవల పరిశోధన సాగించింది. 'ఫైబ్రోబ్లాస్ట్-లైక్ సినోవియోసైట్లు (ఎఫ్ఎల్ఎస్)'గా పిలిచే కణాలు... కీలు నుంచి కీలుకు ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో అవి స్రవించే హానికర ద్రవం కారణంగా రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతిని... కీళ్లవాపులు, నొప్పులు తలెత్తుతాయి. ఈ కణాలపై ఉండే పొటాషియం పొరలు తెరచుకోవడం వల్లే రోగకారక ద్రవం బయటకు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే... తేలు విషంలోని 'బూథస్ థములస్ (ఐబిరియోటాక్సిన్)' అనే పదార్థానికి ఈ పొరను నిలువరించే గుణమున్నట్లు తేల్చారు. ఈ పదార్థాన్ని ఎలుకలపై విజయవంతంగా ప్రయోగించి నిర్ధారించుకున్నారు కూడా!

తరచూ పరీక్షలతో మధుమేహం అదుపు!



దిల్లీ: రక్తంలో గ్లూకోజు స్థాయిని తెలుసుకోడానికి తరచూ పరీక్షలు చేయించుకుంటే... మధుమేహం అదుపులో ఉంటుందట! పరీక్షలతో వ్యాధి నియంత్రణ ఎలా సాధ్యమవుతుందని ఆశ్చర్యపోతున్నారా? కానీ... ఇది నిజమేనట!! గురుగ్రామ్‌కు చెందిన 'హెల్థియన్స్ ఆరోగ్య సేవల సంస్థ' పరిశోధనలో తేలిందీ విషయం. దిల్లీ, జాతీయ రాజధాని ప్రాంతంలో పరిశోధకులు నిరుడు 5 లక్షల మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. పాతికేళ్లు దాటినవారిలో 39% మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు తేలింది. విచిత్రం ఏంటంటే- తరచూ రక్తపరీక్షలు చేయించుకోవడం వల్ల... వ్యాధి నుంచి బయటపడాలన్న మానసిక ప్రేరణ ఎక్కువవుతుందట. ఫలితంగా ఆహారం, వ్యాయామం వంటి విషయాల్లో వారు జాగ్రత్తలు పాటించి.. వ్యాధిపై విజయం సాధిస్తున్నారట. "ఏడాదికి రెండుసార్లు రక్త పరీక్షలు చేయించుకున్న వారి కంటే... రెండు నెలలకోసారి పరీక్షలు చేయించుకునేవారు మధుమేహాన్ని బాగా నియంత్రణలో ఉంచుకోగలుగుతున్నారు" అని ఆకాశ్ హెల్త్‌కేర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సీనియర్ వైద్యులు డా.విక్రమ్ జీత్ సింగ్ విశ్లేషించారు.

సెన్సెక్స్	నిఫ్టీ	రూపాయి	బంగారం	వెండి	ముడి చమురు
▼ 99	▼ 28	64.87 ▼	30695 ▼	38495 ▼	66.86 ▼
34346	10554	(ఒక అమెరికా డాలరుకు) 08 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 55	ముంబయిలో కిలో రూ.లలో 115	(బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం-/నష్టం-
డోజోన్స్	25,683	–26
నాస్‌డాక్	7,388	–34
నిక్కీ 225 (జపాన్)	22,390	+236
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,540	–15
షాంఘై(చైనా)	3,292	–38
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,282	–07
డాక్స్ (జర్మనీ)	12,491	–36

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.99	68.40
పౌండ్ స్టెర్లింగ్	82.36	95.52
యూరో	72.73	84.34
జపనీస్ యెన్/100	55.18	64.01
ఆస్ట్రేలియా డాలరు	46.27	53.56
సింగపూర్ డాలరు	44.80	53.06
థాయ్ బాత్/100	188.40	225.32
బహ్రెయిన్ దీనార్	159.73	183.05
కువైట్ దీనార్	178.90	222.70
సౌదీ రియాల్	15.68	18.60
యూఏఈ దిర్హమ్	16.06	18.77
మలేషియా రింగిట్	14.78	18.17
చైనీస్ యువాన్	7.27	11.78



మంగళవారం నిఫ్టీ కదలికలు



కంపెనీల మేనేజర్లకు 'డేటా'లో శిక్షణ

ప్రారంభించిన టాలెంట్ స్ప్రింట్

ఈనాడు, హైదరాబాద్: అన్ని రంగాల్లోని కంపెనీల్లో డేటా విశ్లేషణ కీలకంగా మారుతోంది. పై స్థాయి మేనేజర్లు, యాజమాన్యం డేటా విశ్లేషణ ద్వారా కీలక నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎప్పటికప్పుడు వినియోగదారుల అభిరుచులు మారడం, మార్కెట్, పోటీ పరిస్థితుల్లో మార్పు వంటి అంశాలు బిగ్ డేటా విశ్లేషణ ప్రాధాన్యాన్ని పెంచుతున్నాయి. దీంతో డేటా విశ్లేషణపై అవగాహన, నైపుణ్యాన్ని పెంచుకోవడానికి చాలా కంపెనీల ఉన్నత స్థాయి మేనేజర్లు ఆసక్తి చూపుతున్నారని టాలెంట్ స్ప్రింట్ ఎండీ, సీఈఓ శంతను పాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో మేనేజర్లకు బిగ్ డేటా, డేటా విశ్లేషణపై అవగాహన కల్పించడానికి టాలెంట్ స్ప్రింట్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందుకు కోల్‌కతాకు చెందిన ప్రాక్సిస్ బిజినెస్ స్కూల్ ఫౌండేషన్‌తో చేతులు కలిపింది. డేటా సైంటిస్టులు, అనలిస్టులకు గిరాకీ పెరుగుతోందని, నిర్ణయాలు వేగంగా తీసుకోవాలంటే మేనేజర్లకు కూడా డేటా విశ్లేషణపై అవగాహన ఉండాలని ప్రాక్సిస్ బిజినెస్ స్కూల్ ఫౌండేషన్ డైరెక్టర్ చరణ్‌జీత్ సింగ్ తెలిపారు. ఇందుకు 'డేటా సైన్స్ ఫర్ మేనేజర్స్' ప్రోగ్రామ్ దోహదం చేస్తుందన్నారు. ప్రాక్సిస్ బిజినెస్ స్కూల్ డేటా సైన్స్‌లో ఎంబీఏ కార్యక్రమాన్ని అందిస్తోంది.

అంతా ప్రభుత్వ బ్యాంకుల వల్లే

- వరుస లాభాలకు అడ్డుకట్ట
- పీఎన్‌బీకి 12 శాతం నష్టం

సమీక్ష

సూచీల జోరుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు అడ్డుకట్ట వేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ మోసం విలువను పెంచడంతో ఈ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ, ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, అలహాబాద్ బ్యాంక్ షేర్లు 7.18 శాతం వరకు నష్టాలు నమోదు చేశాయి. డిసెంబరు త్రైమాసికానికి జీడీపీ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 34,558.56 పాయింట్ల వద్ద మెరుగ్గానే ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 34,610.79 పాయింట్ల వద్ద గరిష్ఠానికి తాకింది. అనంతరం నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఒకానొకదశలో 34,314.87 పాయింట్ల కనిష్ఠానికి తాకిన సూచీ.. చివరకు 99.36 పాయింట్ల నష్టంతో 34,346.39 దగ్గర స్థిరపడింది. గత రెండు సెషన్లలో సూచీ 626.25 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ సైతం 28.30 పాయింట్లు కోల్పోయి 10,554.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,537.25- 10,631.65 పాయింట్ల మధ్య కదలాడింది.



పీఎన్‌బీ నేలచూపులు: నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల మోసం 2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.13,000 కోట్లు) ఉండొచ్చని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తాజాగా అంచనా వేయడంతో షేర్లు నేలచూపులు చూశాయి. ఒకానొకదశలో 14.11 శాతం కుప్పకూలిన షేరు.. రూ.96.10 వద్ద 52 వారాల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 12.11 శాతం నష్టంతో రూ.98.35 వద్ద ముగిసింది. గత నాలుగు సెషన్లలో షేరు 16 శాతం కోల్పోవడంతో రూ.4,547.35 కోట్ల మేర మార్కెట్ విలువ తుడిచిపెట్టుకుపోయింది.

✦ రుణాలను తీర్చడానికి కట్టుబడి ఉన్నామని సింభౌలి షుగర్స్ ప్రకటించడంతో షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 15.84 శాతం పెరిగిన షేరు.. చివరకు 10.92 శాతం లాభంతో రూ.15.75 వద్ద ముగిసింది. కంపెనీకి రుణాలిచ్చిన ఓబీసీ షేరు 0.95 శాతం పెరిగి రూ.96.05 దగ్గర స్థిరపడింది.

✦ ప్రస్తుతానికి విలీన ప్రతిపాదనేమీ లేదని ప్రకటించడంతో అంబుజా సిమెంట్స్ షేరు 3.91 శాతం నష్టంతో రూ.252.05 వద్ద ముగిసింది. ఇక ఏసీసీ షేరు 1.82 శాతం తగ్గి రూ.1,632.65 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 15 నష్టాలు చవిచూశాయి. యాక్సిస్ బ్యాంక్ 2.68%, ఎస్‌బీఐ 2.53%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.25%, సన్ ఫార్మా 2.02%, ఓఎన్‌జీసీ 1.23%, టాటా స్టీల్ 1.23%, మారుతీ సుజుకీ 1.22%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.17%, కోల్ ఇండియా 1.13% చొప్పున డీలాపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్ 2.07%, డాక్టర్ రెడ్డీస్ 1.82%, ఎన్‌టీపీసీ 1.59%, హీరో మోటోకార్ప్ 1.34%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.21%, పవర్‌గ్రిడ్ 1.12%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 2.09% నీరసపడింది. బ్యాంకింగ్, పీఎస్‌యూ, ఫైనాన్స్, లోహ, ఆరోగ్య సంరక్షణ, మౌలిక, యంత్ర పరికరాల షేర్లు అదే బాటలో నడిచాయి. టెక్, ఐటీ, మన్నికైన వినిమయ వస్తువులు, ఎఫ్‌ఎమ్‌సీజీ, చమురు- గ్యాస్ షేర్లు మాత్రం రాణించాయి.

17 ఏళ్లలో.. 3.5 కోట్లు

ద్విచక్ర వాహన తయారీలో హోండా మోటార్స్ ఘనత

దిల్లీ: హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) అరుదైన ఘనత సాధించింది. భారత్‌లో కార్యకలాపాలు మొదలుపెట్టిన 17 ఏళ్లలోనే 3.5 కోట్ల వాహనాల తయారీ మైలురాయిని అధిగమించింది. దేశంలో ఇలాంటి ఘనతను సాధించిన మొట్టమొదటి ద్విచక్ర వాహన తయారీ కంపెనీ తమదేనని హెచ్ఎంఎస్ఐ ప్రకటించింది. హోండా మోటార్ కంపెనీ (జపాన్)కి అనుబంధ సంస్థ అయిన హెచ్ఎంఎస్ఐ 2001లో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. అప్పటినుంచి 11 ఏళ్లలోనే కోటి వాహనాల తయారీ లక్ష్యాన్ని సాధించామని కంపెనీ తెలిపింది.

హైదరాబాద్‌లో 'మైగేట్' సేవలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని గేటెడ్ అపార్ట్‌మెంట్లకు మొబైల్ ఆధారిత భద్రత మేనేజ్‌మెంట్ సేవలను మైగేట్ ప్రారంభించింది. ఇప్పటికే 28 గేటెడ్ కమ్యూనిటీలకు సేవలు అందిస్తున్నామని.. ఇందులో మైహోమ్ జ్యువెల్, అపర్ణ సరోవర్ వంటివి ఉన్నాయని కంపెనీ తెలిపింది. మొత్తం 15,000 ఫ్లాట్లు, విల్లాలకు సేవలు అందిస్తున్నట్లు వివరించింది. 2018 చివర నాటికి హైదరాబాద్‌లో 400 గేటెడ్ కమ్యూనిటీలకు భద్రత సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యవస్థలో సందర్శకులు వచ్చేది, వెళ్లేది, ఆటోమేటిక్ విజిటర్ ప్రవేశం, పిల్లల భద్రత హెచ్చరికలు తదితర సదుపాయాలు ఉంటాయి.

హెటెరో హెచ్ఐవీ చికిత్సా ఔషధం

దిల్లీ: హెచ్ఐవీ చికిత్సలో ఉపయోగించే ఎమ్‌ట్రిసిటబైన్ (200 ఎంజీ), టెనోఫోవిర్ అలఫెనమైడ్ (25 ఎంజీ)ల నిర్దిష్ట పరిమాణ సంయుక్త (ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్- ఎఫ్‌డీసీ) ఔషధం జనరిక్ రూపాన్ని భారత విపణిలోకి హెటెరో విడుదల చేసింది. ఈ సంయుక్త ఔషధ ఉత్పత్తికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి ఆమోదం లభించిందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 'టఫెరో-ఈఎం' బ్రాండ్ పేరుతో హెటెరో హెల్త్‌కేర్ సంస్థ ద్వారా విక్రయం, పంపిణీ చేయనున్నామని వెల్లడించింది.

మార్కెట్ కబుర్లు

- ✦ ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక పెట్టుబడులు ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా 89.69 ఎకరాల ప్రధానేతర స్థలాన్ని విక్రయించేందుకు **స్కూటర్స్ ఇండియా** డైరెక్టర్ల బోర్డు అనుమతినిచ్చింది.
- ✦ పబ్లిక్ ఇష్యూకు వెళ్లేందుకు **టీసీఎన్ఎస్ క్లాతింగ్** సెబీకి దరఖాస్తు సమర్పించింది. ఇష్యూలో భాగంగా ప్రస్తుత వాటాదార్లకు చెందిన 1.57 కోట్ల షేర్లను విక్రయించనుంది.
- ✦ జీఈతో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త సంస్థ అల్‌స్టోమ్ భారత్ ఫోర్జ్ పవర్‌లో మిగిలిన 26 శాతం వాటాను కూడా విక్రయించినట్లు **భారత్ ఫోర్జ్** తెలిపింది.
- ✦ **హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్** పబ్లిక్ ఇష్యూ రెండో రోజున 44 శాతం షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. ఇష్యూలో భాగంగా 1,21,37,070 షేర్లను విక్రయానికి ఉంచగా.. ఎన్ఎస్ఈలో లభ్యం అవుతున్న సమాచారం ప్రకారం 53,19,490 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. ఇష్యూ నేటితో ముగుస్తుంది.
- ✦ ఇ-వేలం ద్వారా గుడ్‌గావ్‌లోని 11.76 ఎకరాల స్థలాన్ని రూ.1,500 కోట్లకు తమ అనుబంధ సంస్థ ఆదర్శిని రియల్ ఎస్టేట్ డెవలపర్స్ దక్కించుకుందని **డీఎల్ఎఫ్** తెలిపింది. హర్యానా స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ ఇ-వేలాన్ని నిర్వహించింది.
- ✦ క్రాస్ కరెన్సీ డెరివేటివ్‌ల ట్రేడింగ్‌పై లావాదేవీ రుసుం ఉండదని **నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)** వెల్లడించింది. ఈ తరహా కాంట్రాక్టుల ట్రేడింగ్‌లో పాల్గొనేలా మదుపర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

ఐటీ ఇ-మదింపు సమాచారం అమల్లోకి

- నోటిఫై చేసిన సీబీడీటీ

దిల్లీ: ఆదాయపు పన్ను (ఐటీ) చెల్లింపుదార్లకు ఆన్‌లైన్‌లో నోటీసులు జారీచేసేందుకు కొత్తగా రూపొందించిన కేంద్రీకృత సమాచార పథకాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) నోటిఫై చేసింది. ఈనెల 22న ఈ నోటిఫికేషన్ విడుదలైంది. పన్ను చెల్లింపు అధికారులు, మదింపుదార్ల మధ్య లావాదేవీలు కాగిత రహితంగా చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా ఐటీ విభాగంలో ఇంటర్నెట్ ఆధారిత స్వతంత్ర కేంద్రీకృత సమాచార కేంద్రం (సీసీసీ) నెలకొల్పుతారు. ఐటీ చట్టంలోని 133సి సెక్షన్ కింద, ఏ వ్యక్తికైనా ఈ కేంద్రం నోటీస్ పంపవచ్చు. ఐటీ అధికారుల పరిశీలన కోసం ఏదేని సమాచారం, పత్రాలు పంపాలని కోరవచ్చు.

ఇదీ ప్రక్రియ: నోటీస్ జారీ చేసే అధికారి, డిజిటల్ సంతకాన్ని మాత్రమే వినియోగిస్తారు.

- ✦ మదింపుదార్లకు ఇమెయిల్ ద్వారానే నోటీస్ జారీ అవుతుంది. దీంతోపాటు మొబైల్‌కు సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) కూడా చేరుతుంది.
- ✦ పన్ను చెల్లింపుదార్ల నుంచి వచ్చే సమాధానాన్ని, సీసీసీలోని చదివే యంత్రం అందుకుంటుంది.
- ✦ సమాధానం జాప్యం అయితే ఇ మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా మళ్లీ గుర్తు చేస్తారు. లేఖలు రాస్తారు, కాల్స్ కూడా వెళ్తాయి.
- ✦ ఈ కేంద్రంలోని కాల్‌సెంటర్‌కు మదింపుదార్లు ఫోన్ చేసి, తమ సందేహాలు కూడా తీర్చుకోవచ్చు.

చౌకగా ఆండ్రాయిడ్ గో స్మార్ట్‌ఫోన్లు

- ఎయిర్‌టెల్, గూగుల్ భాగస్వామ్యం

దిల్లీ: దేశీయ విపణిలోకి తక్కువ ధర ఆండ్రాయిడ్ ఓరియో (గో ఎడిషన్) స్మార్ట్‌ఫోన్లు ఆవిష్కరించేందుకు గూగుల్‌తో జట్టుకట్టినట్లు భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ర్యామ్ 1జీబీ అంతకంటే తక్కువ ఉండే ఆండ్రాయిడ్ ఓరియో గో ఎడిషన్ స్మార్ట్‌ఫోన్లను గూగుల్ గత డిసెంబరులో ఆవిష్కరించిన సంగతి విదితమే. తక్కువ డేటాను వినియోగించుకుంటూ, ఎక్కువ వేగంతో పనిచేసే యాప్‌లను ఈ చౌక స్మార్ట్‌ఫోన్లలో నిక్షిప్తం చేయనున్నారు. 'నా తొలి స్మార్ట్ ఫోన్' (మేరా పహ్లా స్మార్ట్‌ఫోన్) కింద అందిస్తున్న ప్రాథమిక శ్రేణి 4జీ స్మార్ట్ ఫోన్లు, ఈ ఏడాది మార్చి నుంచి ఆండ్రాయిడ్ ఓరియో (గో ఎడిషన్) ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్)తోనే ఉంటాయని ఎయిర్‌టెల్ తెలిపింది. వీటిల్లో మైఎయిర్‌టెల్, ఎయిర్‌టెల్ టీవీ, వింక్‌మ్యూజిక్ యాప్‌లు నిక్షిప్తమయ్యే ఉంటాయి. కోట్ల మంది ఫీచర్‌ఫోన్ వినియోగదారులు, స్మార్ట్‌ఫోన్లలోకి.. తద్వారా ఆన్‌లైన్‌కు చేరేందుకు ఆండ్రాయిడ్‌గో ఫోన్లు ఉపకరిస్తాయని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వాణి వెంకటేశ్ పేర్కొన్నారు.

లావా తొలి ఫోన్: ఆండ్రాయిడ్ ఓరియో (గో ఎడిషన్) ఓఎస్‌తో జడ్50 స్మార్ట్‌ఫోన్‌ను మార్చి మధ్యకల్లా విక్రయశాలలకు అందుబాటులోకి తెస్తామని లావా సంస్థ ప్రకటించింది. 4.5 అంగుళాల తెర, 1.1 గిగాహెర్ట్జ్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్, 1 జీబీ ర్యామ్, 8 జీబీ అంతర్గత మెమొరీ, ముందు-వెనుక 5 మెగాపిక్సెల్ కెమేరాలు ఉండే ఈ ఫోన్ ధరను సంస్థ ప్రకటించలేదు.


విశాఖలో డెస్కెరా క్లౌడ్ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు, సంస్థలకు సమగ్ర క్లౌడ్ ఆధారిత వ్యాపార నిర్వహణ సాఫ్ట్‌వేర్, సొల్యూషన్లను అందిస్తున్న డెస్కెరా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు అనుగుణంగా 'క్లౌడ్ కనెక్ట్ ప్రోగ్రామ్'ను అమలు చేయనున్నట్లు డెస్కెరా సీఈఓ శశాంక్ దీక్షిత్ తెలిపారు. అవగాహన ఒప్పందానికి అనుగుణంగా విశాఖపట్నంలో క్లౌడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. దాదాపు రూ.500 కోట్ల పెట్టుబడులు పెడుతుంది. దీని వల్ల దాదాపు 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని దీక్షిత్ తెలిపారు.

టోకు ధరలకు గృహోపకరణాలు!

ఈనాడు, హైదరాబాద్: గొలుసుకట్టు ఔషధ విక్రయ కేంద్రాలను నిర్వహిస్తున్న మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు, సీఈఓ మధుకర్ గంగడి కొత్త వ్యాపారంలోకి అడుగు పెట్టారు. ఫర్నీచర్ నుంచి గృహోపకరణాలు, గృహ నిర్మాణ వస్తువుల వరకూ అనేక రకాల ప్రీమియం ఉత్పత్తులను ఫ్యాక్టరీ ధరకే రిటైల్‌గా విక్రయించడానికి బ్యాచ్‌ట్యాగ్ డాట్‌కామ్ (BatchTag.com)ను ప్రారంభించారు. ఇందు కోసం దేశ, విదేశాల్లోని ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు.

27న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	350
బెంగళూరు	385	చెన్నై	395
28వ తేదీకి...		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	348	నమక్కల్	380

టీవీఎస్ ఎన్‌టార్క్ 125

- దక్షిణాది విపణిలోకి విడుదల

ఈనాడు, హైదరాబాద్: విపణిలోకి స్పోర్టీ స్కూటరు 'టీవీఎస్ ఎన్‌టార్క్ 125'ను టీవీఎస్ మోటార్ విడుదల చేసింది. స్టెల్త్ విమానం స్ఫూర్తితో ఈ స్కూటరును అభివృద్ధి చేశామని సంస్థ మార్కెటింగ్ మేనేజర్ బెనోయ్ అంథోని తెలిపారు. స్కూటర్ల విభాగంలో 3 వాల్వ్ ఇంజిన్, బ్లూ టూత్ కనెక్షన్ కలిగిన మొదటి స్కూటరు ఇదేనని వివరించారు. నావిగేషన్ సాయం, స్ట్రీట్, స్పోర్ట్, రైడ్ మోడ్‌లు, యాప్ ఆధారిత పార్కింగ్ లొకేటరు, ఇంజిన్ ఆయిల్ వేడి సూచిక, అత్యధిక వేగం నమోదు (టాప్ స్పీడ్ రికార్డరు) వంటి అనేక సాంకేతిక పరమైన సదుపాయాలు ఈ స్కూటరులో ఉన్నాయి. ప్రామాణిక పరిస్థితుల్లో లీటరు ఇంధనానికి 48 కిలోమీటర్లు ప్రయాణించగలదని కంపెనీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ స్కూటరు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయని, ఎక్స్ షోరూమ్ ధర రూ.61,450 అని తెలిపింది. ప్రస్తుతం టీవీఎస్ మోటార్ నెలకు 90 వేల స్కూటర్లను విక్రయిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో తాజాగా ప్రవేశపెట్టిన స్కూటర్ ద్వారా స్కూటర్ల అమ్మకాలు భారీగా పెరగగలవని కంపెనీ భావిస్తోంది. 2 లక్షల 'ఎన్‌టార్క్ 125' స్కూటర్లను విక్రయించాలని యోచిస్తోంది. ప్రతినెల దేశంలో 5.7 లక్షల స్కూటర్లు విక్రయం అవుతున్నాయని, ఇందులో టీవీఎస్‌కు 16 శాతం వాటా ఉందని జనరల్ మేనేజర్ (విక్రయాలు) ఆర్.బాలాజీ తెలిపారు.



కొత్త స్కూటరును విపణిలోకి విడుదల చేస్తున్న టీవీఎస్ మోటార్ జనరల్ మేనేజర్లు బెనోయ్ అంథోని, బాలాజీ

అవసరాలకు తగినట్లుగా 5జీ సాంకేతికత

- టెస్ట్ బెడ్ కేంద్రాల ఏర్పాటుకు రూ.224 కోట్లు
- కేంద్ర టెలికాం విభాగం ప్రత్యేక కార్యదర్శి ఎన్.శివశైలం

ఈనాడు, సంగారెడ్డి: దేశ అవసరాలకు తగినట్లుగా 5జీ సాంకేతికతకు సంబంధించిన ప్రమాణాలను నిర్వచించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చే క్రమంలో ఇదే కీలకాంశంగా మారుతుందని, ఈ దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(హైదరాబాద్) ప్రాంగణంలో మూడు రోజులుగా కమ్యూనికేషన్ల అంశమై 24వ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమానికి కేంద్ర టెలికాం విభాగం ప్రత్యేక కార్యదర్శి ఎన్.శివశైలం హాజరై మాట్లాడారు. గతంలో 2జీ, 3జీ లాంటి సాంకేతికతలను మనం ఇతర దేశాల నుంచి తీసుకునేవాళ్లమన్నారు. 5జీ అంశానికి వచ్చేసరికి అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే మనమే ఈ విషయంలో ముందంజలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. 2022 కల్లా 5జీ సాంకేతికతను దేశంలోని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా ప్రయత్నాలు సాగుతున్నాయని వివరించారు. దీని ద్వారా కొత్త ఉద్యోగాల సృష్టితోపాటు ప్రజారోగ్యం, విద్యా, భద్రతాపరమైన రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. దేశవ్యాప్తంగా 50 మిలియన్ల యాక్సెస్ పాయింట్లను అందుబాటులోకి తేనున్నామన్నారు. ఇందుకోసం తొలిదశగా రూ.224 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెలాఖరు వరకు రూ.34 కోట్లు వెచ్చించి ఒక టెస్ట్ బెడ్ కేంద్రం ఏర్పాటు పనులు పూర్తి చేస్తామన్నారు.

ఎస్‌బీఐ వెల్త్ సేవల విస్తరణ

- హైదరాబాద్‌లో 8వ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: అధిక నికర విలువ (హెచ్ఎన్ఐ) కలిగిన ఖాతాదారులకు వెల్త్ మేనేజ్‌మెంట్ సేవలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విస్తరిస్తోంది. రెండేళ్ల క్రితం ఈ సేవలను దేశ వ్యాప్తంగా బ్యాంకు ప్రారంభించిందని, హైదరాబాద్‌లో ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చాయని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) జె.స్వామినాథన్ తెలిపారు. ఖాతాదారులకు వెల్త్ మేనేజ్‌మెంట్ సేవలను అందించడానికి 'ఎస్‌బీఐ ఎక్స్‌క్లూసిఫ్ వెల్త్ మేనేజ్‌మెంట్' హబ్‌లను ఎస్‌బీఐ ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకూ హైదరాబాద్‌లో ఇటువంటి కేంద్రాలు 7 ఉన్నాయి. తాజాగా మాదాపూర్‌లోని 'ఎస్‌బీఐ ఇన్‌టచ్' శాఖలో 8వ కేంద్రాన్ని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం స్వామినాథన్ ప్రారంభించారు. మార్చి చివరి నాటికి మరో రెండుమూడు హబ్‌లను హైదరాబాద్‌లో బ్యాంకు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. వరంగల్, కరీంనగర్ తదితర ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కూడా ఈ సేవలను విస్తరించాలని బ్యాంకు యోచిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని ఎస్‌బీఐ ఎక్స్‌క్లూసిఫ్ వెల్త్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఎస్‌బీఐ ఇన్‌టచ్ శాఖల్లో అప్పటికప్పుడే ఖాతా తెరవడం వంటి అనేక సదుపాయాలు ఉన్నాయి.



హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో 'ఎస్‌బీఐ ఎక్స్‌క్లూజివ్ వెల్త్ మేనేజ్‌మెంట్' కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఎస్‌బీఐ, హైదరాబాద్ సర్కిల్ సీజీఎం జె.స్వామినాథన్, తదితరులు

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 410.45 (415.05) 1334518
AMBUJA CEMEN 251.40 (262.95) 10403386
ASIAN PAINTS 1110.35 (1104.80) 610498
AUROBIND PHA 614.40 (615.05) 1780359
AXIS BANK LT 538.40 (552.30) 4136383
BAJAJ AUTO L 3034.70 (3008.70) 325597
BAJAJ FINANC 1656.80 (1674.95) 605244
BHARTI AIRTE 430.50 (423.15) 4675953
BHARTI INFRA 344.80 (344.45) 6738482
BOSCH LTD 19017.85 (19119.15) 6822
BPCL 426.95 (433.00) 6814803
CIPLA 586.50 (590.10) 1349590
COAL INDIA L 309.00 (314.05) 6667601
DR. REDDYS 2236.00 (2193.80) 676152
EICHER MOTOR 27154.65 (27185.95) 50684
GAIL 457.05 (463.20) 4588093
HCL TECH 949.90 (946.05) 1439714
HDFC 1828.65 (1843.25) 2558313
HDFC BANK 1902.55 (1911.55) 1196832
HERO MOTOCOR 3585.50 (3537.85) 320893
HINDALCO IND 244.30 (246.20) 4805004
HINDUSTAN UN 1346.35 (1333.30) 1316559
HPCL 391.50 (391.75) 2814935
ICICI BANK 322.15 (327.05) 9623651
INDIABULLS H 1279.75 (1294.35) 1142949
INDIAN OIL 377.45 (376.70) 3906960
INDUSINDBANK 1685.20 (1691.30) 529068
INFOSYS LTD 1150.20 (1138.60) 3308013
ITC 266.40 (266.55) 7429924
KOTAK MAHIND 1093.05 (1105.15) 1034120
LARSEN & TOU 1338.10 (1344.25) 2243499
LUPIN 826.30 (821.30) 976292
M&M 739.80 (735.40) 1429191
MARUTI SUZIK 8891.20 (9005.35) 684609
NTPC LTD 165.55 (162.95) 3204111
ONGC 188.50 (190.35) 6611097
POWER GRID C 197.75 (196.15) 9750068
RELIANCE IND 950.50 (938.70) 6410097
SBI 267.60 (274.45) 20824909
SUN PHARMA 544.80 (555.95) 6920945
TATA CONSULT 3042.35 (3031.70) 858900
TATA MOTORS 372.55 (372.05) 6156672
TATA STEEL L 671.75 (680.20) 6805376
TECH MAHINDR 610.55 (612.45) 1905663
ULTRATECH 4176.10 (4140.80) 179366
UPL LIMITED 721.15 (720.50) 1233367
VEDANTA LIMI 340.60 (343.15) 4697935
WIPRO 291.75 (291.60) 3925139
YES BANK LTD 327.15 (326.15) 15104405
ZEE ENTERTAI 576.50 (585.45) 1137417

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1528.35 (1518.10) 41198
ACC 1632.80 (1661.05) 333670
ASHOK LEYLAN 137.70 (136.80) 9397195
AVENUE SUPER 1354.70 (1291.20) 1794604
BAJAJ FINSER 5121.35 (5192.95) 82961
BANK OFBAROD 141.45 (143.75) 18251152
BEL 152.85 (155.20) 3465893
BHEL 91.35 (93.35) 6008686
BRITANNIA 4952.25 (4964.75) 213517
CADILA HEALT 407.90 (406.90) 466319
COLGATE PALM 1049.15 (1052.85) 434248
CONTAINER 1330.15 (1329.90) 287506
CUMMINS INDI 808.45 (820.80) 194326
DABUR INDIA 328.10 (331.75) 698699
DLF LIMITED 222.45 (228.15) 4117630
EMAMI LIMITE 1094.15 (1104.60) 34860
GLAXOSMI CON 6733.85 (6780.05) 6753
GLAXOSMI PHA 2393.40 (2408.40) 8925
GLENMARK PHA 540.40 (537.55) 501446
GODREJ CONSU 1091.35 (1065.55) 661530
HAVELLS INDI 512.10 (513.05) 738023
HINDUSTAN ZI 329.40 (332.30) 1360525
ICICI PRU LI 413.75 (415.40) 384665
IDEA CELLULR 84.30 (82.35) 20718134
INTERGLOBE A 1337.45 (1337.95) 822147
JSW STEEL LT 318.10 (316.10) 6081243
LIC HOUS.FIN 509.50 (515.90) 1728539
MARICO LIMIT 312.60 (307.25) 959055
MCDOWELL 3279.85 (3248.00) 200096
MOTHERSON 327.20 (327.95) 4607616
MRF 72665.80 (72690.80) 9668
NHPC LTD 27.70 (27.95) 3536611
NMDC LTD 131.10 (131.85) 2128975
OIL INDIA 349.15 (348.95) 394689
ORACLE FIN S 3871.30 (4001.35) 53762
P&G HYG&HEAL 9370.85 (9341.20) 633
PETRONET LNG 249.65 (243.20) 2411909
PIDILITE IND 885.80 (891.50) 475548
PIRAMAL ENTE 2618.25 (2644.00) 148844
PNB 98.35 (112.00) 202069429
POWER FIN CO 107.40 (110.35) 5554775
RURAL ELEC C 145.35 (146.50) 9702894
SAIL 84.25 (86.50) 14511936
SHREE CEMENT 16859.90 (16988.40) 29919
SHRIRAM TRAN 1348.45 (1348.90) 530452
SIEMENS 1164.05 (1171.65) 172035
SUN TV LTD 950.50 (948.10) 935091
TATA POWER 85.65 (85.90) 3483539
TITAN IND 822.60 (819.70) 2089446
TORRENT PHAR 1348.35 (1344.55) 133530

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ALPHAGEO 809 (805.40) 1030
AMAR RAJA BA 816 (818.15) 18849
ANDHRA BANK 45 (45.85) 206325
ANDHRA CEMEN 10.90 (11.23) 24480
ANDHRA PAPER 314.05 (316.35) 3911
ANDHRA PETRO 59.80 (57.80) 102353
ANDHRA SUGAR 506.40 (496.65) 5162
ANJANI PORTL 192.95 (192.85) 6442
ASTRA MICROW 92 (94.95) 82036
AUROBINDO PH 614.35 (615.15) 168949
AVANTEL SOFT 534.30 (538.50) 3959
AVANTI FEEDS 2395.20 (2456.05) 11697
AVON ORG 11.20 (11.75) 17354
BALAJI AMIN 657.95 (668) 4563
BARTRONICS 13.27 (13.61) 56271
BHAGIRA CHEM 306.40 (300) 1364
BHAGYA NAG 50.50 (42.10) 168542
BRILLIANT SE 11.55 (11.35) 243657
CAMBRIDGE TE 72.35 (73.80) 4503
CONT COFFEE 298.65 (294) 6434
COROMAN FERT 543 (542.65) 13633
CYBERMATE 3.18 (3.32) 27418
CYIENT LIMIT 629.50 (636.30) 3062
DECCAN CEMEN 556.60 (576.80) 818
DIVI'S LAB 1035 (1036.15) 74355
DR REDDY 2234.15 (2194.15) 34928
GATI CORPN 113.25 (114.20) 112460
GAYATRI PROJ 212.30 (212) 9026
GMR INFRASTR 18.80 (19.05) 2190983
GOLDST INFRA 218.75 (214.70) 85789
GRANULES (I) 117.25 (119.40) 58788
GSS AMERICA 47.50 (46.70) 120408
GVK POWER 17.15 (17.15) 533311
HBL NIFE POW 56.20 (57.25) 28933
HYD INDUS 1738.60 (1743.50) 827
ILFS ENGINEE 43.95 (44.15) 4929
INNAREDY COM 3.20 (3.30) 14343
IVRCL INFRAS 4.42 (4.46) 183327
KAKATIYA CEM 294.10 (297.05) 5047
KAVERI SEED 506.20 (502.90) 35453
KCP LTD 130.35 (131.90) 11377
KNR CONSTRUC 308.25 (303.25) 23980
LANCO INDUS 351.80 (358.40) 16632
LANCO INFRAT 1.33 (1.38) 2909187
LAURUS LABS 532.45 (521.20) 123011
MADHUCON PRO 27.45 (27.60) 30886
MIC ELECTRON 6.99 (7.30) 31830
MOLD-TEK.TEC 59.25 (61.05) 300
MOLDTK PLA 330.95 (322.10) 2319
NAGARJAGRICH 44.60 (44.20) 16046
NATCO PHARMA 769.55 (775.05) 37082
NAVA BH VENT 154.50 (152) 28373
NCC 130.05 (126.05) 899855
NCL IND 230.60 (228.85) 5447
NEHA INTER 7.44 (7.06) 4945
NEULAND LAB 718.85 (705.50) 3625
NIHAR INFO 15.50 (15) 300
PANYAM CEMEN 47.35 (47.70) 8883
PENNER IND 60.60 (61.55) 57361
PIONEER DIST 186.40 (189) 1976
PITTI LAMIN 91.25 (90.75) 4365
PRISM CEMENT 122.55 (127.35) 130927
PRUDENTL PHA 4.33 (4.43) 108609
RAIN INDUSTR 399.20 (395.15) 858554
RAJVIR INDUS 44.05 (43.75) 197302
RAM INFORMAT 41.90 (42.75) 12025
SATVAH. ISPA 22.60 (22.35) 12976
SMS PHARMA 88.40 (89.40) 2019
SPHERE GLOBA 39.95 (37.15) 22041
SREE RAYAL A 57.15 (57.75) 190535
SRINIVASA SH 59.05 (63.75) 3880
STEEL EXCHAN 31 (31) 40206
SUJANA TOWER 3.96 (3.88) 5532
SUJANA UNIVE 0.93 (0.90) 36403
SURANA TELE 5.50 (5.26) 20108
SUVEN PHARMA 190.55 (191.85) 49212
TAJ GVK HOTE 166.05 (168.05) 4555
TANLA 31.70 (32.35) 34051
TERA SOFTWAR 56.90 (59.05) 8379
VICEROY HOTE 15.70 (15.80) 64595
VIMTA LABS 204.30 (205) 7951
VISAKA IND 689.45 (690.55) 4376
VISTA PHARMA 48.95 (44.80) 325168
VIVIMED LABS 76.95 (78.15) 120452
VST INDUS 3201 (3208.55) 19
YBRANT DIGIT 5.16 (5.27) 202807
ZENTECH 115.90 (118.50) 48487

ఈనాడు బిజినెస్

ట్రయంఫ్ బోన్‌విల్లే స్పీడ్‌మాస్టర్

ధర రూ.11.11 లక్షలు

దిల్లీ: బ్రిటన్ ఖరీదైన బైకుల తయారీ సంస్థ ట్రయంఫ్ మోటార్ సైకిల్స్ తమ క్లాసిక్ క్రూయిజర్ 'బోన్‌విల్లే స్పీడ్‌మాస్టర్'ను భారత విపణిలోకి విడుదల చేసింది. ఈ బైకు ధర రూ.11.11 లక్షలు (ఎక్స్‌షోరూమ్ దేశవ్యాప్తంగా) నిర్ణయించారు. 1200 సీసీ హై టార్క్ ప్యారెలల్ ట్విన్ ఇంజిన్ కలిగిన ఈ బైకులో ట్విన్ డిస్క్ బ్రెంబో బ్రేకులు, హై స్పెషిఫికేషన్ సస్పెన్షన్, 12 లీటర్ల ఇంధన ట్యాంక్ వంటి సదుపాయాలు ఉన్నాయి. 'మా లక్ష్యం కేవలం విపణిలో ఆధిపత్యం మాత్రమే కాదు. భారత్‌లో మొత్తం బైకులను నవీకరించడాన్ని కొనసాగిస్తాం. ఈ విభాగంలో మరింత బలోపేతం అవుతాం' అని ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విమల్ సంబ్లీ తెలిపారు. దేశవ్యాప్తంగా కంపెనీకి 15 విక్రయశాలలు ఉన్నాయి. అయిదు ప్రీమియం విభాగాల్లో కంపెనీ మోటార్‌సైకిళ్లను విక్రయిస్తోంది.



దీపావళి కల్లా 99% మందికి

అందుబాటులో జియో నెట్‌వర్క్

బార్సెలోనా: వచ్చే దీపావళి కల్లా దేశ జనాభాలో 99 శాతం మందికి రిలయన్స్ జియో నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తేవాలన్నది తమ అధినేత ముకేశ్ అంబానీ లక్ష్యమని, రిలయన్స్ జియో అధ్యక్షుడు జ్యోతీంద్ర థక్కర్ వెల్లడించారు. ప్రతి నెలా కొత్తగా 8,000-10,000 టవర్లు నెలకొల్పుతున్నట్లు తెలిపారు. 2జీ కవరేజీని మించి జియో నెట్‌వర్క్ (ఎల్‌టీఈ) ఉండే పరిస్థితి వస్తుందన్నారు. ప్రస్తుతం 16 కోట్ల మంది చందాదార్లు సంస్థకు ఉన్నారన్నారు. విస్తరణలో భాగంగా శామ్‌సంగ్‌తో కలిసి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సేవల్లో పాల్గొంటామని, ఇందువల్ల సంస్థలు, వినియోగదార్లకు మేలు కలుగుతుందన్నారు. రవాణా, వాతావరణ అంచనాలు, వ్యవసాయ రంగాల్లోనూ ఐఓటీ సేవలు అందించాలన్న యోచన ఉందని, ఇందుకు తగిన వ్యవస్థ-వాతావరణం నెలకొల్పాల్సి ఉందని తెలిపారు. ఇందుకోసం మూడోపార్టీ డెవలపర్లతో కలిసి పనిచేస్తామని వివరించారు. ప్రస్తుతం ముంబయిలో అందిస్తున్నామని, ఇకపై నగరాల వారీగా కాకుండా, ఒకేసారి దేశవ్యాప్తంగా ఐఓటీ సేవలకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ప్రస్తుతం 4జీ సేవలు అందిస్తుండగా, 5జీకి మారడం సులభమేనని, సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ చేస్తే సరిపోతుందన్నారు.

ఉమాంగ్ యాప్ ద్వారా పీఎఫ్ ఖాతాతో ఆధార్ అనుసంధానం

దిల్లీ: భవిష్య నిధి (పీఎఫ్) ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవడానికి ఉమాంగ్ యాప్ ద్వారా కూడా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌ఓ) వీలు కల్పిస్తోంది. ఆ మేరకు కార్మిక శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఉమాంగ్ యాప్‌లో ఈపీఎఫ్‌ఓ లింక్‌ను ఉపయోగించుకుని యూఏఎన్-ఆధార్ అనుసంధానం చేసుకోవచ్చు. ఈపీఎఫ్‌ఓ ఖాతాదార్ల కోసం దీనిని తీసుకొచ్చామ'ని అందులో వెల్లడించింది. ఆధార్‌తో యూఏఎన్‌ను అనుసంధానం చేయడానికి ఇ-కేవైసీ పోర్టల్‌లో ఒక కొత్త లింక్‌ను జత చేశారు. ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్‌లో ఉన్నదానికి ఇది అదనం. 'డిజిటల్ ఇండియా' దిశగా కదలడం కోసం ఈపీఎఫ్‌ఓ ఇ-నామినేషన్ సదుపాయాన్ని సైతం ఆవిష్కరించింది. ఆన్‌లైన్లో నామినేషన్ వివరాలను ఇచ్చిన అనంతరం సభ్యులు డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది. ఇ-సైన్ సదుపాయాన్ని సభ్యులకు ఈపీఎఫ్‌ఓ ఉచితంగా ఇస్తోంది. ప్రభుత్వం విడుదల చేసిన ఉమాంగ్ లేదా యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ద్వారా వివిధ ప్రభుత్వ సేవలను ఒకే దగ్గర పొందే వీలున్న సంగతి తెలిసిందే.

రూ.10 లక్షలపైన కావాలంటే ఆన్‌లైన్ క్లెయిము తప్పనిసరి

రూ.10 లక్షల పైన భవిష్య నిధి(పీఎఫ్) ఉపసంహరణకు ఆన్‌లైన్ క్లెయిమును ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌ఓ) తప్పనిసరి చేసింది. దీంతో కాగిత రహిత సంస్థగా మారడానికి మరో అడుగు వేసినట్లయింది. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్-1995 కింద రూ.5 లక్షలు పైబడిన ఉపసంహరణలకు సైతం ఆన్‌లైన్ క్లెయిములను తప్పనిసరి చేసింది. ఈ పింఛను పథకం కింద పింఛనులో కొంత భాగాన్ని ఖాతాదార్లు ఉపసంహరించుకునే వీలు ఉంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ ఖాతాదార్లకు పీఎఫ్ లేదా పింఛనును క్లెయిము చేసుకోవడానికి అటు ఆన్‌లైన్ ఇటు ఆఫ్‌లైన్‌లో వెసలుబాటు ఉంది. కాగా, తాజా నిర్ణయాన్ని జనవరి 17, 2018న జరిగిన ఒక సమావేశంలో కేంద్ర భవిష్యత్ ఫండ్ కమిషనర్ తీసుకున్నారని ఒక అధికారి తెలిపారు.

రూ.50 కోట్లు పైబడిన బకాయిలపై దర్యాప్తు

● మోసం అనిపిస్తే సీబీఐకి చెప్పండి ● బ్యాంకులకు ఆర్థిక శాఖ ఆదేశాలు

దిల్లీ

రూ.50 కోట్లకు పైబడిన అన్ని మొండి బకాయిలపై దర్యాప్తు చేపట్టాలని, మోసం జరిగే అవకాశమున్న వాటిని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు అప్పజెప్పాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నీరవ్ మోదీ, ఇతరులు కలిసి లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఓయూలు) ద్వారా పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)ను రూ.12,700 కోట్ల వరకు మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి. ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా కొంత మంది రుణ స్వీకర్తలపై దర్యాప్తు సంస్థల చెంతకు చేరిన సంగతి విదితమే. బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు (ఎండీలు) మోసాలను గుర్తించి ఆయా కేసులను సీబీఐకి అప్పజెప్పమని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్వీట్ చేశారు. పీఎమ్‌ఎల్‌ఏ, ఫెమా లేదా ఎగుమతి దిగుమతి నిబంధనల ఉల్లంఘనల విషయంలోనూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డీఆర్ఐ)లను పీఎస్‌బీలు సంప్రదించవచ్చని



అందులో సూచించారు.

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని సంబంధిత ముఖ్య నిఘా అధికారి(సీవీఓ) రూ.50 కోట్లకు మించిన మోసాలపై ఫిర్యాదు చేయడంతో పాటు సీబీఐతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. 'ఒక ఖాతా ఎన్‌పీఏగా మారిన సమయాల్లో సెంట్రల్ ఎకనమిక్ ఇంటలిజెన్స్ బ్యూరో (సీఈఐబీ)ను రుణ స్వీకర్త వివరాల నివేదికను కోరాలి. వారంలోగా సీఈఐబీ స్పందించాలి' అని కూడా సూచించారు. ఆ నివేదిక ఆధారంగా బ్యాంకులు ఈడీ, డీఆర్ఐల చెంతకు వెళ్లాలని తెలిపారు.

బ్యాంకులకు.. 15 రోజులే గడువు

దిల్లీ: పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో బ్యాంకులు ఈ తరహా నిర్వహణ, సాంకేతిక మోసాల నుంచి ఎలా రక్షించుకుంటాయో చెబుతూ ఒక ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో రావాలని ఆర్థిక శాఖ బ్యాంకులకు సూచించింది. ఇందుకు 15 రోజుల గడువు ఇచ్చింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ల (సీటీఓలు)కు ఒక ప్రణాళికను సిద్ధం చేయాలంటూ ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ట్వీట్ చేశారు. 'ముందస్తు చర్యలను చేపట్టడంతో పాటు.. నిర్వహణ, సాంకేతిక మోసాలకు వీలు కల్పించే బలహీనతలను గుర్తించాలి. సాంకేతిక పరిష్కారాలు సహా అన్ని వ్యూహాలను, అత్యుత్తమ విధానాలను రచించాల'ని ఆయన సూచించారు. 'ప్రతీ బ్యాంకు.. ఈడీలు, సీటీఓలతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేసి బ్యాంకింగ్ రంగంలోని అత్యుత్తమ విధానాలను చూసి 'నేర్చుకోవాలి'. అలాగే ప్రస్తుత వ్యవస్థలోని బలహీనతలను గుర్తించాల'ని వివరించారు. 'బ్యాంకుల బోర్డులు ఈ నివేదిక అమలును సీనియర్ అధికారులకు అప్పజెప్పాలి. ఈ విషయంలో స్పష్టమైన బాధ్యత ఉండేలా చూసుకోవాల'ని తెలిపారు.



మంగళవారం దిల్లీలో జరిగిన భారత్ - కొరియా వ్యాపార సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

మీ పెట్టుబడులకు నాదీ హామీ

భారత్ కంటే ఉత్తమ దేశం లేదు

● తయారీ రంగానికి ప్రోత్సాహం ● వేగంగా వ్యాపార అనుమతులు

● మన భాగస్వామ్యం ఆసియాకు స్థిరత్వాన్నిస్తుంది

☛ కొరియా వ్యాపారవేత్తలకు మోదీ పిలుపు

దిల్లీ: విదేశీ పెట్టుబడులకు రక్షణ, ప్రోత్సాహం ఇస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీనిచ్చారు. విదేశీ నిధులు మరిన్ని రావాలని కోరుకుంటుండడమే ఇందుకు కారణమని స్పష్టం చేశారు. ఒక కంపెనీ పెట్టడానికి భారత్ కంటే ఉత్తమ దేశం మరొకటి ఉండదని సీఐఐ-డీఐపీపీలు సంయుక్తంగా నిర్వహించిన భారత్-కొరియా వ్యాపార సదస్సులో పేర్కొన్నారు. వ్యాపారాలకు అనువుగా ఉండే స్థిరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నిర్ణయాలు తీసుకోవడంలో ఉన్న జాప్యాన్ని సైతం తొలగించామన్నారు. కొరియా వ్యాపారవేత్తలనుద్దేశించి ఆయన ఇంకా ఏమన్నారంటే.. భారత్ ఇపుడు వ్యాపారాలకు అనువుగా ఉంది. ఏ కంపెనీకైనా ఒక స్వేచ్ఛా గమ్యస్థానం భారతే. ఇలాంటి స్వేచ్ఛాయుత, వృద్ధి చెందుతున్న మార్కెట్ ప్రపంచంలో ఎక్కడా కనిపించదు. రక్షణ రంగంలో తప్ప తయారీ రంగంలో పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతులు అవసరం లేదు. మీకు నేను హామీనిస్తున్నా. మీ పెట్టుబడులకు రక్షణ, ప్రోత్సాహం రెండూ లభిస్తాయి. మా ఆర్థిక వ్యవస్థపై ఆసక్తి కనబరచే కొరియా వ్యాపారవేత్తల చొరవకు అత్యంత విలువనిస్తాం. వ్యక్తిగత స్థాయిలోనూ మీకు అవసరమైనపుడల్లా పూర్తి మద్దతునిస్తాను. కార్పొరేట్ పన్నును తగ్గించే దిశగా ప్రభుత్వం కదులుతోంది. అంతర్జాతీయంగా పోటీనిచ్చే పరిశ్రమను సృష్టించడమే మా ప్రభుత్వ లక్ష్యం. నైపుణ్యం, వేగం నిండిన సేవలనూ అందించడానికి కృషి చేస్తున్నాం. కాబట్టే పెట్టుబడుల వాతావరణాన్ని మెరుగుపరచుకోవడానికి నిరంతం పనిచేస్తుంటాం. ముఖ్యంగా మా యువతకు అధిక ఉద్యోగాలను ఇచ్చే తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని భావిస్తున్నాం.

1400 సంక్లిష్ట చట్టాలను రద్దు చేశాం

మా దేశంలో వ్యాపారాన్ని నిర్వహించుకోవడం చాలా సులువు. ఒక కంపెనీని స్థాపించడానికి అవసరమయ్యే అనుమతులన్నీ ఒకే రోజులో ఇస్తున్నాం. వ్యాపారం, పెట్టుబడులు, పాలన, ద్వైపాక్షిక వాణిజ్యం విషయాల్లో వేలకొద్దీ సంస్కరణలను ప్రవేశపెట్టాం. చరిత్రాత్మక జీఎస్‌టీ అమలు కూడా అందులో ఒకటి. పాలనను సంక్లిష్టం చేస్తున్న దాదాపు 1400 పాత చట్టాలను రద్దు చేశాం. తద్వారా అధిక వృద్ధి దిశగా దేశాన్ని నడిపించాం. గత మూడేళ్లలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా పెరిగాయి. సులువుగా వ్యాపారాన్ని నిర్వహించుకునే విషయంలో మా ర్యాంకింగ్ చాలా మెరుగైంది. అంతర్జాతీయ పోటీతత్వం సూచీ, లాజిస్టిక్స్ పనితీరు సూచీల్లోనూ పైకెగబాకాం.

వృత్తి నిపుణులకు కొదవ లేదు

అంతర్జాతీయంగా పోటీనిచ్చే సత్తాగల వ్యవస్థ మా దగ్గర ఉంది. నైపుణ్యం ఉన్న వృత్తినిపుణులు భారీ సంఖ్యలో ఉన్నారు. ప్రపంచ స్థాయి ఇంజినీరింగ్ విద్య, పరిశోధన-అభివృద్ధి(ఆర్ అండ్ డీ) సదుపాయాలు మా వద్ద ఉన్నాయి. పారిశ్రామిక లైసెన్సుల గడువును మూడేళ్ల నుంచి 15 ఏళ్లకు పెంచాం. అలాగే పారిశ్రామిక లైసెన్సింగ్ విధానాన్ని సరళీకరించాం. ఇపుడు దాదాపు 65-70% వస్తువులకు లైసెన్సు లేకుండానే ఉత్పత్తిని ప్రారంభించవచ్చు. అదే సమయంలో పారిశ్రామిక తనిఖీలు కూడా అవసరాన్ని బట్టి, పై స్థాయి అధికారుల అనుమతుల ద్వారానే జరుగుతాయి.

మీకు అవకాశాలు అపారం

కొరియా మిత్రులారా, సాఫ్ట్‌వేర్, వాహన, ఉక్కు, నౌకా నిర్మాణం, నౌకాశ్రయాలు తదితరాల్లో మనం సహకారం అందింపుచ్చుకోవడానికి భారీ అవకాశాలు ఉన్నాయి. నవీన నగరాలు, రైల్వే స్టేషన్లు, రవాణా, నౌకాశ్రయాలు, పునరుత్పాదక విద్యుత్, ఐటీ మౌలిక సేవలు, ఎలక్ట్రానిక్స్.. ఇలా అన్నీ వ్యాపారాలకు లాభసాటి రంగాలే మా దేశంలో ఉన్నాయి. మన భాగస్వామ్యంతో ఆసియాలో వృద్ధి, అభివృద్ధి, స్థిరత్వాన్ని తీసుకురావచ్చు. మధ్యతూర్పు, ఆఫ్రికా మార్కెట్లలోకి వ్యాప్తి చెందడానికి కొరియా వ్యాపారాలకు భారత్ ఒక వంతెనలా ఉపయోగపడుతుంది.

హ్యుందాయ్ విద్యుత్ కార్లు

నెక్సో, లోనిక్‌ల ఆవిష్కరణ

ముంబయి: దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుందాయ్ రెండు విద్యుత్ కార్లను ఆవిష్కరించింది. ఫ్యూయల్ సెల్ ఈవీ 'నెక్సో', బ్యాటరీ ఆధారిత ఈవీ 'లోనిక్'లను దిల్లీలో జరిగిన ఇండియా కొరియా బిజినెస్ సమిట్‌లో కంపెనీ ప్రదర్శించింది. 'గత 20 ఏళ్లుగా 'భారత్‌లో తయారీ'కి కట్టుబడి ఉన్నాం. ఎస్‌యూవీ నెక్సోతో పాటు లోనిక్‌ను ప్రదర్శించడానికి మేం గర్వపడుతున్నామ'ని హ్యుందాయ్ మోటార్ కంపెనీ నామ్‌యాంగ్ ఆర్ అండ్ డీ కేంద్రం ఉపాధ్యక్షుడు ఎస్. హెచ్. కిమ్ పేర్కొన్నారు.

స్వల్పంగా తగ్గిన జీఎస్‌టీ వసూళ్లు


జనవరిలో రూ.86,318 కోట్లు

దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జనవరిలో స్వల్పంగా తగ్గాయి. డిసెంబరులో రూ.86,703 కోట్లు వసూళ్లు కాగా.. జనవరిలో ఇవి రూ.86,318 కోట్లకు పరిమితమయ్యాయి. డిసెంబరుతో పోలిస్తే అంతకుముందు రెండు నెలలైన అక్టోబరు, నవంబరులోనూ పన్ను వసూళ్లు తక్కువగా ఉండటం గమనార్హం. అయితే 200కి పైగా వస్తువుల పన్ను రేట్లను తగ్గిస్తూ జీఎస్‌టీ మండలి నిర్ణయం తీసుకోవడం డిసెంబరులో వసూళ్లు పెరగడానికి దోహదం చేశాయి. జనవరిలో వసూలైన రూ.86,318 కోట్లలో సీజీఎస్‌టీ కింద రూ.14,233 కోట్లు రాగా.. ఎస్‌జీఎస్‌టీ, ఐజీఎస్‌టీ రూపేణా వరుసగా రూ.19,961 కోట్లు, రూ.43,794 కోట్లు వసూలయ్యాయని ఆర్థిక శాఖ వెల్లడించింది. పరిహార సెస్సు కింద రూ.8,311 కోట్లు వచ్చాయని పేర్కొంది. ఐజీఎస్‌టీ నుంచి సీజీఎస్‌టీ ఖాతాకు రూ.11,327 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ ఖాతాకు రూ.13,479 కోట్లు చొప్పున బదిలీ అయ్యాయని పేర్కొంది. ఫిబ్రవరి 25 వరకు జీఎస్‌టీ కింద నమోదైన వారి సంఖ్య 1.03 కోట్లని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇందులో కాంపోజిషన్ విధానాన్ని ఎంపిక చేసుకున్న వ్యాపారులు 17.65 లక్షల మంది. కాంపోజిషన్ డీలర్లు మూడు నెలలకోసారి రిటర్న్‌లు దాఖలు చేస్తే సరిపోతుంది. అయితే ఈ 17.65 లక్షల మందిలో 1.23 లక్షల మంది కాంపోజిషన్ డీలర్లు ఈ విధానం నుంచి బయటకు వచ్చేందుకు నిర్ణయించుకున్నారని తెలిపింది. తద్వారా వీళ్లు కూడా సాధారణ జీఎస్‌టీ చెల్లింపుదార్లుగా మారిపోయారని పేర్కొంది.

వేతనాలు 9.4 శాతం పెరగొచ్చు

2018పై అయాన్ హెవిట్ వార్షిక సర్వే అంచనా

దేశంలో ఉద్యోగులకు వేతనాలు ఈ ఏడాది సగటున 9.4 శాతం పెరిగే అవకాశం ఉందని మానవ వనరుల కన్సల్టెన్సీ సంస్థ అయాన్ హెవిట్ వార్షిక సర్వే నివేదిక అంచనా వేసింది.



రంగాల వారీగా

1	వృత్తినిపుణుల సేవలు	10.6
2	వినియోగదారు ఇంటర్నెట్ కంపెనీలు	10.4
3	లైఫ్ సైన్సెస్	10.3
4	వినియోగ ఉత్పత్తులు	10.2
5	వాహన తయారీ	10.1
6	రసాయనాలు	9.6
7	ఐటీ ఆధారిత సేవలు	9.6
8	రిటైల్	9.5
9	హైటెక్/సమాచార సాంకేతిక పరిజ్ఞానం	9.5
10	స్థిరాస్తి/మౌలిక సదుపాయాలు	9.3



మంగళవారం దిల్లీలో జరిగిన ఏఐఐబీ వార్షిక సమావేశం సన్నాహక కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ఆ సత్తా భారత్‌కు ఉంది

● 7-8 శాతానికి మించి వృద్ధి సాధిస్తుంది ● వచ్చే 10-20 ఏళ్లలోనూ అదే దూకుడు

● అంతర్జాతీయ సానుకూలతలు, సంస్కరణలు కలిసొస్తాయ్ ● భారత్ - కొరియా సదస్సులో ఆర్థిక మంత్రి జైట్లీ

దిల్లీ: భారత్‌కు 7-8 శాతానికి మించి వృద్ధి రేటు నమోదు చేసే సత్తా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ప్రభుత్వం చేపడుతోన్న సంస్కరణలు, అంతర్జాతీయ సానుకూలతలను దృష్టిలో పెట్టుకొని ఆయన పైవిధమైన వ్యాఖ్య చేశారు. వచ్చే 10-20 ఏళ్లలో కూడా అత్యంత వేగంగా అభివృద్ధి చెందే దేశాల్లో ఒకటిగా భారత్ కొనసాగుతుందని ఇక్కడ జరిగిన భారత్ - కొరియా సదస్సులో అన్నారు. 'గత కొన్ని సంవత్సరాలను పరిగణనలోకి తీసుకుంటే అంతర్జాతీయ ప్రతికూలతలు ఎదురైనా తట్టుకొని నిలిచే సామర్థ్యం ఉందని భారత్ నిరూపించింది. అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధపడింది. తద్వారా అధిక వృద్ధి లక్ష్యాన్ని కొనసాగించుకుంటూ వచ్చింద'ని జైట్లీ అన్నారు. 'ప్రస్తుతం 7-8 శాతం వృద్ధి రేటు సరిపోతుందని దేశంలో ప్రజలు భావిస్తున్నారు. అయితే అంతకు మించి వృద్ధి రేటును నమోదు చేసే సత్తా భారత్‌కు ఉంది. ప్రస్తుతం విధాన నిర్ణయాల్లో తీసుకొచ్చిన మార్పులకు అంతర్జాతీయ సానుకూల వాతావరణం తోడు కావడంతో 7-8 శాతానికి మించి కాస్త ఎక్కువ వృద్ధి రేటు నమోదవుతుందని భావిస్తున్నామ'ని తెలిపారు.

ఒకటే జీఎస్‌టీ రేటు అసాధ్యం: దేశమంతటా ఒకటే జీఎస్‌టీ రేటు అమలు చేయడం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాదని జైట్లీ అభిప్రాయపడ్డారు. దేశంలో ఎన్నో ఏళ్లుగా ఆదాయ అసమానతలు నెలకొని ఉండటమే ఇందుకు కారణమని అన్నారు. అయితే పన్ను నిబంధనల ప్రమాణాలు మెరుగుపడితే మరిన్ని సంస్కరణలు చేపడతామని మదుపర్లకు ఆయన భరోసా ఇచ్చారు.


భారత్‌కు అధిక నిధులు ఇవ్వండి

భారత్‌కు అధిక నిధుల సాయాన్ని అందించాల్సిందిగా ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ)ను కోరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. ఆసియా ప్రాంతంలో మౌలిక వసతుల లోటును భర్తీ చేసేందుకు తగినన్ని నిధులను అందివ్వాల్సిన బాధ్యత ఏఐఐబీపై ఉందని పేర్కొన్నారు. ఏఐఐబీ 3వ సాధారణ సమావేశ ప్రారంభానికి ముందుగా నిర్వహించిన కార్యక్రమంలో జైట్లీ మాట్లాడుతూ ఏఐఐబీలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించేందుకు భారత్ నిర్ణయించుకోవడంపై సంతోషంగా ఉందని అన్నారు. ఆసియా ప్రాంతంలో వృద్ధికి ఊతమివ్వాలంటే మౌలిక వసతుల లోటు సమస్యను అధిగమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మౌలిక రంగాల అభివృద్ధికి భారత్ పెద్దపీట వేస్తోందని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏఐఐబీ వార్షిక సమావేశం చిహ్నాన్ని, నినాదాన్ని బ్యాంకు అధ్యక్షుడు జిన్ లిక్విన్‌తో కలిసి జైట్లీ ఆవిష్కరించారు. ఏఐఐబీలో రెండో అత్యధిక వాటాను భారత్ కలిగి ఉంది. అత్యధికంగా చైనాకు 29.9 శాతం ఉండగా.. భారత్‌కు 7.74% ఉంది. 2016లో ఏర్పాటైన ఏఐఐబీలో 84 దేశాలకు సభ్యత్వం ఉంది. ఆర్థిక శాఖ వర్గాల ప్రకారం గత రెండేళ్లలో భారత్‌లో ఐదు ప్రాజెక్టులకు ఏఐఐబీ ఆమోదం తెలిపింది. వీటి మొత్తం విలువ 100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.6500 కోట్లు) పైనే. అలాగే మరో 12 ప్రాజెక్టులు ప్రతిపాదన దశలో ఉన్నాయి. వీటికి నిధుల సాయం విలువ 350 కోట్ల డాలర్లు (సుమారు రూ.22,500 కోట్లు) వరకు ఉండొచ్చు.

అభివృద్ధి కనిపించట్లేదా?



"ప్రపంచంలో కొన్ని దేశాల్లో కమ్యూనిజం... మరికొన్ని దేశాల్లో నియంతృత్వం... ఇంకొన్ని దేశాల్లో ప్రజాస్వామ్యం ఉంది. అయితే ఏ దేశంలో చూసినా సమర్థ నాయకుడు ఉన్నప్పుడే అక్కడ ఊహించని ఫలితాలు వస్తున్నాయి. దుబాయ్‌లో నీళ్లు లేవు. ఎడారి అయినా అభివృద్ధి చెందింది. సింగపూర్ మత్స్యకార గ్రామం.. ఇప్పుడు స్వర్గధామంగా మార్చారు. చైనా చాలా వేగంగా వృద్ధి సాధిస్తోంది. నిర్దిష్టమైన ఆలోచనా విధానం కలిగిన నాయకుడు ఉంటేనే ఇలాంటి మార్పు సాధ్యపడుతుంది. రాజకీయాల్లో చేయాలనుకున్న వాటిలో చాలా వరకూ చేస్తున్నాం" అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. "విశ్వవిద్యాలయంలో చదివేటప్పుడే విద్యార్థి నాయకుడిగా పనిచేశా. అప్పటివరకూ అక్కడున్న రాజకీయాలకు భిన్నంగా సామాజిక న్యాయం చేశాను. అది నా మొదటి గెలుపు" అని వివరించారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎమ్మెల్యేగా ఎన్నికై మంగళవారానికి 40 ఏళ్లయిన సందర్భంగా చంద్రబాబు 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడారు.



"మోదీ ప్రధానిగా ఉండి దేశాన్ని బాగు చేయాలనే నేను కోరుకుంటాను.. మనం అడుగుతోంది విభజన చట్టంలోని అంశాలు, కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయమనే..! అది మన హక్కు. వాటినే మనం డిమాండ్ చేస్తున్నాం. కాంగ్రెస్ హేతుబద్ధత లేకుండా రాష్ట్రాన్ని విభజించింది. ప్రజలు ఆ పార్టీని లేకుండా చేశారు. విభజన సమయంలో అవమానం జరిగిందని ప్రజలు భావించారు. మళ్లీ అవమానపడమంటున్నారని ప్రజలు అనుకునే పరిస్థితి రాకూడదు. కేంద్రమే మొత్తం చేస్తుందని ఊహించుకోవడం లేదు."

ఈనాడు - అమరావతి

తొలినుంచీ వినూత్నంగా ఆలోచించేవాణ్ని

ఏ విషయమైనా చిన్నతనం నుంచి వినూత్నంగా ఆలోచించేవాణ్ని. నా సొంతూరి రహదారి గోతులమయం కావడంతో బస్సు రాకపోకలకు ఇబ్బందులెదురయ్యేవి. రహదారిని బాగు చేసుకునేందుకు ఇంటికొకర్ని రమ్మని పిలుపునిచ్చా. ఊరంతా కదిలివచ్చింది. నేను చిన్న కుర్రాణ్ని...నేను చెబితే ఊళ్లో వాళ్లంతా వింటారా? అనుకుంటే ఆ పని జరిగేది కాదు. ఊరిని సమష్టిగా నడిపించడం, పదిమందికి ఉపయోగపడే పనిలో అందర్నీ భాగస్వాముల్ని చేయాలనేది నా అభిప్రాయం. నేను ఐఏఎస్ అవ్వాలని ఆలోచించా. అయితే చదివే ఓపికా లేదు. సాధిస్తానన్న భరోసా లేదు. రాజకీయాల్లోకొస్తే ఐఏఎస్ అధికారులనే నియంత్రించొచ్చని భావించా. చివరిగా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని, గెలవాలని బలంగా అనుకున్నా. జనతా ఉద్యమం చాలా ఉద్ధృతంగా ఉన్న రోజులవి. అంతకు ముందు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో జనతా పార్టీ అభ్యర్థికి 18వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. అలాంటి నియోజకవర్గంలో పరిస్థితులను తారుమారు చేసి ఇందిరా కాంగ్రెస్ తరఫున నేను 6,500ఓట్ల ఆధిక్యతతో గెలిచా.

బెల్లం అమ్మితే వచ్చిన సొమ్మే ఎన్నికల ఖర్చు

మా నాన్న వృత్తి వ్యవసాయం. ఆయన ఊరి పెద్దమనిషి. పంచాయతీల్లో తీర్పులు చెప్పేవారు. అప్పట్లో ఎవరూ న్యాయస్థానాలకు వెళ్లేవారు కాదు. నాన్న చదువుకోకపోయినా నాపై పూర్తి విశ్వాసం ఉండేది. ఉన్న ఆర్థిక వనరుల నుంచే డబ్బులు పంపించి నాకే లోటూ లేకుండా చూశారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయనతో చెబితే మనకెందుకురా? అని అన్నారు. లేదు నేను పోటీ చేయాలని నిర్ణయించుకున్నా అని చెబితే సరే ఆలోచించు అన్నారు. అప్పట్లో మేం చెరకు సాగు చేసేవాళ్లం. బెల్లం విక్రయం ద్వారా వచ్చిన ఆదాయం రూ.75వేలు ఎన్నికల ఖర్చుకిచ్చారు. స్నేహితులు, ఇతరులు ఇచ్చిన దాంతో కలిపితే మొత్తం రూ.90వేలు అప్పట్లో సమకూరాయి.

అవినీతిపరులకు శిక్షలు పడాలి

విజయ్‌మాల్యాను అందరం ఛీకొడుతున్నాం కదా! ఎవరు అవినీతికి పాల్పడినా వారికి శిక్షలు పడేలా చేసి, అక్రమాస్తులను స్వాధీనం చేసుకోవాలి. అలాంటి పరిస్థితి మన వ్యవస్థలో లేకపోవడంతోనే చాలామంది ఏముందిలే కేసులు నమోదైతే ఏడాదో, 16 నెలలో జైల్లో ఉంటాం. ఆ తర్వాత సాంకేతిక కారణాలతో న్యాయస్థానాల్లో ఆ కేసులు వీగిపోతాయి. మా ఆస్తులు మా దగ్గర ఉంటాయన్న ధీమాతో వ్యవహరిస్తున్నారు. అదే అక్రమాస్తులను స్వాధీనం చేసుకుంటే అతని జీవితకాలంలో సంపాదించిన అక్రమార్జనంతా ప్రభుత్వపరమవుతుంది.

> **జనసేనతో పొత్తు పరిస్థితుల్ని బట్టి**
>
> **రాజకీయాల్లో అప్పటికప్పుడు పరిస్థితుల్ని బట్టి నిర్ణయాలుంటాయి. జనసేనతో పొత్తు ఉంటుందా? వంటి ఊహాజనిత ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం చెప్పడం సరికాదు.**

వ్యవసాయం దండగ అని ఎప్పుడూ అనలేదు

వ్యవసాయం దండగ అనే మాటను నేను అనలేదు. అమెరికా పర్యటనలో నేను వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి అక్కడి రైతుతో మాట్లాడా. వారి పిల్లలు ఆసుపత్రిలో, పర్యాటక ప్రాజెక్టుల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ఎందుకు వారు వ్యవసాయం చేయడం లేదని అడిగితే వారికి ఇష్టం లేదని ఆ రైతు చెప్పాడు. రైతు పిల్లలు కూడా పారిశ్రామికవేత్తలు, ఐటీ వృత్తి నిపుణులు కావాలనేది నా అభిప్రాయం. దీనిపైనే రాజశేఖర్‌రెడ్డి దుష్ప్రచారం చేసి రాజకీయ లబ్ధికి ప్రయత్నించారు. నేను సవాల్ చేస్తే నిరూపించలేకపోయారు.

మా కుటుంబమే త్యాగం...

మా కుటుంబమే త్యాగం. నలుగురం నాలుగుచోట్ల పని చేస్తున్నాం. మా ఆవిడ 25ఏళ్లుగా హెరిటేజ్ సంస్థని నడిపిస్తోంది, వ్యాపారాన్ని వదిలేసి ఇక్కడకు వచ్చేయమంటే ఆమె వస్తారు. కానీ, సంస్థను లాజికల్ దిశగా నడిపించాలి. ఆమె రాజకీయాల్లో కలుగజేసుకోరు. కోడలు బ్రాహ్మణి నిరూపించుకునేందుకు కష్టపడుతోంది. నేను, లోకేష్ ఇక్కడున్నాం. మాఇద్దరికీ ఎవరి పనులు వారికున్నాయ్.

వారసత్వంతో ప్రవేశం లభించవచ్చేమో కానీ.. నిరూపించుకోలేకపోతే కనుమరుగవుతారు.

రాజకీయాల్లోనైనా, వ్యాపారాల్లోనైనా సమర్థత లేకపోతే నిలబడలేరు. మా లోకేష్‌నీ అడిగా. మన కుటుంబం వ్యాపారంలో ఉంది కదా ఆలోచించుకోమన్నా. ప్రజలకు సేవ చేయాలి, త్యాగాలు చేయాలంటే రాజకీయాల్లోకి రావచ్చు.. లేదు పది రూపాయాలు సంపాదించుకోవాలంటే వ్యాపారమే ఎంచుకోవచ్చు అని చెప్పా. స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు.. అలాంటి చదువుకున్న వారు రాజకీయాల్లోకి వస్తే సేవల్లో నాణ్యత ఉంటుంది. వారసత్వంతో ప్రవేశం లభించవచ్చేమో కానీ, నిరూపించుకోలేకపోతే కనుమరుగవుతారు.

రామోజీ ఎవరు తప్పు చేసినా తప్పంటారు...

నాకే కాదు.. ఎవరికైనా సరే ప్రజల జీవితాలను మెరుగుపరిచేటపుడు అందులో ఉండే సంతోషం వేరు.. పత్రిక ద్వారా రామోజీరావు ఎంతో గొప్పగా ప్రజలను మంచి వైపు నడిపించగలగుతున్నారు. ఆయన ఎవరితో రాజీపడడం లేదు. ఎవరు తప్పు చేసినా తప్పంటారు. మంచి చేస్తే మంచి అంటారు.

నేను ఒత్తిడికి లోనైతే...

నేను మనిషినే. నాకూ కోపం, పౌరుషం, బాధ, తపన ఉంటాయి. ఒక ముఖ్యమంత్రిని పట్టుకుని ఒకరు నడిరోడ్డుపై ఉరేయాలంటారు. బంగాళాఖాతంలో పడేయాలంటూ తాను మాట్లాడమే కాకుండా తన వారితోనూ మాట్లాడిస్తారు. నేను ఒత్తిడికి లోనైతే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. సమాధానం చెప్పకపోతే భయపడుతున్నానంటారు. రెండింటినీ సమతూకం చేసుకుంటా. ఇతను(జగన్) తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని విపరీతంగా సంపాదించారు. దేశానికి మచ్చ తెచ్చారు.

> **"ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంత అభివృద్ధి జరుగుతుంటే కళ్లకు కనిపించడం లేదా? రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వెళ్లండి. 2014కి ముందు ఎలా ఉందో, ఇప్పుడు ఎలా ఉందో చూడండి. అభివృద్ధి ఏంటో తెలుస్తుంది. హుద్‌హుద్ తుపానుతో కళా విహీనమైన విశాఖ నగరాన్ని ఇప్పుడు ఎంత సుందరంగా తీర్చిదిద్దామో తెలియదా? తిరుపతిలో వచ్చిన హార్డ్‌వేర్ పరిశ్రమలు, ఓర్వకల్లులో వస్తున్న విమానాశ్రయం, పారిశ్రామికవాడ, పెనుగొండలో కియా పరిశ్రమ కనిపించడం లేదా? నేనేమీ చేయకపోతేనే భాగస్వామ్య సదస్సులో రూ.4.40 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయా? అనేక ప్రయాసలకోర్చి, కాలికి బలపం కట్టుకుని దేశాలన్నీ తిరిగి పెట్టుబడిదారుల్ని పట్టుకొస్తే ఆ శ్రమ మీకు కనిపించదా? ఒకరేమో అన్ని లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినప్పుడు ప్రత్యేక హోదా ఎందుకంటారా? ఇంకొకరేమో పెట్టుబడులే రాలేదు, అంతా అబద్ధమని తప్పుడు ప్రచారం చేస్తారా? విమర్శలకూ అర్థముండాలి. కేంద్రం ఇవ్వడం లేదని పేద అరుపులు అరుస్తూ కూర్చోవాలా? కేంద్రం హామీ ఇచ్చినవీ, చట్టం ప్రకారం మనకు రావలసినవే కదా అడుగుతున్నాం. ఏపీ విపక్షాలు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నాయి."**

కేసీఆర్‌తో నా సంబంధాలంటారా...

నాకు ఎవరితో గొడవల్లేవ్. తెలుగువారి రెండు రాష్ట్రాలు ముందుకు పోవాలి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారు, వదిలి వచ్చారని చాలామంది నన్నడుగుతుంటారు. తెలుగువారి కోసం చేశా, విభజన సమస్యలు కొన్ని పరిష్కారం కావాలి. వాటికోసం ప్రయత్నిస్తా.

ఆగస్టు సంక్షోభం గురించి..

నాకు గౌరవాన్నిచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. నేను ఏదైనా చెబితే ఆయనకు గురి కూడా. కొన్ని పరిస్థితుల్లో పార్టీని కాపాడుకోవాల్సి అలా చేశా. ఆరోజు అది చేశాక, పార్టీని కాపాడుకుంటూ వచ్చా. శాశ్వతంగా తెలుగు వారికి సేవ చేసే అవకాశాన్ని తీసుకున్నాం. ఆరోజు ఏదైనా విఘాతం కలిగితే కోలుకునేవాళ్లం కాదు. నాయకుడిగా ఎప్పుడూ నాకు ఆయన ఆదర్శం. మా పెళ్లి విషయంలోనూ ఎన్టీఆర్ సొంత నిర్ణయం తీసుకున్నారు. ఆయనే ఆలోచించి మా బంధువులనే నా వద్దకు పంపారు. ఆయన అంచనా ఎందులోనైనా అత్యుత్తమంగా ఉంటుంది.

స్విట్జర్లాండ్ మంత్రి క్షమాపణ చెప్పారు: నేను గతంలో సీఎంగా ఉన్నప్పుడు విజన్ 2020 పత్రం తయారు చేస్తే ఎగతాళి చేశారు. స్విట్జర్లాండ్ చెందిన ఓ మంత్రి ఇలాంటి వారిని మా దేశంలో పిచ్చి ఆస్పత్రుల్లో పెడతామని అన్నారు. ఆ తర్వాత మన రాష్ట్రం, హైదరాబాద్ సాధించిన అభివృద్ధి చూసి... అదే మంత్రి నాకు క్షమాపణ చెప్పారు.

తెదేపాకి ఎప్పటికీ ఢోకా లేదు

తెదేపాకి ఎప్పటికీ ఢోకా లేదు. శాశ్వతంగా ఉంటుంది. ఒక నాయకుడి స్థానంలో మరొకరు వస్తారు.

మితాహారమే ఆరోగ్య రహస్యం

మితాహారమే నా ఆరోగ్య రహస్యం. బతకడానికి, పని చేయడానికి మాత్రమే తింటాను. ఇటీవల చేప తినడమూ నిలిపివేశాను. ఉదయం జొన్న ఇడ్లీ, పెసరట్టు, పండు వంటివి ఒకటో, రెండో తీసుకుంటాను. మధ్యాహ్నం రాగి ముద్ద, సజ్జన్నం, మజ్జిగ, పండ్లు తింటా. రాత్రికి కట్‌లెట్స్ లాంటివి, 2-3కోడి గుడ్లతో ఆమ్లెట్ తీసుకుంటా. అంతా శరీరానికి కావాల్సిన కేలరీలు, ప్రొటీన్ల లెక్కల ప్రకారమే ఉంటుంది. ఆహారం ఏం తీసుకోవాలన్నది నా భార్య చూస్తుంది.

ఖమ్మం కలెక్టరేట్ నిర్మాణాలు చేపట్టం

- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం
- హామీని రికార్డు చేసుకుని విచారణ వాయిదా

ఈనాడు, హైదరాబాద్: ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నిర్మాణాన్ని ఇప్పటికిప్పుడు చేపట్టే పరిస్థితి లేదని, వారంలోపు పనులు చేపట్టబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి హైకోర్టుకు మంగళవారం నివేదించింది. ఈ హామీని రికార్డు చేసుకున్న హైకోర్టు.. కలెక్టరేట్ నిర్మాణాలపై కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను వారానికి వాయిదా వేసింది. ఖమ్మం పట్టణం మధ్యలో మంచి భవనం ఉన్నప్పటికీ ఊరి బయట కలెక్టరేట్ నిర్మించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని సవాలు చేస్తూ ఖమ్మంకు చెందిన న్యాయవాది ఎం.విజయభాస్కర్ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కలెక్టరేట్ నిర్మాణం నిమిత్తం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో సామాజిక ప్రభావ అధ్యయనాన్ని మినహాయించిందని చెప్పారు. కేంద్ర భూసేకరణ చట్టానికి విరుద్ధమని చెప్పారు. ఈ అధ్యయనంలో ప్రజలను భాగస్వాములను చేయాల్సి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ మౌలిక వసతుల ప్రాజెక్టులకు అధ్యయనాన్ని మినహాయించవచ్చని, ఆ అధికారం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. వారం గడువిస్తే మౌలిక వసతుల ప్రాజెక్టు కింద పరిగణలోకి తీసుకోవచ్చన్న అంశంపై వివరణ ఇస్తామన్నారు. ఈ హామీని రికార్డు చేసుకున్న ధర్మాసనం కౌంటర్లు దాఖలు చేయాలంటూ విచారణను వాయిదా వేసింది.

కుక్కల గుంపు దాడిలో బాలుడి మృతి

విజయనగరం జిల్లాలో ఘటన



మృతి చెందిన బాలుడు యశ్వంత్

బలిజిపేట, న్యూస్‌టుడే: కుక్కల గుంపు ఓ బాలుడి నిండు ప్రాణాలు కబళించాయి. ఈ హృదయ విదారక ఘటన విజయనగరం జిల్లా బలిజిపేట మండలం అంపావల్లిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. అంపావల్లికి చెందిన రాగాల యశ్వంత్ ఉరఫ్(10) జయకృష్ణ పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న తండ్రి సత్యన్నారాయణకి చద్ది అన్నం తీసుకుని తన స్నేహితుడు రాకేష్‌తో కలిసి సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో వీరిని ఓ కుక్కల గుంపు అడ్డగించింది. సైకిల్‌పై నుంచి కింద పడిపోయిన యశ్వంత్‌ను కుక్కలన్నీ దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్నేహితుడు అక్కడి నుంచి తప్పించుకుని సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే స్థానికులు పరుగున వచ్చి రక్తపు మడుగులో ఉన్న బాలుడిని 108 వాహనంలో బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యశ్వంత్ తుదిశ్వాస విడిచాడు. బాలుడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు.

పన్నుల రాబడిలో కొనసాగుతున్న 15.7శాతం వృద్ధిరేటు

- గతి తప్పిన గ్రాంట్ ఇన్‌ఎయిడ్
- రుణాల లక్ష్యంలో 92 శాతం
- రిజిస్ట్రేషన్ల రాబడి ఇప్పటికే 111 శాతానికి
- జనవరి ఆఖరుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ బడ్జెట్ తుది ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి ప్రాథమిక గణాంకాలు అందుబాటులోకి రాగా, జనవరి నెలాఖరు వరకూ పూర్తి స్థాయిలో రాబడులు, వ్యయాలపై స్పష్టత లభించింది. పన్నుల రాబడి సహా ఇతర ఆదాయాల నేపథ్యంలో బడ్జెట్ సిద్ధమవుతోంది. పన్నుల రాబడిలో 15.7శాతం వృద్ధిరేటు నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి ఇదే వృద్ధిరేటు కొనసాగుతోంది. గత ఏడాది జనవరి నాటికి రాష్ట్రానికి పన్నుల రాబడి రూ.48,704 కోట్లు కాగా.. ఈ ఏడాది జనవరి నాటికి రూ.56,348 కోట్లు వచ్చింది. మొత్తం రెవెన్యూ రాబడులు గత ఏడాది కంటే 13శాతం పెరిగాయి. 2017 జనవరి వరకూ రూ.58,502 కోట్లు రాగా ఈ జనవరి ఆఖరుకు 66,116 కోట్లు వచ్చింది. ఇది గత ఏడాది కంటే 7,614 కోట్లు అధికం. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా అందాల్సిన నిధులు అంచనాల కంటే బాగా తగ్గాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందాల్సిన నిధుల్లో కేవలం 24శాతమే కావడం గమనార్హం. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ.26,857 కోట్లు రావాల్సి ఉండగా రూ.6,486 కోట్లే వచ్చాయి. గత ఏడాది 2017 జనవరి ఆఖరు నాటికి 48శాతం అందగా ఈ ఏడాది ఇందులో సగమే వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రానికి వచ్చిన రాబడులు రూ.90,333 కోట్లు కాగా రెవెన్యూ, క్యాపిటల్ వ్యయం రూ.87,565 కోట్లు. వడ్డీల చెల్లింపునకు రూ.7,924 కోట్లు వ్యయం కాగా, వేతనాలకు రూ.19,165 కోట్లు వ్యయమయ్యాయి.

2018 జనవరి వరకూ రాష్ట్ర రాబడులు ఇలా ఉన్నాయి

అంశం	2018 అంచనా (రూ.కోట్లలో)	2018 జనవరికి వచ్చింది	శాతం
రెవెన్యూ రాబడులు	1,13,083	66,116	58
పన్నుల రాబడి	79,624	56,348	70
స్టాంపులు రిజిస్ట్రేషన్	3,000	3,331	111
అమ్మకం పన్ను (జీఎస్టీకాకుండా)	46,500	20,882	45
రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీ	9,000	7,918	88
ఇతర పన్నులు	352	116	33
గ్రాంట్ ఇన్ ఎయిడ్	26,857	6,486	24
రుణాల వసూళ్లు	5,807	74	1
రుణాలు	26,096	24,140	92

కౌలు, పోడు రైతులకూ రూ.4 వేలివ్వాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండు

ఈనాడు, హైదరాబాద్ : కౌలు, పోడు వ్యవసాయం చేసే రైతులకు కూడా పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.4వేల చొప్పున ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం డిమాండు చేసింది. రాష్ట్రంలో కౌలు రైతులు 14లక్షల మంది, పోడు సేద్యం చేస్తున్నవారు 1.08లక్షల మంది, దేవాదాయ భూములు సాగుచేస్తున్నవారు 20వేల మంది, అసైన్డ్ భూములు కొని సాగుచేస్తున్న వారు మరో లక్షన్నర మంది రైతులున్నట్లు సంఘం కార్యదర్శి సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి రూ.4 వేలు పెట్టుబడి సాయం ఇవ్వబోమన్న సీఎం వైఖరికి నిరసనగా జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. వాస్తవ పరిస్థితులు గుర్తించి పంట సాగుచేసే వారందరికీ ప్రభుత్వం సాయం అందించాలని ఆయన డిమాండు చేశారు.

మంత్రాల నెపంతో వృద్ధుడి దారుణ హత్య

గుర్రంపోడు, న్యూస్‌టుడే: మంత్రాల నెపంతో నల్గొండ జిల్లాలో ఓ వృద్ధుడిని దారుణంగా హత్య చేశారు. గుర్రంపోడు మండల పరిధిలోని తెరాటిగూడెంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తెరాటిగూడేనికి చెందిన పిల్లి సాయన్న కుమారుడు వారం క్రితం ఉరి వేసుకుని మృతి చెందాడు. అదే క్రమంలో సాయన్న భార్య ఆరునెలల క్రితం మృతి చెందింది. దీంతో గ్రామంలో మంత్రాలు చేస్తారనే పేరున్న కన్నెబోయిన రాములు(66), అతని కుమారుడు రామలింగయ్యలే తన భార్య, కుమారుడి మృతికి కారణమని భావిస్తూ సాయన్న కసిపెంచుకున్నాడు. మంగళవారం ఉదయం వీధిలో ఉన్న రామలింగయ్యపై దాడికి దిగాడు. కత్తితో పొడవగా రామలింగయ్య చేతికి గాయమైంది. తప్పించుకుని ఇంటికెళ్లిన రామలింగయ్య.. తండ్రి రాములుకు జరిగింది చెప్పాడు. దీంతో రాములు కూడా వీధిలోకి వచ్చాడు. సాయన్నతోపాటు తన బంధువులు వెంకటయ్య, పిల్లి వెంకటయ్య, సత్తయ్య, మండలి వెంకటయ్య, శ్రీనులతో కలిసి రాములుపై దాడి చేశారు. తలపై బండరాయితో మోదడంతో తీవ్ర రక్తస్రావంతో రాములు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దళిత బాలుడి హత్య

- కుటుంబంలోని మహిళ, ఆమె కుమార్తెపై అత్యాచారం
- తమిళనాడులో దారుణం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాట దారుణం చోటుచేసుకుంది. దళిత కుటుంబానికి చెందిన మహిళ, ఆమె కుమార్తె(15)పై దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు యత్నించిన ఆమె కుమారుడి(12)పైనా వారు దాడి చేయడంతో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. విల్లుపురం జిల్లా వెల్లంపుత్తూరు పరిసర ప్రాంతంలో ఈనెల 22వ తేదీన ఈ ఘటన జరిగింది. సోమవారం రాత్రి వెలుగులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన తల్లీకుమార్తెలను వైద్య పరీక్షల నిమిత్తం పుదుచ్చేరిలోని జిప్‌మర్‌కు తరలించామని అన్నారు. స్థల వివాదమా? మరేమైనా కారణాలు ఉన్నాయా? అని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఘటనను పీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, ధర్మపురి ఎంపీ అన్బుమణి రామదాసు, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, మనిదనేయ మక్కల్ పార్టీ అధ్యక్షుడు జవాహరుల్లా, ఎస్డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు కేకేఎస్ఎం తెహ్లాన్ బక్వి తదితరులు ఖండించారు.

క్యాన్సర్ కణాలే జీవ సూచికలు!

- మెరుగైన చికిత్సామార్గాల అభివృద్ధికి దోహదపడతాయన్న శాస్త్రవేత్తలు

బెంగళూరు: క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో ఔషధాల పనితీరును తెలుసుకునేందుకు.. వారి రక్త ప్రవాహంలోని కొన్ని ప్రత్యేక కణాలు దోహదపడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. సాధారణంగా క్యాన్సర్ కణాలు శరీరంలో ఓ అవయవం నుంచి మరో అవయవానికి 'మెటాస్టాసిస్(రోగకణ వ్యాప్తి)' అనే విధానంలో చేరుకుంటాయి. ఇందుకు రక్తం, శోషరసాలను మాధ్యమంగా ఉపయోగించుకుంటాయి. ఇలా వేరే అవయవాన్ని చేరుకునేందుకు ప్రవాహ వ్యవస్థల్లోకి చేరిన క్యాన్సర్ కణాలను 'సర్క్యులేటింగ్ ట్యూమర్ సెల్ (సీటీసీ)'లుగా పిలుస్తారు. ఇతర అవయవాల్లోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోతే అవి కొంతకాలం తర్వాత మరణిస్తాయి. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో ఔషధాలు ఎంతమేరకు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయో తెలుసుకునేందుకు ఈ సీటీసీలు దోహదపడతాయని శాస్త్రవేత్తలు తాజాగా వెల్లడించారు. వాటిని జీవ సూచికలుగా ఉపయోగించుకుంటూ చికిత్సలో మార్పులు చేయవచ్చన్నారు.

శిలాజ ఇంధన ఉద్గారాల లెక్క తప్పు

లండన్: శిలాజ ఇంధనాలైన ఈథేన్, ప్రొపేన్‌లు వాతావరణంలో ఏ స్థాయిలో ఉన్నాయన్నదానిపై వేసిన లెక్కలన్నీ తప్పని తాజా అధ్యయనం తేల్చింది. వాస్తవ స్థాయి కన్నా 50 శాతం మేర వీటిని తక్కువగా లెక్కకట్టినట్లు పేర్కొంది. ఈ హైడ్రోకార్బన్లు భారీ నగరాలకు చాలా హానికరం. అక్కడ.. ఇవి వాహనాల నుంచి వచ్చే ఉద్గారాలతో రసాయన చర్యలు జరిపి, ఓజోన్‌ను ఏర్పరుస్తాయి. ఇది గ్రీన్‌హౌస్ వాయువు. పొగమంచును ఏర్పర్చడంలో ఇది చాలా కీలకం. మరణాల రేటును పెంచడానికి ఇది ప్రత్యక్షంగా కారణమవుతోంది. సహజవాయువును వెలికితీసేటప్పుడు, పంపిణీ సమయంలోనూ ఈథేన్, ప్రొపేన్‌లు వాతావరణంలోకి లీకవుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా వీటి ఉద్గారాల స్థాయిని తక్కువగా అంచనావేసినట్లు బ్రిటన్‌లోని యార్క్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



దగ్ధమవుతున్న టేకు చెట్లు

అడవిలో మంటలు

50 ఎకరాల్లో టేకు చెట్లు దగ్ధం

గూడూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం మంటలు చెలరేగాయి. దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో టేకు చెట్లు దగ్ధమయ్యాయి. వేసవి కాలం కావడంతో అడవిలోని చెట్ల ఆకులు రాలిపోయాయి. ఇటీవల ఎండిన కొమ్మలను కూడా తొలగించారు. ఎండిన మండలకు గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టారు. దీంతో రాలిన ఆకుల ద్వారా మంటలు వ్యాపించి టేకు చెట్లు కాలిపోయాయి. సమీపంలోని తండావాసులు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. ఒక్కో ఎకరాలో సుమారు 1500 చెట్లు ఉంటాయని అంచనా.



పెర్కవేడు గ్రామంలోని కుంటలో చేపల వేటలో నిమగ్నమైన సైబీరియన్ పక్షులు

విదేశీ అతిథులం.. విడిది చేయ వచ్చాం!

సంతానాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఖండాంతరాలు దాటి..వేసవి విడిది ప్రాంతాలకు వచ్చే అరుదైన పక్షులతో వరంగల్ గ్రామీణ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామం కొత్త కళ సంతరించుకుంది. రష్యాలోని సైబీరియా నుంచి వలసొచ్చే వీటిని స్థానికులు నత్తగొట్టు పక్షులని పిలుస్తారు. పెద్ద వృక్షాలపై ఆవాసాలు ఏర్పాటుచేసుకొనే ఇవి..గ్రామానికి చుట్టుపక్కలున్న చెరువుల్లోని చేపలను వేటాడి జీవనం సాగిస్తాయి. ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఇక్కడికి వచ్చి..గుడ్లుపెట్టి పొదిగి పిల్లలతోపాటు జూన్ నెలాఖరులో తిరుగుప్రయాణమవుతాయి.

- న్యూస్‌టుడే, రాయపర్తి

కమలనాథులే 'త్రిపురా'ధిపతులు!

దిల్లీ: త్రిపురలో భాజపా నినాదమైన 'చలో పాల్టాయ్' (మార్పేద్దాం)కి అక్కడి ప్రజల నుంచి అనూహ్య స్పందన కనపడుతోంది. హోరాహోరీగా జరిగిన అక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా-ఐపీఎఫ్‌టీ సంకీర్ణం జయకేతనం ఎగురవేయడం ఖాయమని ప్రీపోల్, ఎగ్జిట్ పోల్ సర్వేలు చెబుతున్నాయి. 25 ఏళ్ల వామపక్ష ప్రభుత్వం గద్దె దిగక తప్పదని, తద్వారా లెఫ్ట్ పార్టీల చివరి కంచుకోట కూడా కూలిపోనుందని పేర్కొన్నాయి. నాగాలాండ్‌లో భాజపా-ఎన్‌డీపీపీ కూటమి అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయని సర్వేలు చెబుతున్నాయి. మేఘాలయలో హంగ్ ఏర్పడుతుందని, అక్కడ కూడా భాజపా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోబోతోందని వెల్లడైంది. మూడు రాష్ట్రాల్లోనూ 60 చొప్పున అసెంబ్లీ స్థానాలున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 31 సీట్లు అవసరం. త్రిపురలో ఓ అభ్యర్థి మరణించడంతో 59 చోట్ల మాత్రమే ఎన్నికలు జరిగాయి.

త్రిపుర

సర్వే సంస్థ	భాజపా కూటమి	వామపక్ష కూటమి	కాంగ్రెస్	ఇతరులు
పీపుల్స్ పల్స్ (ప్రీపోల్ సర్వే)	31-36	19-23	0	-
జన్‌కీబాత్-న్యూస్ ఎక్స్	35-45	14-23	0	0-1
యాక్సిస్‌మై ఇండియా	44-50	9-15	-	0-3
సీ ఓటర్	24-32	26-34	0-2	0-2

నాగాలాండ్

సర్వే సంస్థ	భాజపా-ఎన్‌డీపీపీ	ఎన్‌పీఎఫ్	కాంగ్రెస్	ఇతరులు
జన్‌కీబాత్-న్యూస్ ఎక్స్	27-32	20-25	0-2	5-7
సీ ఓటర్	25-31	19-25	0-4	6-10

మేఘాలయ

సర్వే సంస్థ	ఎన్‌పీపీ	భాజపా	కాంగ్రెస్	ఇతరులు	యూడీపీ-హెచ్‌ఎస్‌పీడీపీ
జన్‌కీబాత్-న్యూస్‌ఎక్స్	23-27	8-12	13-17	2-6	
సీ ఓటర్	17-23	4-8	13-19	5-9	8-12
పీపుల్స్ పల్స్	10-13	2-5	19-24	7-12	6-9

నాగాలాండ్‌లో 75%, మేఘాలయాలో 67%

- ముగిసిన శాసనసభ ఎన్నికలు... హింసలో ఒకరి మృతి
- త్రిపురతో కలిసి 3న ఓట్ల లెక్కింపు

దిల్లీ: నాగాలాండ్, మేఘాలయా రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు మంగళవారం ముగిశాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా పూర్తయింది. నాగాలాండ్‌లోని జున్హెబోటో జిల్లాలో భాజపా, నాగా పీపుల్స్ ఫ్రంట్ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఉద్రిక్తత కారణంగా లాంగ్లెంగ్ జిల్లాలో ఒక కేంద్రంలో పోలింగ్ జరగలేదు. మునుపటి ఎన్నికలతో పోలిస్తే రెండు రాష్ట్రాల్లో పోలింగ్ శాతాలు తగ్గాయి. నాగాలాండ్‌లో 75% (గతసారి 90.19%), మేఘాలయాలో 67% (గతసారి 89%) మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికీ అనేకమంది ఓటర్లు ఆయా కేంద్రాల వద్ద వరుసల్లో నిల్చొని ఉండడంతో తుది గణాంకాలు వెలువడేసరికి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఎన్సీపీ అభ్యర్థి మరణించిన కారణంగా మేఘాలయాలో ఒక స్థానంలో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మిగతా 59 స్థానాల్లో పోలింగ్ నిర్వహించారు. నాగాలాండ్‌లోనూ 59 స్థానాలకే ఎన్నికలు జరిగాయి. అక్కడ ఒక స్థానంలో అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేఘాలయా, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును మార్చి 3న చేపడతారు.

సిద్ధు సర్కారు డబ్బుమయం

- సిద్ధరామయ్య కాదు.. సీదా రుపయ్య (రూపాయి బాబు)
- ధ్వజమెత్తిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

దావణగెరె నుంచి ఈనాడు ప్రతినిధి

కర్ణాటకలో ఎన్నికల వాతావరణాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వేడెక్కించారు. దావణగెరెలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన భారీ రైతు బహిరంగసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై మరోసారి విరుచుకుపడ్డారు. 'గతంలో సిద్ధరామయ్యది పది శాతం కమీషను సర్కారు అని ఆరోపించా. కమీషను అంతకంటే ఎక్కువగా పన్నెండు శాతంగా పెరుగుతోంది. ఏతవతా ఇక్కడుండేది సిద్ధరామయ్య కాదు. సీదా రుపయ్య (రూపాయి బాబు)...'అని వ్యాఖ్యానించారు. పైసలిస్తే కానీ ఏ చిన్న పనీ ఈ సర్కారులో జరగటం లేదని దుయ్యబట్టారు. 'ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమాభివృద్ధులకు పాటు పడేది కాదు. దిల్లీ నేతలకు ముడుపుల్ని చెల్లించేది...' అని చెప్పారు. మంత్రుల నివాసాల్లో దాడులు జరిగినపుడు కట్టలు కట్టలుగా బయటపడిన నోట్లు ఎక్కడివని ప్రశ్నించారు. దిల్లీ నేతలకు ముడుపుల్ని చెల్లించారనేందుకు ఒకరి ఇంట్లో లభించిన డైరీయే సాక్ష్యమని పేర్కొన్నారు. కర్ణాటక.. కష్టాల కొలిమిలో కాగిపోతున్నందున ఇక్కడి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి వీడ్కోలు పలికే తరుణం ఆసన్నమైందన్నారు. కన్నడిగులు ఆ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తారని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతికి కేంద్రం విడుదల చేసే నిధులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వినియోగించటం లేదన్నారు.



మంగళవారం కర్ణాటకలోని దావణగెరెలో భాజపా రైతు సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, భాజపా నేత యడ్యూరప్ప 75వ పుట్టిన రోజు మంగళవారమే కావటంతో 'పిడికిలి బియ్యం' కార్యక్రమాన్ని కూడా నరేంద్రమోదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు పార్టీ కార్యకర్తలు పల్లెల్లో ప్రతి ఇంటి నుంచి పిడికిలి బియ్యాన్ని సేకరించి జిల్లాకేంద్రాల్లో వాటితో ఆహారాన్ని వండి సహపంక్తి భోజనాలను చేస్తారు. కేంద్ర మంత్రులు అనంతకుమార్, సదానందగౌడ తదితరులు కూడా ఈ సభలో పాల్గొన్నారు.

భాజపా సీఎంలతో నేడు ప్రధాని భేటీ

ఈనాడు, దిల్లీ: భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా బుధవారం భేటీ కానున్నారు. దిల్లీలో నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయంలో దీనిని నిర్వహిస్తారు. డిజిటల్ పాలనతో పాటు నిరంతరం ప్రజల మధ్య కనిపించేలా రాష్ట్రాల సారథులకు వారిద్దరూ దిశా నిర్దేశం చేయనున్నారు. సుపరిపాలన అందించడం ఈ సమావేశ ప్రధాన అజెండాగా చెబుతున్నా- 2019 సార్వత్రిక ఎన్నికల దిశగా పార్టీ సీఎంలను కార్యోన్ముఖుల్ని చేయడం అసలు ఉద్దేశమని భాజపా వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో మూడు ప్రధానాంశాల ఆధారంగా పోరాడాలని భాజపా భావిస్తోంది. అవి...1) సాగువ్యయాన్ని తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచడం 2) మోదీకేర్ (ఆయుష్మాన్ భారత్) పథకం 3) స్కిల్ ఇండియా, ముద్రా యోజనల ద్వారా యువతలో నైపుణ్యాన్ని, సాధికారతను కల్పించడం. ఈ మూడు అంశాలను ఇప్పటి నుంచే ప్రజల్లోకి తీసుకువెళ్లాలంటూ సీఎంల సమావేశం ద్వారా సూచించనున్నారు. ప్రజలపై, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన జిల్లాల ప్రజానీకంపై పట్టుసాధించడానికి రాష్ట్రాల మంత్రులకు కొన్ని బాధ్యతలు అప్పగించాల్సిందిగా కోరనున్నారు. పేదల అనుకూల పథకాలను సమీక్షించి, బలహీనవర్గాలకు ఇంకా ఏ విధంగా మేలు చేయవచ్చో సమీక్ష జరపనున్నారు. రైతులు, దళితులు, గిరిజనులు, యువత, మహిళలకు గరిష్ఠ లబ్ధి కలిగించే అంశాలను చర్చిస్తారు. భాజపా, ఎన్డీఏ కూటమి చేతిలో దేశంలో 19 రాష్ట్రాలున్నాయి.

ఇంజిన్ ఆపకుండానే తేజస్‌లోకి ఇంధనం!

పరీక్షలు విజయవంతం

బెంగళూరు, న్యూస్‌టుడే: బెంగళూరులో హిందూస్తాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ తయారు చేస్తున్న తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్ అన్ని ప్రయోగ పరీక్షల్లో విజయం సాధించింది. తాజాగా విమానం ఆపకుండానే ఇంధనాన్ని నింపుకునే ప్రక్రియ (హాట్ రీఫిల్లింగ్)ను నిర్వహించామని, ఇది విజయవంతమైందని మంగళవారం అధికారులు తెలిపారు. తేజస్‌కు అమర్చిన ఎయిర్‌క్రాఫ్ట్ యంత్రం ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. ఈ తేలికపాటి విమానం ఒకచోటు నుంచి మరోచోటుకు వెళుతున్న సమయంలో... ఇంజిన్ ఆపకుండానే ఇంధనాన్ని నింపడం వల్ల సగానికి పైగా సమయం ఆదా అవుతుందని వివరించారు. ఎల్‌సీఏలను దేశీయ సాంకేతికతతో రూపొందించారు. సాధారణంగా ఇంధనాన్ని నింపుకొనేందుకు విమానాల యంత్రాన్ని ఆపేయాలి. పైలట్ కాక్‌పిట్ నుంచి కిందకు దిగిన తరువాత ఇంధనాన్ని నింపుతారు. హాట్ రీఫిల్లింగ్ ప్రక్రియతో ఆ అవసరం ఉండదు.

12ఏళ్లలోపు బాలికలపై అత్యాచారంచేస్తే మరణశిక్షే

కొత్త చట్టం రూపకల్పనకు హరియాణా పచ్చజెండా

చండీగఢ్: పన్నెండేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికలపై అత్యాచారం చేసినట్లు రుజువైతే... మరణ శిక్ష విధించే చట్టం రూపకల్పనకు హరియాణా సర్కారు పచ్చజెండా ఊపింది. ఈ విషయంపై ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ నేతృత్వంలోని కేబినెట్ మంగళవారం చర్చలు జరిపింది. లైంగిక నేరాలకు సంబంధించిన చట్టాలకు మరింత పదును పెట్టాలని నిర్ణయించింది. '12 లేదా అంతకంటే తక్కువ వయసున్న బాలికలపై అత్యాచారం లేదా సామూహిక అత్యాచారం చేసినట్లు రుజువైతే.. మరణశిక్ష లేదా 14 ఏళ్లకు తక్కువ కాకుండా కఠిన కారాగార శిక్ష విధించే చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించాం'అని కేబినెట్ ఓ ప్రకటన విడుదలచేసింది. ఇటీవల రాష్ట్రంలో అత్యాచారాల సంఖ్య పెరుగుతున్న సంగతి తెలిసిందే.

వ్యాధిలక్షణాలపై ఇక గూగుల్‌లో మెరుగ్గా 'సెర్చ్'!

బెంగళూరు: రోగులు తమ వ్యాధి లక్షణాల గురించి సులువుగా అర్థం చేసుకోవడానికి ఇంటర్నెట్ సెర్చ్ దిగ్గజం గూగుల్ కొత్తగా ఒక అంశాన్ని జోడించింది. 'సింప్టమ్ సెర్చ్' అనే ఈ కొత్త అంశం ద్వారా వివిధ వ్యాధి లక్షణాల గురించి నాణ్యమైన సమాచారాన్ని ప్రజలు తమ మొబైల్ ఫోన్ల ద్వారానే పొందవచ్చు. కొత్త అంశం కింద.. సాధారణంగా అన్వేషించే వ్యాధి లక్షణాల గురించిన సమాచారాన్ని గూగుల్ జోడిస్తుంది. దగ్గు, నొప్పి కోసం శోధించినప్పుడు సాధారణ జలుబు, తీవ్రస్థాయి బ్రాంకైటిస్, ఫ్లూ, న్యుమోనియా, ఛాతీ ఇన్ఫెక్షన్ వంటి సంబంధిత రుగ్మతల జాబితానూ ఈ యాప్ చూపుతుంది. గూగుల్‌లో సాగించే అన్వేషణల్లో దాదాపు ఒక శాతం మేర.. వ్యాధి లక్షణాలకు సంబంధించినవే ఉండటం వల్ల ఈ వెసులుబాటును సంస్థ జోడించింది. దీనిద్వారా ప్రజలు తమ వ్యాధి లక్షణాలపై ఆరోగ్య నిపుణుడితో మెరుగ్గా చర్చించగలుగుతారు. లేదా వెబ్‌లో మరింత లోతైన శోధన చేయగలుగుతారు. ఈ సమాచారం భారత అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూడటానికి గూగుల్ సంస్థ.. అపోలో హాస్పటల్స్ వైద్యులతో కలసి పనిచేస్తోంది.





సంగారెడ్డి సభకు తరలివచ్చిన కార్యకర్తలు, ప్రజలు ★ అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు కుంతియా, ఉత్తమ్, సురేష్ షెట్కార్, దామోదర్ రాజనర్సింహ, పొన్నాల, బట్టి విక్రమార్క, వీహెచ్, జగ్గారెడ్డి తదితరులు

తెలంగాణలో పోలీసు రాజ్యం..

- భాజపాపై సీఎం కేసీఆర్ విమర్శల మర్మమేమిటో
- ప్రశ్నించేవారిని జైళ్లకు పంపుతున్నారు
- సంగారెడ్డి బస్సు యాత్రలో కాంగ్రెస్ నేతలు

ఈనాడు, సంగారెడ్డి, ఈనాడు డిజిటల్, వికారాబాద్: దేశాన్ని కుదిపేసిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ విధింపు సమయంలో, రాష్ట్రపతి ఎన్నికలప్పుడూ కేంద్ర ప్రభుత్వానికి బేషరతుగా మద్దతిచ్చిన కేసీఆర్.. ఇప్పుడు హఠాత్తుగా భాజపాపై ఎందుకు విమర్శలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి రామచంద్ర కుంతియా ప్రశ్నించారు. ప్రజాచైతన్య బస్సు యాత్రలో భాగంగా మంగళవారం ముందుగా ఆయన వికారాబాద్‌లోని అనంతగిరి పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తాండూరు, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో కుంతియా మాట్లాడుతూ... కేంద్రంలోని ప్రభుత్వానికి నాలుగేళ్లుగా ఎల్లవేళలా మద్దతిస్తూ వచ్చిన కేసీఆర్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో భాజపాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014లో కేసీఆర్ అధికారంలోకి వస్తే ఏదో చేస్తాడని ప్రజలు ఆశించారని, అయితే.. నాలుగేళ్లుగా రాష్ట్రంలో దోపిడీ పాలన కొనసాగుతోందని దుయ్యబట్టారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ పోలీసు రాజ్యాన్ని నడిపిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. మిషన్ కాకతీయ, జలవనరుల పథకాల నుంచి కేసీఆర్ జేబులోకి ఆరు శాతం కమీషన్ చేరుతోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తాండూరు బండలపై జీఎస్టీని తగ్గిస్తామని, ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మారుస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నష్టం కలిగిస్తున్న సీపీఎస్ పింఛను విధానాన్ని రద్దుచేసి, పాత పద్ధతినే అమలులోకి తెస్తామంటూ ప్రకటించిన కేసీఆర్ ఏం చేశారు..? అంటూ ఉత్తమ్ నిలదీశారు. ప్రస్తుతం తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం వీస్తోందని, కేసీఆర్‌ను ఇంటికి పంపే సమయం ఆసన్నమైందని జోస్యం చెప్పారు. ఎన్నికలు సమీపిస్తోండటంతోనే.. వారికి ఎకరానికి రూ.4వేలు వంతున పెట్టుబడి సాయం ప్రకటించారని ఆరోపించారు.

తెరాసను గద్దె దించాలనే ఇంత 'మంది' జమ..

సీఎల్పీ నేత జానారెడ్డి మాట్లాడుతూ.. సభలకు వస్తున్న జనాన్ని చూస్తే తెరాసను గద్దె దించాలనే దీక్షతోనే హాజరవుతున్నట్లు అనిపిస్తోందన్నారు. సహ చట్టం, ఆహార భద్రత, అటవీ హక్కులు, భూసేకరణ, ఉపాధి హామీ వంటి పథకాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ కాదా అంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజల దశాబ్దాల కోరికను తీర్చడానికే సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని, అలాంటి పార్టీని ఏం చేసిందని నిలదీసే నైతిక హక్కు తెరాసకు లేదన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.2లక్షల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామంటూ పునరుద్ఘాటించారు. అందుకే రూ.రెండు లక్షలు ఇచ్చేది కావాలా.. రూ.4వేలు ఇచ్చే పార్టీ కావాలో ప్రజలే తేల్చుకోవాలని జానారెడ్డి సూచించారు.

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టి విక్రమార్క మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ కాలం నుంచి నేటి వరకు సింగరేణిలో ఒక్కనాడూ పనులు ఆపలేదని, అయితే కేసీఆర్ సభకు జనాలు ఉండరనే భయంతో మంగళవారం సంస్థకు సెలవు ప్రకటించడం ఎంతవరకు సమంజసమన్నారు. కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ నిరాహార దీక్ష చేసినప్పుడు ఆయనకు రోజూ అవసరమైన పోషకాలను ఇంజెక్షన్ ద్వారా ఎక్కించారన్నారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ... రాష్ట్రంలో రైతులు, విద్యార్థులతో పాటు తెరాస కార్యకర్తలు సైతం ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు, మంత్రి మహేందర్‌రెడ్డికి విందు భోజనం చేసినట్లుగా ఉందని ఆరోపించారు. సీనియర్ నేతలు షబ్బీర్‌అలీ, దామోదర రాజనర్సింహ, వీహెచ్, పొన్నాల, పొన్నం ప్రభాకర్, సురేష్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

విభజన చట్టం హామీలపై మౌనమేల?: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: విభజన చట్టం హామీలపై తెరాస ఎందుకు మౌనంగా ఉందని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ మీడియాహాలులో మాట్లాడుతూ తెరాస కేంద్రంతో కుమ్మక్కైందని, మిత్రపక్షంగా వ్యవహరిస్తోందని అన్నారు. నాలుగు సంవత్సరాల్లో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ విషయంలోనైనా విభేదించిందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరానికి జాతీయ హోదా సాధించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో కేంద్రంపై నెపం నెట్టి కేసీఆర్ చేతులు దులుపుకొంటున్నారన్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి ఉద్యమ నాయకుడైతే.. కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఉద్యమ నాయకులేనన్నారు.

పపువా న్యూగినియాలో భూకంపం: 31 మంది మృతి

సిడ్నీ: పసిఫిక్ ద్వీప దేశమైన పపువా న్యూగినియాను వణికించిన భూకంపం ఫలితంగా దాదాపు 31 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 300 మంది గాయపడ్డారు. అనేక ఆస్తులు ధ్వంసం కాగా అపారనష్టం వాటిల్లింది. ఇక్కడ సోమవారం 7.5 తీవ్రతతో భూకంపం సంభవించగా.. నష్టానికి సంబంధించిన వివరాలను రెండో రోజున ఓ వార్తాసంస్థ వెల్లడించింది. అటవీ, పర్వత ప్రాంతాలతో నిండి ఉన్న ఎంగా ప్రావిన్సులోని దక్షిణ పోర్గెరాలో ఈ విపత్తు సంభవించగా.. అనంతరం రెండుసార్లు తీవ్ర ప్రకంపనలు కూడా కుదిపేశాయి.



పపువా న్యూగినియాలో భూకంపంతో కొండచరియలు విరిగిపడి విధ్వంసం

అమెరికా బయట ఎక్కడి నుంచైనా దరఖాస్తు చేయొచ్చు!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

నాకు, నా భార్యకు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసేందుకు మా అమ్మాయి ప్రయత్నిస్తోంది. పుట్టినతేదీ ధ్రువీకరణపత్రాల జారీ అప్పట్లో లేదు. పాఠశాల జారీ చేసిన ధ్రువపత్రాలే ఉన్నాయి. వాటిల్లో పుట్టినతేదీ ఉంది. ఇవి సరిపోతాయా? - వారణాసి సుధాకర్

శాశ్వత నివాసి(గ్రీన్‌కార్డు) హోదాకు సంబంధించిన సమాచారం కోసం యూఎస్‌సీఐఎస్ వెబ్‌సైట్ http://www. uscis.gov/portal/site/uscis ను గానీ, దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలోని యూఎస్‌సీఐఎస్ యూనిట్‌ను cis.ndi@ uscis.dhs.gov గానీ సంప్రదించండి.

బీటెక్ పూర్తి చేశాను. అమెరికాలో మాస్టర్స్ చేద్దామనుకుంటున్నాను. వీసా ప్రక్రియ ఏమిటి? - భగత్ సుంకర

అమెరికాలో విద్యాభ్యాసానికి సంబంధించిన సాధారణ సమాచారం కోసం ఎడ్యుకేషన్ యూఎస్‌ఏ వెబ్‌సైట్ https://educationusa.state.gov, యునైటెడ్ స్టేట్స్-ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వెబ్‌సైట్ www.usief.org.in ను చూడండి. విద్యార్థి వీసా కోసం దరఖాస్తు తదితర సమాచారం కోసం www.ustraveldocs.com/in ను పరిశీలించండి.

మా అమ్మాయి 2016 జూన్‌లో అమెరికాలో ఇంటర్నల్ మెడిసిన్‌లో చేరింది. అది మూడేళ్ల కోర్సు. ఏడాదికి జె-1వీసా జారీ చేశారు. రెండో సంవత్సరానికి వీసా అమెరికాలో పునరుద్ధరించుకోవచ్చా? లేక భారత దేశం రావాలా? ఇంటర్వ్యూకు హాజరు కావాలా? వీసా పునరుద్ధరణలో రెండు నెలలకుమించి జాప్యం జరిగితే కళాశాల సీటును కోల్పోవాల్సి వస్తుంది. డ్రాప్ బాక్స్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చా? ప్రయాణానికి ముందు పునరుద్ధరించుకోవచ్చా? - డాక్టర్ ఎ.కృష్ణమూర్తి

కళాశాల జారీచేసిన చెల్లుబాటయ్యే డీఎస్-2019 ధ్రువపత్రం లేదా విద్యా కార్యక్రమంలో చేరినట్లు ఉంటే అమెరికా వెలుపల ఎక్కడి నుంచైనా వీసా పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆమె ఇంటర్వ్యూ మినహాయింపు పథకం(ఐడబ్ల్యూపీ) కింద అర్హత పొందవచ్చు. డ్రాప్ బాక్స్ విధానాన్ని వినియోగించుకునేందుకు అర్హులా? కాదా? అన్నది నిర్ధారించుకునేందుకు www.ustraveldocs.com/in ను చూడండి. ఈ విధానం వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ కోసం కాన్సులేట్‌కు రావాల్సిన అవసరాన్ని తగ్గిస్తుంది.

నలుగురు కుటుంబ సభ్యులమైన మేము ఒక గ్రూపుగా బి1/బి2 పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేద్దామనుకుంటున్నాం. ధ్రువపత్రాలను వేర్వేరుగా దాఖలు చేయాలా? లేక ఒక సెట్ దాఖలు చేస్తే సరిపోతుందా? - రవికృష్ణ ముప్పలనేని

మీ కుటుంబ సభ్యులంతా ఒకేదఫా దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రతి ఒక్కరూ వేర్వేరుగా ఆన్‌లైన్‌లో డీఎస్-160 దరఖాస్తును భర్తీ చేయాలి. వీసా ఫీజును చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారానే అపాయింటుమెంటును షెడ్యూల్ చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ, వీసా ఇంటర్వ్యూ అపాయింటుమెంటు తదితర సమాచారం కోసం www.ustraveldocs.com/in ను చూడండి.

- ★ వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.comకు ఈ-మెయిల్‌చేయండి.
- ★ మరింత సమాచారానికి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.govను సంప్రదించవచ్చు.
- ★ హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

చందమామపై చరవాణి నెట్‌వర్క్

వచ్చే ఏడాది ఏర్పాటుచేయనున్న వొడాఫోన్, నోకియా

బార్సిలోనా: చంద్రుడిపై వచ్చే ఏడాది చరవాణి నెట్‌వర్క్(4జీ) అందుబాటులోకి రానుంది. తొలిసారిగా జాబిల్లిపై ఈ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసేందుకు తాము సంయుక్తంగా కృషిచేస్తున్నామని వొడాఫోన్-జర్మనీ, నోకియా, కార్ల తయారీ సంస్థ 'ఆడి' మంగళవారం వెల్లడించాయి. వచ్చే ఏడాది కేప్ కెనవెరాల్ నుంచి స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్‌తో సంబంధిత సామగ్రిని చందమామపైకి పంపించనున్నట్లు తెలిపాయి. బెర్లిన్‌కు చెందిన 'పీటీసైంటిస్ట్స్' సంస్థ ఈ ప్రయోగాన్ని చేపడుతుందని పేర్కొన్నాయి.

సన్నిహితులతో భోజనానికి వెళ్తే చరవాణిని దూరంగా పెట్టేయండి!

టొరంటో: కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి భోజనం చేసేందుకు బయటకు వెళ్తున్నారా? అయితే, మీ చరవాణిని దూరంగా పెట్టేయండి. లేదంటే వారితో విందు సమయాన్ని సరిగ్గా ఆస్వాదించలేరు! 300 మందిపై అధ్యయనం అనంతరం కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ అంశాన్ని నిర్ధారించారు. తాజా అధ్యయనంలో భాగంగా పరిశోధకులు.. రెస్టారెంట్లలో భోజనానికి విచ్చేసినవారు స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగిస్తున్న తీరును(వారికి చెప్పకుండానే) తెలుసుకున్నారు. అనంతరం వారిని పలు ప్రశ్నలు అడిగారు. సన్నిహితులతో భోజన సమయాన్ని ఎంతమేరకు ఆస్వాదించారో విశ్లేషించారు. చరవాణిని చేతిలోనే పట్టుకొని వినియోగించిన వారితో పోలిస్తే.. పక్కనపెట్టేసినవారు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఎక్కువ సంతోషంగా భోజనం చేశారని గుర్తించారు. స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగిస్తూనే విందు ఆరగించిన కొందరిలో కాస్త విసుగు ఛాయలు కూడా కనిపించాయని తెలిపారు.

చోదక అనుమతులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ వేగవంతం

దిల్లీ: వాహన చోదక అనుమతులకు (డ్రైవింగ్ లైసెన్సులు) ఆధార్‌ను అనుసంధానించే ప్రక్రియ శీఘ్రగతిన పూర్తయ్యేలా కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో చర్చిస్తున్నట్లు ఐటీ, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. దిల్లీలో నిర్వహించిన 2018 ఎన్ఎస్ఈ టెక్ సదస్సులో ఆయన మంగళవారం మాట్లాడారు. ప్రజా ప్రయోజనాలు, వారి భద్రతను దృష్టిలో ఉంచుకునే ఈ చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. దీంతో తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు చేసే చోదకులు అక్రమాలకు పాల్పడే వీలుండదని పేర్కొన్నారు.

నూతన ఆరోగ్య కేంద్రాల్లో 12 భిన్న సేవలు: జె.పి.నడ్డా

ఆరోగ్య పరిరక్షణరంగంలో జిల్లాల మధ్య దీర్ఘకాలంగా నెలకొన్న తారతమ్యాలను జాతీయ ఆరోగ్య కార్యక్రమం(ఎన్‌హెచ్‌ఎం)తో రూపుమాపుతామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జె.పి.నడ్డా అన్నారు. అన్ని జిల్లాల్లో ఆరోగ్య సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చేస్తామన్నారు. దిల్లీలో జరిగిన ఎన్‌హెచ్‌ఎం స్టీరింగ్ బృందం సమావేశానికి నడ్డా అధ్యక్షత వహించి మాట్లాడారు.

సోహ్రాబుద్దీన్ కేసులో మరో న్యాయమూర్తిపై వేటు: రాహుల్

ఉగ్రవాదులతో సంబంధాలున్న సోహ్రాబుద్దీన్ షేక్ (గుజరాత్‌లో పేరుమోసిన గూండా)ను బూటకపు ఎన్‌కౌంటర్లో హతమార్చిన కేసును విచారిస్తున్న మరో న్యాయమూర్తిపై వేటు పడిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లను బాంబే హైకోర్టులోని మరో ఏకసభ్య ధర్మాసనానికి బదలాయిస్తూ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో ఆయన ట్విటర్ ద్వారా ఈ వ్యాఖ్య చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తీరును తప్పుపట్టి, మీడియాపై ఆంక్షల్ని ఎత్తివేసిన న్యాయమూర్తిని మార్చడంపై వెలువడిన కథనాలను ఆ వ్యాఖ్యకు జత చేశారు.

ఈసీ ఆదేశాలు అన్యాయం

దిల్లీ హైకోర్టు ముందు అనర్హతకు గురైన ఆప్ ఎమ్మెల్యేల వాదన

దిల్లీ: ఎమ్మెల్యే పదవులకు తమను అనర్హులను చేస్తూ ఈసీ ఇచ్చిన ఆదేశాలు.. అన్యాయమని ఆప్ నేతలు దిల్లీ హైకోర్టుకు విన్నవించుకున్నారు. అసలు తమ వాదనను ఈసీకి వినిపించే అవకాశమే ఇవ్వలేదన్నారు. లాభదాయక పదవుల్లో కొనసాగినందుకు 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఈసీ గత నెల 19న ప్రతిపాదించగా.. ఆ మరుసటి రోజే రాష్ట్రపతి దీన్ని ఆమోదించారు. ఈ అంశంపై విచారణకు సంబంధించి తమకు అసలు ఈసీ సమాచారమే ఇవ్వలేదని అనర్హతకు గురైన ఎమ్మెల్యేలు.. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చందర్ శేఖర్‌లతో కూడిన ధర్మాసనానికి తెలిపారు.

ఆప్ ఎమ్మెల్యే బెయిల్‌కు కోర్టు నిరాకరణ

దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాశ్‌పై దాడికి పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ ఎమ్మెల్యే ప్రకాశ్ జర్వాల్‌కు బెయిల్ మంజూరు చేసేందుకు దిల్లీ సెషన్స్ కోర్టు నిరాకరించింది.

షాబాజ్‌కే అధికార పార్టీ పగ్గాలు..

లాహోర్: పాకిస్థాన్ అధికార పీఎంఎల్-ఎన్ పార్టీ తాత్కాలిక అధ్యక్షుడుగా షాబాజ్ షరీఫ్ ఎన్నికయ్యారు. పాక్ పదవీచ్యుత ప్రధాని నవాజ్ షరీఫ్, రాజకీయ పార్టీ అధ్యక్ష పదవిని కూడా చేపట్టరాదంటూ ఇటీవల పాక్ సుప్రీంకోర్టు అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సోదరుడిని ఎన్నుకున్నారు.

సల్మాన్, కత్రినాలపై కేసులో స్థాయి నివేదికను కోరిన కోర్టు!

దిల్లీ: కులంపేరుతో దూషణకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బాలీవుడ్ నటులు సల్మాన్‌ఖాన్, కత్రినాకైఫ్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ఫిర్యాదుపై స్థాయి నివేదికను సమర్పించాల్సిందిగా దిల్లీసెషన్స్ కోర్టు మంగళవారం పోలీసులను కోరింది. ఈ కేసులో ఏదైనా ఎఫ్ఐఆర్ దాఖలైందా లేదా అనే విషయంపై మార్చి 5లోగా నివేదికను సమర్పించాల్సిందిగా సూచించింది. 'టైగర్ జిందా హై' చలనచిత్ర ప్రచారంలో సల్మాన్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారని బాధితుడు ఆరోపించారు. ఈ కేసు విషయంలో తనను సల్మాన్‌ఖాన్, అతడి సహచరులు బెదిరిస్తున్నట్లు బాధితుడు విన్నవించారు. దీనిపై అదనపు సెషన్స్ న్యాయమూర్తి సిద్ధార్థ్ శర్మ స్పందిస్తూ.... ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు ప్రక్రియలో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఎందుకు అనుసరించడంలేదో తెలపాలని ఆయన సదరు ఏసీపీని అడిగారు.

ఛాంపియన్



మయాంక్

ప్రేమలోనూ గెలిచాను..!

ఈ సీజన్ అద్భుతంగా సాగిపోయిందని.. కేవలం పరుగులే కాదు.. ప్రేమలోనూ తాను విజయం సాధించానని మయాంక్ అగర్వాల్ చెప్పాడు. ఈ సీజన్‌లో 2141 పరుగులు చేసిన మయాంక్.. విజయ్ హజారె టోర్నీలోనే 723 పరుగులు సాధించాడు. ఓ విజయ్ హజారె టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అతడు చరిత్ర సృష్టించాడు. "ఈ సీజన్ అద్భుతంగా సాగింది. నా స్నేహితురాలికి ప్రేమ ప్రతిపాదన కూడా చేశాను ఆమె అందుకు అంగీకరించింది" అని వెల్లడించాడు. శ్రీలంకలో ముక్కోణపు టోర్నీకి ఎంపిక చేయకపోవడంపై మయాంక్ స్పందించడానికి నిరాకరించాడు.

మెరిసిన మయాంక్

ఫైనల్లో సౌరాష్ట్ర ఓటమి

కర్ణాటకదే విజయ్ హజారె టోర్నీ

దిల్లీ

సీజన్‌లో రెండు వేలకు పైగా పరుగులు చేశాడు.. ఓ విజయ్ హజారె టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు.. అయినా సెలక్టర్ల నుంచి అతడికి నిరాశే మిగిలింది. శ్రీలంకలో ముక్కోణపు టీ20 టోర్నీలో తలపడే భారత జట్టుకు ఎంపికకాని మయాంక్ అగర్వాల్ బ్యాటుతో మరోసారి మెరిశాడు. అసాధారణ ఇన్నింగ్స్‌తో కర్ణాటకను విజయ్ హజారె ఫైనల్ చేర్చిన ఈ యువ కెరటం.. ఆఖరి పోరులోనూ అదరగొట్టాడు. మంగళవారం తుది పోరులో మయాంక్ (90; 79 బంతుల్లో 11×4, 3×6) చెలరేగిపోవడంతో పాటు స్పిన్నర్ కృష్ణప్ప గౌతమ్ (3/10) విజృంభించడంతో కర్ణాటక 41 పరుగుల తేడాతో సౌరాష్ట్రను ఓడించింది. మొదట 253 పరుగులు చేసిన కర్ణాటక.. పుజారా సారథ్యంలోని సౌరాష్ట్రను 212 పరుగులకే ఆలౌట్ చేసింది. ఐదేళ్లలో కర్ణాటక దేశవాళీ వన్డే టైటిల్‌ను గెలుచుకోవడం ఇది మూడోసారి.



అతడొక్కడే..: రెండు బలమైన జట్ల మధ్య జరిగిన తుది సమరంలో కర్ణాటకదే పైచేయి అయ్యింది. ముగ్గురు టీమ్‌ఇండియా ఆటగాళ్లతో కూడిన సౌరాష్ట్రపై ఆధిపత్యం ప్రదర్శించిన కర్ణాటక అలవోకగా విజయాన్ని అందుకుంది. కర్ణాటక జట్టులోనూ ముగ్గురు టీమ్‌ఇండియా ఆటగాళ్లున్నారు. ఐతే అందులో ఇద్దరు.. కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్ పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ చేరిపోయారు. 5కే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది కర్ణాటక. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఏం లేదు. ఇలాంటి పరిస్థితిలో మయాంక్ జట్టును ఆదుకున్నాడు. ఇది అతడికి కొత్తేం కాదు. ఈ టోర్నీలో ఇలాంటి ఇన్నింగ్స్ చాలానే ఆడాడు. ఫైనల్లో కాస్త కుదురుకునేవరకు ఆచితూచి ఆడిన అతడు ఆ తర్వాత చెలరేగిపోయాడు. సమర్థ్ (48)తో కలిసి మూడో వికెట్‌కు 136 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. సెంచరీ చేసేలా కనిపించిన అతడు ధర్మేంద్ర సింగ్ జడేజా బౌలింగ్‌లో నిష్క్రమించాడు. ఆ తర్వాత కర్ణాటక వికెట్లు వేగంగా నేలకూలాయి. పవన్ దేశ్‌పాండే (49), శ్రేయాస్ గోపాల్ (31) రాణించడంతో.. జట్టు స్కోరు 253 (45.5 ఓవర్లలో) పరుగులకు చేరుకుంది. లక్ష్యం పెద్దదేం కాదు. కానీ కర్ణాటక బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేయడంతో సౌరాష్ట్ర బ్యాట్స్‌మెన్ ఇబ్బందిపడ్డారు. ఏ సమయంలోనూ ఆ జట్టు భాగస్వామ్యాలు బలపడలేదు. పుజారా (94; 127 బంతుల్లో 10×4, 1×6) బాధ్యతాయుతంగా ఆడినా మిగతావారి నుంచి అతడికి సహకారం అందలేదు. సెమీస్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన రవీంద్ర జడేజా (15) విఫలమయ్యాడు. ఆఖర్లో చిరాగ్ జాని (22), మక్వానా (20 నాటౌట్) పుజారాకు అండగా నిలిచారు. ఐతే తొమ్మిదో వికెట్ రూపంలో పుజారా నిష్క్రమించాక సౌరాష్ట్ర ఇన్నింగ్స్ ఎంతోసేపు నిలవలేదు.

కర్ణాటక: 253 (45.5 ఓవర్లలో ఆలౌట్) (మయాంక్ అగర్వాల్ 90, సమర్థ్ 48, పవన్ దేశ్‌పాండే 49, శ్రేయాస్ గోపాల్ 31; మక్వానా 4/34, ప్రేరక్ మన్కడ్ 2/54)

సౌరాష్ట్ర: 212 (46.3 ఓవర్లలో) (పుజారా 94, బరోత్ 30, సీఎస్ జాని 22, మక్వానా 20 నాటౌట్; కృష్ణప్ప గౌతమ్ 3/27, ప్రసిద్ కృష్ణ 3/37)

భారత్-ఎ కెప్టెన్‌గా అశ్విన్

దేవధర్ ట్రోఫీ, ఇరానీ కప్‌కు జట్ల ఎంపిక



దిల్లీ: కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌కు ఎంపికైన రవిచంద్రన్ అశ్విన్‌కు సారథిగా నిరూపించుకునేందుకు ఐపీఎల్ కంటే ముందే మరో అవకాశం లభించింది. దేవధర్ ట్రోఫీలో పోటీపడే భారత్-ఎ జట్టుకు అతడు సారథిగా ఎంపికయ్యాడు. మంగళవారం బీసీసీఐ భారత్-ఎ, భారత్-బి జట్లను ప్రకటించింది. విజయ్ హజారె వన్డే టోర్నీ విజేత కర్ణాటకతో పాటు ఈ రెండు జట్లు ముక్కోణపు టోర్నీలో తలపడతాయి. భారత్-బి జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్, తెలంగాణ ఆటగాడు రోహిత్ రాయుడు భారత్-ఎ జట్టులో ఎంపిక కాగా.. భారత్-బి జట్టులో ఆంధ్ర క్రికెటర్లు కేఎస్ భరత్, హనుమ విహారిలకు చోటు లభించింది. వచ్చే నెల 4న ధర్మశాలలో ఈ టోర్నీ ఆరంభం కానుంది. లీగ్ దశలో ప్రతి జట్టు ఇతర జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు మార్చి 8న ఫైనల్లో ఢీకొంటాయి. రంజీ విజేత విదర్భతో ఇరానీ కప్ కోసం పోటీపడే రెస్టాఫ్ ఇండియా జట్టునూ బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టుకు కరుణ్ నాయర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఆంధ్ర ఆటగాళ్లు కేఎస్ భరత్, విహారి ఈ జట్టులో చోటు సొంతం చేసుకున్నారు. మార్చి 14న ఈ మ్యాచ్ ఆరంభమవుతుంది.

ఆసీస్‌తో సిరీస్‌కు మిథాలీ సారథ్యం



దిల్లీ: వడోదర వేదికగా వచ్చే నెల 12న ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొనే భారత మహిళల క్రికెట్ జట్టుకు మిథాలీరాజ్ నాయకత్వం వహించనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఇటీవల దక్షిణాఫ్రికా పర్యటనలో మిథాలీ కెప్టెన్సీలో వన్డే సిరీస్‌ను 2-1తో గెలుచుకున్న భారత్.. టీ20 సిరీస్‌నూ 3-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆసీస్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే మార్చి 12న ప్రారంభం కానుండగా.. 15న రెండు, 18న మూడో వన్డేలు జరుగుతాయి.

భారత్ జట్టు: మిథాలీరాజ్ (కెప్టెన్), హర్మన్‌ప్రీత్ (వైస్ కెప్టెన్), స్మృతి మంధాన, పూనమ్ రౌత్, జెమిమా రోడ్రిగ్స్, వేద కృష్ణమూర్తి, మోనా, సుష్మ (వికెట్‌కీపర్), ఏక్తా బిస్త్, పూనమ్ యాదవ్, రాజేశ్వరీ గైక్వాడ్, శిఖా పాండే, సుకన్య, పూజ, దీప్తిశర్మ



ఓ రాజు ఓ రాణి

చదరంగం కలిపింది ఇద్దరినీ

ఈనాడు - హైదరాబాద్

ముకేశ్‌కుమార్, వీవీఎస్ లక్ష్మణ్, పుల్లెల గోపీచంద్, కరణం మల్లీశ్వరి.. క్రీడారంగంలో ఒక వెలుగు వెలిగిన తెలుగు తేజాలు! ఈ నలుగురి తర్వాతి తరం క్రీడాకారుల్లో మొట్టమొదటి ఆటగాడు.. గ్రాండ్ మాస్టర్ పెంటేల హరికృష్ణ. దేశంలో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత చెస్‌లో అత్యున్నత స్థానానికి చేరుకున్న ఆటగాడు హరికృష్ణే. ఎన్నో ఘనతలు సాధించిన 31 ఏళ్ల హరి.. పెళ్లి కొడుకు కాబోతున్నాడు. మార్చి 3న తన ఇష్టసఖి నదెడ్జాను మనువాడనున్నాడు. నదెడ్జాతో పరిచయం.. ప్రేమపై హరి అంతరంగమిది...

ఆమెతో పరిచయం..

1996లో నదెడ్జాను తొలిసారిగా ఓ యూత్ చెస్ టోర్నీలో చూశా. అప్పుడు నా వయసు పదేళ్లు. అప్పుడు మేం పెద్దగా మాట్లాడుకున్నది లేదు. తను యుగోస్లేవియాకు ఆడేది. ఆ తర్వాత సెర్బియా. నదెడ్జా మహిళా ఫిడె మాస్టర్ కూడా. కొన్నేళ్ల తర్వాత ఆటకు వీడ్కోలు చెప్పి.. చదువు వైపు మళ్లింది. ఎకనామిక్స్‌లో ఉన్నత చదువు పూర్తిచేసింది. చెల్లి కోసం నదెడ్జా మళ్ళీ చెస్‌తో జట్టుకట్టింది. చెస్ ఆడకపోయినా ఆటకు సంబంధించిన కోర్సులు చేసింది. నదెడ్జా ఫిడె ఆర్బిటర్ కూడా. ఇన్‌స్ట్రక్టర్ కోర్సు కూడా చేస్తోంది.

కలిసిన మాట..

2000 వరకు తరచూ టోర్నీల్లో కలిసేవాళ్లం. తర్వాత తను ఆటకు దూరమైంది. ఐదారేళ్ల తర్వాత చెల్లితో పాటు టోర్నీలకు రావడం మొదలుపెట్టింది. 2010 నుంచి నదెడ్జాతో స్నేహం మొదలైంది. అప్పట్నుంచి తరచూ మాట్లాడుకోవడం ప్రారంభమైంది.

ప్రేమ.. పెళ్లి..

2010 నుంచి మా స్నేహం కొనసాగుతోంది. స్నేహం ప్రేమగా ఎప్పుడు మారిందో తెలియదు. ప్రపోజ్ చేసుకున్న సందర్భం కూడా గుర్తులేదు. ముందు మేం స్నేహితులం.. తర్వాతే ప్రేమికులం. మా ఇద్దరి ఆలోచనలు దగ్గరగా ఉంటాయి. ఇష్టాలు కూడా అంతే. 3, 4 నెలల క్రితమే పెళ్లి ఆలోచన వచ్చింది. అమ్మానాన్నలతో చర్చించాం. వాళ్లింట్లో ఒప్పించడానికి కొంచెం సమయం పట్టింది. తను భాగస్వామిగా దొరకడం సంతోషంగా ఉంది.

ఇంట్లో ఇబ్బందిగా..

అమ్మానాన్నకు చెప్పినప్పుడు మొదట్లో కొంచెం ఇబ్బందిగా అనిపించింది. మా కుటుంబంలో ఇలాంటి పరిణామం కొత్త. తర్వాత అంతా సర్దుకుంది. అందరి కుటుంబాల్లో మొదట్లో ఇలాంటి పరిస్థితి ఉండటం సహజం. రోజులు గడుస్తున్నకొద్దీ అన్నీ సర్దుకున్నాయి.

ఖాళీ సమయాల్లో..

సినిమాలు చూడం. అంత సమయం ఉండదు. సంగీత కార్యక్రమాలకు వెళ్తుంటాం. చాటింగ్‌కు కూడా సమయం ఉండదు. మొదట్లో నేను బెల్‌గ్రేడ్‌లో ఉండేవాడిని. అప్పుడు తరచూ కలిసేవాళ్లం. ఇప్పుడున్న ఇంటికి రావడానికి నదెడ్జాకు గంటన్నర విమాన ప్రయాణమే.

భారత్‌కు దూరమైనట్లేనా..

ఒకప్పుడు స్పెయిన్‌లో ఆనంద్ స్థిరపడినట్లే.. ఇప్పుడు చెక్ రిపబ్లిక్‌లోని ప్రేగ్‌ను సొంతగడ్డగా ఎంచుకున్నా. అక్కడి క్లబ్ నాకు అన్ని వసతులు కల్పిస్తోంది. యూరోపియన్ లీగ్స్‌లో ఆడాలని నిర్ణయం తీసుకున్నా. అందుకే చాలాకాలం నుంచి దాదాపుగా అక్కడే ఉంటున్నా.

లీగ్‌ల ప్రత్యేకత..

మన ఐపీఎల్ మాదిరే ఐరోపా, చైనాలో చెస్ లీగ్‌లు నిర్వహిస్తున్నారు. స్థానిక ఆటగాళ్లలో ప్రతిభను గుర్తించేందుకు ఈ లీగ్‌లు తోడ్పడతాయి. చైనా లీగ్‌లో స్థానిక క్రీడాకారులతో తప్పనిసరిగా ఆడాలి. అలా చేయడం వల్ల పెద్ద గ్రాండ్‌మాస్టర్‌లతో వారికి ఆడే అవకాశం లభిస్తుంది.

నదెడ్జా గురించి..

ఎందుకు.. ఏమిటి అని అడగదు. ఏది చెప్పినా వింటుంది. త్వరగా నేర్చుకుంటుంది. సానుకూలంగా ఆలోచిస్తుంది.

కుటుంబ నేపథ్యం..

నదెడ్జాది సెర్బియా. చెల్లి ఏంజెలియస్ స్టెయినోవిచ్ కూడా చెస్ క్రీడాకారిణే. సెర్బియా నంబర్ టూ. తను మహిళా గ్రాండ్‌మాస్టర్. తల్లి డాక్టర్. తండ్రి వ్యాపారవేత్త. ఆయనకు ఆరోగ్యం బాగుండట్లేదు. పెళ్లికి కూడా రావట్లేదు.

మన సంస్కృతి గురించి..

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తనకు అస్సలు తెలియవు. చెబుతుంటే ఆసక్తిగా వింది. మన పెళ్లిళ్లకు సంబంధించిన వీడియోలు చూసింది.

ఆమె ఇష్టాయిష్టాలు..

చదవడం, వంట చేయడం అంటే ఇష్టం. పెయింటింగ్ కూడా. ఇతర దేశాల సంస్కృతి తెలుసుకోవడం.. ప్రయాణాలపై ఆసక్తి ఎక్కువ. నాక్కూడా ప్రయాణాలంటే ఇష్టం.

పెళ్లి.. హనీమూన్..

హైదరాబాద్‌లోనే పెళ్లి. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. చెక్ రిపబ్లిక్‌లో మా క్లబ్ వాళ్లు విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఖాళీ ఉన్నప్పుడు ఆ కార్యక్రమం ఉంటుంది. హనీమూన్ ఇండియాలోనే. చిన్నప్పట్నుంచి విదేశాలు తిరుగుతున్నా. మనదేశంలో చూడని ప్రదేశాలు చాలా ఉన్నాయి. అందుకే ఇక్కడే అనుకుంటున్నాం.

కలిసి తిరిగిన ప్రాంతాలు..

ఇద్దరం కలిసి చాలా దేశాలు తిరిగాం. స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, స్పెయిన్ ఇలా చాలా చోట్లకు వెళ్లాం. స్విట్జర్లాండ్ మాకు చాలా నచ్చింది. జ్యూరిచ్ సరస్సు బాగుంది.



కోహ్లి.. దూకుడు తగ్గించుకోవాలి!

మొనాకో: విరాట్ కోహ్లి అంటే దూకుడు.. ఆటలోనైనా, సారథ్యంలోనైనా దూకుడుగా ఉండటం టీమ్‌ఇండియా కెప్టెన్‌కు అలవాటు. ఐతే అన్ని వేళలా దూకుడు పనికిరాదని, ఈ విషయంలో కోహ్లికి నియంత్రణ అవసరమని అంటున్నాడు ఆస్ట్రేలియా మాజీ సారథి స్టీవ్ వా. కెప్టెన్‌గా కోహ్లి నేర్చుకునే దశలోనే ఉన్నాడని, ఏది సరైందో త్వరలో తెలుసుకుంటాడని చెప్పాడు. "దక్షిణాఫ్రికాలో కోహ్లిని చూశాను. అతడిలో దూకుడు మోతాదు మించిందనిపించింది. కెప్టెన్‌గా అతడు ఇంకా ఎదిగే క్రమంలోనే ఉన్నాడు. ఉత్సాహాన్ని, భావోద్వేగాలను నియంత్రించుకోవడానికి అతడికి మరికొంత సమయం పడుతుంది. అయినా విరాట్ అంటేనే దూకుడు. అతడు ఆటను అలాగే ఆడతాడు. ఐతే.. జట్టులో అందరూ అతడిలా ఆడలేరన్న సంగతిని గుర్తించాలి. రహానె, పుజారా లాంటి ఆటగాళ్లు ఎంతో ప్రశాంతంగా ఉంటారు. జట్టులో కొందరు భిన్నంగా ఉంటారన్న సంగతి కోహ్లి అర్థం చేసుకోవాలి. అన్ని వేళలా దూకుడుగా ఉంటానంటే కుదరదు. కొన్నిసార్లు నియంత్రించుకోవాలి. కొన్నిసార్లు పెంచాలి. ఎప్పుడు ఏది సరైందన్న సంగతిని తెలుసుకోవాలి" అని వివరించాడు. ఆటగాడిగా కోహ్లి అంటే తనకు ఎంతో గౌరవముందని చెప్పాడు. "ప్రస్తుతం కోహ్లి జట్టును చక్కగా నడిపిస్తున్నాడు. గొప్ప నైపుణ్యమున్న ఆటగాడు. ఐతే జట్టులోని ఆటగాళ్లందరూ తనను అనుసరించాలని భావిస్తాడు. జట్టు ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఆడాలని, వీలైనంత త్వరగా విజయాన్ని అందుకోవాలని కోరుకుంటాడు" అని అన్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో భారత్‌కు కోహ్లినే కీలకమని వా చెప్పాడు.

ఆట ముగిశాక.. రాజకీయాల్లోకి..!



మెల్‌బోర్న్: క్రికెటర్లు కెరీర్ ముగిశాక ఏం చేస్తారు..? కోచ్‌లుగా మారతారు.. లేదంటే వ్యాఖ్యాతగా కొత్త ఇన్నింగ్స్ ఆరంభిస్తారు. ఈ రెండు కాకుంటే.. క్రికెట్ పాలనవైపు అడుగులు వేస్తారు. ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ మాత్రం భిన్నమైన మార్గం ఎంచుకున్నాడు. కెరీర్ ముగిశాక రాజకీయాల్లో అడుగుపెట్టే అవకాశాన్ని వదులుకోనని అన్నాడు. క్రికెట్ ఆస్ట్రేలియాతో (సీఏ)తో క్రికెటర్ల జీతాల సమస్య ముదిరి పాకాన పడ్డ సమయంలో.. వార్నర్ ముందుండి ఉద్యమాన్ని నడిపించాడు. ఆటగాళ్లను జట్టులోకి ఎంపిక చేయకుండా నిరుద్యోగులుగా మార్చినా అతడు వెనక్కి తగ్గలేదు. అదే స్ఫూర్తితో రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించాలనుందని వార్నర్ చెప్పాడు. ఆస్ట్రేలియా జట్టులో రాజకీయ నాయకులతో తరుచుగా మాట్లాడే వారిలో వార్నర్ ముందు వరుసలో ఉంటాడు. ఓసారి ప్రధానితో సమావేశం సందర్భంగా పరిష్కరించాల్సిన సమస్యలను ఏకరవు పెట్టాడు కూడా. "చిన్నప్పుడు నేను ఎంతో కష్టపడ్డాను. అమ్మనాన్నలు పనికిపోతే.. సోదరుడితో కలిసి ఇంట్లో పాత్రలు కడిగేవాడిని. బట్టలు ఉతికి, ఇస్త్రీ చేసేవాడిని. ఆ తర్వాత కాస్త పెద్దయ్యాక పనికి వెళ్లి.. అద్దె చెల్లించడంలో భాగమయ్యాను. హక్కుల కోసం పోరాడేందుకు నేను ఎప్పుడూ ముందుంటాను. ఊరికే కూర్చుంటే కుదరదు. ఎవరో ఒకరు మాట్లాడి ఏదో ఒకటి చేస్తేగానీ సమస్యలు పరిష్కారం కావు" అని వార్నర్ అన్నాడు.

చేయి చేయి కలిపారు



కేప్‌టౌన్: ప్రపంచంలోని అందమైన నగరాల్లో కేప్‌టౌన్ ఒకటి. అదే సమయంలో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న నగరం కూడా. భారత జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో తొలి టెస్టు ఇక్కడే ఆడింది. ఆ సమయంలో ఇక్కడి నీటి కొరతపై వార్తలొచ్చాయి. పొదుపుగా నీళ్లను వాడుకోవాలంటూ భారత క్రికెటర్లకు స్థానిక అధికారులు కూడా సూచించినట్లు కూడా కొన్ని పత్రికలు రాశాయి. ఈ నేపథ్యంలో చివరి టీ20 ముగిసిన తర్వాత విరాట్ కోహ్లి, డుప్లెసిస్ నీటి కొరత అధిగమించడానికి తమ వంతు సాయంగా స్థానిక అధికారులకు రూ.5.5 లక్షల చెక్కు అందించారు. "ప్రపంచంలోని అందమైన నగరాల్లో కేప్‌టౌన్ ఒకటి. మేమిక్కడ ఎప్పుడు మ్యాచ్ ఆడినా స్థానికులు మాపై ప్రేమ కురిపిస్తూనే ఉన్నారు. అందుకే ఈ కార్యక్రమం చేశాం" అని కోహ్లి చెప్పాడు. "కేప్‌టౌన్‌లో నీటి సమస్యను ప్రత్యక్షంగా రెండు జట్లూ చూశాయి. అందుకే కోహ్లితో మాట్లాడిన తర్వాత ఆటగాళ్ల సంతకాలతో కూడిన జెర్సీలను వేలం వేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బును స్థానిక అధికారులకు అందించాం" అని డుప్లెసిస్ పేర్కొన్నాడు.

గాయంతో మాథ్యూస్ ఔట్

ముక్కోణపు సిరీస్‌కు శ్రీలంక జట్టు



కొలంబో: శ్రీలంక పరిమిత ఓవర్ల క్రికెట్ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్ వచ్చే నెల స్వదేశంలో జరగనున్న టీ20 ముక్కోణపు సిరీస్‌కు దూరమయ్యాడు. మోకాలు కండరం గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో శ్రీలంక క్రికెట్ బోర్డు మంగళవారం ప్రకటించిన జట్టులో అతణ్ని ఎంపిక చేయలేదు. మార్చి 6నుంచి శ్రీలంక, భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ జరగనున్న విషయం తెలిసిందే.

అప్పుడు మాట్లాడమన్నారు.. ఇప్పుడు వద్దంటున్నారు..!



దిల్లీ: బ్యాడ్మింటన్‌లో ప్రతిపాదిత కొత్త నిబంధనలపై భారత చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అసహనం వ్యక్తం చేశాడు. స్కోరింగ్ పద్ధతిని మార్చే యోచనలో ఉన్న ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్).. మ్యాచ్ సందర్భంగా కోర్టులో కోచింగ్ సమయాన్ని తగ్గించాలని భావిస్తోంది. మేలో జరిగే వార్షిక సర్వసభ్య సమావేశంలో వీటిపై తుది నిర్ణయం తీసుకోనుంది. కోచింగ్ సమయం తగ్గించడంలో తర్కమేంటో తనకు అర్థం కావడం లేదన్నాడు గోపీచంద్. 'అసలు ఎలాంటి మార్పులు చేస్తున్నారన్న దానిపై పూర్తి అవగాహన లేదు. ముసాయిదాను ఇంకా చూడలేదు. ఒకప్పుడు మ్యాచ్‌ల మధ్యలో షట్లర్లకు కోచింగ్ ఇచ్చే అవకాశం ఉండేది కాదు. ప్రపంచ సమాఖ్య ఆ అవకాశం కల్పించింది. ఇప్పుడు కోచింగ్ సమయాన్ని తగ్గించాలని భావిస్తోంది. అందులో తర్కమేంటో నాకు అర్థం కావడం లేదు" అని చెప్పాడు. మరోవైపు డెన్మార్క్ చీఫ్ కోచ్ బీడబ్ల్యూఎఫ్ తీరును తప్పుపట్టాడు. "అన్ని క్రీడల్లో బ్యాడ్మింటన్‌ను ప్రత్యేకంగా నిలిపేది కోర్టులో కోచింగే. టీవీలో ప్రేక్షకులను ఇది ఆకట్టుకునే అంశం" అని కెన్నెత్ జొనాసెన్ అన్నాడు. ఐతే వీరిద్దరికి భిన్నంగా భారత కోచ్‌లు విమల్ కుమార్, మహ్మద్ ఆరిఫ్ స్పందించారు. "కొత్త నిబంధన షట్లర్లను మానసికంగా, శారీరకంగా పరీక్షిస్తుంది. కఠిన సందర్భాల్లో వాళ్లు కోచ్‌లపై ఆధారపడకుండా సొంతంగా నిర్ణయాలు తీసుకోవాల్సివుంటుంది" అని విమల్ అన్నాడు. ఈ మధ్య కాలంలో షట్లర్లు ఎక్కువగా సాంకేతికత, కోచ్‌లపై ఆధారపడుతున్నారని, వాళ్లు వారి బుర్రలను వాడటం చాలా ముఖ్యమని ఆరిఫ్ చెప్పాడు. ప్రస్తుతం గేమ్ అర్ధభాగం (11 పాయింట్లు), ఆ తర్వాత గేమ్ ముగిసిన తర్వాత షట్లర్లు, కోచ్‌లతో మాట్లాడేందుకు అవకాశం ఉంటుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00